# మంచుతెరలు

నవల

- తాడేపల్లి శివరామకృష్ణారావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 185

కౌముది మాసపత్రికలో

జనవరి 2017 సంచిక నుంచి డిసెంబర్ 2017 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# (ప్రారంభం)

**వైశాఖమాసం..**

వేసవి ప్రవేశించిందనటానికి రుజువుగ సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు.

ఉదయం పదిగంటలకే రోడ్డుపైకి రావటానికి జనం జంకుతున్నారు. అయినా ఏవో పనులపై వచ్చేవారు వస్తున్నారనటానికి నిదర్శనంగా అక్కడొకరు ఇక్కడొకరు కనబడుతున్నారు. వెళ్ళేవారు వెళ్తూనే ఉన్నారు. ఒకరు తలపై కర్చీఫ్‌తో ఎండవేడిమి తగలకుండా జాగ్రత్తపడుతుంటే మరొకరు గొడుగుతో రక్షణ పొందుతున్నారు. ఇంకొకరు తలపై టోపీతో దర్శనమిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపైకి వచ్చేందుకు సూర్యప్రతాపానికి జనం భయపడుతున్న వాతావరణం స్పష్టంగా కనబడుతోంది.

సరిగ్గా అదే సమయంలో స్పీడుగా వస్తూ కుడివైపునకు టర్నింగ్ తీసుకునే ప్రయత్నంలో ఒక కారు పక్కనే కొద్దిగా నీడగా ఉన్న చోట సైకిల్ ఆపుకుని సోడా తాగుతూ సేదతీరుతున్న మధ్య వయస్కుడిని ఢీకొట్టింది.

"ఇడియట్ బుద్ధిలేదూ? రోడ్డు నీ బాబుగాడి సొమ్మనుకున్నావా?" కారులో నుండి దిగకుండానే డోర్ అద్దం దించి అరిచింది ఒక స్వరం. వీణ మీటినట్లుందా స్వరం. అయినా అదేం పట్టించుకోనట్టుగా ఆ సైకిల్ వాలా అసలు జరిగిందేమిటో తెలుసుకునేలోపలే జరిగిపోయిందా సంఘటన.

"నిన్నే! ఇక్కడ నిలబడి చోద్యం చూస్తున్నావా? కారుకు అడ్డంగా నువ్వూ, నీ డొక్కు సైకిలూను!"

కిందపడినతను నెమ్మదిగా లేచి నిలబడి రోడ్డుకు కొట్టుకుపోయిన మోచేతిని బాధగా చూసుకుంటున్నాడు. ఆ కారు డ్రైవింగ్ సీటులో ఉన్న యువతిని, మాటల్ని వినిపించుకునే స్థితిలో లేడు. ఆమెకు పంధొమ్మిదో ఇరవయ్యో ఉంటుంది వయసు.

"కంట్రీ బ్రూట్. రోడ్డు వీడి బాబుగాడి సొమ్మనుకున్నాడు. భలే శాస్తి జరిగింది. ఇటువంటి వాళ్ళకు ఇలాగే జరిగితేగానీ బుద్ధిరాదు. ఒకటి రెండు అనుభవాలు జరిగితేనే తెలిసొస్తుంది" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అనేసింది కారు డ్రైవింగ్ సీటులో ఉన్న యువతి. పక్కనే కూర్చున్న మరో యువతి ఆమె మాటలకు గలగలా నవ్వింది.

"నిజమే మేడమ్. రోడ్డు వాడి బాబుగాడి సొమ్మూకాదు. మీ అత్తామామల్దికాదు. ఇది అందరిదీ. కాస్త నోరు సంబాళించుకుంటే మంచిది. అనవసరంగా నోరు పారేసుకుంటే ఆ తరువాత చింతించినా ప్రయోజనం ఉండదు" కారు పక్కనే ఆగిన మోటారు సైకిల్ ముందు కూర్చున్న యువకుడి మాటలకు అతడ్ని చూసింది.

కళ్ళకు రేబాన్ గ్లాసులు, సాదాసీదా దుస్తుల్లో ఉన్నాడతను. అతణ్ణి చూస్తూనే ముఖం చిట్లించింది. ఇరవై రెండు, ఇరవై మూడేళ్ళకు మించి ఉండవు అతనికి.

"నీకెందుకు మిస్టర్. నీ దారిన నువ్వు పో. అనవసర విషయాల్లో జోక్యం చేసుకుంటే తలబొప్పి కడుతుంది. ఆ తరువాత నువ్వన్నట్టు చింతించినా ప్రయోజనం ఉండదు."

"ముందతనికి సారీ చెప్పండి. తప్పు చేసింది కాకుండా నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారు" సైకిల్ వాలాను చూపిస్తూ అన్నాడు ఆ యువకుడు.

"ఒరేయ్ సాగర్! మనకెందుకు అనవసర గొడవ. త్వరగా పద. మనకు ట్రైన్ టైమ్ అవుతోంది." మోటారు సైకిల్ వెనుక కూర్చున్న మరో యువకుడు అన్నాడు. ఎక్కడ ట్రైన్ మిస్ అవుతుందోనన్న కంగారు అతని ముఖంలో కనబడుతోంది.

"నువ్వు ప్రశాంతంగా ఉండు. ట్రైన్ మిస్సయితే ఫ్లైట్‌లో పంపుతానులే. ఇంటర్వ్యూ టైమ్‌కి నిన్ను చెన్నై పంపించే బాధ్యత నాది" మోటార్ సైకిల్ ముందు కూర్చుని యువతితో వాదన పెట్టుకున్న యువకుడు అన్నాడు.

ఆ యువతి మాత్రం వాళ్ళ మాటలు పట్టించుకోకుండా కారును రైజ్ చేసేందుకు ప్రయత్నించటం గమనించిన సాగర్ గబుక్కున మోటారు సైకిల్ దిగి "అరేయ్ శర్మా! బండి పట్టుకోరా కాస్త. ఇవాళ ఈ పిల్ల పొగరేమిటో చూడాల్సిందే" అంటూ విండోలోంచి లోపలికు తలపెట్టి కారు తాళాలు లాక్కున్నాడు.

అతని చొరవకు ఆమె విస్తుపోయింది. అంతలోనే తేరుకుని పట్టరాని ఆగ్రహంతో "ఏయ్ఁ... ఏమిటి నువ్వు చేస్తున్న పని? నీకిలా చెబితే అర్థంకాదు. ఉండు నీ సంగతి చెబుతా" కారు డోర్ తీయబోయింది.

ఆమె ప్రయత్నం గమనించి కారు డోర్‌కు అడ్డంగా నిలబడ్డాడు 'నీ కోపం నన్నేం చేస్తుందిలే' అన్నట్టు చూస్తున్న అతడ్ని ఆగ్రహంతో చూసింది. ఆ కోపానికి శక్తి ఉంటే అతను మలమలా మాడిపోయేవాడే కానీ మనుషుల కోపాలకు, చూపులకు అంత శక్తి ఉండదు కదా!

"మీ చూపులకి భస్మం కావటానికి మీరేమీ మాంత్రికురాలు కాదు. నేనేమీ అశక్తుణ్ణి కాదు. ముందు కారు దిగి మీ వల్ల దెబ్బతిన్న అతనికి సారీ చెప్పి సైకిల్‌కు నష్టపరిహారం చెల్లించండి" అతని మాటలకు ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి.

"చూస్తున్నకొద్దీ హద్దు మీరుతున్నావు. ఎవడ్రా నువ్వు? వాడికి వత్తాసుగా వచ్చావు. వాడినీ, నిన్నూ జైల్లో తోయిస్తాను జాగ్రత్త. నష్టపరిహారం చెల్లించాలిట. నష్టపరిహారం."

"మేడమ్. మైండ్ యువర్ టంగ్. హద్దుమీరి మాట్లాడుతోంది మీరు. చూడ్డానికి చదువుకున్నవారిలా ఉన్నారు. ఎదుటివారితో మాట్లాడే పద్ధతి ఇదేనా? అలంకరణేమో టిప్‌టాప్.. నోరేమో..!?" ఆ తరువాత మాట పూర్తిచేయకుండానే వదిలేశాడా యువకుడు.

రోడ్డు కార్నర్‌లో జరుగుతున్న ఈ తంతంగాన్ని గమనించిన ట్రాఫిక్ పోలీస్ అక్కడికి చేరుకున్నాడు.

కారులో నుండి దిగి వాదనలకు దిగిన యువతిని చూసి ఎవరో అయినింటి బిడ్డేనని భావించాడు. ఆమెను చూడ్డంతోనే "నమస్కారం మేడమ్.. ఏమిటి గొడవ?" వినయంగా ప్రశ్నిస్తున్న కానిస్టేబులును చూసి యువకుడి వైపు తిరిగి నవ్వింది 'చూశావా నా తాహతు' అన్నట్లు.

"ఎదురుగా వచ్చి నా కారును ఆ ముసలాడు ఢీకొట్టాడు. ఇతను అతని తరపున వకాల్తా పుచ్చుకుని నన్ను అనరాని మాటలంటున్నాడు" ఆమె ఫిర్యాదు విన్న కానిస్టేబుల్ యువకుడివైపు తిరిగి "ఏయ్! మిస్టర్ ఏమిటీ న్యూసెన్స్? అయినింటి ఆడపిల్ల మీద నీ రుబాబు? తప్పుకో" అన్నాడు కోపంగా.

దానికా యువకుడు చిరునవ్వు నవ్వాడు.

అతను నవ్వుతుండటంతో ఆమెకు చిరెత్తుకొచ్చింది.

"ఇది సార్! ఇందాకటి నుంచి అతని తీరు. అనవసరంగా నా టైము వేస్ట్ చేస్తున్నాడు. మీరు కూడా చూస్తున్నారుగా" కానిస్టేబుల్‌ని రెచ్చగొడుతూ అంది.

"ఏయ్ మిస్టర్! పదండి స్టేషన్‌కి" తోసుకుని తీసుకెళ్ళేందుకు భుజం మీద చెయ్యివెయ్యబోతున్న కానిస్టేబుల్ చేతిని అడ్డుకున్న వెనకవైపు కుర్రాడు "సార్! చెయ్యివేస్తే తరువాత తీరిగ్గా విచారిస్తారు. రేపు మీరు ఉద్యోగంలో ఉండాలా అక్కర్లేదా?"

"ఎవడ్రా నువ్వు. అసలు నిన్ను.." కానిస్టేబుల్ మాట పూర్తిగాకముందే పెద్దగా నవ్వాడు ఆ యువకుడు.

"సార్! ఇందాకటి నుండి జరిగిన తతంగమంతా ఈ ఫోన్‌లో వీడియో రూపంలో రికార్డు అయివుంది. ఎవరిది తప్పో తెలుసుకోకుండా మీరిలా ప్రవర్తిచటం మీకే మంచిది కాదు"

వెనక ఉన్న యువకుని మాటలకు ఖంగుతిన్న కానిస్టేబుల్ వెనక్కి తగ్గాడు. మొత్తం రికార్డు చేశానని ఆ యువకుడు చెప్పటంతో యువతి కూడా మొదట తెల్లబోయింది. అంతలోనే బింకం తెచ్చుకుంది.

"రికార్డయితే ఏమవుతుంది? ఏం బెదిరిస్తున్నారా? మీ సంగతి తేల్చిగాని కదలను. అక్కడ ట్రాఫిక్ కంట్రోల్‌లో ఉన్న మీ ఎస్.ఐని పిలవండి. వీళ్ళ సంగతి తేలుస్తాను" కానిస్టేబుల్‌తో అన్నది.

"పిలవండి సార్. అప్పుడుగానీ అమ్మగారికి తెలిసిరాదు ఎదుటివాళ్ళు కూడా మనుషులేనని ఇంత పొగరు, అహంకారం ఉన్నవాళ్ళకు తెలిసిరావాలి కూడా!"

"ఎందుకమ్మా అనవసరమైన గొడవ. ఏదో చిన్న విషయం సర్దుకు పోవచ్చుకదా" నచ్చచెప్పజూచిన కానిస్టేబుల్‌ను మిర్రి మిర్రి చూసింది. కానిస్టేబుల్‌తో అంతసేపు జరుగుతున్న వాదన ఏమిటో తెలుసుకుందామని ట్రాఫిక్ కంట్రోల్‌లో ఉన్న ఎస్.ఐ అక్కడికి చేరుకున్నాడు. అతడు రావటం చూసి తన బ్యాగ్‌లో నుంచి విజిటింగ్ కార్డు తీసి ఇచ్చింది ఎస్.ఐకి.

ఆ కార్డు చూడగానే ఆమెకు అటెన్షన్‌లో శాల్యూట్ చేశాడు ఎస్.ఐ. అది చూసి యువకుని మిత్రుడు కనుబొమ్మలు ఎగరేశాడు చూశావా అన్నట్టు యువకుడి వైపు తిరిగి. మళ్ళీ నవ్వాడు ఆ యువకుడు. ఈసారి అతనితో అతని మిత్రుడు శర్మ కూడా శృతి కలిపాడు.

వారి నవ్వును హేళనగా భావించిన ఎస్.ఐ "ఏయ్ మిస్టర్ నడిరోడ్డుపై ఏమిటీ న్యూసెన్స్ రోడ్డు సైడ్ రోమియోల్లా? మర్యాదగా ఆ అమ్మాయికి సారీ చెబుతారా? స్టేషన్‌కు తీసుకెళ్ళి చెప్పించమంటారా?"

"ఎస్.ఐగారూ! నాణానికి ఒకవైపే మీరు చూస్తున్నారు. ఆమె చూపించిన విజిటింగ్ కార్డుకు మీరు గౌరవం ఇచ్చేంత విలువ ఉండొచ్చుగాక. కానీ, ఇక్కడ జరిగింది ముందు తెలుసుకోండి. ఆ తరువాత చట్టప్రకారం నడుచుకోండి. అంతకు మించి మేము చెప్పేదేమీలేదు. మనుషుల్ని మనుషులుగా చుసేవాళ్ళ కాళ్ళకు నేను మొక్కుతాను. అంతేగానీ సాటి మనిషిని కనీసం జంతువుగా చూడని ఇలాంటి వాళ్ళకు పాఠం చెప్పేందుకు ఎంతదూరమైనా వెళ్తాను. ఏదో స్టేషన్ అంటున్నారుగా. పదండి పోదాం అక్కడే తేల్చుకుందాం."

యువకుడు కూడా సామాన్యుడు కాదనుకున్నాడు ఎస్.ఐ. ఇదంతా నాకెందుకు స్టేషన్‌కు తీసుకెళ్ళి సి.ఐకి అప్పగిస్తే సరిపోతుంది అనుకుని, "పదండి" అన్నాడు.

కారు తాళాలు జేబులో వేసుకుని ఎస్.ఐతో పాటు వెళ్తున్న అతణ్ణి చూసి "ఏయ్ కారు తాళాలిచ్చి వెళ్ళు" అందా యువతి.

ఆమె మాటలకు ఆశ్చర్యంగా చూశాడు యువకుడు.

"అదేమిటండి ఆమెను స్టేషన్‌కు తీసుకురారా. తప్పు చేసిన వాళ్ళను వదిలేసి ఆ తప్పును ప్రశ్నించిన వాళ్ళను లాకప్ చేస్తారా?" ఎస్.ఐని ప్రశ్నించాడు.

ఈసారి కంగుతిన్నాడు ఎస్.ఐ.

"ఆమె గొప్పింటి బిడ్డ. ఆమెను ఎలా తీసుకెళ్తాను?" ప్రశ్నించాడు ఎస్.ఐ.

"ఓహో. గొప్పింటి వాళ్ళయితే తప్పులు చేసినా పర్వాలేదన్నమాట. గుర్తుంచుకోండి. ఇందుకు భవిష్యత్తులో తగిన జవాబు మీరు చెప్పుకోవాల్సి వస్తుంది" అంటున్న శర్మను కోపంగా చూశాడు ఎస్.ఐ.

తాళాలివ్వకుండానే అతను పక్కనే ఉన్న పోలీస్ స్టేషన్‌లోకి అడుగుపెట్టాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె కూడా అతని వెనక నడవాల్సి వచ్చింది.

నడుస్తూనే శర్మనుంచి ఫోన్ తీసుకుని సాగర్ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడసాగాడు. అతని మాటలు పక్కనున్న వారికి కూడా వినబడనంత చిన్నగా మాట్లాడాడు. స్టేషన్‌లోకి అడుగుపెట్టటం అతని ఫోన్ సంభాషణ ముగియటం ఒకేసారి జరిగింది.

లోపలికి అడుగుపెడ్తూనే సి.ఐకి శాల్యూట్ చేశాడు ఎస్.ఐ. అతనితో పాటు వస్తున్న యువతీ యువకుల్ని చూసి ప్రశ్నార్థకంగా ఏమిటన్నట్టు సైగచేశాడు సి.ఐ.

"చూడండి సార్! ఆమె రేఖా ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్. ఆమె కారుకు ఒక సైకిల్ వాలా డాష్ ఇచ్చాడు. ఇది ఆమె తప్పేనని ఈ కుర్రాడు ఆమెతో వాదులాడుతున్నాడు" ఎస్.ఐ మాటలు విన్న సి.ఐ రేఖా ఇండస్ట్రీస్ అన్నమాట వినబడగానే వినయంగా నమస్కరించాడు సి.ఐ.

"ఏమిటి మిస్టర్. పెద్దింటి ఆడపిల్లల్ని అల్లరి పెట్టటం ఎంత నేరమో తెలుసా? అకార్డింగ్ టు సెక్షన్.." సాగర్‌ను అతడి మిత్రుడు శర్మను బెదిరించేందుకు యత్నిస్తున్న సి.ఐని నవ్వుతూ చూసింది ఆ యువతి.

అంతలో టేబుల్‌పై ఉన్న ఫోన్ మోగింది. ఎ.ఐ దాన్ని తీసి "ఎస్ సార్. ఎస్.. సిఐగారి మొబైల్ నెంబర్ సార్" అని రిసీవర్‌పై చేయి ఉంచి సిఐ వైపు చూశాడు. "సార్! కమీషనర్ గారి ఆఫీసు నుండి" అని నెంబర్ చెప్పాడు.

ఇప్పుడు కమీషనర్ ఆఫీసు నుండి ఫోన్ ఎందుకొచ్చిందా అని సిఐ కంగారు పడుతున్నంతలోనే అతని మొబైల్ మోగింది. గబుక్కున జేబులో నుండి ఫోన్ తీసి నెంబర్ చూసుకున్నాడు. వెంటనే అటెన్షన్‌లో నిలబడి "నమస్కారం సార్" అన్నాడు. అప్పటికే అతని గొంతులో మార్పు వచ్చింది. శర్మను చూస్తూ నవ్వాడు సాగర్.

అంతలోనే ఫోన్ సాగర్‌కు ఇచ్చి "కమీషనర్ సార్ మీతో మాట్లాడతారట" అన్నాడు.

సాగర్ మరో రెండు నిమిషాలు ఫోన్ మాట్లాడి సి.ఐకి ఫోన్ తిరిగి ఇచ్చేశాడు.

"ఏమిటి సిఐ రాందాసూ! స్టేషనుకు తీసుకొచ్చే ముందు మనిషిని గురించి తెలుసుకోనక్కర్లేదా? ఎవరు ఎవరో తెలుసుకోకుండా ఇలా పిలుచుకు వచ్చేయడమేనా? త్వరగా సాగర్‌ను పంపించెయ్యి. అర్థమైందా? మళ్ళీ నీమీద ఇటువంటి కంప్లయింట్ రాకూడదు. వచ్చిందా?"

కమీషనర్ హెచ్చరికకు బెదిరి ఎస్ ఐ వైపు సీరియస్‌గా చూశాడు సి.ఐ. ఫోన్ జేబులో పెట్టుకున్నాడు.

"ఇదేమిటి. రామారావ్. పొద్దున్నే అనవసరమైన తిట్లు తీసుకొచ్చావ్" అని ఎస్.ఐని కేకలేసి సాగర్ వైపు చూస్తూ "మీరు కూర్చోండి సార్. ఎవరేమిటో తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం నీకు అలవాటుగా మారింది రామారావ్. ఇది నీకు ఎన్నో వార్నింగ్ గుర్తుందా?" అని అప్పటికీ సాగర్ నిలబడే ఉండటం చూసి "ముందు మీరు కూర్చోండి సార్. మిగతా విషయాలు కూర్చుని మాట్లాడుకుందాం" అంటున్న సి.ఐని వింతగా చూస్తుండిపోయింది ఆ యువతి.

"పర్వాలేదు సార్! నేను చెబుతూనే ఉన్నా. కాస్తయినా మీ ఎస్.ఐగారు వినిపించుకుంటేనా?" శర్మ అన్నాడు.

"రోజూ ఇలాగే ఏదో ఒకటి నా నెత్తి మీదకు తెచ్చి పెడుతూనే ఉంటాడు. ఇదో సమస్య అయింది నాకు."

సాగర్ కోసం స్వయంగా కమీషనరే మాట్లాడారంటే అతనెంత పెద్దవాడై ఉంటాడోనని భయపడుతున్న ఎస్.ఐని చూసి సాగర్ నవ్వుతూ "మీకొచ్చిన భయం ఏమీలేదు రామారావుగారూ! కాకపోతే మనుషుల్ని మనుషులుగా చూడండి. మేము అర్జంటుగా రైల్వేస్టేషన్‌కు వెళ్ళాలండీ. లేకపోతే కూర్చునేవాళ్ళం. మా వాడు చెన్నై వెళ్ళాలి. ముందుగా ఈమెను మానవత్వం తెలుసుకోమనండి. మేము

షూట్ చేసినదంతా మీ ఫోన్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేశాం. కాస్త అది చూసి ఆ సైకిల్‌వాలాకు మీరు న్యాయం చెయ్యండి. ఇటువంటి వాళ్ళను వదిలేస్తే ఇంకెన్ని ఘోరాలకు, ప్రాణాలకు అపాయం తీసుకొచ్చేందుకు కారకులవుతారో. జాగ్రత్త. ముందు ఈమెకు ట్రాఫిక్ రూల్స్ గురించి తెలుసో లేదో కనుక్కోండి. టర్నింగ్ తీసుకోవటమెలాగో తెలియజెప్పండి. ఆ తరువాత అనవసరమైతే కౌన్సెలింగ్ ఇప్పించండి. ఇది మొదటి వార్నింగ్‌గా ఏదో ఫైన్ వేసి వదిలేయండి. ఆ సైకిల్‌వాలాకు నష్టపరిహారం కింద ఓ ఓవెయ్యి రూపాయలు ఇప్పించండి. నా వంతుగా నేనతనికి ఈ వెయ్యి రూపాయలు ఇస్తాను. మీరు కూడా ఈమె చేత తగువిధంగా న్యాయం కలిగేలా చూడండి. అప్పుడే మీ శాఖ మీద ప్రజలకు ఉన్న అపోహలు తొలిగిపోయి నమ్మకం, విశ్వాసం పెరుగుతాయి"

తాను ఇవ్వాలనుకున్న వెయ్యిరూపాయలు సి.ఐకి అందజేయమని శర్మకు చెప్పాడు.

"అమ్మా! కారు ఎక్కగానే రోడ్డు కనిపించాలిగానీ, అహంకారం కాదు. మర్యాదగా ఫైన్ ఏడు వందల రూపాయలు, ఆ సైకిల్ వ్యక్తికి నష్టపరిహారంగా వెయ్యి రూపాయలు మొత్తం పదిహేడు వందలు చెల్లించండి" సి.ఐ ఆదేశించాడు.

"ఏమిటీ? నేను ఫైన్ కట్టాలా? కట్టకపోతే?"

"కేసు పెడతాం. ఆ తరువాత కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుంది." సి.ఐ హెచ్చరించాడు.

"సార్! అమ్మాయిగారు రేఖా ఇండస్ట్రీస్ ఎమ్‌డి. ఇలా ఫైన్ కట్టించుకోవటం సరికాదనుకుంటాను" ఎస్.ఐ గొణిగాడు.

"అయితే ఏమిటండీ? ఇండస్ట్రియలిస్ట్ అయితే తప్పులు చేయచ్చా? మానవత్వం మరిచిపోవాలా? మనుషుల్ని మనుషులుగా పట్టించుకోనక్కర్లేదా?" గుమ్మం దాకా వెళ్ళిన సాగర్ వెనక్కి తిరిగి అన్నాడు.

"రేఖా! ఇదింతటితో వదిలెయ్యి. ఆ ఫైనేదో కట్టెయ్యి. ఇప్పటికే చాలా సేపయింది. నీ జీవితంలో పోలీస్ స్టేషన్‌కు వస్తావని అనుకున్నావా? ఇప్పుడు చూడు. గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తీసుకొచ్చావ్" ఆమెతో పాటున్న ఆమె స్నేహితాలు కిశోరి అన్నది.

తప్పనిసరి పరిస్థితుల్లో తన హ్యాండ్‌బ్యాగ్ అందుకుంది రేఖ.

బ్యాగులో తాను చెల్లించాల్సినంత మొత్తం లేకపోవటం గమనించి, "ఇన్స్‌పెక్టర్ పక్కనే ఏదైనా ఏటిఎమ్ ఉందా? ప్రస్తుతం అంత డబ్బు నా దగ్గరలేదు. కావాలంటే ఇదిగో క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ఉన్నాయి" రేఖ మాటలకు స్నేహితురాలు తలపట్టుకుంది.

"అదేమిటి మేడమ్. పెద్ద బిజినెస్ ఉమన్ మీరు. మీ దగ్గర రెండువేలు కూడా లేవా?" ఆశ్చర్యంగా సిఐ అన్నాడు.

"లేవండి. డబ్బుతో ఏం అవసరముంటుంది. ఎక్కడపడితే అక్కడ ఏటిఎంలు ఉన్నాయిగా" రేఖ మాటలు విని గుమ్మం దగ్గర నుండి వెనక్కి తిరిగి వచ్చి సాగర్ అన్నాడు.

"శర్మా! ఆ పదిహేడు వందలు ఇచ్చెయ్యి."

"అక్కర్లేదు. ఒకరి దయాదాక్షిణ్యాలు మాకు అక్కర్లేదు. మీరు దయచేయండి" మొండిగా అంటున్న రేఖను చూసి నవ్వుతూ అన్నాడు.

"ఊరికే ఇవ్వంలెండి. మీలాంటి వాళ్ళకు దానం చేసే కంటే తిండిలేక పూట గడవని వాళ్ళకు దానం చేస్తే కాస్తంతైనా పుణ్యం వస్తుంది. అప్పుగానే లెండి. శర్మా ఆ పదిహేడు వందలతో పాటు నీ విజిటింగ్ కార్డు కూడా ఇవ్వు"

శర్మ నుంచి విజిటింగ్ కార్డు తీసుకుని ఆమెకు ఇచ్చాడు ఎస్.ఐ.

"మా శర్మ రెండు రోజులు ఊళ్ళో ఉండటం లేదు. ఆ తరువాత ఆ అడ్రసుకు డబ్బు చేర్చండి" అని వెళ్ళిపోయాడు సాగర్. అతని మాటలకు రేఖలో ఉక్రోషం ఆగలేదు.

'ఛీ! ఏమిటి ఈ రోజు ఇలా అయింది? ఇంతకంటే అవమానం మరోటి లేదు. ఒక సామాన్యుడు తనను హేళన చేయటమా? పోలీసులు కూడా అతనికి వత్తాసు రావటమా? ఇంతకీ కమీషనర్ స్థాయి అధికారి అతని కోసం స్వయంగా ఫోన్ చేశాడంటే ఎవరతను? నిజంగా సామాన్యుడేనా? లేక ఏదైనా అధికారా?"

ఆమె మనసులోని భావాలను అర్థం చేసుకున్నాడు సి.ఐ.

"అమ్మా! మిమ్మల్ని అవమానం చేయాలని నా ఉద్దేశం కాదు. అతని కోసం స్వయంగా మా కమీషనర్‌గారే ఫోన్ చేశారంటే అతనెంత వివిఐపీనో అయివుంటాడో! అయినా కుర్రాడు చాకులా ఉన్నాడు. మాణిక్యం కంటే మెరుస్తున్నాడు"

అసలే అవమానంతో తల్లడిల్లిపోతున్న రేఖకు పుండుమీద కారం జల్లినట్లయింది.

సిఐ మెచ్చుకోలు మాటలు మరింత ఆగ్రహాన్ని తెప్పించాయి.

"చాకో, బాకో, మాణిక్యమో అయితే మీ కూతుర్ని ఇచ్చి పెళ్ళిచేయండి. అంతేగానీ స్తోత్రపాఠాలు కట్టిబెట్టండి" విసురుగా బయటకు నడిచింది. తాను మాట్లాడిన దాన్లో తప్పేముందో అర్థంగాక ఆమె వెళ్ళిన వైపే ఆశ్చర్యంగా చూస్తుండిపోయాడు సి.ఐ.

## 2

"ఇదేనే వాళ్ళిచ్చిన అడ్రసు" అపార్టుమెంట్‌ను చూపిస్తూ రేఖ స్నేహితురాలు కిశోరి అరిచింది.

చేతిలో విజిటింగ్ కార్డు పట్టుకుని 'అంజనీ అపార్టుమెంట్' అని వెతుకుతూ స్లోగా పోనిస్తున్న కారుకు బ్రేక్ వేసింది రేఖ. మధ్యతరగతి వాళ్ళు ఉండే అపార్టుమెంట్ అది. వాచ్‌మన్ అనుకుంటా గేటు బయటే బీడీ తాగుతూ కనిపించాడు. లుంగీ, బనీనుతో ఉన్న అతణ్ణి చూడగానే నొసలు చిట్లించింది రేఖ.

"అంతేలే! కాణికి ఠికాణా లేనివాళ్ళకు నివాసంగా ఇటువంటి అపార్టుమెంట్లే ఉంటాయి. ఏం చేస్తాం? ఎప్పుడు చేసుకున్న పాపమో ఇవాళ మనకు ఈ అపార్టుమెంట్‌లోకి వెళ్ళాల్సిన అవసరం వచ్చింది" రేఖ గొణుక్కుంది.

"అలా ఎందుకనుకుంటావు? మన పాదస్పర్శకు ఈ అపార్టుమెంట్ పునీతమైందని ఎందుకు అనుకోవు? మనలాంటివాళ్ళు ఇందులోకి అడుగుపెడతారని ఈ అపార్టుమెంట్ వాళ్ళు కలలో కూడా ఊహించి వుండరు" స్నేహితురాలు అన్నది.

"అయినా అన్నింటికీ నెగటివ్‌గా ఆలోచించటం నీకు అలవాటుగా మారింది. కాస్త అప్పుడప్పుడైనా పాజిటివ్‌గా ఆలోచించు. నీరసంలో కూడా మంచి ఎనర్జీ వస్తుంది"

అంటున్న స్నేహితురాల్ని కోపంగా చూడబోయి నవ్వేసింది రేఖ.

"అబ్బ! నీ ముఖంలో నవ్వుచూసి మూడురోజులైందే బాబూ! ఆ నవ్వు ముఖాన్ని అలాగే మనం లోపలికి వెళ్ళి వచ్చేవరకూ కంటిన్యూ చెయ్యి. మళ్ళీ అక్కడ వాళ్ళతో వాదులాటలొద్దు. వచ్చిన పని చూసుకుని వెనక్కి రెండు నిమిషాల్లో వచ్చేద్దాం"

"రాక అక్కడే కాపురం ఉంటామా? వెళ్ళటం వాళ్ళ డబ్బు వాళ్ళ ముఖాన కొట్టటం. అనాల్సిన నాలుగు దులిపేసి వచ్చేయటం అంతే!"

"అదిగో మళ్ళీ మొదటికొస్తున్నావు. ఆ అలగావాళ్ళతో మనకెందుకే? పైగా ఇది మన స్థలం కూడా కాదు. స్థానబలం చూసుకుని మాట్లాడాలి. కాస్త నోరుమూసుకుంటే మన సొమ్మేం పోదుకదా! మౌనం సర్వరోగ నివారిణి అనుకుంటే సరి. వాదులాటతో సాధించలేనిదాన్ని మౌనంతో సాధించవచ్చు. ఈసారికి నా మాట విను" బతిమలాడుతోంది స్నేహితురాలు.

"సరే... అలాగే! ఈసారి నీ మాటను గౌరవిస్తాను. నన్ను కించపరచకుండా ఉన్నంతసేపు ఏమీ మాట్లాడను. మనం వచ్చాం కదాని ఏదైనా అడ్వాంటేజ్ తీసుకునేందుకు వాళ్ళు ప్రయత్నించారా ఊరుకోను" గేటుముందు కారు ఆపుతూ అంది.

గేటు మీద 'బయటి వ్యక్తుల వాహనాలు లోపలికి అనుమతించబడవి' అన్న బోర్డు చూసి కారును పక్కకు తీయబోయింది అక్కడికి ఈ అపార్టుమెంట్ నిత్యం వాహనాలతో నిండిపోతుందేమో అని అనుకుంటూ...

"అమ్మా! మీరు రేఖా మేడమేనా?" వాచ్‌మన్ అడిగాడు.

అవునన్నట్టూ చూసింది.

"అయితే మీ కారును లిఫ్టు దగ్గరకు అనుమతించమని మా బాబుగారు చెప్పారు. మీరు లోపలికి వెళ్ళవచ్చు"

తాము అప్పుడే వస్తామని ఆ బాబుగారికి ఎలా తెలుసో అర్థంకాలేదు రేఖకు, ఆమె స్నేహితురాలికి.

కారు లిఫ్టు ముందు పార్కు చేసి లిఫ్టు ఎక్కేందుకు వెళ్తుండగా "సారీ మేడమ్! లిఫ్టు పనిచేయటం లేదు. మీరు మెట్లెక్కి వెళ్ళాల్సిందే" వెనకే వచ్చిన వాచ్‌మన్ అన్నాడు.

"అమ్మో అయిదో అంతస్తు వరకు ఎక్కటం నావల్ల కాదు. అయినా లిఫ్టు చెడిపోతే బాగుచేయించ వచ్చుకదా! అంత లోభత్వమెందుకు?" వాచ్‌మన్‌ను అడిగింది.

"మూడురోజుల నుండి ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఇదిగో వస్తున్నా అదిగో వస్తున్నా అని మెకానిక్ చెబుతున్నాడు. ఏం చేస్తాం చెప్పండి" వాచ్‌మన్ జవాబును వినిపించుకోకుండా నెమ్మదిగా మెట్లవైపు దారి తీసింది.

ఒకటో అంతస్తు నుంచి లెక్కపెడుతూ అయిదో అంతస్తు చేరుకునే సరికి ఊపిరి అందటం లేదిద్దరికీ. వాళ్ళు వస్తున్నట్లు ముందుగా ఎలా తెలిసిందో ఏమో మెట్ల దగ్గరే కాచుక్కూర్చున్నాడు సాగర్.

"కొద్దిగా ఆగి కాస్త ఊపిరి తీసుకోండి. తరువాత రూములోకి వెళ్ళొచ్చు" నవ్వుతూ ఆహ్వానిస్తున్న సాగర్‌ని కోపంగా చూశారిద్దరూ.

"పాజిటివ్‌గా చూడవే. ఆయాసంలో కూడా ఎనర్జీ వస్తుంది" వెక్కిరింతగా తన మాటల్ని తనకే అప్పగిస్తున్న రేఖను నీరసంగా చూసింది స్నేహితురాలు. ఇద్దరూ ఆయాసపడుతున్నారు. మాట్లాడటానికి ఊపిరి అందటం లేదు.

"మేడమ్ ఆయాసం తీరేవరకూ మాట్లాడవద్దు. అదిగో ఆ కుర్చీల్లో రెండు నిమిషాలు కూర్చుని అలసట తీర్చుకోండి" అన్నాడు సాగర్.

అతను చూపించిన కుర్చీల్లో కూర్చున్నారిద్దరూ తప్పదన్నట్టు. ఇంతలో లోపలి నుండి శర్మ రెండు నీళ్ళ బాటిల్స్ తీసుకొచ్చాడు. ఆ నీళ్ళను యువతులిద్దరికీ అందించాడు. ఆ నీళ్ళను తాగాలా వద్దా అని రెండు క్షణాలు ఆలోచించిన రేఖ గొంతెండిపోతుండటంతో రాజీపడింది. నీళ్ళ విషయంలో కుడా ఎప్పుడూ రాజీపడని రేఖ అలా నీళ్ళను అందుకోవటం పక్కన ఉన్న యువతికి ఆశ్చర్యం కలిగించింది. సందర్భాన్ని బట్టి అభిప్రాయాలు మారతాయంటే ఇదేనన్నమాట అని అనుకున్నది. నీళ్ళు తాగిన తరువాత బాటిల్స్ అందుకుని శర్మ లోపలికి వెళ్ళిపోయాడు.

యువతులిద్దరూ ఆయాసం నుండి తేరుకున్నారు.

"లోపలికి రండి. మా ఆతిధ్యం స్వీకరిద్దురుగాని" సాగర్ ఆహ్వానించాడు.

అతని ఆహ్వానానికి అంగీకరించాలా వద్దా అన్న సంశయం రెండో యువతికి కలిగింది.

రేఖ తలూపి సాగర్‌తో వెనక నడిచింది.

"కూర్చోండి మేడమ్. ఒక్క క్షణం" లోపల హాలులో ఉన్న గది నీట్‌గా సర్దివుంది. ఎక్కడా బ్రహ్మచారి కొంపలా కనిపించలేదు వారికి.

"అబ్బ బ్రహ్మచారుల కొంప అంటే ఎంత అధ్వానంగా ఉంటుందో అనుకున్నాను. మంచి టేస్ట్ ఉందే!" రెండో యువతి హాలును పరికిస్తూ అంది.

"ఏదోలెండి. మాకు తోచిన విధంగా సర్దుకున్నాం. ఎంతైనా ఆడవాళ్ళు లేని కొంప కూడా ఒక కొంపేనా?" సాగర్ సాగదీస్తూ అని లోపలికి నడిచాడు.

"వచ్చిన పని చూడకుండా నసుగుతావేమిటే! అతను వచ్చీరాగానే డబ్బు ఇచ్చేయి. చెప్పానుగా ఇక్కడే తిష్ఠ వేయొద్దని" మందలించింది స్నేహితురాలిని రేఖ.

అంతలో ఒక ట్రేలో రెండు కప్పులతో కాఫీ తీసుకొచ్చాడు సాగర్.

"ఏదో మా శక్తి కొద్దీ ఈ ఆతిథ్యం" ట్రా వాళ్ళముందుంచాడు.

ఇంక చేసేదేముంది. తప్పనిసరిగా కాఫీ అందుకున్నారు.

కాఫీ సిప్ చేసి, "కాఫీ చాలా బాగుంది. నిజంగా ఏ ఫైవ్‌స్టార్ హోటల్లో కూడా ఇంత రుచికరమైన కాఫీ దొరకదు. పర్వాలేదు. ఏ ఉద్యోగం లేకపోతే కాఫీ హోటల్లో పనిచేయొచ్చు" రేఖ పెడసరంగా అందో లేక పొగుడుతూ అందో తెలియలేదు ఆ స్నేహితురాలికి. అసలు రేఖ నోటి నుండి ఎప్పుడు ఎదుటివాడిని గురించి పొగడ్త వచ్చింది కనుక? ఇది ఖచ్చితంగా తెగడ్తే. కాకపోతే ఎదుటివాళ్ళ గురించి కామెంట్ చేసే అధికారం, హక్కు ఆమెకు ఎక్కడిదని కూడా అనుకున్నది. అందుకే రేఖ వైపు కోపంగా చూసింది.

"ఏదోలెండి మేడమ్. అంత అవసరపడితే మీ రికమెండేషన్ కోసం వస్తాంలెండి. అప్పుడు మీకు తెలిసిన చోట ఎక్కడైనా బట్లర్ ఉద్యోగం ఇప్పిద్దురుగాని. కాకపోతే ఒక కండిషన్. ఆ తరువాత రోజూ మా చేతి కాఫీ మా అకౌంట్‌లో తాగాలి" నవ్వుతూ జవాబిచ్చాడు సాగర్.

"ఆ చేత్తోనే నాక్కూడా ఏదైనా సప్లయిర్ పోస్టు రిజర్వ్ చేసి వుంచండి" లోపలినుండి వస్తూ అన్నాడు శర్మ.

"ఇడియట్స్ ఇద్దరికి ఇద్దరూ ఇద్దరే. ఎదుటి వ్యక్తికి జవాబివ్వటంలో ఎవరికెవరూ తీసిపోరు" అనుకుంది కచ్చగా రేఖ. అంతలోనే స్నేహితురాలిని చూస్తూ కనుసైగచేసింది.

"ఆఁ మొన్న మీరిచ్చిన పదిహేడువందలు తిరిగివ్వటానికి వచ్చాం. మీరు దానం అనుకున్నారేమోగానీ దానం తీసుకునేంత హీనస్థితిలో మేం లేం" స్నేహితురాలి మాటలకు మెచ్చుకున్నట్టుగా ఉంది రేఖ వాలకం.

"అమ్మమ్మ. మీకు దానం ఇచ్చేంత ఉన్నవాళ్ళం కాదులెండి మేము. ఏదో ఆ రోజు ఆపద్ధర్మంగా మిమ్మల్ని ఆపద నుంచి గట్టెక్కించే ఉద్దేశం తప్ప మరో దురుద్దేశమే లేదండి మాకు" శర్మ మాటలకు చిన్నగా నవ్వింది స్నేహితురాలు.

"అందుకే మీ మంచి ఉద్దేశానికి మేమూ ఉడతాభక్తిగా పదిహేడు వందలకు మరో మూడు వందలు కలిపి రెండువేలు ఇస్తున్నాం. ఇవి తీసుకుని మమ్మల్ని రుణగ్రస్తత నుండి బయటపడేయండి"

ఆమె మాటలకు మొదట శర్మ, సాగర్ ఇద్దరూ నిరుత్తులయ్యారు.

తరువాత ముందుగా శర్మే తేరుకున్నాడు.

"అంటే మమ్మల్ని మరీ వడ్డీ వ్యాపారులుగా జమ కట్టేస్తున్నారన్నమాట. అసలే వద్దని మేమనుకుంటుంటే మళ్ళీ వడ్డీ కూడా ఇస్తామంటారేమిటి?"

"లేకపోతే ఏమిటీ మీ ధోరణి? మా దగ్గర డబ్బు లేదనుకుంటున్నారా లేక పోలీసుల ముందు మమ్మల్ని కించపరచాలని అనుకున్నారా? మహా గొప్పగా డబ్బు తీసిస్తారా? అంతకంటే మాకు ఇంకేం అవమానం ఉంటుంది" ఆమె డబాయింపుకు ఖంగుతిన్నది మిత్రద్వయం.

"ఇంతకీ మీరనేదేమిటి? మీరిచ్చే రెండువేలు మేము నోర్మూసుకుని తీసుకోవాలంటారు అంతేగా. సరే శర్మా పుచ్చుకో. మనం అనాథ శరణాలయానికి డొనేషన్ ఇస్తామని ప్రామిస్ చేశాం కదా! ఆ ఇచ్చేదేదో వీరి పేరుమీదే ఇద్దాం. స్వామి కార్యం స్వకార్యం రెండూ తీరిపోతాయి. వాళ్ళకు ఫోన్‌చేసి ఎప్పుడు కలవమంటారో అడుగు. వెళ్దాం.." లేస్తూ అన్నాడు సాగర్.

రేఖ ముఖం మరింత అవమానంతో ఎర్రబారింది. తాము కూర్చుని ఉండగానే అతను అలా విసురుగా లేవటం ఆమెకు మింగుడు పడని విషయంగా తయారైంది. 'ఏమిటిలా అతని చేతికి దొరికిపోతున్నానేమిటి? తాను ముందుగా ఎంతో ఆలోచించి తయారు చేసుకున్న సంభాషణంతా ఇలా అతని మాటల మాయలో ఎలా తెలా పోతోందేమిటి? ఇది అతని మాటకారితనమా? తన చేతకానితనమా?' రేఖ ఆలోచనలు ఇలా సాగుతుండగానే అతని కంటే విసురుగానే లేచింది స్నేహితురాలు.

"సిగ్గులేకుండా ఇంకా కూర్చున్నావేమిటే? అతనంత నిక్కచ్చిగా వెళ్ళిపొమ్మన్నట్టు చెప్పకనే చెబుతున్నాడు కదా! ఏ మైంది నీ ఇగో. ఇలా ఇగో దెబ్బకొట్టేవాళ్ళతో ఎక్కువసేపు ఉండటం శ్రేయస్కరం కూడా కాదు" రేఖను రెక్కపట్టుకుని లేపుతూ అంది స్నేహితురాలు.

"మీరు నా ప్రవర్తనను తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. ఇక్కడ ఇగోలు, అవమానాలు లేవు. ***అంతా మన ఆలోచనలు, మనం తీసుకునే తీరుపైనే ఉంటుంది. ఎవరూ ఎవరి ఇగోను దెబ్బకొట్టలేరు. మనకు మనమే అలా దెబ్బకొట్టుకోగలం*** ఏ భావం లేకుండా మాట్లాడుతున్న అతని మాటల తీరు రేఖను మరింత రెచ్చగొట్టింది. విసురుగా అతని కళ్ళలోకి చూసింది. ఏ భావం కనబడని ఆ కళ్ళను చూసి కోపంగా తలతిప్పుకుని లేచి నిలబడి వడివడిగా బయటకు నడిచింది.

## 3

"**ఏమిటి ఇతను** ఎదురుపడినప్పుడల్లా ఇలా ఎదురుదెబ్బలు తగులుతూనే ఉన్నాయి? ఎప్పుడూ అతనిదే పైచేయిలా కనబడుతోంది. ఇతను నాకు ఒక పజిల్‌లా తయారయ్యాడు. ఇతన్ని ఎలాగోలా అవమానం పాల్జేయకపోతే నాకు నిద్రపట్టదు. నా ఇగో శాటిస్‌ఫై కాదు. ఏం చేయాలి? అతణ్ణి తన చెప్పుచేతల్లోకి తెచ్చుకునేదెలా" ఆమె ఆలోచనలు సాగిపోతున్నాయి.

"హాయ్ రేఖా! ఏమిటంత పరధ్యానం? ఏదైనా సమస్యా? అయినా రాష్ట్రంలోనే ఎదురులేని పారిశ్రామికవేత్త గారాల పట్టివి. కోరుకుంటే కొండమీద కోతినైనా సునాయాసంగా తీసుకురాగల సుదర్శనరావుగారి కూతురివి. ఎందుకింత ఆలోచనలో మునిగిపోయావు?" పక్కన కూర్చుంటూ అంది మంజుల.

"ఏమిటోనే నిజంగ నాకంత శక్తే ఉంటే ఇలా దిగాలుగా ఎందుకు ఆలోచిస్తూ కూర్చుంటాను? ఎప్పుడో వాడికి తగిన బుద్ధి చెప్పేదాన్ని. ఇలా చేతకానిదానిలా అతని ఆలోచనలతోనే ఆఫీసు క్కూడా వెళ్ళకుండా ఎందుక్కూర్చుంటాను చెప్పు?" బేలగా అంటున్న రేఖ ముఖంలోకి వింతగా చూసింది మంజుల.

"ఏమిటీ నీకంత కొరకరాని కొయ్యలా తయారైన వాడెవడే తల్లీ? నువ్వే అందర్నీ ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తావు కదా! చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంది. పూర్తిగా చెప్పు. తోచిన సలహా ఇస్తాను. ఇష్టమైతే ఒకే చెబుదువుగాని" మంజుల ముఖంలో ఆసక్తి కనబడింది.

అప్పుడు చెప్పుకొచ్చింది సాగర్ గురించి. మొదట అతని చేతిలో పోలీస్ స్టేషన్‌లో ఎలా దెబ్బతిన్నది. ఆ తరువాత డబ్బు తిరిగివ్వటానికి అతని రూమ్ వెతుక్కుంటూ వెళ్ళి ఎలా బోల్తాపడింది. అతను తన పేర అనాధశరణాలయంలో రెండువేల రూపాయలు కట్టి రశీదు అందజేసిందీ అన్నీ వివరించింది.

"ఇలా అతని చేతిలో ఏదో కారణంగా దాదాపు రోజూ దెబ్బతింటున్న నా ఇగోకి జవాబు చెప్పుకోలేకపోతున్నాను"

ఆమె మాటలు మంజులకి కొత్తగా ఉన్నాయి. అందర్నీ తన అదుపాజ్ఞల్లో ఉంచుకోవాలన్న ఆమె అహంభావం సంగతి మంజులకు బాగా తెలుసు. ఆమె తండ్రికి ఉన్న పొజిషన్ చూసి తామంతా ఆమె ఏది చెబితే దానికి తలూపుతున్నారుగానీ మనస్ఫూర్తిగా ఆమెను సమర్ధించేందుకు ఎవరూ ముందుకు రారని మంజుల అభిప్రాయం. ఇప్పుడు దీనికి సరైనవాడు దొరికాడు. ఇంతకంటే సెలబ్రేట్ చేసుకునే ఛాన్స్ తనకేముంటుంది? ఏమైనా దీన్ని సెలబ్రేట్ చేసుకోవలసిందే

అది సిటీలోకెల్లా అత్యంత ఖరీదైన హోటల్. ఎప్పుడూ అక్కడే రేఖ మిత్రబృందం కలుసుకుంటుంది. ఇవాళ కూడా ఏదో ఆలోచిస్తూ అలవాటుగా అక్కడికి చేరుకుంది రేఖ. సాగర్ ఆలోచనలతో వేడెక్కిన మెదడు ఎక్కడికి ఆమెను తీసుకెళ్తోందో ఆమె గమనించలేదు.

గమనించేసరికి తాము రోజూ కూర్చునే హోటల్ స్పాట్‌కే చేరుకోవటం ఆమెకు చిరాకు పుట్టించింది. తనకు తెలియకుండానే తన మనసుని, ఆలోచనల్ని సాగర్ కబ్జా చేస్తున్నాడని భావించింది. అలా అవమానంతో సతమతమవుతున్న ఆమెకు మంజుల రాక మరింత చిరాకు పుట్టించింది.

"ఇది నిజంగా నాపై సానుభూతి చూపుతోందా? లేక తన పరిస్థితికి లోపల్లోపల పొంగిపోతోందా? దీనిది సానుభూతి అనుకోవటానికి నమ్మకం కలగటంలేదు. దీని బుద్దే అంత. ఎదుటి వ్యక్తి ఇగో దెబ్బతింటే సంతోషించే జీవి. దీనితో మైత్రి ఇష్టం లేకపోయినా చిన్నప్పటినుంచి తమ కుటుంబాల మధ్య ఉన్న స్నేహబాంధవ్యాలను బట్టి దీన్ని తాను భరిస్తోందిగానీ లేకపోతే ఎప్పుడో తగ్గ జవాబిచ్చేది. అయినా సాగర్ గురించి దీనితో చర్చ ఎందుకు తీసుకొచ్చాను? ఏమిటి తానిలా దొరికిపోతోంది. ఇంతకు ముందులా ఎందుకు వ్యవహరించలేకపోతోంది? ఇదంతా సాగర్ ప్రభావమేనా?" మళ్ళీ సాగర్ ఆలోచన రావటంతో చిరాకనిపించి లేచింది.

అప్పుడే లోపలికి ప్రవేశించిన లలిత, రేఖను చూసి "హాయ్!" అన్నది.

లలితను చూసిన తరువాత కొద్దిగా ఊపిరి పీల్చుకున్నది రేఖ. మంజులలాగా లలిత ఇతరుల్ని చూసి జెలసీఫీలవ్వదు. పర్‌ఫెక్ట్ మైత్రికే ప్రాధాన్యం ఇస్తుంది. కొందరంతే.

స్నేహాన్ని స్వలాభానికి వాడుకుంటారు కొందరు. మరికొందరు స్నేహమంటే ప్రాణమిస్తారు. స్నేహితులకు ఏ చిన్న కష్టమొచ్చినా తమకు వచ్చినట్టుగా ఫీలవుతారు. స్నేహితుడి (స్నేహితురాలి) మూడ్‌ను బట్టి వారితో మెలుగుతారు ఇంకొందరు. లలిత మాత్రం స్నేహానికే ఎంతో విలువ ఇస్తుంది. రేఖకు సరైన సలహాలిస్తూ ఆమె ఏ మాత్రం లోన్లీనెస్ ఫీలవ్వకుండా చూస్తుంది. అందుకే లలిత అంటే అంత ఇష్టం రేఖకి.

"ఏమిటీ అప్పుడే వెళ్ళిపోతున్నావ్?" అంటూ పక్కన మంజుల ఉండటం చూసి అర్ధమైనట్టు నవ్వింది.

"బోర్ కొడుతోంది. పైగా ఆఫీస్ నుంచి మా క్యాషియర్ ఒకటే ఫోన్. ఫోన్ మీద ఫోన్ చేస్తూ చంపేస్తున్నాడు. ఏవో బిల్లులున్నాయట. వాటిపై నేను సంతకం చేస్తేకానీ పాస్‌కావని, ఇవాళ ఆ సంతకాలు చేయకపోతే రేపు స్టాఫ్‌కు జీతాలు ఇవ్వటం సాధ్యపడదని" రేఖ మాటలకు నవ్వింది లలిత.

"పెద్ద బడాయిపోతోంది" అనుకుంది మంజుల.

"అయినా ఒక్కరోజు వెళ్ళకపోతేనే ఇన్ని సమస్యలా! ఆ చేయించుకునే సంతకాలేవో నిన్ననే చేయించుకోవచ్చుకదా! నెత్తిమీద కొచ్చేవరకు సాగదీసి ఇప్పుడు కాళ్ళకింద నిప్పులు పోస్తే ఎలా?" లలిత అన్నమాటల్ని ముందుకు నడుస్తూ విన్నది రేఖ.

"లేదే! మూడురోజుల నుంచి ఫోన్ చేస్తూనే ఉన్నాడు. నేనే."

రేఖ మాటలకు ఉలిక్కిపడింది లలిత.

వెనకే నడుస్తూ వాళ్ళిద్దరి మాటల్ని ఆలకిస్తోంది మంజుల.

"అంటే మూడురోజుల నుండి ఆఫీసుకు వెళ్ళటం లేదన్నమాట అమ్మాయిగారు. మూడురోజుల నుండి జ్వరం రావటం వల్ల నేను నిన్ను కలవలేకపోయాను. అందుకే నీ అప్‌డేట్స్, వెరెబవుట్స్ నాకు తెలియలేదు. ఇంతకీ మూడురోజులుగా నిన్ను అంత మథనపెడుతున్న సమస్య ఏమిటో?"

"ఏమీలేదే? ఏదో" ఓరచూపుతో మంజులను చూపిస్తూ సైగచేసింది.

అర్ధమైంది లలితకు. "అవును మంజులా! నీకిప్పుడేమైనా పనివుందా?"

మంజుల వైపు తిరిగి ప్రశ్నించింది లలిత.

"షాపింగ్ చెయ్యాలి. మీరూ వస్తున్నారుగా?"

"ఓ.సారీనే అర్జంటుగా మా డాడీ రమ్మని ఫోన్ చేశారు. వెళ్ళాలంటే సమయానికి నా కారు కూడా మొరాయించింది. అందుకే ఇక్కడికొస్తే రేఖ ఉంటుందేమో. దాని కార్లో మా డాడీ ఆఫీసుకు లిఫ్ట్ తీసుకుందామని వచ్చాను. లక్కీగా ఇది ఇక్కడే ఉంది."

అని రేఖవైపు తిరిగి "నన్ను మా డాడీ ఆఫీసు దగ్గర దింపేసి నువ్వు మీ ఆఫీసుకెళ్ళవే" లలిత మాటలకు తలూపింది రేఖ. అప్పటికే వారు కారు దగ్గరకు చేరుకున్నారు డ్రైవింగ్ సీట్లో కూర్చోబోతున్న రేఖను ఆపి తాను కూర్చుంది డ్రైవింగ్ సీట్లో.

కనీసం మొక్కుబడిగా అయినా తనను కూడా రమ్మంటారేమోనని ఎదురు చూసిన మంజుల "ఇడియట్స్! నన్ను కావాలని అవాయిడ్ చేయటానికే ఇదంతా. ఆ మాత్రం గ్రహించలేవా?" పళ్ళు కొరుక్కుంది. చేసేదిలేక తన కారువైపు నడిచింది.

## 4

"ఆ ఇప్పుడు చెప్పవే నీ సమస్య. ఆ పిశాచి నుంచి తప్పించానుగా! ఇక మనం రిలాక్స్‌డ్‌గా మాట్లాడుకోవచ్చు" లలిత మాటలకు చిన్నగా నవ్వింది రేఖ.

"అంటే... మీ డాడీ?"

"డాడీ ఊళ్ళోనే లేరు. క్యాంప్ కెళ్ళారు. ఏదో దాన్నించి తప్పించటం కోసం కోతలు కోశాను. ఇప్పుడు ప్రశాంతంగా చెప్పు అసలు సంగతి. ఎవరైనా నీ ఇగోని దెబ్బకొట్టారా? లేకపోతే నువ్వింతగా ఫీలవ్వవు. అసలు సంగతి నాన్చకుండా మీ ఆఫీసు వచ్చేలోపల చెప్పేయ్" రేక కంపెనీవైపు కారును మళ్ళిస్తూ అంది లలిత.

"ముందుగా థాంక్స్ చెప్పాలి నీకు ఆ మంజుల బారినుంచి తప్పించినందుకు" ఆమె ముఖంలో కొంచెం కళవచ్చింది.

"అవన్నీ తరువాత.. ముందు విషయం చెప్పు"

"ఒక బకరాగాడు నా మానమర్యాదలను మంటగలిపాడు. వాణ్ణి చూస్తుంటేనే. కాదు కాదు.. వాడిపేరు తలుచుకుంటేనే ఒళ్ళు మండిపోతోంది. ఎలాగైనా వాడి గుణపాఠం చెప్పి కాళ్ళబేరానికి తెప్పించుకునే వరకూ నాకు మనశ్శాంతి లేదు" అప్పటికే ఆగ్రహంతో ఆమె ముఖం ఎర్రబడింది.

"నిన్ను, నీ అహాన్ని అంత దెబ్బతీసేందుకు ధైర్యంచేసిన వాడెవడే?"

"ఉన్నాడులే సాగర్ అని. వాడికి తోడు వాడి స్నేహితుడు శర్మ. ఇద్దరూ ఇద్దరే. పెద్ద సమాజ సేవకులకు మల్లే పోజులు. ఎలాగైనా ఆ సాగర్ గాడి సంగతి తేల్చేయాల్సిందే. మా డాడీతో చెబితే ఒక్క క్షణంలో ఆ ఇద్దర్నీ చెడుగుడు ఆడించేస్తారనుకో. కానీ, వాళ్ళ మీద నేనే పగతీర్చుకోవాలనుకుంటున్నాను. ఏదైనా ఉపాయం చెప్పవే"

సాగర్ పేరు వినగానే ఉలిక్కిపడింది లలిత. తన కలవరపాటు కనబడకుండా ఉండేందుకు ముఖం రోడ్డువైపు తిప్పింది. ఆమె అలా ముఖం తిప్పడాన్ని డ్రైవింగ్ చేస్తోంది కదాని సరిపెట్టుకుంది రేఖ. సాగర్‌ను అవమానం చేసేంత వరకు ఆమె కోపం తగ్గదని అర్థమైంది లలితకు.

"ఆ సంగతి నేను చూస్తానుగానీ, ముందు వాళ్ళ అడ్రసు చెప్పు" లలిత గొంతులో ఏదో మార్పు.

"అదేనే అదేదో పార్టుమెంట్. ఆ దాని పేరు మర్చిపోయాను. అదే అదే గాంధీనగర్‌లో అంజనీ అపార్టుమెంట్. ఫ్లాట్ నెంబర్ 504."

"అదేమిటి అదంతా లోయర్ మిడిల్ క్లాసు ఉండే ఏరియా. అక్కడేనా చెప్పు. గుర్తుతెచ్చుకో"

"అందుకే నాకింత పట్టుదల. పూటకి ఠికాణా లేని వాళ్ళు కూడా ఈ రేఖను అవమానించేవాళ్ళే. వాళ్ళిద్దరికీ జీవితంలో మరిచిపోలేని గుణపాఠం చెప్పాలి. ఉన్నవాళ్ళతో అదీ రోషమున్న వాళ్ళతో పెట్టుకుంటే ఏమవుతుందో తెలిసిరావాలి. అందు కోసం ఎంతకైనా తెగిస్తాను"

రేఖ గొంతులో పట్టుదల గమనించింది.

"ముందు వాళ్ళను నేనొకసారి చూసిన తరువాత నువ్వేం చేయాలో చెబుతాను. మాములు గుణపాఠం కాదు. జీవితంలో మరువలేని, మళ్ళీ నీలాంటి వాళ్ళతో పెట్టుకుంటే ఏమిటో తెలుసుకునేలా ఉండే గుణపాఠం ఎలా నేర్పాలో మంచి ఉపాయం ఆలోచించి చెబుతాను. అందుకు ముందుగా నువ్వు కొద్దిగా ఓపికపట్టాలి అంతే. నేను చెప్పే ఉపాయం వాళ్ళకు నషాళానికి అంటేలా ఉంటుందని నీకు తెలుసుగా! కాబట్టి నువ్వు నీ రోజువారీ పనుల్లో తీరిక లేకుండా మునిగిపో. ఇక వాళ్ళ విషయాన్ని నాకు వదిలిపెట్టు"

లలిత మాటలకు రేఖ మనసు కొద్దిగా కుదుటపడింది. లలిత మాట ఇచ్చిందంటే అది జరిగిపోయినట్టే. ఇప్పుడు మనసు శాంతించింది. నిజంగా లలిత వంటి స్నేహితురాలుండటం తన అదృష్టం.

"ఇప్పుడు మీ ఆఫీసుకు వెళ్దామా?" లలిత ప్రశ్నించింది.

"ఉహూం లేదు. ముందుగా నీకు వాళ్ళ అడ్రసు చూపిస్తాను. తరువాత అటునుంచి అటే ఆఫీసుకి వెళ్దాం"

సరే తప్పేదేముంది. ఈ విషయం తేలేవరకు ఆమె మనసు నెమ్మదించదని అర్థమైంది లలితకు.

కారు గాంధీనగర్ వైపు మళ్ళించింది. రేఖ డైరెక్షన్ ప్రకారం కారు అంజనీ అపార్టుమెంట్ ముందు ఆగింది.

కారును గేటు దగ్గరే ఆపి, నెమ్మదిగా డోరు తీసుకుని దిగింది లలిత. ఆమెతో పాటే దిగుతున్న రేఖను ఆపి "ముందు నేను వెళ్ళి వాళ్ళతో మాట్లాడివస్తాను. అసలు వాళ్ళెలాంటివాళ్ళో, ముందు ముందు వాళ్ళ వల్ల నీకెలాంటి అవమానాలు ఎదురవుతాయో అన్నీ

తెలుసుకొస్తాను. ఎదుటివారి ఆలోచనలు ముందుగా తెలుసుకుంటే తగిన ఎత్తు వేయటం తేలిక. ఎదుటి బలగాన్ని, బలాన్ని తెలుసుకుని నడుచుకునేవాడే తెలివిగలవాడు. కాబట్టి నేనెవరో వాళ్ళకు తెలియదు గనుక ముందుగా వెళ్ళి వాళ్ళ గుట్టుమట్లు తెలుసుకొస్తాను. నిన్ను చూస్తే వాళ్ళు అలర్ట్ కావచ్చు. మన ఎత్తుకు పై యెత్తులు ఆలోచించవచ్చు. అందుకని నువ్విక్కడే ఉండు."

లలితను విచిత్రంగా చూసింది. "వాళ్ళ గుట్టుమట్లు ఎలా తెలుసుకుంటావ్? వాళ్ళనసలు నువ్వు చూడనేలేదు కదా!"

"అక్కడే ఉంది అసలు కిటుకు. నా తెలివితేటలపై నీకు నమ్మకం ఉంది కదా!" ఉందన్నట్టు తలూపింది రేఖ.

"మరికనేం. నువ్వు ఈ విషయంలో నిశ్చింతగా ఉండు. నీకు మనశ్శాంతి కలిగేలా కథ నేను నడిపిస్తాను" హామీ ఇచ్చింది లలిత.

అంతలో వాచ్‌మన్ ఎదురయ్యాడు.

"ఫ్లాట్ నెంబర్ 504లో ఉంటున్న సాగర్ సార్ రూమ్‌లో ఉన్నారా?"

సాగర్ పేరు వినగానే అతని ముఖంలో వినయం కొట్టొచ్చినట్టు కనపడింది.

లలిత ప్రశ్నకు ఉన్నారన్నట్టు తలుపాడు. ఆమెకు దారిచూపిస్తూ లిఫ్ట్ దగ్గరకు తీసుకెళ్ళాడు.

లిఫ్ట్ ఎక్కబోతూ ఆమెకు విక్టరీ సింబల్‌ను చూపించింది లలిత. అప్పటికి గానీ రేఖ మనసు పూర్తిగా కుదుటపడలేదు. లలిత అనుకున్నదంటే పనిసాధించుకు వస్తుంది. ఏదో తిరుగులేని ఉపాయం ఇప్పటికే దాని మెదడులో తయారై ఉంటుంది. తన ప్లాన్ అమలు చేయటానికి ముందు పరిసర ప్రాంతాల పరిస్థితుల్ని అంచనా వేసుకుంటుంది దానికి అనుకూలంగా తన ప్లాన్‌ను మార్చుకుంటుంది రేఖ ఆలోచనలు ఇలా సాగుతున్నాయి. లిఫ్ట్ ఎక్కి పైకి వెళ్ళింది లలిత.

తన జీవితంలో సాగర్ అనే వ్యక్తి సృష్టించబోయే తుఫాను గురించి రేఖ ఊహించలేకపోయింది. ఊహించివుంటే ఆమె ఏ నిర్ణయం తీసుకునేదో మరి.

లలిత పైకి వెళ్ళి పావుగంట అయింది. ఇరవై నిమిషాలు అర్థగంట. ఈలోపు లిఫ్ట్ ఎన్నిసార్లు కిందకు వచ్చినా లలిత వచ్చిందేమోనని లిఫ్ట్‌వైపు చూడటం ఆమె రాకపోవటంతో 'ఇంకా రాదేమిటబ్బా!' అనుకుంటూ నిట్టూర్చటం రేఖవంతైంది. గంట తరువాత దిగివచ్చింది లలిత. ఒక్కతే రాలేదు. ఆమెతో పాటు సాగర్, శర్మ, ఇద్దరు ఉన్నారు.

వాళ్ళు కారువరకూ వచ్చి కారులో ఉన్న రేఖను చూసి, "హల్లో రేఖగారూ! నమస్తే. ఏంటి ఇక్కడే ఉండిపోయారు? పైకి వచ్చి మా ఆతిథ్యాన్ని తీసుకుంటే సంతోషించేవాళ్ళం కదా!" అంటున్న సాగర్‌ను చూసి విసురుగా ముఖం తిప్పుకుంది.

"అదేమిటండీ లలితగారూ! రేఖగారు మీ స్నేహితురాలని మాకు చెప్పలేదు. మీ అంతస్తుకు తగినవాళ్ళం కాకపోయినా అతిథి మర్యాదలకు లోటు రానివ్వమని ఆమెకు తెలుసు" శర్మ అన్నాడు నవ్వుతూ.

రేఖకు ఒంటినిండా కారం పూసినట్టుగా ఉంది. "లల్లీ పదవే. ముందిక్కడి నుంది బయటపడితేగానీ ఒళ్ళు తేరుకోదు."

లలిత నెమ్మదిగా డ్రైవింగ్ సీట్లో కూర్చుంది. రెండు చేతులు జోడించి "సెలవు సాగర్‌జీ, శర్మాజీ మళ్ళీ కలుస్తాను. ఈసారి మీకు మరిచిపోలేని ఆతిథ్యం మా రేఖే ఇస్తుంది. ఎదురు చూస్తుండండి."

అలాగే అన్నట్టు తలుపారిద్దరూ.

కారు కొంచెం దూరం వెళ్ళిన తరువాత "అదేమిటి ముందే పరిచయం ఉన్నట్టు మాట్లాడుతున్నారు వాళ్ళు. నీకు ముందే తెలుసా?" అడిగింది రేఖ.

నెమ్మదిగా రేఖ ఆఫీసు కాంపౌండులోకి కారు ప్రవేశించింది. పార్కింగ్ ప్లేస్‌లో కారు ఆపి ఇద్దరూ దిగారు. నెమ్మదిగా నడుచుకుంటూ ఆఫీసు కారిడార్‌లోకి ఎంటర్ అయ్యారు.

వారిద్దర్నీ చూసి రెసెప్షన్ దగ్గర ఉన్న రెసెప్షనిస్టు, ఇతరులు గౌరవ సూచకంగా లేచి నిలబడ్డారు. వారు చేసిన విషెస్ అందుకుంటూ ముందుకు నడిచారు.

"చూశావా రాజు మేడమ్ హుందాతనం. ఎక్కడా తడబాటు లేకుండా ఆమె నడుస్తూ వెళ్తుంటే అలాగే చూడాలనిపిస్తోంది" రెసెప్షనిస్టుతో పక్కన నిలబడిన వ్యక్తి అనటం విన్న రేఖ పెదవులపై చిరాకు కదలాడింది.

"అంతలోనే కుంగిపోవాలా ఏమిటి? ఈ మాత్రం దానికే చిరాకుపడితే ఎలా?" ఆమె చిరాకును గమనించి అన్నది లలిత.

"అది చిరాకు కాదే మన స్టేటస్‌కు గుర్తించారని తెలుసుకున్న సంతోషం. వాళ్ళకు చేతకాని దాన్ని గురించి మెచ్చుకోవటం సామాన్యుల వంతు. దాన్ని చూసి మురిసిపోవటం మనవంతు. మనం పొంగిపోతున్నట్టుగానీ, అహాన్ని వదులుకున్నామని గానీ అనుకుంటే పొరబాటే. మన స్థాయిని ఎప్పుడూ మనం తగ్గించుకోకూడదు. గుర్తుంచుకో" రేఖ మాటలకు మౌనం వహించింది లలిత.

"వాళ్ళకు లేనిది ఇతరులకు ఉన్నది చూస్తే లేనివాళ్ళకు ఎక్కడలేని అసంతృప్తి చూపుతారు. దాన్ని పొగడ్తల రూపంలో చూపవచ్చు. లేకపోతే నిట్టూర్పుల రూపంలో చూపవచ్చు. అదీగాకపోతే అసహనం ప్రదర్శించవచ్చు. ఇవన్నీ వారిలోని రకరకాల విన్యాసాలు. ఉదాహరణకు ఇందాక నన్ను చూడగానే సాగర్ కళ్ళలో మెరుపు నువ్వు గమనించలేదూ. వాళ్ళకూ మనలా కార్లలో తిరగాలని, కాలు కిందపెట్టకుండా గడపాలని ఏవేవో ఆశలుంటాయి. వాటిని ఎలాగూ నెరవేర్చుకోలేరు. ఇలా మనపై అసూయ చూపుతూ శాటిస్‌ఫై అవుతారు. అందుకే లేనివాళ్ళను చూస్తే నాకు తీరనిమంట" మళ్ళీ రేఖ అన్నది.

ఆమె మాటలకు సమాధానమివ్వడం అనవసరం అనుకున్నది లలిత.

"ఏమిటే మాట్లాడవ్. నేను అన్నదానిలో తప్పేం ఉన్నది?" రేఖ ప్రశ్నకు లలిత చిరునవ్వే సమాధానమైంది. సమాధానమైంది.

ఇద్దరూ రేఖ కాబిన్‌లోకి ప్రవేశించారు. గుమ్మం దగ్గర ఉన్న అటెండర్ వాళ్ళను చూసి వినయంగా, బయం భయంగా నమస్కరించాడు. రేఖ ఎప్పుడే మూడ్‌లో ఉంటుందో ఆమెకే తెలియదు. ఇక అతనెలా ఊహించుకోగలడు? అందుకే అతని కళ్ళల్లో ఆ భయం. యజమానిని చూసి వినయం చూపించాల్సిన పనివాళ్ళు ఆమెను చూడగానే భయం ప్రదర్శించటం లలితకు ఎప్పుడూ అంతు చిక్కని సంశయమే.

మంచి మూడ్‌లో ఉన్నా తనకంటే స్థాయి తక్కువ వాళ్ళను అసలు పట్టించుకోదు. వాళ్ళెప్పుడూ తన కాలికింద చెప్పులగానే ఉండాలన్నది ఆమె ఆశయం. ఎవరైనా ఎప్పుడైనా ఆమె మాటలకు ఎదురుచెబితే వాళ్ళకు పుట్టగతులుండవు వెంటనే వాళ్ళకు ఇంక్రిమెంట్లు కట్ చేయటమో లేక అసలు ఉద్యోగానికే ఎసరు రావటమో ఆ ఆఫీసులో అందరికీ తెలిసిన విషయమే.

అందుకే రేఖ ఆఫీసులో ఉన్నంతసేపు ముళ్ళమీద ఉన్నట్టో, కత్తుల వంతెనపై నడుస్తున్నట్టో ఉంటుంది. వాళ్ళతీరు. అలాగని అక్కడినుండి వెళ్ళిపోయి మరోచోట ఉద్యోగం చేద్దామా అంటే రేఖా ఇండస్ట్రీస్ ఉద్యోగం మానేసి వచ్చిన వారికి ఇతర కంపెనీల్లో అంత తేలిగ్గా ఉద్యోగం దొరకదు. అందుకే రేఖ వ్యవహారశైలి నచ్చకపోయినా మింగలేక కక్కలేక ఉండిపోతారు అందరూ. ఈ సంగతి లలితకూ తెలుసు.

వారు కూర్చోకముందే టేబుల్‌పై ఇంటర్‌కమ్ మోగింది.

దాన్ని ఎడం చేత్తో స్టయిల్‌గా తీసింది రేఖ.

"చెప్పు భామినీ..!" స్వరంలో అధికారం, అతిశయం స్పష్టంగా కనబడుతోంది.

"మేడమ్! మీరు రాగానే చైర్మన్‌గారు కలవమని చెప్పారు."

"అలాగే ఛైర్మన్‌గారికి కనెక్షన్ ఇవ్వు ముందు" గొంతులో మార్దవం లేదు. అతిశయం, అహంకారం తప్ప మరొకటి ప్రతిబింబించలేదు.

"మేడమ్. ఛైర్మన్‌గారు లైన్‌లో ఉన్నారు" రెండు నిమిషాల తరువాత భామిని చెప్పింది.

"ఎస్. డాడీ. ఎస్. అలాగే ఇప్పుడే వస్తున్నాను. నాతోపాటు లలిత కూడా ఉంది. అదీ, నేను కలిసి మీ దగ్గరకు వస్తున్నాం"

ఫోన్ పెట్టేసి, "నాన్నగారెందుకో కంగారుగా ఉన్నారు. ఆయన మాటల్లో ఏదో తేడా కనబడుతోంది పద వెళ్ళొద్దాం" లేస్తూ రేఖ అన్నది.

"నేనెందుకులే. నేనిక్కడే కూర్చుంటాను. నువ్వెళ్ళిరా."

"నాన్నగారితో నువ్వూ వస్తున్నావని చెప్పానుగా. పర్వాలేదు. అంత నీముందు మాట్లాడుకోకూడని వ్యాపార రహస్యాలు ఏమీ ఉండవు. ఏదో వ్యాపార సంబంధమైన సమస్యే అనుకుంటాను"

లేవక తప్పలేదు లలితకు.

అదే కారిడార్‌లో కొంచెం దూరంలో ఉన్న ఛైర్మన్ అన్న కాబిన్ ముందు ఆగారు ఇద్దరూ. వాళ్ళను చూడగానే స్టూల్‌పై కూర్చున్న బోయ్ అటెన్షన్‌లో నిలబడి వెంటనే డోర్ తెరిచి వినయంగా దారి చూపించాడు.

"హలో బేబీ! రా అమ్మా రా! హల్లో లలితా! నాన్నగారికి ఇవాళ ఫోన్ చేశాను. క్యాంప్‌కెళ్ళారని చెప్పారు." సుదర్శనరావు అన్నాడు. అప్పటివరకు కొంత కలవరపడుతున్న సుదర్శనరావుకి కూతుర్ని చూడగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

"ఆఁ ఏమిటమ్మా మూడురోజుల నుండి ఆఫీసుకు రావటం లేదు. అంత తీరుబడిలేని పనులున్నాయా ఏమిటి?"

డబ్బున్న వాళ్ళిళ్ళల్లో సహజమే. ఎవరికి ఎప్పుడే పని ఉంటుందో ఎవరికీ తెలియదు. ఉదయం లేచిన దగ్గరనుండి పైసా ఎలా సంపాదించాలా అన్న యావ తప్ప మరొకటి ఉండదు. ప్రైవేట్ లైఫ్ కోల్పోతున్నామని తెలిసినా పట్టించుకోరు. ఒక్కక్షణం నిలిస్తే తామెక్కడ మార్కెట్‌లో వెనకబడిపోతామేమోనని భయం. అడుగువేయాలంటే భయం. తీయాలంటే సంకోచం. అందులోనూ సుదర్శనరావు వంటి వాళ్ళ సంగతి చెప్పనక్కర్లేదు.

"ఏమిటి డాడీ ? ఫోన్‌లో అంత కంగారుగా మాట్లాడారు. ఏదైనా అనుకోని సమస్య ఎదురైందా?"

మూడురోజులనుండీ తానెందుకు ఆఫీసుకు రావటం లేదో వివరించటం కూతురికి ఇష్టంలేదని సుదర్శనరావు గ్రహించాడు. ఇక దాని గురించి రెట్టించటం అనవసరం అనుకున్నాడు. అయినా ఇప్పుడు తన ముందున్న సమస్యకంటే కూతురు ఆఫీసుకు రావటం లేదన్న విషయం అంత ప్రాముఖ్యమైనదిగా కనబడలేదు ఆయనకు.

"అవునమ్మా! సాగర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు ఈ మధ్య ఒక ప్రోడెక్ట్ విషయంలో కొటేషన్ పంపించాం. మనకంటే రూపాయి తేడాతో మరెవరో కొటేషన్ వేశారని, దాన్నే సాగర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఖాయం చేయబోతోందని తెలిసింది. ఆ కంపెనీతో మనం స్నేహసంబంధాల్ని కొనసాగిస్తే భవిష్యత్తులో మనకు ఎదురుండదు."

"అలా ఎలా జరిగింది? మనకంటే కరెక్టుగా ఒక్క రూపాయి తేడాగా కోట్ చేశారంటే మన ఆఫీసు నుండే ఎవరో మన కొటేషన్ రేటు బహిరంగపరిచారన్నమాట. లేకపోతే ఒక్క రూపాయి తేడాతో ఎలా కోట్ చేస్తారు?"

ఆలోచిస్తూ అంటున్న రేఖ మాటలకు సుదర్శనరావు ముఖంలో వెలుగువచ్చింది.

"ఇంతవరకు తనకెందుకీ ఆలోచన రాలేదు? తన ఉద్యోగెవరో కోట్ చేసిన రేటును బయటకు చేరవేసి ఉంటాడు. అందుకే ఒకే ఒక్క రూపాయితో పాంచజన్య ట్రేడింగ్ కంపెనీ కొటేషన్ వేయగలిగింది"

రేఖ మాటలకు సుదర్శనరావు ఆలోచనలకు బ్రేక్ పడింది.

"ఇంకో రూపాయి తేడాతో మనమూ కోట్ చేస్తే నష్టం ఎక్కువగా ఉంటుందా డాడీ?"

"లేదమ్మా! నష్టం విషయం కాదు నేను ఆలోచిస్తోంది. ఆ సాగర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కు అంతర్జాతీయంగా చాలా రెప్యుటేషన్ ఉంది. ఆ కంపెనీతో స్నేహసంబంధాలు ఏర్పడితే భవిష్యత్తులో మనకు చాలా ఉపయోగకరం. అదే నేను ఆలోచించేది. ఇప్పుడు నువ్వు కొత్త విషయాన్ని చెప్పావు. సరిగ్గా మన కోట్ కంటే ఒక్కరూపాయి తేడాతో ఎలా కోట్ చేసిందా పాంచజన్య కంపెనీ? ఇందులో ఏదో మతలబు ఉంది."

"అసలు కొటేషన్లు ఓపెన్ చేశారా నాన్నా?" రేఖ ప్రశ్నకు సుదర్శనరావు భ్రుకుటి ముడిపడింది.

"ఇంకా చాలా టైమున్నది. కొటేషన్ గడువు ఇంకా ఉన్నది."

"అలాంటప్పుడు మనకంటే పాంచజన్య కంపెనీ ఒక రూపాయి తేడాతో కోట్ చేసిందని ఎలా చెప్పగలుగుతున్నారు కొటేషన్లు వేయటానికి సమయం ఉన్నప్పుడు?"

"అదే వ్యాపార సీక్రెట్ అమ్మా. పాంచజన్య కంపెనీలో మన మనుషులున్నారు. వారి వల్ల ఈ విషయం తెలిసింది. "

"ఇదేం వ్యాపార సూత్రం డాడీ? మన కంపెనీ నుండి రహస్యాలు బయటకు వెళ్తుంటే బాధపడతాం. ఎదుటి కంపెనీ నుంచి రహస్యాలు మనకు తెలిస్తే ఉప్పొంగిపోతాం. ఇది వ్యాపారమంత్రం కాదు నాన్నా కుతంత్రం"

స్పష్టంగా చెప్పాల్సింది చెప్పి మౌనం వహించిన రేఖను ప్రేమగా చూశాడు.

"నిజమేనమ్మా! ప్రతి వ్యాపారి మనసు ఇలాగే ఆలోచిస్తుందేమో! మనల్ని ఎదుటి వ్యక్తి ఎక్కడ మించిపోతాడోనని భయం నుండు పుట్టుకొచ్చే అభద్రతాభావం అన్నమాట. మనం మునిగిపోతున్న సంగతి అటుంచి ఎదుటివ్యక్తి మునగలేదేమిటా అని ఆలోచించటం నేటి వ్యాపారసూత్రం. ఇందుకే ఇన్ని కుతంత్రాలు, కుట్రలు!"

తండ్రి మాటలకు చిన్నగా నవ్వింది. "అంటే న్యాయమార్గాన కాకుండా కుట్రల ద్వారానే వ్యాపారం చేయగలమా డాడీ? తంత్రం వేరు. కుతంత్రం వేరైనా ఈ రెండూ మనిషి అథఃపాతాళానికి తీసుకెళ్ళే మార్గాలే. చూడ్డానికి సోపానాల్లా కనబడినా ఒక్కసారి అంత ఎత్తునుండి కిందకు పడేస్తాయి. ఇకనైనా వీటికి ఫుల్‌స్టాప్ పెట్టటం అవసరం డాడీ. మనకున్న బుద్ధితో రుజుమార్గంలోనే వ్యాపారం చేద్దాం. వచ్చే లాభాలతో తృప్తి పొందుదాం. అప్పుడే మన ఇమేజ్ పెరుగుతుంది. ఇది నా సొంత అభిప్రాయం" స్పష్టంగా అన్నది.

"అవన్నీ తరువాత ఆలోచించుకోవలసిన సంగతులు. ఇప్పుడు ఈ ఆపద నుండి గట్టెక్కేదెలా?"

"ఇందులో ఆపద ఏమున్నది? అంతగా ఆలోచించవలసినదేమున్నది? మన సిస్టర్ కంపెనీ పేరుతో మరో కొటేషన్ వేస్తే సరి. అయినా ఆ సంగతి నేను చూసుకుంటానులెండి. మీరు నిశ్చింతగా ఉండండి."

కూతురు భరోసాకు ఆయన మనసు తేలికపడింది.

సరిగ్గా తన మనసులోని ఆలోచన తెలిసినట్టు మాట్లాడుతున్న కూతురు తెలివితేటలకు ఆయన మురిసిపోయాడు. బయటకు అది కనపడకుండా జాగ్రత్తపడ్డాడు. ఇక మాట్లాడవలసినవేవీ లేదన్నట్లు ఇద్దరూ లేచారు. నెమ్మదిగా అడుగులో అడుగువేసుకుంటూ రేఖ కాబిన్‌లోకి నడిచారు.

"ఎంతలో ఎంత తేడా! అసలు రేఖేనా ఇది. ఇంతకు కొద్ది నిమిషాల ముందు తనతో మాట్లాడినప్పుడు అతిశయం చూపిన రేఖకు, ఇప్పుడు వ్యాపారధోరణిలో మాట్లాడిన రేఖకు ఎంతతేడా?" మనసులో స్నేహితురాల్ని ఆరాధనాభావంతో చూస్తూ అనుకుంది లలిత.

అంతలో లలిత ఫోన్ మోగింది. తీసి ఎవరో తెలుసుకుని "ఇప్పుడే వస్తాను. ఫోన్ అర్జంటట. డాడీ చేస్తున్నారు. ఒక్క నిమిషం" అని రేఖకు చెప్పి పక్కనే ఉన్న మరో రూములోకి వెళ్ళింది. అలా అయిదు నిమిషాల తరువాత వచ్చిన లలిత లాప్‌టాప్ తీసుకుని పనిలో మునిగిపోయిన రేఖనే చూస్తుండిపోయింది.

అతిశయం, ఎదుటి వ్యక్తులపై తేలికభాం ఉన్నా పనిలో రేఖ రాక్షసేనని మరోసారి ధ్రువపరుచుకుంది లలిత.

"ఒక్క పదినిమిషాలే అయిపోయింది" లలిత రావటం చూస్తుండిపోయింది.

అతిశయం, ఎదుటి వ్యక్తులపై తేలికభావం ఉన్నా పనిలో రేఖ రాక్షసేనని మరోసారి ధ్రువపరుచుకుంది లలిత.

"ఒక్క పదినిమిషాలే.. అయిపోయింది" లలిత రావటం చూసి అన్నది.

మరో పదినిమిషాల్లో భామినీని పిలిచింది.

"చూడు భామినీ! నీకో ముఖ్యమైన పని అప్పగిస్తున్నాను. ఇది నీకూ, నాకూ తప్ప మరొకరికి తెలియకూడదు. తెలిసిందా నా సంగతి తెలుసుకదా! జాగ్రత్త" అంటూ తాను ప్రింటవుట్ తీసిన పేపర్లను ఒక కవర్‌లో పెట్టి అందివ్వబోయింది.

"ఒక్క నిమిషం భామినీ! నువ్వు బయటవుండు మళ్ళీ మేడమ్ పిలుస్తారు"

**లలిత** చెప్పటంతో వెళ్ళాలా వద్దా అని నిలబడ్డ భామినీని వెళ్ళమన్నట్టు సైగచేసింది రేఖ.

"అయినా ఇంత వ్యాపారసూత్రాలు అంటూ, ఇందాక మీ డాడీ ముందు, ఉపన్యాసం ఇచ్చావు,. అవన్నీ చెప్పి మూడు నిమిషాలు కాకముందే మొదటికొస్తున్నావు. ఎవరో మీ ఆఫీసునుండి బయటకు రహస్యాలు మోస్తున్నారని నీకు తెలుసు. ఎవరో తెలియదు. వారెవరో తెలిసేవరకూ ఇటువంటి విషయాల్లో జాగ్రత్తపడొద్దూ!"

అవును లలిత మాటల్లోనూ వాస్తవం ఉంది. ఎవరో తెలియకుండా ఈ రెండో కొటేషన్‌ను కూడా బయటకు చేరవేసే వాళ్ళకు అప్పగిస్తే ఎలా? అసలు ఎవరీ పనిచేస్తున్నారో ముందుగా తెలుసుకోవాలి. ఆ తరువాత రేఖ ఆలోచనలు పూర్తిగాకముందే లలిత అన్నది.

"ఇప్పుడు మనిద్దరికీ పనేం లేదుకదా! మనమే స్వయంగా వెళ్ళి వీటిని అందజేసొద్దాం"

లలిత మాటలకు ఉలిక్కిపడింది రేఖ.

"నేనా? కొటేషన్ పేపర్లు అందచేయటానికి స్వయంగా వెళ్ళటమా? నెవ్వర్. ఒక గుమాస్తా చేసేపని నేను చేస్తే నా విలువేమవుతుంది? నాకంత దిగజారాల్సిన అవసరంలేదు" మళ్ళీ ఆమెలో మొదటి రేఖ ప్రవేశించింది.

ఆమె మనసులోని భావం కనిపెట్టింది లలిత.

'ఈ అహంకారం, అహంభావం నుండి ముందు దీన్ని బయటకు తీసుకురావాలి. అప్పుడే తాననుకున్నది సాధించగలుగుతుంది' అనుకుని రేఖ చేతిలోని కవర్‌ను అందుకున్నది.

"పోన్లే నేనే వెళ్ళొస్తాను. ఎవరు అందజేస్తే ఏముంది? కొటేషన్ కాగితాలు వాళ్ళకు ముట్టాలి. ముట్టినట్లు మనకు రసీదు కావాలి అంతేకదా!"

ఆమె మాటలకు విస్మయపడింది రేఖ.

"అదేమిటే! నువ్వెళ్తే ఒకటి, నేను వెళ్తే ఒకటా! ఇద్దరిలో ఎవరు వెళ్ళినా ఒకటే. గుమాస్తా చేసే పని మనం చేయటమేమిటి? ఇట్స్ రిడిక్యులస్"

"మరేం చేద్దాం చెప్పు. నీ ఆఫీసులో వాళ్ళనా నమ్మలేవు. నువ్వా నీ అభిజాత్యాన్ని వదులుకోలేవి. ఏ అభిజాత్యం, అతిశయం లేని నాలాంటి వాళ్ళను ఉపయోగించుకో. దీని ఫలితమేమిటో ముందు ముందు నీకే తెలుస్తుంది" అని కవర్‌తో సహా లేచింది.

"ఉండు నేనూ వస్తాను. నీ కారు తేలేదుగా. నా కారులో డ్రాప్ చేస్తాను"

"నన్ను గాంధీనగర్‌లో దింపు. అక్కడ షెడ్‌లో నా కారు ఉంది. తీసుకెళ్తా"

"ఏం ఏమన్నా విశేషమున్నదా ఏమిటి? నన్ను అవాయిడ్ చేయాలని చూస్తున్నావు" కళ్ళెగరేస్తూ అన్నది రేఖ.

"అంత సీన్ నాకు లేదని నీకు తెలుసు. నేనెప్పుడో మా బావకు వాగ్దత్తను. అయినా ఈ విషయంలో నీకున్నంత ధైర్యం అందరికీ ఉండొద్దూ"

"ఎప్పుడూ ఊరిస్తున్నావుగానీ, మీ బావను ఒక్కసారి కూడా పరిచయం చెయ్యవేమే. మేమేమన్నా ఎగరేసుకు వెళ్తామన్న భయమా లేక.?"

"నువ్వు ఎగరేసుకు వెళ్ళే ప్రయత్నాలు చేసినా అంత తేలిగ్గా బుట్టలో పడే రకం కాదులే మా బావ. అయినా నేనేమన్నా రోజూ అతన్ని కలుస్తాననుకున్నావా ఏమిటి? ఏదో వాళ్ళు మా ఇంటికి వచ్చినప్పుడో లేక మేము వాళ్ళింటికి వెళ్ళినప్పుడో. మా బావగురించి నాకో సీక్రెట్ ఈ మధ్యే తెలిసింది. అదెంత నిజమో తేలాల్సి వుంది" ఊరిస్తూ అంది లలిత.

"ఏమిటే ఆ సీక్రెట్? దొంగ చాలా అడ్వాన్స్‌లో ఉన్నావు. ఇందులో నీకంటే పూర్. ఒక్క అడుగు కూడా వేయలేకపోతున్నా."

"ఎన్ని కబుర్లయినా చెబుతావు ఇప్పుడు. తీరా ఆ టైము వచ్చిందంటే ఎవరికీ చెప్పకుండా నీ కలల రాకుమారుడితో చెక్కేస్తావు. అయినా నీ అభిజాత్యం, పట్టుదలలే నీలోని అసలు వ్యక్తిని బయటకు రానివ్వటంలేదు. నీకుగా నువ్వు వాటి మధ్య బందీగా చిక్కుకుపోయావు. ముందు వాటినుంచి బయటపడి ఎదుటివ్యక్తిని కూడా మనిషిలా గుర్తించటం నేర్చుకో. ఆ తరువాత అన్నీ అవంతట అవే కలిసొస్తాయి"

లలిత మాటలకు రేఖ ముఖం జేబురించింది.

మాట్లాడుతూ మాట్లాడుతూనే ఇది నన్ను ఎగతాళి చేస్తోంది. అవమానం చేస్తోంది. ప్రేమకు తాను పనికిరానని ముద్రవేస్తోంది. దీని రోగం కుదర్చాలంటే ఎలా? ఇంత ప్రాణస్నేయితురాలు కూడా ఈ రోజు ఇలా తనను తక్కువ చేసుకోమని ఎందుకు చెబుతోంది?

ఇది నిజంగా దానికి పుట్టిన ఆలోచనేనా లేక ఎవరైనా వెనక ఉన్నారా? నిజమే. తనకు తాను స్థాయి తగ్గించుకునేందుకు ఎట్టి పరిస్థితుల్లోను ఒప్పుకోదు. ఎందుకు తగ్గించుకోవాలి? దేవుడు అందర్నీ మనుషుల్లా పుట్టించినా మనిషికి, మనిషికి మధ్య ఎన్నో వ్యత్యాసాలు, ఎన్నో తేడాలు. మరెన్నో అంతరాలు. కేవలం తననే ఎందుకు ధనవంతురాలిగా పుట్టించాలి? ఆ సాగర్‌లాంటి వాళ్ళను ఎందుకు లేమిలో పుట్టించాలి? ఈ తేడాల కారణంగానే తాము ఆదేశిస్తే అమలు చేసే స్థితిలో సాగర్‌లాంటి వాళ్ళున్నారు. తాము ఎప్పుడూ అధికారం చెలాయించేందుకే ఉన్నాం. లేమిలో ఉన్నవాళ్ళు మా అధికారాన్ని భరించేందుకు ఉన్నారు. ఆలోచిస్తూనే డ్రైవింగ్ చేస్తోంది.

తన ఆలోచనలు, అభిప్రాయాలు తెలిసీ ఇవాళ ఇదేదో కొత్తగా మాట్లాడుతోంది. చూద్దాం. ప్రస్తుతానికి దీనితో వాదన పెట్టుకోవటం అనవసరం. తాను నమ్మిన, తనను ప్రేమించే ఏకైక స్నేహితురాలిదొక్కటే. మిగిలినవారంతా తన డబ్బును చూసి తనతో చెలిమి కోసం పాకులాడేవారే.

"ఏమిటే ఆలోచిస్తున్నావు. నా మాటలేమైనా నిన్ను బాధించాయా? లేక ఏమిటిది ఇవాళ కొత్తగా మాట్లాడుతోందనుకుంటున్నావా? అనవసరంగా నేనేదీ మాట్లాడనని నీకు తెలుసు. నేనేది మాట్లాడినా దాని ప్రయోజనం వేరే ఉంటుందనీ తెలుసు. కాబట్టి ఆలోచనలను

కట్టబెట్టి ఆ పక్కగా కారాపు. అదిగో గ్యారేజీ దాటేస్తున్నాం కూడా'' లలిత మాటలకు సడన్ బ్రేక్ వేసింది. వెనక ఏదో చప్పుడైనట్టు శబ్ధం వినిపించింది. సైడ్ మిర్రర్‌లో నుంచి వెనక్కి చూసిన రేఖ ముఖం పట్టరాని ఆగ్రహంతో జేవురించింది. ఆమె కారుకు సడన్ బ్రేక్ వేయటంతో వెనకే వస్తున్న బైక్ బ్రేక్ పడక ఆమె కారును ఢీకొన్నది.

అసలే కొత్తకారు. ఇష్టపడి కొనుక్కున్నది కావటంతో దానికేమైనా అయితే రేఖ మనసు చివుక్కుమంటుంది. ఆగ్రహంతో కారు డోర్ తీసి విసురుగా వెనక్కి నడిచింది. కారు వెనక బైక్‌పై సాగర్, శర్మ ఉన్నారు. వాళ్ళను చూడ్డంతోనే ఆమెకు కోపం ఆగలేదు.

''ఇడియట్స్! ఏమిటి నన్నిలా ఫాలో అవుతున్నారు? నేనెక్కడికి వెళితే అక్కడ ప్రత్యక్షమవుతున్నారు. అయినా బైక్ నడపటం రానివాళ్ళకు రోడ్డుపైకి రాకూడదని తెలియదా! లేక ఏదైనా దెబ్బతగిలితే డబ్బున్నది కదా కాస్తో కూస్తో లాగుదామనుకున్నారేమో జాగ్రత్త!'' ఆ తరువాత ఆగ్రహంతో ఆమెకు మాటలు రావటంలేదు.

అప్పుడే కార్లోంచి దిగుతున్న లలితను చూసి చిన్నగా నవ్వాడు సాగర్.

అతను నవ్వటం చూసిన తరువాత మరింత చిర్రెత్తుకొచ్చింది రేఖకు.

తానిక్కడ మాట్లాడుతుంటే అటువైపున్న లలితను చూస్తూ నవ్వుతాడేమిటి? తనంటే లెక్కలేదని చెప్పటమా?

''అయినా మా కారే దొరికిందా మీకు?'' వెనక్కి వెళ్ళి కారును చూస్తూ అంది లలిత. వెనక కారు డిక్కీ దగ్గర దెబ్బతిని సొట్ట కనిపించింది.

''ఏమిటోనండీ బాబూ! నా ప్రారబ్ధం కాకపోతే మీ స్నేహితురాలితో ఎప్పుడూ నాకు ఘర్షణ తప్పటంలేదు. ఎప్పుడు కలుసుకున్నా ఇదిగో ఇలాగే జరిగిపోతోంది. ఏమిటో మొదట మా చూపులు మంచివేళలో కలుసుకున్నట్టు లేదండీ.''

నర్మగర్భంగా అంటూ రేఖను చూశాడు సాగర్.

''మిస్టర్ నోరు జారకు జాగ్రత్త. చూపులు కలవటమేమిటి? అతిగా మాట్లాడితే ఫలితం అనుభవిస్తావ్''

రేఖ ఆగ్రహానికి మౌనం వహించాడు.

''ఏమిటి మేడమ్ నోరు జారింది మీరు. పైగా మావాణ్ణి అంటారు. అయినా మీరేమన్నా సడన్‌బ్రేక్ వేస్తారని కలగన్నామా? రోడ్డుపై వెళ్తున్నప్పుడు ట్రాఫిక్ రూల్స్ మీరెందుకు గమనించరు? మొన్నటికి మొన్నా అంతే. వెనక వస్తున్న వాహనాలను కూడా గమనించి డ్రైవ్ చేస్తే ఈ తిప్పలు, మాటలు ఉండవు కదా!'' శర్మ కల్పించుకుంటూ అన్నాడు.

అన్న తరువాత తాను కాస్త ఎక్కువగా మాట్లాడినట్టనిపించింది. తగ్గమన్నట్టు పక్కనే ఉన్న లలిత కళ్ళతో చెప్పటంతో నిదానించాడు.

''అయినా శర్మా! మాటలెందుకు లేరా! మనదే తప్పని ఆమె భావిస్తున్నప్పుడు తగిన పరిహారం కూడా ఇవ్వాలి. సరే. వెళ్ళి లోపల మెకానిక్ శేఖర్ ఉన్నాడేమో చూడు'' అన్నాడు సాగర్.

తనను వారిస్తున్న సాగర్‌ని చూస్తూ గారేజీ లోపలికి నడిచాడు.

''ఉండండి లోపల నాకారు ఉంది. నేనూ వస్తాను'' అని అతనితో పాటే నడిచింది లలిత. వాళ్ళిద్దరూ నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ వెళ్తుంటే అనుమానంగా చూసింది రేఖ.

శర్మ మాట్లాడిన తరువాత బయట నిలబడివున్న సాగర్‌ను చూసి పరిగెత్తుకుంటూ వచ్చాడు శేఖర్.

''సార్! మీరిక్కడ..!? రండి సార్ లోపల ఏసీ రూమ్ ఉంది. కొద్దిసేపు కూర్చుంటే కారు రిపేరు చేసిచ్చేస్తాను'' తనను గమనించకుండా సాగర్‌కు ఎక్కడలేని గౌరవం ఇవ్వటం రేఖను ఇంకా రెచ్చగొట్టయింది. అందరూ వీడినేమిటంత గౌరవిస్తారు?

తనకు తెలిసినవాళ్ళు కూడా అతన్ని చూడగానే ప్రపంచంలోని గౌరవాభిమానాలన్నీ చూపిస్తారెందుకు? ఆ సమయంలో తననెవరూ పట్టించుకోరేమిటి? ఇదో పజిల్‌లా అనిపించింది ఆమెకు.

"చూడు శేఖర్. నావల్ల పాపం మేడమ్‌గారి కారు దెబ్బతిన్నది. దాని సంగతి ముందు చూడు. బిల్లు నేనిస్తాను. మేడమ్‌గారి దగ్గర తీసుకోకు"

సాగర్ మాటలకు శేఖర్ కారు దెబ్బతిన్న ప్రదేశంలో చూశాడు.

"చాలా చిన్నదే సార్. కాకపోతే ఒకరోజు పడుతుంది. ఢీ ఇచ్చిన చోట కారు పెయింట్ పోయింది. టింకరింగ్ చేయాలి. అందువల్ల కారును ఒక్కరోజు నాకు అప్పగించాలి"

శేఖర్ మాటలకు

"అక్కర్లేదు. నేను మా గారేజీలో చూపిస్తాను" అంది.

అంతలో తనకారు తీసుకుని వచ్చిన లలిత "ఏమిటే! సాగర్‌గారితో అంత యిదిగా మాట్లాడుతున్నావు. ఒకసారి మాట్లాడితే మళ్ళీమళ్ళీ మాట్లాడాలనిపోస్తోంది కదూ!"

చిలిపిగా అంటున్న లలితను కోపంగా చూసి "ముందు నువ్వు నోర్మూయ్!" అని కసిరింది.

నవ్వుకుంటూ తన కారు తలుపు తీసింది లలిత. సరిగ్గా అప్పుడే అదే కారులోంచి దిగాడు శర్మ. ఇదేమిటో శర్మతో ఎక్కువ చనువుగా ఉంటున్నట్టున్నది. దీని సంగతి తరువాత ఇప్పుడేం చేయాలి? భగవంతుడా ఏమిటి ఈ ఇరకాట పరిస్థితి?

"శర్మా! శేఖర్‌కి పదివేలుంటే ఇచ్చేయి. శేఖర్ కారు తప్పనిసరిగా రేపటికి రెడీ చెయ్యి. బిల్లు ఇంకా ఎక్కువైతే శర్మకు ఫోన్ చెయ్యి. అంతేగానీ ఎవరో ఒకరి దగ్గర తీసుకోకు" రేఖ వంక చూస్తూ మోటారు సైకిల్ దగ్గరకు నడిచాడు.

ఏదో మాట్లాడాలని రేఖ ప్రయత్నించినా అదేమీ పట్టించుకోనట్లు తన బైక్‌ను స్టార్ట్ చేసి ముందుకు దూకించాడు.

ఏమిటి ఇలా ఇతని దగ్గర ఇరుక్కుపోతున్నాను? అయినా అతను చెప్పినంత మాత్రాన ఇక్కడే ఇవ్వాలని ఏముంది?

"మా మెకానిక్ ఉన్నాడు అతని దగ్గరే ఇస్తాను" మొండిగా అంటున్న రేఖను చూసి, "నీ ముఖం. ఇతను మంచి మెకానిక్. అందుకే వెతుక్కుంటూ వచ్చి నేనిక్కడే కారు ఇస్తుంటాను. మాట్లాడకుండా కారెక్కు. రేపొచ్చి కారు తీసుకెళ్దాం" మందలింపుగా అంది లలిత.

"అదికాదే కారు గురించి, మెకానిక్ గురించి కాదు నా ఆలోచన. ఆ సాగర్ గురించే. ఎప్పుడూ ఇలా ఇరకాటంలో పెట్టి మాయమాటలతో డబ్బు చెల్లించేస్తుంటాడు. ఇది నాకు మూడోదో నాలుగోదో అనుభవం. ఎప్పుడూ ఇలా ఇరుక్కుపోవటం, అతను ముందు ముందు దీన్ని అడ్వాంటేజీగా తీసుకుంటాడేమోనని అనుమానం. ఇక ఇక్కడితో ఇతనికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే"

"సరేలే అలాగే చేద్దువుగానీ, నిన్ను మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను. పద"

రేఖ తలూపి నీరసంగా లలిత కారెక్కింది.

## 5

ఇంటికి వెళ్ళి చిరాగ్గా ఉండటంతో స్నానం చేసి అందంగా తయారైన రేఖకు కాసేపు రిఫ్రెష్‌గా కూర్చోవటం అలవాటు. అదే అలవాటు ప్రకారం తన గదిలో ఎదురుగా ఉన్న షెల్ఫ్‌లోంచి పుస్తకం తీసుకుని తీరుబడిగా సోఫాలో కూర్చుని పుస్తకం తెరిచింది. ఒకటి రెండు లైన్లకంటే ఎక్కువ చదవలేకపోయింది. చదివేదేమీ బుర్రకు ఎక్కటం లేదు. ఆమె మనసునిండా సాగర్ గురించి ఆలోచనలే.

ఏమిటిలా ఎప్పుడు కలుసుకున్నా తాము ఉప్పూ నిప్పులా కీచులాడుకునే సంఘటనలే ఎదురవుతున్నాయి. ప్రతిచోటా అతనిదే పైచేయి అవుతోంది. ఏదో తుఫాను వచ్చినట్టుగా ఉంటుంది తన మనసు ఆ సమయంలో. అన్ని విషయాల్లోను కచ్చితంగా ఉండే తాను అతని దగ్గర ఎందుకు ఉండలేకపోతోంది? అయినా అతని ముఖంలో మచ్చుకైనా చిరాకు అనేది కనిపించదే? ఎప్పుడూ నవ్వుతూనే ఉంటుందా ముఖం. నిజంగా అతని నవ్వెంత బాగుంటుంది. అలా నవ్వుతుంటే ఇంకా ఇంకా చూడాలనిపిస్తుంది. కానీ అలా చూసే పరిస్థితుల్లో తామెప్పుడూ కలుసుకోలేదు. కలుసుకున్నప్పుడల్లా ఏవో కీచులాటలే. అంత నెమ్మదిగా, ఎవరినైనా లెక్కచేయని విధంగా ఎలా ఉండగలుగుతున్నాడతను? ఈసారి అతను నవ్వుతున్నప్పుడు ఫోటో తీయించాలి. అదే అతను కలిగినింట్లో పుట్టి ఉంటే ఎంత బాగుండేది - ఆమె ఉలిక్కిపడింది.

ఏమిటి ఎన్నడూ లేనిది ఇవాళ ఆ సాగర్ గురించి ఆలోచిస్తోంది. మరో వ్యక్తి గురించి అదీ తన స్థాయికాని వ్యక్తి గురించి అసలు పట్టించుకోని తాను ఇవాళేమిటి ఇలా సాగర్ గురించి ఆలోచిస్తోంది. తన మాట మనసు అసలు వినిపించుకోవటంలేదు. తానేమైనా అతన్ని..?!

ఛ..ఛ..కాదు. కానేకాదు. ఏదో యధాలాపంగా ఆలోచిస్తోంది అంతే. ఆమె ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ ఫోన్ మోగింది. ఎక్కడినుండా అని నెంబర్ చూసింది. లలిత పేరు చూసి లిఫ్ట్ చేసింది.

"హాయ్! రెస్టు తీసుకుంటుంటే భంగం కలిగించానా? నాకు తెలిసిన విషయం వెంటనే నీకు పాస్ చేయకపోతే పిచ్చెక్కినట్టుంటుందని తెలుసుగా. అందుకే ఫోన్ చేశాను."

"అసలు సంగతి చెప్పవే. చంపక"

"ఏమిటంత చికాగ్గా ఉన్నావు. ఎనీథింగ్ సీరియస్?!"

"ఆ! అంతా సీరియస్సే. ఏమిటో ఇవాళ పిచ్చిపిచ్చి ఆలోచనలతో చికాగ్గా ఉంది. అనవసరమైన మనుషులు గుర్తుకొస్తున్నారు"

"కొంపదీసి సాగర్ ఏమైనా గుర్తుకొచ్చాడా?" అనుమానంగా అడిగింది.

దీని దగ్గరేమైనా దుర్భిణీ యంత్రం ఉందా, ఇట్టే పట్టేస్తుంది? నేనిక్కడ ఆలోచిస్తుంటే నా ఆలోచనల్ని అదెక్కడి నుండో పసిగట్టేస్తుంది. ఎప్పుడూ ఇంతే! దగ్గరలో ఉన్నా, దూరంలో ఉన్నా తన ఆలోచనలు దానికిట్టే తెలిసిపోతాయి. ఇదెట్లా! లేకపోతే చీకట్లో రాయి విసురుతుందా? అంతే. అయివుంటుంది.

ఇప్పటివరకు తామిద్దరం సాగర్ విషయాన్నే కదా మాట్లాడుకుంది. దాన్ని ఆధారం చేసుకునే అది ఒక రాయి విసిరివుంటుంది. నేనేమో దొరికిపోతుంటాను.

"ఏమిటే మట్లాడవు. అతన్ని ఆలోచనల దగ్గరే ఆపేస్తున్నావా? లేక ఇంకేమైనా..!?" లలిత మాటలకు జవాబివ్వకపోతే ఇక చెలరేగిపోతుంది. ఏదో ఒకటి చెప్పి ప్రస్తుతానికి దానిబారి నుంచి తప్పించుకోవాలి.

"అదేం కాదే ఆ కొటేషన్ గురించే ఆలోచిస్తున్నాను. ఎలాగైనా దాన్ని సంపాదించామా ఇండస్ట్రీలో మనకు ఎదురుండదు."

"చెప్పానుగా దాని గురించి నువ్వు మరిచిపోయి, అది మనకే వచ్చేసిందనుకో. తరువాత జరగాల్సిన విషయాలు ప్లాన్ చేసుకో. ఇది నా హామీ. "

"అంత నమ్మకంగా ఎలా చెబుతున్నావు? నీకేమైనా జ్యోతిసం తెలుసా?"

"జ్యోతిషం కాదు. మరేం కాదు. సాగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌లో ఒక ముఖ్యమైన పోస్టులో ఉన్న వ్యక్తి నాకు బాగా తెలుసు. అతనికి విషయమంతా వివరించాను. అతనిదేం తక్కువ పోస్టు కాదు. ఎం.డి తరువాత ఇతనిదే నిర్ణయం. ఇతనెంత చెబితే ఎం.డి

అంతేనట. కాబట్టి నో టెన్షన్. నో థింకింగ్. కేవలం ఒకే ఒక్క ఆలోచన నీ మనసులోకి రానివ్వు. ఈ కొటేషన్ నీకే గ్రాంట్ అయితే ఫరదర్‌గా తీసుకోవలసిన అంశాలపై దృష్టిపెట్టు.''

లలిత మాటలకు ఆమెలో ఒక్కసారి జోష్ కలిగింది. ''నిజమా! మరి ఇంత ఆలస్యంగా చెబుతావేం. ఈ విషయం ముందుగానే ఎందుకు చెప్పలేదు?''

''కాస్త ఆనందాన్ని దాచుకో. నిజంగా నీ ఆలోచన, టెన్షన్ బిజినెస్ గురించేనా లేక సాగర్‌పై మనసు పోతోందా?''

అబ్బ. దీనితో వచ్చిన చిక్కే ఇది. కాలికివేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి వేస్తుంది. ఎలాగోలా విషయాన్ని రాబడుతుంది. చెబితే ఒక గోల. చెప్పకపోతే మరోగోల. ఎలా దీనితో వేగేది?

''ఆగవే కాస్త మనం కలిసినప్పుడు వివరాలు చెబుతానుగానీ, ఇప్పటికి వదిలెయ్యవే లల్లీ..పిల్లీ..తల్లీ!''

అటునుంచి పకపకా నవ్వు వినిపించింది.

''అమ్మాయిగారు దారిలోనే ఉన్నారన్నమాట. సాగర్‌లాంటి వాళ్ళతో జాగ్రత్త. అటుచేసి ఇటుచేసి ఏదో మాయచేసేస్తారు. చివరకు తాము చేసిందే రైటనిపిస్తారు.''

''ఏయ్! ఎక్కువ మాట్లాడావంటే చూస్కో. మీ బావతో చెబుతాను'' మళ్ళీ అటునుంచి నవ్వు వినిపించింది.

అనుకున్నంతా అయ్యింది. చివరకు ఎలాగోలా తన ఆలోచనలు సాగర్ చుట్టూ తిరుగుతున్నాయని గ్రహించింది. ఈ సంగతి ఆ సాగర్‌కు మోసెయ్యదు కదా! చూస్తుంటే దీనికి సాగర్, శర్మలతో మంచి స్నేహమే కుదిరినట్లుంది. మరీ ఆ శర్మను చూడగానే దీని ముఖంలో వెలుగే వెలుగు. సరే చేసేదేమున్నది.

తానెంతో తెలివిగలదానినని, ఏ విషయం అంత త్వరగా బయటపడనని, ఎవరినీ లెక్కపెట్టనని అమ్మానాన్నలతో సహా చాలామంది అభిప్రాయం. కానీ ఒక్క లలిత దగ్గరే తాను దొరికిపోతుంది. ఇదిగో మళ్ళీ ఇలా సాగర్ ఒకడున్నాడు. తనను ఎన్ని రకాలుగా చికాకు పెట్టాలో అన్ని రకాలుగా పెడుతున్నాడు. వీళ్ళిద్దరూ ఒకటైతే తన పాట్లు ఎలా ఉంటాయి? తననసలు లెక్కలోకి తీసుకుంటారా? వాళ్ళే నిర్ణయాలు తీసుకుని తనపై రుద్దేందుకు ప్రయత్నిస్తారా? అయినా తానంత తెలివితక్కువదా, ప్రతి విషయంలోనూ దొరికిపోవటానికి? వాళ్ళ నిర్ణయాలు వాళ్ళు తీసుకుంటే తన నిర్ణయాలు తనకుంటాయి. చూద్దాం ఇదెటు తీసుకెళ్తుందో.

''ఏమిటే ఆఫీసు నుండి రాగానే కాఫీ తాగకుండా అంత ఆలోచనలో పడ్డావు? ఏదైనా సీరియస్ ప్రాబ్లమా? ఆఫీసుదా? పర్సనలా?'' అమ్మ మాటలకు ఉలిక్కిపడింది.

ఇదేమిటి అమ్మ ఇలా అడుగుతుంది, ఆఫీసు సంగతా లేక పర్సనల్ విషయమా అని. అందరూ తన మనసుని చదివేస్తున్నారా ఏమిటి ఊరికే పసిగట్టేస్తున్నారు.

ఛ. ఈ సాగర్ పరిచయమైనప్పటినుండి తను తానుగా ఉండలేకపోతోంది. తన ప్రవర్తనలోను, మాటలోను ఆలోచనా తీరులోను ఏదైనా మార్పు వచ్చిందా? ఇంతకుముందు అతిశయంతో అందర్నీ ఆరడుగుల దూరంలోనే ఉంచేది. ఇప్పుడు ఎవరికి వారు ఆ హద్దు దాటి ముందుకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనిపిస్తోంది. అందరిలోనూ తాను చులకన అయిపోతోందా? ఇంతకు ముందులా ఉండలేకపోతోందా? ఎందుకింత మార్పు? ఇది ఇక్కడితో ఆపకపోతే తన ఇగో దెబ్బతినటం ఖాయం. దాన్ని కోల్పోయిన తరువాత అందరిలో తానూ ఒకలా ఉండటం కల్ల. లాభంలేదు. తన ప్రత్యేకతను తాను చాటుకోవలసిందే, అది సాగర్ దగ్గరైనా, మరెవరి దగ్గరైనా!

తన ఆలోచనలో తానుంటే అమ్మ మళ్ళీ రెట్టించింది.

''ఆఁ ఏమీలేదమ్మా. ఏదో కొటేషన్ గురించి'' తేలిగ్గా అన్నది.

"ఆఫీసు పని గురించా? ఇంకా ఏమిటో అనుకున్నాను. అయినా ఇంటికొచ్చిన తరువాత కూడా ఆఫీసు ఆలోచనలేనా? ఇక లాభంలేదు. మీ నాన్నగారితో చెబుతానుండు. పందొమ్మిదేళ్ళ పిల్లవు. నీ ఈడుపిల్లలు చూడు. చక్కగా ఆడుతూ పాడుతూ ఎంత చలాగ్గా ఉంటారో. నువ్వూ ఉన్నావు. ఎంతసేపూ ఆఫీసు విషయాలు తప్పితే ఒక అచ్చటా ముచ్చటా అంటూ లేదు"

"అమ్మా! అమ్మా! అంతటితో ఆపవే. ఇప్పుడు నేనేం కానిపని చేయటంలేదు. మనల్ని నమ్ముకుని అటు ఆఫీసులోకానీ, ఇటు ఫ్యాక్టరీలోగానీ పదిహేనువందల మంది బతుకుతున్నారు. మనం ఒక్క తప్పటడుగు వేశామా వారందరి జీవితాలు గోవిందా! అందుకే అంత అప్రమత్తత. తెలిసి కూడా నువ్వేమిటో ఊహించుకుని నా మీద ఎగురుతావు"

కూతుర్ని చూసి ఆప్యాయంగా నవ్వింది సుమిత.

"చక్కగా నీ ఈడువాళ్ళంతా కలల్లో తేలిపోతారే. ఎప్పుడు పెళ్ళిచేసుకుని మొగుడితో ఎగిరిపోదామా అని చూస్తుంటారు. నీకేమో ఆ ధ్యాసేలేదు. నీ గురించి నీకెప్పుడూ పట్టదు. నీకు కలలు రావు. కోరికలు లేవు. ఉన్నదల్లా వ్యాపారం ఎలా అభివృద్ధి చెయ్యాలా. లక్షకు మరో లక్ష ఎలా కూడబెట్టాలా అన్న ఆలోచనే తప్ప మరొకటి ఉండదాయె. ఎలా చెప్పు నీతో!"

"ఇప్పుడేమిటి నేనర్జంటుగా పెళ్ళిచేసుకుని వెళ్ళిపోవాలి అంతేకదా! నేను వెళ్ళిపోతే నువ్వూ నాన్న నన్ను వదిలి ఉండగలరా? అయినా ఇప్పటికిప్పుడు సంబంధం ఎక్కడ దొరుకుతుంది ఆలోచించు?"

"ఏమిటీ? నీకు పెళ్ళిపై మనసు పోతోందన్నమాట. ఇకనేం. శుభం. ఈ విషయం మీ నాన్నగారి చెవిన వెయ్యకపోతే నాకు నిద్రపట్టదు. ఉండు" హడావుడిగా గదిలోనుండి పరుగుతీసింది.

ఇదేమిటి ఎక్కడినుండి ఎక్కడికెళ్ళాను. చివరకు అమ్మ దగ్గర కూడా దొరికిపోయాను. ఇందుకు సాగర్ పరిచయమే కారణం. నా వ్యక్తిత్వానికి, నా ఆలోచనలకు భిన్నంగా నా జీవితాన్ని తన చేతుల్లోకి తీసేసుకుంటున్నాడు. ఇందులో ఎక్కడా నా ప్రమేయం కనబడటంలేదు.

ఇదిగో తోక అంటే అదిగో పులి అన్నట్టుగా ఎవరికి వారు తనమాటల్ని వాళ్ళకు అనుకూలంగా అన్వయించుకుంటున్నారు. గత పదిపదిహేనురోజులుగా నా జీవనశైలి నా చేతుల్లో ఉండటం లేదు. ఎవరికివారే ఏదేదో అర్థాలు తీసుకుంటూ తన మాటల్ని పట్టించుకోవటంలేదు.

జీవితమంటే ఇంతేనేమో! ఒక్కొక్కసారి మన ప్రమేయం లేకుండానే అన్నీ జరిగిపోతాయేమో. అదెలా సాధ్యం? తన మాటకు విలువలేకుండా తన గురించి అమ్మానాన్న నిర్ణయాలు తీసేసుకుంటారా? వీల్లేదు. తన జీవితం తన నిర్ణయం మేరకే ఉండాలి. మరొకరి చేతుల్లోకి వెళ్ళకూడదు. ఎట్టి పరిస్థితుల్లోను తన అహం దెబ్బతింటే తాను తట్టుకోలేదు. అందుకే అమ్మ ఎన్నిసార్లు పెళ్ళని పోరుపెడుతున్నా పెళ్ళయితే తన జీవితం మరొకరి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందనే భయంతో ఎప్పటికప్పుడు ఏవేవో సాకులు చెబుతోంది.

కానీ ఇప్పుడు పరిస్థితులు తన చేయి దాటిపోయేటట్టుగా ఉన్నాయి. తన మనసు తన అదుపులో ఉండేటట్టు కనబడటంలేదు. అదే గనుక జరిగితే? అమ్మో తాను భరించలేదు. మరిప్పుడు కింకర్తవ్యం?

సాగర్ వంటి వ్యక్తులకు సాధ్యమైనంత వరకు దూరంగా ఉండటమే పరిష్కారం అవును. అదే సరైన పరిష్కారం

ఈ నిర్ణయంతో ఆమె మనసు శాంతించింది.

మర్నాడు మెకానిక్ షాపు అడ్రసు చెప్పి కారు తీసుకురమ్మని డ్రైవర్‌కు పురమాయించింది, తాను వెళితే ఎక్కడ సాగర్ ఎదురుపడతానోనన్న అనుమానంతో. మరో అర్థగంటలో డ్రైవర్ కారు తీసుకొచ్చాడు. ఆమె అనుమానమే నిజమైంది. డ్రైవర్ వెళ్ళేసరికి

అక్కడ సాగర్, శర్మ ఇద్దరూ తిష్టవేసుక్కూర్చున్నారట. కారుతోపాటు డ్రైవర్ బిల్లు కూడా తెచ్చాడు. దాన్ని అందుకుని కసిగా చింపి పారేసింది. అంతలో లలిత నుంచి ఫోన్ వచ్చింది.

"ఏమిటే! బ్యూటీ కారుకోసం డ్రైవర్‌ను పంపించావంట. పాపం అక్కడ నీ కలల రాకుమారుడు నీకోసం కళ్ళు కాచేలా ఎదురుచూస్తూ కూర్చున్నాడట.."

"షటప్ అండ్ మైండ్ యువర్ టంగ్!"

"ఏమిటే ఇదంతా కోపమే. ఎవరిమీద? మధ్యలో ఈ అమాయకురాలి మీద కోపం చూపితే ఎలాగే?"

"పిల్లీ! ఇంకోసారి ఆ సాగర్ పేరెత్తావంటే నువ్వెక్కడుంటే అక్కడికొచ్చి చంపేస్తాను"

"అమ్మా తల్లీ! నీ కలల రాకుమారుడి గురించి నా చావు ఎందుకులేగానీ, ఇవాళ ప్రోగ్రాం ఏమిటి?"

"ఇప్పటికే నాలుగురోజులుగా ఆఫీసు పనులు పెండింగ్‌లో పడ్డాయి. ముందుగా వాటిని క్లియర్ చేసిన తరువాతే ఏ ప్రోగ్రామైనా"

"ఓకే! అయితే నీ పని అయిన తరువాత నాకు ఫోన్ చెయ్యి" ఫోన్ పెట్టేసింది.

6

"**పెళ్ళా?!** అదీ సాగర్‌తోనా! నీకేమైనా మతివుండే మాట్లాడుతున్నావా?" కోపంతో అరిచినంత పనిచేసింది రేఖ.

ఆమె అరుపులకు ఆ హాల్లో ఉన్నవారంతా ఒక్కసారి ఆమెవైపు చూశారు. దాంతో కొంచెం సిగ్గనిపించింది రేఖకు.

"ఏమిటే అంత బిగ్గరగా అరిచావు? సాగర్ నుండి తప్పించుకోవాలంటే ఇంతకుమించి మరో మార్గం లేదు. అతని వల్ల నీ మనసును స్థిమితంగా ఉంచుకోలేకపోతున్నావు. ఇదివరకులా ఆఫీసు పనులు పట్టించుకోలేకపోతున్నావు. నిన్నటికి నిన్న అంకుల్ గమనించకపోతే కొన్నికోట్లు నష్టం వచ్చివుండేది గమనించావా? నాకైతే ఇంతకుమించి ఈ సమస్యకు పరిష్కారం కనపడటంలేదు"

లలిత మాటలకు ఆలోచనలో పడింది రేఖ నిన్న జరిగిన ఒక సంఘటన ఆమెను ఉలిక్కిపడేలా చేసింది. టైపింగ్ మిస్టేకో లేక టైపిస్టు కావాలని చేశాడోగానీ తమ కంపెనీలో తయారయ్యే స్పేర్ పార్టు కొటేషన్‌లో వేల స్థానంలో కాకుండా కోట్ల స్థానంలో పదికి బదులు ఒకటి ప్రింటవుట్‌లో ఉంది. దాన్ని తాను గమనించకుండానే సంతకం చేసి చైర్మన్ దగ్గరకు పంపింది. ఆ పొరపాటును గమనించిన డాడీ తనను ఏమీ అనలేక డాటా ఎంటర్ చేసిన ఆపరేటర్‌కు ఇంక్రిమెంట్ కట్ చేశారు.

నిజంగా నాన్నగారు కూడా గమనించకపోతే? తలుచుకుంటే తన అజాగ్రత్తకు తానే సిగ్గుపడింది. ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగలేదు. తన మనసు తన అధీనంలో లేకపోవటం, పదేపదే సాగర్ తనను డిస్టర్బ్ చేయటం తప్ప మరోకారణం కనబడటంలేదు. ఇలాగే ఉంటే తాను బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేదని రుజువవుతోంది.

"హే భగవాన్! తానెందుకు ఇలా తయారవుతోంది, తనకేనా? లేక ఆ సాగర్‌కు కూడా ఇలాగే మతిస్థిమితం తప్పుతోందా? ఆం. అయినా అతనికేం నష్టం. పూటకి ఠికాణా లేనివాడు. అతని సొమ్మేం పోతుంది, తన ఆలోచనలతో సతమతమైనా. అతని డిస్టర్బన్స్ వల్ల తన వ్యక్తిగత జీవితానికి, ఉద్యోగ నిర్వహణకు చికాకు ఏర్పడి తన కుటుంబం చిక్కుల్లో పడుతుంది గానీ, అతను ఏకాకి. ఏ పూటకి ఆ పూట కష్టపడితేగానీ నడవని జీవితం. తన వల్ల అతను డిస్టర్బ్‌కావటం జరగదు. కోటీశ్వరురాలైన తనెక్కడ.. ఏ పూటకి ఆ పూట వెతుక్కునే అతనెక్కడ? అదిగో మళ్ళీ అటు తిరిగి ఇటు తిరిగి అతని ఆలోచనలే!' తల విదిలించుకుంది.

అంతవరకు ఆమెనే గమనిస్తున్న లలిత చిన్నగా నిట్టూర్చింది.

"నువ్వంత తక్కువ ఊహించుకోవలసిన వ్యక్తి కాదనిపిస్తోంది సాగర్. ఎంతసేపూ నీ స్టేటస్‌పై నీకు అతిశయమేగానీ ఎదుటి వ్యక్తి వ్యక్తిత్వాన్ని అంచనా వేయటానికి కనీస ప్రయత్నం చేయవు. నా ఉద్దేశంలో సాగర్ నీకు సరైన జోడీ అని నమ్ముతున్నాను కాబట్టే ఈ ప్రపోజల్ నీ ముందుంచాను. ఆలోచించుకో. నీకు నీ ఇగో ముఖ్యమో లేక మనసు ప్రశాంతంగా ఉండటం ముఖ్యమా? ఎన్ని రోజులు కావాలో అన్ని రోజులూ తీసుకో. బాగా ఆలోచించే ఒక నిర్ణయానికి రా."

ఆలోచనలతో సతమతమవుతున్న రేఖను ఒంటరిగా విడిచిపెట్టలేక "ఇక వెళ్దామా?" అన్నట్టు చూసింది.

"లలితగారూ" అని ఎవరో వెనక నుంచి పిలిచినట్లనిపించి పిలుపు వినవచ్చిన దిక్కుగా చూసింది.

ఎదురుగా శర్మ. అంతే ఆమె ముఖంలో అంతకుముందు కనబడని సిగ్గు ముంచుకొచ్చింది. రేఖ అది గమనించినా గమనించనట్లే ఉండిపోయింది. శర్మను చూడగానే సర్రున కోపం ముంచుకొచ్చింది రేఖకు.

"చూడండి శర్మగారూ! మీరిలా మాటిమాటికీ మమ్మల్ని వెంటాడటం బాగుండలేదు. ఇదే ఫైనల్ వార్నింగ్. మీరుగానీ, మీ మిత్రుడు గానీ ఇలా నన్ను వెంటాడుతూ మళ్ళీ కనపడితే ఈవ్ టీజింగ్ కింద కేసు పెట్టించి అన్ని పత్రికల్లో ఫోటోలు వచ్చేలా చేస్తాను. జాగ్రత్త."

రేఖ హెచ్చరికకు ఖంగుతిన్నాడు శర్మ.

"మిస్ రేఖా! మమ్మల్ని పూర్తిగా అపార్థం చేసుకుంటున్నారు. మేమలాంటివాళ్ళం కాము. మేమూ చదువుకున్నవాళ్ళమే. మీ అంతకాకపోయినా కాస్తో కూస్తో సంస్కారం ఉన్నవాళ్ళమే. మా దురదృష్టమేమిటంటే మనం ఎదురుపడినప్పుడల్లా మీకు ఇష్టంలేని, మీ మనసును కష్టపెట్టే సంఘటనలు ఎదురవుతున్నాయి. వాటిని మా మెడకు చుట్టి మీరు అన్యాయ ఆరోపణలకు దిగుతున్నారు" కాస్త ఘాటుగా జవాబిచ్చాడు.

అతని ముఖాన్ని గమనించిన లలిత "అదేదో అన్నదని మీరూ సీరియస్‌గా తీసుకుంటే ఎలాగండీ? దానికి నేను తరువాత సర్ది చెపుతానులెండి. ఇంతకీ ఎందుకప్పుడు ఇక్కడ ప్రత్యక్షమయ్యారు. ఒక్కరే వచ్చారే. మీ స్నేహితుడు ఎక్కడా కనిపించటంలేదు."

"మీతో పర్సనల్‌గా మాట్లాడాలి. కాస్త ఇలా వస్తారా?" అని రేఖవైపు తిరిగి "క్షమించండి మీ మిత్రురాలిని ఇలా పక్కకు తీసుకెళ్తున్నందుకు" అన్నాడు.

కారు దిగి శర్మ దగ్గరకు నడిచింది లలిత. ఆమెతో మూడు నిమిషాలు మాట్లాడి ఏదో కవర్ అందించాడు శర్మ. అతను కవర్ అందించే సమయానికి అప్పుడే ఎదురుగా తననే చూస్తున్న సాగర్‌ను చూసింది రేఖ. దాంతో శర్మ కవర్ అందించటం ఆమె గమనించలేకపోయింది. అతను అందించిన కవర్‌ను తన బ్యాగ్‌లో పెట్టేసింది లలిత. తాను చేసిన ఈ పనిని రేఖ గమనించకపోవటంతో తేలిగ్గా నిట్టూర్చింది. తిరిగి వచ్చి కారులో కూర్చుని కారు స్టార్ట్ చేయబోతున్న లలితతో అంది రేఖ.

"అదిగో చూడు. మళ్ళీ ఆ సాగర్. మనల్ని వదిలేటట్టులేడు. రాలేదేమని నువ్వు అడుగుతున్నావుగానీ రాకుండా ఎలా ఉంటాడు చెప్పు" సాగర్‌ని చూపిస్తూ అంది రేఖ.

"పోనీలే. వాళ్ళ సంగతి మనకెందుకు? మనం ఇద్దరం ఎలా జంటపక్షులమో వాళ్ళూ అంతేనేమో. అందుకే ఎక్కడికెళ్ళినా మనలాగానే వాళ్ళుకూడా."

"ఇంతకీ ఏమంటున్నాడు మీ హీరో? ఏమిటిట సంగతి. పక్కకు పిలిచి మాట్లాడాల్సిన అంత ప్రియమైన విషయం ఏమిటిట?"

"ఆఁ ఏమీలేదు. రేపు సాగర్ పుట్టినరోజుట. పార్టీకి పిలిచాడు. వెళ్దామంటావా?"

"ఇది మరీ బాగుంది. పిలిచింది నిన్ను. నీకు ఇష్టమైతే వెళ్ళు. లేకపోతే లేదు. మధ్యలో నాకేం పని?"

"ఆయన నన్నొక్కదాన్నే ఆహ్వానించలేదు. నిన్నూ ఆహ్వానించాడు"

"ఆ సంగతి నీతో చెప్పాడా?"

అవునన్నట్టు తలూపింది.

"అంతగా ఇన్వైట్ చేయాలనుకుంటే ఎదురుగానే ఉన్నాగా! నన్నెందుకు స్వయంగా ఆహ్వానించలేదు? నిన్నొక్కదాన్నే ప్రత్యేకంగా పక్కకు తీసుకెళ్ళి పిలవటంలో ఆంతర్యమేమిటో?"

"అదే నేనూ అడిగాను. ఆయన్నే పిలవమని. ఆయనేమన్నాడో తెలుసా! ఆమె అసలే ఫైర్‌బ్రాండని మావాడు నిర్ణయానికి వచ్చాడు. చూశారుగా నన్ను చూడగానే ఆమెకెంత ఆగ్రహం కలిగిందో. ఇక పిలిస్తే నన్ను బతకనిస్తారా? అసలే బక్కప్రాణిని అన్నారు. అందులో నాకూ నిజమే కనబడింది. అందుకే నీ తరపున కూడా నేనే మాటిచ్చాను"

"ఏమిటీ మాటిచ్చావా! ఎందుకలా ఇచ్చావు? నా అభిప్రాయంతో పనిలేదా. నన్ను అడగక్కర్లేదా? మాటిచ్చేస్తే గంగిరెద్దులా అవునంటాననుకున్నావా? వారిద్దరితో పరిచయమైన తరువాత నువ్వు మా లలితలా లేవు"

"మహా! నువ్వన్నట్టు. నిజం చెప్పవే. సాగర్‌ను తలుచుకోకుండా ఒక్క క్షణం ఉంటున్నావా?"

లలిత ప్రశ్నకు జవాబివ్వలేకపోయింది.

"అందుకే. నా మాట విను. నువ్వు సరేనంటే నేను సాగర్‌తో మాట్లాడతాను. అతను కాదనడనే నా అభిప్రాయం. నువ్వు ఊఁ అంటే నేను రంగంలోకి దిగుతాను"

రేఖ జవాబేమి ఇవ్వలేకపోయింది.

"ఆఁ అన్నట్టు చెప్పటం మరిచాను. సాగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌లో నాకు తెలిసిన వ్యక్తి ఉన్నాడని చెప్పానుకదా! ఆయన నిన్న ఫోన్ చేశారు. ఈ కాంట్రాక్టు మనకే ఖాయమని చెప్పారు. అందుకు సంబంధించి ఏదో మాట్లాడాలిట. ఒక్కసారి నిన్ను కలవమన్నారు."

లలిత మాటలతో రేఖ మనసు ఒక్కసారి చెప్పలేని ఆనందంతో గంతులు వేసింది.

"నిజంగా! ఎంత మంచివార్త చెప్పావే! ఇప్పుడు నా మనసు చల్లబడింది. ఈ కాంట్రాక్టుతో మా కంపెనీ పరిస్థితులే మారిపోతాయి. సాగర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌తో టై అప్ అంటే మార్కెట్‌లో మన పరపతి రెట్టింపు అయినట్టే!" ఆమె మాటలకు పకపకా నవ్వింది లలిత.

"ఎందుకే నవ్వుతావు? ఇప్పుడు నేనన్నదాన్లో నవ్వు వచ్చే విషయమేమున్నది?"

"అందుకు కాదులే. ఏ పేరు చెబితే నీ మనసు తడబడుతుందో అదే పేరును నువ్వు నిత్యం నీ వ్యాపారంలో తలచుకోవాలి కదా అని నవ్వు వచ్చింది. సాగర్ పేరు చెబితేనే నీకు తేళ్ళూ జర్రులూ పాకుతాయంటావు. కానీ ఆ పేరుతోనే మార్కెట్ పరపతి రెట్టింపు అవుతుందంటావు. చూశావా జీవితం. ఎంత చిత్రమైనదో. మనకు ఇష్టంలేని పేరునే నిత్యం ఏదో రూపంలో స్మరించుకోవలసి వస్తుంది. అటువంటి పరిస్థితుల్లో ఇగోలు పక్కకు పెడితే అంతా ప్రశాంతమే. వ్యక్తుల్ని తప్పుగా అర్థం చేసుకుని వారిని దూరంగా పెట్టటం మంచిదికాదు. ఎప్పుడెవరితో ఏం అవసరమొస్తుందో మరి!" శ్లేషతో అంటున్న లలితను మిర్రిమిర్రి చూసింది రేఖ.

"తల్లీ నీ చూపుల్లో వేడివాడి తగ్గించు. ఇక్కడ మలమలా మాడిపోయేలా ఉన్నాం" అంటున్న లలితను చూసి నవ్వేసింది రేఖ.

"రేపు పార్టీకి వస్తున్నట్టే కదా! మళ్ళీ మనసు మారుతుందా?" లలిత అడిగింది.

దాంతో రేఖకు మళ్ళీ మూడ్ ఆఫ్ అయినట్టయింది.

"నాకోసమైనా రావాలే"

"నీ కోసమా? అదేమైనా నీ అన్న పుట్టినరోజా లేక నీ మేనత్త కొడుకు పుటిన రోజా? నీకేం సంబంధం ఉందని నీ కోసం రావాలని ముడిపెడుతున్నావు?"

"పోనీ మా నాన్నగారి తమ్ముడి కొడుకు పుట్టిన రోజనుకో" నవ్వుతూ అంటున్న లలితను చూసి తనూ నవ్వింది.

"ఎంత చక్కగా చుట్టరికం కలిపేశావే! ఇంకా నయం మరో వరస చెప్పలేదు. అందుకు సంతోషం" తన అన్న పుట్టినరోజని చెప్పటం రేఖకు ఎందుకో ఆనందం కలిగించింది. అదే మేనత్త కొడుకు అని చెప్పివుంటే?"

"రేపు సాయంత్రం ఐదుగంటలకు మీ ఆఫీసుకు వస్తాను. అక్కడినుండి నా కారులో మనం పార్టీకి వెళ్దాం" అంటున్న లలిత మాటలకు అవునని అనలేదు. కాదనలేదు. మౌనంగా ఉండిపోయింది.

## 7

లలిత బలవంతం మీద సాగర్ పుట్టినరోజు పార్టీకి బయలుదేరింది.

ఆమెకు ఇష్టం లేకపోయినా బయలుదేరక తప్పలేదు.

అయితే సాదాసీదాగా బయలుదేరింది. ఆమె అలంకరణ చూసి విచిత్రంగా చూసింది లలిత. సరిగ్గా ఇంట్లో నుంచి బయలుదేరే ముందు తల్లికి చెప్పేందుకు లోపలికి వెళ్ళిన ఆమెను చూసి తృప్తిగా నిట్టూర్చింది సుమిత్ర. కూతురు రోజులాగా కాకుండా నిరాడంబరంగా తయారవటం ఆమెకెందుకో తృప్తినిచ్చింది. అక్కడే టేబుల్‌పై ఉన్న పూలచెండును తీసుకుని కూతురు తల్లో తురిమింది. అభ్యంతరం చెప్పబోయినా పట్టించుకోలేదు.

నెమ్మదిగా కారు డ్రైవ్ చేసుకుంటూ లలితతో సహా పార్టీ జరిగే ఫంక్షన్ హాలుకు చేరుకుంది. అప్పటికే అక్కడ చాలా కార్లు ఆగివున్నాయి. హాల్లోకి కాలు పెట్టీ పెట్టగానే మైకులో నుండి వినిపిస్తున్న పాటకు షాక్ తిన్నట్టయింది. సరిగ్గా ఆమె హాల్లోకి అడుగుపెడుతున్నప్పుడే మైకులో సాగర్ గొంతు నుండి పాట వినిపించింది.

"తలనిండ పూదండ దాల్చిన రాణి, మొలక నవ్వులతో మురిపించకే.." అని ఘంటసాల పాటను శ్రావ్యమైన గొంతుతో ఎత్తుకున్నాడు. హాలంతా పరికించి చూసింది. హాల్లో ఎవరూ పూలు పెట్టుకున్న ఆడవారు కనబడలేదు. తానొక్కతే పూలతో వచ్చింది. అంటే ఈ పాటను తనను గమనించే తనని ఆటపట్టించేందుకే పాడాడన్నమాట. కోపంతో ఆమె ముఖం ఎర్రబారింది. చేతులు బిగుసుకున్నాయి. ఆమె పరిస్థితి పక్కనే ఉన్న లలిత గమనించింది. ఆమె చేతిని పట్టుకుని నెమ్మదించమన్నట్టు సముదాయించింది.

"రాస్కెల్! చూడు. నన్ను చూసే పాడుతున్నాడు. సిగ్గుకూడా లేదు. అందుకే రానన్నాను. బలవంతంగా లాక్కువచ్చి ఈ అవమానాన్ని తీసుకొచ్చావు. ఇతనికి ఎంత త్వరగా బుద్ధిచెబితే అంత మంచిది"

కోపంతో అన్న ఆమె మాటలకు లలిత నెమ్మదిగా "నిన్ను చూసి పాడాడని ఎందుకనుకుంటున్నావ్? సాగర్ బాగా పాడతాడని చెబుతారు. అందులోనూ ఘంటసాల పాటంటే చెవికోసుకుంటాడట. ఘంటసాల పాటల్ని పాడేందుకే కొంతకాలం సంగీతసాధన కూడా చేశాడట. నీ నీడను చూసి నువ్వే భయపడుతున్నావెందుకో ఈ మధ్య?" అని అన్నది.

అప్పుడే వారిద్దర్నీ గమనించాడు శర్మ. వాళ్ళ దగ్గరకు అతను చేరుకోవటం. పాట ముగిసి చప్పట్లతో హాలు దద్దరిల్లి పోవటం ఒకేసారి జరిగింది.

"రండి రండి. సాగర్ మంచి గాయకుడు. అతను పాట పాడుతున్న సమయంలోనే మీరు సరిగ్గా అడుగుపెట్టారు. అందులోనూ ఈ పాటంటే అతనికి ప్రాణం. ఎన్నో పోటీల్లో ఈ పాటపాడే బహుమతి కూడా సాధించాడు" అని సాదరంగా ఆహ్వానించాడు.

కానీ, రేఖ మనసు కుతకుతలాడిపోతోంది. ఇక లాభంలేదు. సాగర్‌కు బుద్ధి చెప్పకపోతే తన మనసు మనసులో ఉండదని నిర్ణయించుకున్నది. ఎలా? ఎలా? ఆమె మనసులో ఆలోచన మొదలైంది. అది నెమ్మది నెమ్మదిగా మహావృక్షంలా తయారవసాగింది.

ఎస్... అవును. అలాగే చేయాలి. ఇంతకుమించి మార్గం లేదు. తాను అనుసరించే మార్గంలో కుతంత్రం ఉన్నా, కుచ్చితం ఉన్నా అమలు చేసి తీరుతుంది. ఇక వెనకడుగువేసే ప్రశ్నేలేదు. ఆమె ఆలోచనలు సాగుతుండగానే ఎవరో కూల్‌డ్రింక్ అందించారు. దాన్ని అందుకుని సిప్ చేయటం మొదలుపెట్టి ఎదురుగా సాగర్ నిలబడటం చూసింది. అతన్ని చూసి లలిత "హలో సాగర్‌గారు పుట్టినరోజు శుభాకాంక్షలు" అని చెప్పి షేక్‌హాండ్ ఇచ్చింది. రేఖకూ తప్పలేదు మరి. యాంత్రికంగా శుభాకాంక్షలు చెప్పింది.

అంతలోనే స్నేహితులంతా మళ్ళీ అతన్ని చుట్టుముట్టారు.

"సాగర్! మరో మంచి పాటపాడరా నీ గొంతు వింటుంటే ఎన్ని పాటలైనా వినాలనిపిస్తోంది" అని బలవంతం చేయటంతో సాగర్‌కు తప్పలేదు.

రేఖనే చూస్తూ "వలపు వలే తియ్యగా వచ్చినావు చల్లగా.." ఆ ప్రాంతమంతా ఈలలు, చప్పట్లు.

రేఖకు భరించటం కష్టంగా ఉంది. ఇందాక అంటే ఏదో యాధృచ్ఛికమని సర్దుకుపోవచ్చుగానీ, ఇప్పుడు మాత్రం ఎలా సర్దుకుంటుంది?

ఎప్పుడూ ఎక్కడా ఎదుర్కోని చిక్కుల్లో ఇరుక్కున్నట్లయింది ఇక్కడికి వచ్చి. ఇలా తనను టార్గెట్ చేస్తాడని ఊహించలేక లలిత మాట విని వచ్చి అతని ట్రాప్‌లో ఇరుక్కుపోయింది

ఇటువంటి వ్యక్తిని క్షమించటం సరికాదు. తప్పకుండా శిక్షించాల్సిందే. ఇందుకు అవసరమైతే కుతంత్రం వాడుకున్నా తప్పులేదు.

ఒకసారి నిర్ణయం తీసుకున్నదా ఇక వెనకడుగు వేసే ప్రశ్నే తలెత్తదు. ఇటువంటి విషయాల్లో ఆమె తీసుకునే నిర్ణయం కూడా దారుణంగానే ఉంటుంది. పాట ఎప్పుడు పూర్తయిందో గమనించే స్థితిలో లేదు.

పార్టీ మధ్యలోనే బయటకు వచ్చేస్తున్న రేఖను అనుసరించక తప్పలేదు లలితకు. ఆమె మధ్యలో ఎందుకు వచ్చేస్తోందో అర్ధంగాక తలపట్టుకుంది.

"పార్టీలో కూడా నన్ను వదిలిపెట్టలేదా రాస్కేల్. నన్నుచూసి అందరూ ఏమనుకుంటారనే ఆలోచన కూడా లేకుండా నాపైనే పాటలు పాడతాడా? ఎంత ధైర్యం? నా ఎదురుగా నిలబడి మాట్లాడ్డానికే అందరూ బెదురుతారు. అటువంటిది పదిమందిలో నా గురించే పాట పాడతాడా? వీడికి తిరుగులేని గుణపాఠం చెప్పాల్సిందే! ఈ రేఖ అంటే ఏమిటో, రేఖతో పెట్టుకుంటే జరిగేదేమిటో తెలియజెప్పాల్సిందే" ఆవేశంతో మాటలు రావటంలేదు.

"ఎందుకే అంత ఆవేశం. ఆ పాటలు నిన్ను గురించి పాడాడని ఏమున్నది. అవి బాగా పాపులర్ సాంగ్స్. అందులోనూ తలనిండ పూదండ దాల్చిన రాణి. పాట అతని ఫేవరెట్ సాంగ్ అట. దాన్ని కూడా నువ్వు నీకు ఆపాదించుకోవటం సరికాదు. కాస్త శాంతించు" లలిత అన్నది.

"పార్టీకి పూలు పెట్టుకొచ్చింది నేనొక్కదాన్నే! అది గమనించే పాడాడు. దుర్మార్గుడు వాణ్ణి వాణ్ణి" ఆగ్రహంతో మాటలు రావటంలేదు.

"అయినా సాగర్ గురించి నువ్వెక్కువ ఆలోచిస్తున్నావే! అతనికి అంత సీన్ లేదంటావ్. అతని ప్రతి అడుగును గమనిస్తున్నావ్? ఏమిటి కథ?"

"కథ లేదు, కాకరకాయ లేదు"

"ఇటువంటి ఆలోచనలే ఎప్పుడో ఒకప్పుడు కొంపముంచుతాయి. అప్పుడు మేమెవరం అమ్మాయిగారికి కనబడం. సాగర్‌తోనే ప్రపంచమవుతుంది. అప్పుడు చెప్పు ఈ కబుర్లన్నీ"

లలిత మాటలకు మౌనాన్ని ఆశ్రయించింది.

లలిత అన్నట్టు సాగర్ నామస్మరణ తప్పేటట్టులేదు. ఏ పేరుకైతే తాను దూరంగా ఉండాలని అనుకుంటోందో అదే పేరుగల కంపెనీతో వ్యాపారబంధం పెట్టుకోవాల్సి రావటం యాదృచ్ఛికం కావటం నిజమే! మన కిష్టంలేని వాటితోనే సంబంధ బాంధవ్యాలను కొనసాగేలా చూస్తాడనుకుంటా భగవంతుడు.

ఆడుతూ పాడుతూ ఎంతో ఉత్సాహంగా తన స్థాయి స్నేహితులతో కలిసి మెలిసి తిరిగే తాను ఇప్పుడేమిటిలా? పోనీ ఆ సాగర్ తనస్థాయివాడా? కాదు. తానంటే గౌరవం ఉన్నవాడా అంతకన్నాకాడు. పోనీ తన ఇగోను శాటిస్ఫై చేయగలడా అంటే అదీ లేదు. మరెందుకిలా తన మనసు అతన్ని వదలనంటోంది? త్వరగా దీనికేదైనా పరిష్కారం కనుక్కోవాలి. లలిత చెప్పిన ప్రపోజల్‌ని అంగీకరిస్తే? అమ్మో ఇంకేమైనా ఉన్నదా? తన పరువు ఏమికావాలి తన అభిజాత్యం ఏమైపోతుంది? స్నేహితులందర్నీ అహంతో కంట్రోల్ చేసే తనకు అతన్ని కంట్రోల్ చేయగల అవకాశంగానీ, శక్తిగానీ ఉంటాయా? పెళ్ళయిన తరువాత అతని ఆధీనంలోకి తానెళ్ళిపోయే పరిస్థితులు వస్తే?

"ఈ ఆలోచనలతోనే పిచ్చెక్కేటట్టున్నది. సుఖంగా ఉన్న ప్రాణానికి ఈ సాగర్ ఎక్కడ దాపురించాడు? ఎందుకిలా తనను వెంటాడుతున్నాడు? అతని ఉద్దేశ్యమేమిటో అసలు? లలిత ప్రపోజల్ తీసుకొచ్చిందిగాని దీనివెనుక అతనున్నాడా? ఉండి ఇదంతా లలిత ద్వారా నడిపిస్తున్నాడా? అతనంటే తనకెందుకు ఇంత సాఫ్ట్‌కార్నర్?

మిగిలిన వారితో మాట్లాడినట్టుగా అతనితో నిక్కచ్చిగా ఎందుకు మాట్లాడలేకపోతోంది? ఆఖరికి ఆ శర్మను కూడా ఖాతరు చేయని తన మనసు అతడితో ఎందుకు కాఠిన్యంగా ఉండలేకపోతోంది. ఇదంతా తన లోపమేనా? ఆలోచనలతో సతమతమయిపోతోంది. ఇందులో నుండి బయటపడేందుకు దారి కానరాక మనసు ఊగిసలాడుతోంది. ఆమె మనసు సాగర్‌వైపు ఆకర్షితమవుతున్న సమయంలో మళ్ళీ ఘనీభవింపజేసే అనూహ్య సంఘటన చోటుచేసుకున్నది.

8

శ్రీశైలం నుంచి హైదరాబాద్ వచ్చే రోడ్డు.

అప్పుడే చీకటి ప్రపంచాన్ని ఆక్రమించుకుంటోంది.

తాను త్వరగా మన్ననూరు చెక్‌పోస్టు దాటితే ఘాట్‌రోడ్డు అంతమవుతుంది. అక్కడి నుండి హైదరాబాద్ చేరుకోవటం తేలిక. ఘాట్ రోడ్డు దాటితే కొంచెం వేగంగా వెళ్ళవచ్చు. అమ్మకు ఎలా ఉన్నదో? స్నేహితులతో శ్రీశైలం వచ్చిన తనకు రూమ్‌కెళ్ళి ఆ పూట విశ్రాంతి తీసుకోవాలనుకున్నది. ఇంతలో డాడీ నుంచి ఫోన్. అమ్మకు మైల్డ్ హార్ట్‌స్ట్రోక్ తననే చూడాలని కలవరిస్తోందని, వీలైతే వెనక్కి వచ్చేయమని చెప్పారు. అమ్మను ఆస్పత్రిలో చేర్పించామని, భయపడాల్సింది లేదని కూడా చెప్పారు. అంత హడావుడిగా రావలసిన అవసరం లేదని, మర్నాడు ఉదయం బయలుదేరి రమ్మని అన్నారు.

అమ్మకు హార్ట్‌స్ట్రోక్ అని విన్నప్పటి నుండి రేఖ మనసు మనసులో లేదు. ఎలాగైనా వీలైనంత త్వరగా హైదరాబాద్ బయలుదేరాలని లలితకు చెప్పింది. ఆ కబురు విన్న తరువాత లలిత కూడా కంగారుపడింది పాపం. ఏదో సరదాగా గడపాలని వచ్చిన వీళ్ళందరి ఉత్సాహాన్ని తన కారణంగా నీరు కార్చటం ఎందుకని ఒక్కతే కారు తీసుకుని బయలుదేరింది. మామూలు కన్నా కొంచెం స్పీడ్‌గానే నడుపుతోంది.

మన్ననూరు చెక్‌పోస్టు దాటిన తరువాత హమ్మయ్య అనుకుంది. ఇక్కడినుండి రోడ్డు సాఫీగానే ఉంటుంది. మరో రెండు గంటల్లో తాను హైదరాబాదులో ఉంటుంది. నేరుగా ఆస్పత్రికి వెళ్ళి అమ్మని చూసేవరకూ మనసు నిలిచేటట్టులేదు. ఆమె ఆలోచనల్లో మునిగిపోయింది.

ఎదురుగా వస్తున్న ఏదో వాహనం భూతంలా మీదికి దూసుకు రావటంతో కంగారుపడి ఎడమ వైపుకు కారును తిప్పింది. దాంతో కారు రోడ్డు దిగింది. పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకుపోయి అదుపు తప్పింది. ఆమె గుండెలు భయంతో వేగంగా కొట్టుకుంటోంది. ఏం చేయాలో పాలుపోక బ్రేక్ వేయటం కూడా మరిచిపోయింది. రోడ్డుకు పక్కనే ఉన్న చెట్టును కారు ఢీకొనటం, ఆమె పక్కనున్న డోర్ తెరుచుకోవటం, ఎగిరి అంత దూరంలో పడటం క్షణాల్లో జరిగిపోయింది.

క్షణాల్లో జరిగిన ఈ ప్రమాదాన్ని ఎదురుగా వస్తున్న వాహనంలోని వ్యక్తి చూసి తనకారు ఆపాడు. పరిగెత్తుకు వెళ్ళి రేఖ కారును పరిశీలించాడు. చెట్టుకు ఢీకొనటంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఇంజన్ భాగం లోపలికి నొక్కుకు పోయింది.

కారు సంగతి సరే. అందులో ఉండాల్సిన మనుషులేరీ? అనుకుని చుట్టూ పరికించి చూస్తున్న అతను కారుకు అయిదారు అడుగుల దూరంలో చీకట్లో అచేతనంగా పడివున్న ఎవరో యువతిని గమనించాడు. ఆమె స్పృహ తప్పి పడిపోయివుంది. వెంటనే దగ్గరకు పోయి ఆమె నాడి చూశాడు. నాడి చేతికి తగలటంతో తెలుసుకుని తేలిగ్గా నిట్టూర్చాడు. ఆమెను తనవైపు తిప్పుకుని ముఖం చూసి ఉలిక్కిపడ్డాడు. రేఖ! ఈమె ఇటెందుకు వచ్చింది? ఎక్కడినుంచి వస్తోంది? జేబులో నుండి ఫోన్ తీసి గబగబా ఫోన్ చేశాడు.

"చెప్పరా! సాగర్ ఎక్కడిదాకా వచ్చావ్?" అటునుండి శర్మ గొంతు వినబడింది.

"అరేయ్ శర్మా! నేను రావటంలేదురా! అర్జంటు పనిబడింది. నువ్వూ రేపొద్దున బయలుదేరి వచ్చేసెయ్. అర్జంట్. తరువాత ఫోన్ చేసి వివరాలన్నీ చెబుతాలే" ఫోన్ పెట్టేశాడు.

అప్పుడు చూశాడు. ఆమె దుస్తులు పీలికలు పీలికలయ్యాయి. వెంటనే పరిగెత్తుకుంటూ తన కారు దగ్గరకు వెళ్ళి కారులో ఉన్న సూట్ కేసు తెరిచి, పైన ఉన్న బెడ్‌షీట్‌తో అంతే స్పీడ్‌గా వచ్చాడు. ఆ బెడ్‌షీట్‌ను ఆమెకు కప్పి రెండు చేతుల్తో ఎత్తుకుని తన కారు వెనక సీట్లో ఆమెను పడుకోబెట్టాడు. తాను డ్రైవింగ్ సీట్లోకి దూకినంత పనిచేసి గేరు మార్చి కారును వెనక్కి తిప్పాడు.

ఆమె ఇటువైపు రావటం ఏమిటి? తాను కూడా శ్రీశైలం బయలుదేరటమేమిటి? సరిగ్గా తాను అక్కడికి చేరుకున్న సమయంలోనే ఈ ప్రమాదం జరగటమేమిటి? అంతా దైవలీల. అదృష్టమంటే ఇదేనేమో? ఆలోచిస్తూ కొంచెం స్పీడుగానే కారు నడుపుతున్నాడు. రెండుగంటల ప్రయాణాన్ని గంటన్నరలో పూర్తిచేసి సిటీలోకి ప్రవేశించాడు. అదే స్పీడులో నేరుగా అపోలో ఆస్పత్రి ముందు కారు ఆపాడు. అప్పటికే డాక్టర్ ముకుందరావుకు పరిస్థితి అంతా ఫోన్‌లో వివరించి చెప్పటంతో కారు పార్కింగ్ స్పేస్‌లో అటెండర్స్‌తో సిద్ధంగా ఉన్నారు. ఒకరు ఆక్సిజన్ సిలిండర్ ట్రాలీతో ఉండగా మరికొందరు స్ట్రెచర్‌తో సిద్ధంగా ఉన్నారు. ఇద్దరు ముగ్గురు డాక్టర్లు కూడా అక్కడే ఉన్నారు. కారు ఆగటంతోనే ఆక్సిజన్ సిలిండర్‌ను కారు దగ్గరకు తీసుకెళ్ళాడు అటెండర్.

డాక్టర్ ముకుందరావు కారు డోర్ వద్దకు చేరుకుని లోపలికి తొంగిచూశాడు.

స్పృహలో లేని రేఖను గమనించి "మైగాడ్! ఈమె రేఖా ఇండస్ట్రీస్ ఛైర్మన్ సుదర్శనరావుగారి అమ్మాయి" అంటూ చేయి తీసుకుని నాడి చూసి తృప్తిగా నిట్టూర్చాడు. ఆయన సూచన మేరకు ఆమెను స్ట్రెచర్ పైకి ఇమార్చి పరుగులు తీస్తూ లోపలికి తీసుకెళ్ళారు.

వెంటనే ఎమర్జెన్సీ వార్డ్‌లోకి మార్చి ఆక్సిజన్ మాస్క్ తగిలించి పరుగులాంటి నడకతో ఆమెను ఐ.సి.యూలోకి మార్చారు ఒకరు కాదు ఇద్దరు కాదు. ఆస్పత్రిలో పేరుబడ్డ డాక్టర్లంతా ఆమె దగ్గరికే అటెండయ్యారు. డాక్టర్లు అంత కేర్ తీసుకుంటుండటంతో పేషెంట్ ఎవరోఒ ఇంపార్టెంట్ అనుకుని సిస్టర్స్, ఇతర స్టాఫ్ అలర్ట్ అయ్యారు.

అర్ధగంట తరువాత డాక్టర్ ముకుందరావు బయటకు వచ్చాడు. ఆయనతో పాటు డాక్టర్లు కూడా ఉన్నారు.

వరండాలో కుర్చీలో కూర్చున్న సాగర్‌ను చూసి, "అంతగా కంగారుపడాల్సిందేమీ లేదు. వాళ్ళ నాన్నకు కబురు చెయ్యి. అంతా ఆయనే చూసుకుంటాడు. నీకెందుకు శ్రమ?" అన్నాడు.

"శ్రమ కాదు డాక్టర్. మానవత్వం. ముందుగా ఈ సంగతి పోలీసులకు తెలియజెయ్యాలి. కేసూగ్రటా లేకుండా చూడమని చెప్పాలి. ఆ తరువాత ఆమె అమ్మానాన్నలకు. అంత కంగారు పడాల్సిందేమీ లేదంటున్నారు కదా!"

"**అవును.** పోలీసులకు చెప్పటం మన ధర్మం. లేకపోతే ఆ తరువాత వచ్చే ఇబ్బందుల్ని ఎదుర్కోవటం కష్టం. సరే ప్రతిపావుగంటకు నేను వచ్చి చెకప్ చేస్తుంటాను. నువ్వేమీ కంగారుపడకు" అన్నాడు డాక్టర్.

ఆయన వెళ్ళేవరకు ఆయన్ని చూస్తుండిపోయాడు సాగర్.

"ఇదేమిటి.. తమ ఇద్దరి విషయంలో ఇలా జరుగుతోంది. ఎప్పుడూ ఏదో ఘర్షణో, గొడవో తప్పటంలేదు. తాము ప్రశాంతంగా కలుసుకున్న సందర్భం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. ఆమెతో మాట్లాడేందుకు తానెప్పుడు ప్రయత్నించినా ఏదో ఒక అవాంతరం. ఫలితంగా ఆమెకు అనుమానాలు, అపార్థాలు కలిగించే పరిస్థితులు" ఆలోచిస్తున్న అతనికి 'సార్' అన్న సిస్టర్ పిలుపుతో ఇటు తిరిగాడు.

"ఆమె ఒంటిపై దుస్తులన్నీ చిరిగిపోయి వున్నాయి. ఆమె ఐసియూలో ఉన్నంత వరకు ఫర్వాలేదు. ఆ తరువాతే ఆమె డ్రస్ మార్చాలంటే మాత్రం ఏదో ఒక డ్రస్ తెచ్చి ఇవ్వండి" సిస్టర్ మాటలకు తలూపాడు. డ్రస్ అంటే తానెక్కడి నుండి తేగలడు? అంతలో అతనికి గుర్తుకొచ్చింది.

సిస్టర్‌కు తన కారు తాళాలిచ్చి కారులో ఉన్న సూట్‌కేసు తెమ్మన్నాడు. "అతను ఎంత వి.ఐ.పి కాకపోతే డాక్టర్లంతా పేషెంట్ దగ్గరకు ఎందుకు పరిగెత్తుకు వస్తారు?" అనుకుని మౌనంగా కారు తాళాలు తీసుకుని నడిచింది. రెండు నిమిషాల్లో సూట్‌కేసు అందిస్తున్న ఆమెను చూసి నవ్వుకున్నాడు. సూట్‌కేసు తెరిచి అందులో నుంచి తన పైజమా లాల్చీ తీసి అందించాడు. సిస్టర్ వాటిని ఆశ్చర్యంగా చూస్తూ అందుకుంది.

"ప్రస్తుతం ఇవే ఉన్నాయి. అవసరమైనప్పుడు ఉపయోగించు" చెప్పాడు.

సిస్టర్ తలూపి వెళ్ళిపోయింది. ఈలోగా ఫోన్ తీసి సుదర్శనరావుకు ఫోన్ చేద్దామనుకున్నాడు. కానీ ఆయన నెంబర్ తన దగ్గర లేకపోవటంతో లలితకు ఫోన్ చేద్దామనుకుని టైమ్ చూశాడు. పన్నెండు గంటలైంది. ఇప్పుడు ఆమెను డిస్టర్బ్ చేయటమా మానటమా అని మీ మాంసలో పడి చివరకు చేశాడు.

అటునుండి లలిత పలకడానికి కొంచెం టైము పట్టింది.

"హలో ఎవరూ?" ఆమె గొంతులో నిద్రమత్తు.

"హలో లలితా! నేను సాగర్‌ను"

"ఏమిటన్నయ్యా! ఈ సమయంలో ఫోన్ చేస్తున్నావ్. ఎనీథింగ్ ప్రాబ్లమ్?"

"అవునమ్మా. నువ్వెక్కడ ఉన్నావ్?"

"శ్రీశైలంలో"

"శ్రీశైలంలోనా?! అయితే ఒకపని చెయ్యి. శర్మ కూడా శ్రీశైలంలోనే ఉన్నాడు. వాడూ, నువ్వూ రేపొద్దున బయలుదేరి హైదరాబాద్ వచ్చేయండి. ఆ మర్చిపోయాను. రేఖ వాళ్ళ నాన్నగారి ఫోన్ నెంబర్ ఇవ్వు."

"ఎందుకన్నయ్యా? అంత హడావుడి పడుతున్నావు?"

"ఏమీలేదు. రేఖకు చిన్న యాక్సిడెంట్. ప్రస్తుతం అపోలో నుంచి మాట్లాడుతున్నాను కంగారేం లేదులే. వాళ్ళ నాన్నకు చెప్పాలి కదా!"

రేఖకు యాక్సిడెంట్ అనగానే ఉలిక్కిపడింది. ఆ తరువాత తమాయించుకుని తన ఆతృతను నొక్కిపట్టి "ఇప్పుడెలా ఉంది? మరేం ఫరవాలేదు కదా! ఇప్పటికిప్పుడు బయలుదేరి వద్దామన్నా చెక్‌పోస్టు ప్రాబ్లమ్ ఉంటుంది. మరెలా?"

"చెబుతున్నానుగా పర్వాలేదని. నువ్వు వచ్చేవరకూ నేనిక్కడే ఉంటానులే. రేపు ఉదయమే నువ్వూ, శర్మ ఇద్దరూ వచ్చేయండి. వాళ్ళ నాన్నగారి ఫోన్ నెంబర్ ఇస్తే.." అంటున్న అతని మాటల్ని మధ్యలోనే అందుకుంది.

"వాళ్ళ అమ్మకు మైల్డ్ స్ట్రోక్ వచ్చిందట. వాళ్ళ నాన్న ఫోన్ చేస్తే అదిక్కడి నుండి హైదరాబాద్‌కు వస్తోంది. ఇంత రాత్రివేళ వాళ్ళను కంగారు పెట్టటమెందుకు? అర్జంట్ అయితే ఆయనకు తెలియజేయవచ్చు. కానీ ఇప్పుడు పర్వాలేదంటున్నావుగా. రేపొద్దున నేను రాగానే చెబుతానులే. ఎందుకంటే వాళ్ళమ్మకు ఒంట్లో బాగుండలేదని ఆయన ఇప్పటికే కంగారు పడుతుంటారు"

నిజమే. ఈ సమయంలో వాళ్ళను ఎందుకు కంగారు పెట్టటం? ఎటు తిరిగి ఇప్పుడు రేఖ పరిస్థితి స్థిమితంగానే ఉందికదా! రేపు చెప్పవచ్చు.

"సరేలే. అలాగే చేద్దాం. మీరొచ్చేవరకు నేనిక్కడే ఉంటాను. అవసరమైతే మళ్ళీ కాంటాక్టు చేస్తానులే. నువ్వు మాత్రం కంగారు పడక్కర్లేదు. నిబ్బరంగా ఉండు. ఇప్పుడే శర్మను కాంటాక్టు చేసి సంగతి చెబుతాను. రేపు ఉదయమే ఇద్దరూ కలిసి బయలుదేరండి" ఫోన్ పెట్టేశాడు.

శర్మకు ఫోన్ చేసి పరిస్థితి వివరించి లలితకు చెప్పినట్టే చెప్పాడు. అతను చెప్పిన మాటలకు శర్మ కొద్దిగా కంగారుపడ్డాడు వెంటనే లలితకు ఫోన్ చేశాడు.

"హలో! లల్లీ..నేను రేఖకు.."

కంగారుపడుతున్న అతని గొంతు విని, "ఇప్పుడే అన్నయ్య ఫోన్ చేశాడు. మీరేమిటి అంత కంగారు పడుతున్నారు? మరేం పర్వాలేదని అన్నయ్య చెప్పలేదా? మీరెక్కడ దిగారు. నన్ను రమ్మంటే వెంటనే అక్కడకు వస్తాను. ముందు జరిగిన దానికంటే మీ కంగారుతో మమ్మల్ని కంగారు పెట్టేట్టున్నారు. అందుకోసమే నేను వద్దామనుకుంటున్నాను."

"కంగారు కాకపోతే మరేమిటి? అక్కడ ఆస్పత్రిలో పాపం వాడొక్కడే ఎన్ని ఇబ్బందులు పడుతున్నాడో అని నేను కంగారుపడుతుంటే."

"అన్నయ్య గురించి మీరేం వర్రీ కానక్కర్లేదు. ఆయన ఎంత సున్నితహృదయుడైన జరిగే సంఘటనలు చూసి తట్టుకోగల ధైర్యం కూడా ఉంది. మీరనవసరంగా కంగారుపడకుండా రెడీ అవ్వండి" ఫోన్ పెట్టేసింది.

రాక్షసి.. మొండిది. ఎదుటివ్యక్తి ఆలోచనలకు అసలు గమనించదు. తను అలాగే అంటుంది. ఆస్పత్రిలో సాగర్ ఒక్కడూ ఎంత ఇబ్బంది పడుతున్నాడో పాపం. రేఖను ఎంతగా ప్రేమిస్తున్నాడో తనకొక్కడికే తెలుసు. రేఖ అంటే ప్రాణం పెట్టే సాగర్ పరిస్థితి తలుచుకుంటేనే తన గుండె నీరవుతోంది. ఈ సంగతి ఈ రాక్షసి గ్రహించలేదుకదా! పైగా తననే తప్పుపడుతోంది.

ఇక నిద్రపట్టలేదతనికి కారు తీసుకుని లలిత స్టే చేసిన ప్రదేశానికి చేరుకున్నాడు. అక్కడే కారు ఆపి కారులోనే తెల్లారేవరకు కూర్చున్నాడు. ఉదయం ఐదుగంటలకు లలిత ఫోన్ చేసింది.

"హాల్లో ఎక్కడున్నారు? బయలుదేరారా?"

"ఆఁ. సరిగ్గా నీ రూం ముందే కారులో ఉన్నాను."

"అలాగా. వస్తున్నానిప్పుడే రెండు నిమిషాలు.."

లలిత వస్తూనే అతని పరిస్థితి చూసి విస్తుపోయింది.

రాత్రంతా నిద్రలేనట్టు ఎర్రగా ఉన్న అతని కళ్ళు అతనెంత కంగారుపడుతున్నాడో చెప్పకనే చెబుతున్నాయి. ఆమె మనసు ద్రవించింది.

"రాత్రంతా నిద్రపోయినట్టులేదు. మీకు, సాగర్‌కు మధ్య ఉన్న స్నేహం తెలిసికూడా రాత్రి అలా తేలిగ్గా నేను మాట్లాడి ఉండకూడదు. రాత్రంతా మేలుకునే ఉన్నారా? సారీ నోరు జారినందుకు. అయినా నేను ఫోన్ చేసేసరికి ఇక్కడికి వచ్చేశారు. అంటే రాత్రంతా.."

"ఇక్కడే ఇదిగో ఇప్పుడున్నట్టుగానే ఉన్నాను. వెళ్దామా?"

అతని జవాబుకు ఒక్క క్షణం మాట్లాడలేకపోయింది. అతని మానసిక పరిస్థితి పట్ల హృదయం ద్రవించింది.

"మీరు డ్రైవ్ చేస్తారా? భలేవారే? రాత్రంతా నిద్రలేదంటున్నారు. మీరు హాయిగా వెనక సీట్లో రెస్టు తీసుకోకండి. నేను డ్రైవ్ చేస్తాను."

"ఘాట్ రోడ్డు కదా! డ్రైవ్ చేయగలవా?"

చేయగలనని తలూపింది. అతను నెమ్మదిగా కారు దిగి వెనక సీట్లోకి మారబోతున్నాడు. అతనికి వాటర్ బాటిల్ అందించి "కాస్త ముఖం కడుక్కోండి. తేటగా ఉంటుంది" సరేనన్నట్టు తలూపి ముఖం కడుక్కుని "ఎక్కడన్నా టీస్టాల్ దగ్గర ఆపు. టీ తాగి బయలుదేరుదాం" అన్నాడు.

టీ తాగి ఆమె కారు నడుపుతూ ఉంటే అతను నిద్రలోకి వెళ్ళిపోయాడు.

అతను నిద్రలోకి వెళ్ళిపోవటం చూసి పాపం రాత్రంతా స్నేహితుణ్ణి తలుచుకుంటూనే ఉన్నాడు. ఈ రోజుల్లో కూడా ఇంతమంచి స్నేహితులుంటారా? ఒకరికోసం మరొకరు ప్రాణం పెడతారు. ఒకరికి తలనొప్పి వస్తే ఆ నొప్పేదో తనకే వచ్చిందన్నట్లు రెండోవారు బాధపడతారు. గొప్ప మైత్రి ఇద్దరిదీ.

"ఇంతకీ రేఖకు ఎలావుందో? అక్కడ సాగర్ ఒక్కడే రాత్రంతా ఎంత ఇబ్బందిపడ్డాడో? రేఖను అతను అంతగా ప్రేమిస్తున్నా రేఖ లక్ష్యపెట్టటంలేదు. కనీసం అతని పేరు కూడా తలిచేందుకు దానికి ఇష్టంలేదు. వాళ్ళిద్దర్నీ కలిపేందుకు తాను శాయశక్తులా కృషిచేస్తున్నా రేఖ మొండివైఖరితో ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా తయారైంది. రేఖ కాదంటే సాగర్ పరిస్థితి తలుచుకునేందుకే భయంగా ఉంది."

కారు నెమ్మదిగా ఘాట్ రోడ్డు దిగింది. చూస్తూ ఉండగానే హైదరాబాద్ సిటీలోకి ప్రవేశించింది. నేరుగా అపోలోవైపు తిరిగింది కారు. వెనక సీట్లో నిద్రలోనే ఉన్న శర్మను చూస్తూ కారు పక్కగా ఆపింది.

"ఏమండీ లేవండి. అపోలో దగ్గరికి వచ్చేశాం" ఆమె పిలుపుతో ఉలిక్కిపడి లేచాడు.

కారు ఆగివుండటం చూసి కిందకు దిగాడు. ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని చుట్టూ పరికించి చూస్తూ ముఖం కడుక్కున్నాడు. ఆమె అందించిన నాప్‌కిన్‌తో ముఖం తుడుచుకుని ముందు సీట్లో కూర్చుని "రైట్ రైట్" అన్నాడు.

ఆమె నవ్వుకుంటూ కారును ముందుకు దూకించింది. కారు అపోలో మెయిన్ గేట్‌లోకి రాగానే సాగర్‌కు ఫోన్ చేసి అతను ఎక్కడున్నదీ తెలుసుకున్నాడు.

వీళ్ళు వార్డు దగ్గరకు వెళ్ళేసరికి అతను ఎదురొచ్చాడు. వాళ్ళిద్దర్నీ చూడగానే సాగర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. రాత్రి నుండి అతనెంత తపనపడ్డాడో వాళ్ళకు అర్థమైంది. అతని పరిస్థితి చూడగానే లలిత కళ్ళనుండి నీళ్ళు వచ్చాయి. ఆ ఇద్దర్నీ తీసుకుని అతను స్పెషల్ వార్డులోకి తీసుకువెళ్ళాడు.

"రాత్రంతా ఐ.సి.యులో ఉంది. ఇప్పుడే స్పృహ రావటంతో స్పెషల్ వార్డులోకి మార్చారు. ఇప్పుడు మాట్లాడగలుగుతోంది. ఇంకా ఏవో టెస్టులు చేయాలట. చేతికిగానీ, కాళ్ళకు గానీ ఏమైనా దెబ్బలు తగిలాయేమో ఎక్సరే తీయాలన్నారు" ఆమె బెడ్ దగ్గరకు తీసుకెళ్ళి ఇవతలకు వచ్చేశాడు సాగర్.

వాళ్ళిద్దరూ ఆమెను చూడగానే ఉలిక్కిపడ్డారు. తలకు గాయంతో, కాళ్ళూ చేతులకు కట్లతో నీరసంగా కనబడటంతో తట్టుకోలేకపోయింది లలిత. ఆమె కళ్ళలో ఉబుకుతున్న నీళ్ళను చూసి నెమ్మదిగా ఆమెను వెనక్కి లాగాడు శర్మ.

"ఊరుకో. నువ్విలా కనపడితే ఆమె మరింత కంగారుపడుతుంది" అని ఇవతలకు లాక్కువచ్చాడు.

ఇద్దరూ సాగర్‌ను సమీపించి, "ఒకసారి డాక్టర్‌ను కలుద్దామా?" ఒకేసారి అడిగారు. అక్కడే ఉన్న సిస్టర్‌కు చెప్పి డాక్టర్‌ను కలవటానికి ముగ్గురూ బయలుదేరారు.

డాక్టర్ రూమ్ చేరుకుని అక్కడున్న వార్డుబోయ్‌కు విజిటింగ్‌కార్డు లోపలికి పంపించాడు. బదులుగా బాయ్‌తో పాటు డాక్టర్ కూడా బయటకు వచ్చాడు. డాక్టర్ అంత గౌరవం ఇవ్వటం బోయ్‌కు ఆశ్చర్యమనిపించింది.

"మీకు కూడా పర్మిషన్ కావాలా" సాదరంగా లోపలికి పిలిచాడు డాక్టర్.

తన పక్కనున్న ఇద్దర్నీ డాక్టర్‌కు పరిచయం చేసి, లలితవైపు తిరిగాడు ఆమెను అడగమన్నట్టు.

అతని పరిస్థితి గమనించిన డాక్టర్ "అమ్మా! రాత్రంతా ఈయన ఎంత కంగారుపడ్డారో మీకు తెలియదు. గంటగంటకూ ఆమెను చూడమని మమ్మల్ని కూడా లాక్కెళ్ళేవారు. పర్వాలేదన్నా వినిపించుకోలేదు. అసలు పేషెంట్‌కంటే ఈయన ఎక్కడ పేషెంట్‌గా మారతారోనని మేమంతా భయపడ్డాం"

నవ్వుతూ అంటున్నా డాక్టర్ మాటల్లో సాగర్ రాత్రంతా పడిన వేదన కనబడింది.

డాక్టర్ మాటలకు సాగర్‌నే చూస్తున్న లలిత కళ్ళు చెమర్చాయి. ఇటువంటి ప్రేమికుడు లభించినందుకు రేఖ ఎంత పుణ్యం చేసుకున్నదో కదా!? ఇతన్ని గుర్తిస్తే దానికి అంతకంటే అదృష్టం మరొకటి లేదు.

రేఖ పరిస్థితి తెలుసుకుని బయటకు వచ్చారు. అప్పటికే నీరసంతో కళ్ళు మగతగా ఉన్నాయి సాగర్‌కు. అతని పరిస్థితి గమనించి చేయూతనిస్తూ నడుస్తున్నాడు శర్మ.

అది గమనించి తానేమీ చేయలేనన్నట్టు కళ్ళు తుడుచుకుంది లలిత. సుదర్శనరావుకు ఫోన్ చేసి పరిస్థితి వివరించి కంగారుపడొద్దని చెప్పింది. ఆయన పది నిమిషాల్లో వస్తానని చెప్పాడు.

"అన్నయ్యా! నువ్వు ఇంటికి వెళ్ళి రెస్టు తీసుకో. వాళ్ళ డాడీ వస్తున్నారుగా! ఆయనొచ్చేవరకూ నేనూ, ఈయనా ఉంటాం. పాపం బాగా అలసిపోయావు. నువ్వెళ్ళు."

లలిత మాటలకు తల అడ్డంగా తిప్పాడు.

"రేఖ డాడీ వచ్చిన తరువాత అందరం కలిసేవెళ్దాం" అని ముందుకు నడుస్తున్న అతన్ని చూసి నిట్టూర్చారిద్దరూ.

చెప్పినట్టుగానే సుదర్శనరావు రావటం, డాక్టర్‌ను కలవటం, కూతుర్ని చూడటం.. అన్నీ జరిగిపోయాయి. కూతుర్ని ఏ స్థితిలో ఆస్పత్రికి చేర్చాడో తెలుసుకుని సాగర్‌ను ఉద్వేగంగా హత్తుకున్నాడు. మిగిలిన ఇద్దరినీ కూడా కళ్ళతోనే అభినందించాడు

"బాబూ! ఇక మీరెళ్ళండి. రాత్రంతా మీరు పడిన శ్రమ డాక్టర్ ఇప్పుడే చెప్పారు. మీలాంటి మానవతావాదులుండటం నా అదృష్టం" అంటున్న ఆయన్ని వారించాడు సాగర్.

"అంకుల్! అంత మాటవద్దు. నా స్థానంలో ఎవరున్నా అలాగే చేస్తారు. నా కర్తవ్యం నేను చేశాను. మనమెంతో అదృష్టవంతులం కాబట్టి కొద్ది దెబ్బలతో రేఖ బయటపడింది. అన్నట్టు పోలీసులు కేసు గీసు అంటారేమో. అటువంటిదేమీ వద్దని చెప్పాను. అనవసరంగా అల్లరిపాలవటం మినహా మరింకేమీ ఉండదని"

సాగర్ మాటలకు అభినందిస్తున్నట్టు చూశాడు.

"అదే మంచిదిలే బాబూ మంచిపని చేశావు. ఇంత కంగారులో కూడా నీలా విజ్ఞతగా ఆలోచించేవారు అరుదు"

"మరో విషయం అంకుల్.. స్పాట్ నుండి కారును వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయండి. మళ్ళీ ఎవరి దృష్టిలోనన్నా పడితే అదో గొడవ. సాధ్యమైనంత త్వరగా ఆ పని చేయించండి. లేకపోతే నేనే చేయిస్తాను" అంటూ ఆయన పర్మిషన్ కోసం ఎదురు చూడకుండా ఫోన్ అందుకున్నాడు. ఎవరికో ఫోన్ చేసి విషయం చెప్పి ఆ కారును షెడ్‌కు తరలించమని, వెంటనే పని జరగాలని, అవసరమైన డబ్బు తానిస్తానని చెప్పటం సుదర్శనరావును ఆశ్చర్యపరిచింది. అతని స్థాయి తెలియదు కాబట్టి  ఆశ్చర్యపడుతున్నాడుగానీ, తెలిస్తే కళ్ళు తిరిగి పడిపోయేవాడు.

అతనెవరా అని లలిత వైపు చూశాడు. ఆమె పెదవి విరవటంతో తరువాత తెలుసుకుందామనుకుని భావించాడు. సరే ఇక తాను ఉండి చేసేదేమీ లేకపోవటంతో శర్మతో బయలుదేరాడు.

వెళ్ళేముందు "ఒకసారి డాక్టర్‌ను కలిసివెళ్దాం పద" అంటున్న అతడితో సుదర్శనరావు కూడా బయలుదేరాడు.

నలుగురూ మళ్ళీ డాక్టరు రూముకు చేరుకున్నారు. సాగర్‌ను చూడగానే గుర్తుపట్టిన బోయ్ అటెన్షన్‌లో నిలబడి లోపలికి వెళ్ళమన్నట్టు డోర్ ఓపెన్ చేశాడు. మళ్ళీ వచ్చిన సాగర్‌ను చూసి ఆశ్చర్యపడ్డాడు డాక్టర్ ముకుందరావు. నలుగురికీ సీట్లు చూపించి కూర్చోమన్నట్టు చూశాడు.

"డాక్టర్! ఇక నేవెళ్ళి సాయంత్రం వస్తాను. మీ రిలీవింగ్ డాక్టర్‌కి కూడా ప్రత్యేక కేసుగా చూడమని చెప్పండి. ఇది నా రిక్వెస్టు మాత్రమే. ఎంత ఖర్చయినా పర్వాలేదు. అవసరమైతే స్పెషల్ టీంతో ట్రీట్‌మెంట్ ఇవ్వండి. ఎక్కడా ఎటువంటి లోపం ఉండకూడదు. మీరు పర్సనల్ కేర్ తీసుకోండి."

రిక్వెస్ట్ చేస్తున్న అతణ్ణి చూస్తు ఏమిటితని వైఖరి? కన్న తండ్రి అయిన తనకంటే ఇతనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నాడు అనుకున్నాడు సుదర్శనరావు.

"డాక్టర్! శ్రమ అనుకోకపోతే ఆమె దగ్గర ఒక సిస్టర్‌ని స్పెషల్‌గా ఉంచండి. గంటలో మా శర్మ వచ్చి మిమ్మల్ని కలుస్తాడు. వీలుగా ఉంటే నేనూ వస్తాను" అంటూ డాక్టర్ దగ్గర సెలవు తీసుకుని బయటకు వచ్చాడు. అతన్నే అనుసరిస్తూ మిగిలినవారు కూడా బయటకు వచ్చారు.

"అన్నట్టు అడగటం మరిచాను. రేఖ అమ్మగారికి ఎలా ఉంది?" అడుగుతున్న సాగర్‌ను ఎంతో ఆప్యాయంగా చూశాడు సుదర్శనరావు.

"పర్వాలేదు. బాబూ! ప్రస్తుతం ఇంట్లోనే ఉంది. ఆమెకీ విషయం చెప్పలేదు. అనవసరంగా కంగారుపడుతుందని"

"మంచిపని చేశారు. ఆమె ఆరోగ్యం చక్కబడిందా. లేకపోతే స్పెషల్ డాక్టర్‌ను ఇంటికి పంపమంటారా?"

సాగర్ ఎక్కువగా ఉద్వేగపడుతున్నట్టు గ్రహించి నెమ్మదిగా అతని చేతిని నొక్కాడు శర్మ. దాన్ని అర్థం చేసుకుని కొంచెం తగ్గాడు.

ఇంకా అక్కడే ఉంటే అతనేం మాట్లాడతాడోనని "ఇక వెళ్ళొస్తాం అంకుల్. నువ్వూ మాతో వస్తావా లలితా! కొద్దిసేపు ఉంటావా?" అడిగాడు శర్మ.

కొద్దిసేపుంటానని ఆమె చెప్పటంతో ఇద్దరూ బయలుదేరారు.

## 9

ఒక వారం తరువాత రేఖను డిశ్చార్జి చేశారు. ఈ వారం రోజులూ సాగర్ నివాసం దాదాపు ఆస్పత్రే అయింది. లలిత, శర్మ ఎంత వారిస్తున్నా అతను వినిపించుకోలేదు. రేఖ నిద్రపోతున్న సమయంలో ఆమెను చూసి మౌనంగా ఇవతలకు వచ్చేసేవాడు. బయటి నుండే ఆమె మాటలు వింటూ ఉండిపోయేవాడు.

డిశ్చార్జి రోజున బిల్లు చెల్లించడానికి వెళ్ళిన సుదర్శనరావుని డాక్టర్ చెప్పిన జవాబు విస్తుపరిచింది.

"బిల్లు విషయం మీరు మరిచిపోండి సుదర్శనరావుగారూ. సాగర్‌కు కావలిసిన వాళ్ళు మీరు. అతని నుండి ఫీజు వసూలు చేసే స్థితిలో మా ఆస్పత్రిలేదు. మా చైర్మన్‌గారి ఆదేశాలు అలా ఉన్నాయి. కాబట్టి మీరు నిశ్చింతగా అమ్మాయిని ఇంటికి తీసుకెళ్ళండి. రోజూ మా డాక్టర్ వచ్చి అవసరమైన ఫిజియోథెరపీ చేయిస్తారు. ఏదైనా పెద్ద కాంప్లికేషన్ వస్తే మళ్ళీ చెకప్‌కు తీసుకురండి" అంటున్న డాక్టర్‌ను వింతగా చూశాడు సుదర్శనరావు.

బిల్లు వద్దంటాడు. సాగర్ దగ్గరి నుండి బిల్లు వసూలు చేసే స్థితిలో ఆస్పత్రి లేదంటాడు. చైర్మన్ ఆదేశాలంటాడు.

ఏమిటి? ఎవరీ సాగర్? ఆస్పత్రి అతని సొంత ఆస్పత్రి మాదిరిగా అందరూ అతన్ని చూడగానే అడుగులకు మడుగులొత్తుతున్నారు. అంత ప్రామినెంట్ పర్సనా అతను? ఇదేదో తెలుసుకోవలసిన విషయమే. తన కూతురంటే ఎందుకంత ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాడు?

ఆలోచిస్తే మతిపోవటం ఖాయం అనుకున్నాడు. నెమ్మదిగా అతనెవరైందీ తెలుసుకోవటం తనకేమీ పెద్దపని కాదని అనుకున్నాడు.

కూతురు ఆరోగ్యం బాగుపడిన తరువాత ఈ విషయం తెలుసుకోవాలనుకున్నాడు.

రేఖను డిశ్చార్జి చేశారు. డాక్టర్లకి, స్టాఫ్‌కి థాంక్స్ చెప్పారు సుదర్శనరావు, రేఖ.

ఇంటికి వచ్చిన దగ్గర నుండి రేఖ ముభావంగా అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎవరితోనూ మాట్లడదు. ఎవరినీ ఏమీ అడగదు. అన్నింటికీ మౌనాన్నే ఆశ్రయిస్తోంది. ఈ యాక్సిడెంట్ ఆమె మానసికస్థితిలో పెనుమార్పును తీసుకొచ్చింది. ఒకసారి ఆమెను చూడ్డానికి లలితోపాటు సాగర్ వచ్చాడు. అతన్ని చూడగానే ఆమె ఆగ్రహంతో ఊగిపోయింది. లలిత ఎంత సముదాయించినా ఫలితం లేకపోయింది. ఆమె ఆగ్రహం చూసి అది ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందేమోనని అతను ఆందోళనపడ్డాడు. అప్పటి నుండి ఆమెను దూరం నుండే చూసేసి వెళ్ళిపోయేవాడు.

అసలతను గుర్తుకు వస్తేనే ఆమె భృకుటి ముడిపడేది. ఆగ్రహంతో ఊగిపోయేది. ఆమె వేళ్ళు గట్టిగా బిగుసుకుపోయేవి. ఫిట్ వచ్చినట్లుగా ఉండేది ఆమె పరిస్థితి. ఎందుకంత ఆవేశం అని ఎవరైనా అడిగితే మౌనమే సమాధానం.

ఎవరైనా గుచ్చి గుచ్చి అడిగితే ఏమని జవాబిస్తుంది? అతను చేసిన ఘోరం కళ్ళముందు కదలాడుతున్నట్టు ఉండేది. తాను స్పృహ కోల్పోయిన దశలో ఆస్పత్రికి చేర్చాడని తెలుసుకుని ఆనందపడింది. ఆ తరువాతే అసలు సంగతి ఆమెకు మింగుడు పడనివ్వలేదు. చిరిగిపోయి చీలికలు పీలికలు అయిన తన డ్రస్‌ను తన పైజమా లాల్చి తీసుకొచ్చి అతను.. ఛీ..ఛీ ఇంత నీచుడా! అతనిని చూస్తుంటేనే తేళ్ళూ జెర్రులు పాకినట్టుగా ఉంటోంది.

ఎంత దుర్మార్గుడు కాకపోతే ఒక ఆడపిల్ల డ్రస్ విషయంలో అలా ఎందుకు ప్రవర్తిస్తాడు? సిగ్గుతో తన ప్రాణం పోయిందనుకుంది. నిజంగా ఆ విషయం తలుచుకుంటున్నప్పుడల్లా చచ్చిపోవాలనిపిస్తోంది. కానీ, తానింకా బ్రతికి వుండటం ఆమెకే ఆశ్చర్యంగా ఉంది. తన శరీరాన్ని అతను తాకినట్టు గుర్తుకు వచ్చినప్పుడల్లా ఒంటిమీద తేళ్ళూ జర్రులు పాకినట్లుగా జలదిస్తోంది. సాగర్ పేరు చెబితేనే ఆమె ఒళ్ళు మండిపోతోంది. ఇందుకు తగిన శిక్ష అతడికి విధించాల్సిందే! అదే ఎలా.. ఎలా? ఏం చేస్తే ఆ శిక్ష విధించినట్టవుతుంది. తాను వేసే శిక్ష అతనికి జీవితకాలమంతా గుర్తుండిపోవాలి.

ఇప్పుడు తాను పడుతున్న మానసిక వేదనకు రెట్టింపు వేదన అతను అనుభవించాలి. ఒక మానవతికి, అభిమానవంతురాలికి అవమానం కలిగించినందుకు జీవితకాలమంతా కుళ్ళిపోయేటట్టు చేయాలి. అందుకు ఏం చేయాలి? ఎలా తన పగ తీర్చుకోవాలి? మార్గం ఏమిటి? రాత్రంతా ఆలోచించింది. బాగా ఆలోచించింది. తెల్లవారుఝామున ఆమెకో మార్గం కనబడింది. అప్పుడు నిశ్చింతగా నిద్రపోగలిగింది.

ఉదయం లేవటం లేవటమే లలితను అర్జంటుగా రమ్మని ఫోన్ చేసింది.

గంటలో వస్తానంటే అంత సేపెందుకు మీ ఇంటినుంచి పావుగంటలో రావచ్చుగా అని అనటంతో లలితకు కంగారెక్కువై వెంటనే బయలుదేరి వచ్చింది.

వచ్చిన లలితను చుసి తన గదిలోకి తీసుకెళ్ళి కూర్చోబెట్టింది. "టిఫిన్ చేశావా?" లలిత అడ్డంగా తలూపింది. వెంటనే "రాజమ్మా! రాజమ్మా!" అని పనిమనిషిని పిలిచి టిఫిన్ తెమ్మని పురమాయించింది.

రాజమ్మ రెండు ప్లేట్లలో ఉప్మా పెసరట్టు తీసుకొచ్చింది. దాన్ని స్వయంగా తానే అందుకని ఒకటి లలితకు ఇచ్చి మరొకటి తాను తీసుకుంది.

టిఫిన్ నోట్లో పెట్టుకోబోతూ రేఖ ప్రశ్నకు సిగ్గుముంచుకొచ్చింది లలితకు.

"ఆఁ ఏమంటున్నాడే నీ కలల రాకుమారుడు?"

"అబ్బ. సిగ్గు దాచుకోవే"

"ఇదిగో నువ్విలా మాట్లాడితే నేను వెళ్ళిపోతాను. ఇందుకా నువ్వు నన్ను ఇంత హడావుడిగా పిలిచింది"

"కాదు. కాదు. అసలు సంగతి చెబుతాను. ముందు టిఫిన్ తిను"

ఇద్దరూ టిఫిన్ తినటం పూర్తయింది. రాజమ్మ తెచ్చిన కాఫీ తాగారు.

రాజమ్మ వెళ్ళిన తరువాత "సాగర్ వాళ్ళిచ్చిన కాఫీ బాగుంటుంది కదూ. నిజంగా అంత కమ్మటి కాఫీ మరెక్కడా దొరకదు. మళ్ళీ వెళ్ళి తాగాలనిపిస్తోంది. ఎప్పుడు వెళ్దాం?" ఆమె మాటలు అర్ధంకాలేదు.

అయోమయంగా చూస్తున్న ఆమెను చేత్తో తడుతూ, "అదేనే! సాగర్ అంటే మీ అన్నయ్య వాళ్ళింటికి ఎప్పుడు వెళ్దాం?"

"నిన్న సాగర్‌ను చూడగానే చీదరించుకున్న మనిషి ఇవాళ అతని ఇంటికి వెళ్దామంటోందేమిటి? మతిగానీ పోయిందా దీనికి?" లలిత మనసులో మెదులుతున్న అనుమానం గ్రహించింది.

"ఏమిటే నాకు మతిలేదనుకుంటున్నావా? మనం శ్రీశైలం వెళ్ళే ముందురోజు నువ్వేమన్నావో గుర్తుచేసుకో"

ఆమెకు గుర్తుకు రాలేదు.

"పోనీ నేనే గుర్తుచేస్తాలే. సాగర్‌ని పెళ్ళిచేసుకోమన్నావు. పైగా పెళ్ళికి రాయబారం చేస్తానన్నావు. అంతలోనే మర్చిపోయావు"

ఉలిక్కిపడింది లలిత. దీనికేదో అయింది. ఇప్పుడు దిక్కేమిటి దేవుడా!

"నేను తెలివితోనే మాట్లాడుతున్నాను. ఈ విషయం నాన్నగారితో మాట్లాడాలనుకుంటున్నాను. నువ్వు కూడా సాగర్‌తో మాట్లాడు. అతన్ని నేను పిలుస్తున్నాని చెప్పు. ఒద్దులే. అతని ఫోన్ నెంబర్ నీ దగ్గరుందిగా. నేనే ఫోన్ చేస్తాలే. ముందు నువ్వీ విషయం అతనికి చెప్పు. అతని అభిప్రాయం చెప్పిన తరువాత నేనే మాట్లాడుతాను"

ఆమె మాటలు విన్న తరువాత లలిత ముఖంలో సంతోషచ్ఛాయలు ప్రస్ఫుటంగా కనబడ్డాయి.

"నా పెళ్ళంటే సంతోషించే వాళ్ళలో నువ్వు ముందుంటావని నాకు తెలుసు. దాన్ని ఇప్పుడు నీ ముఖంలో భావాలు రుజువు చేస్తున్నాయి. కాబట్టి ఇటు నుండి ఇటే సాగర్ దగ్గరకు వెళ్ళి ఒక గంటలో నాకు ఏ సంగతి ఫోన్ చెయ్యి. అన్నట్టు అతని ఫోన్ నెంబర్ నాకివ్వు" అని తన ఫోన్ ఇస్తూ "ఫీడ్ చెయ్యి.."

వస్తానన్నట్టు లేచింది లలిత.

రేఖ మాటలు విన్న తరువాత ఆమె మూగదే అయింది. ఇంత హఠాత్తుగా రేఖ మనసు మారుతుందని ఆమె అనుకోలేదు. పట్టరాని సంతోషంతో బయటకు వచ్చి కారులో కూర్చునే సాగర్‌కు ఫోన్ చేసింది.

ఆమె అంత పొద్దున్నే ఎందుకు ఫోన్ చేసిందోనని అయోమయంలో పడ్డాడు. బహుశా శర్మ కోసం చేసివుంటుందనుకున్నాడు. "లలితా! నేను. శర్మ ఇక్కడ లేడు. గాంధీనగర్ అపార్టుమెంట్‌లో ఉన్నాడు. నేనిప్పుడు బంజారాహిల్స్‌లో ఉన్నాను."

"ఆయన కోసం కాదు. నీకో శుభవార్త చెప్పాలనే ఫోన్ చేశాను. నేనిప్పుడే వస్తున్నాను. ఫోన్‌లో చెప్పేది కాదు. స్వయంగా చెప్పి నీ చేత్తో స్వీట్ తినాల్సిన విషయం ఇది"

ఆమె కారులో కూర్చుని ఫోన్ చేయటం తన రూములోని కిటికీలోనుండి చూస్తూ నవ్వుకుంది రేఖ.

ఆమె వెళ్ళేసరికి శర్మకూడా అక్కడికి వచ్చాడు. వస్తూ వస్తూనే సాగర్ చేయి పట్టుకుని "కంగ్రాట్స్ కంగ్రాట్స్" అంటూ ఊపింది.

ఆమెకు అంత సంతోషం ఎందుకో అర్థంకాలేదు వారికి. సాగర్ చేతిలో ఉన్న స్వీట్ బాక్స్ చూసిన ఆమే చొరవగా స్వీట్ ముక్క తీసుకుని సాగర్ నోట్లో కుక్కింది. మరో ముక్క తీసి శర్మ నోటికి అందించింది.

సంతోషం పట్టలేకపోతున్న లలితను ఇద్దరూ వింతగా చూశారు.

వాళ్ళు కూడా ఆమెకు స్వీట్ తినిపించారు.

"ఆఁ ఇప్పుడు చెప్పు. ఇంత సంతోషం ఎందుకు?" శర్మ ప్రశ్నించాడు.

"అన్నయ్యకు లేని తొందర మీకెందుకు? ఇది అన్నయ్యకు ఆనందం కలిగించే వార్త. మధ్యలో మీ జోక్యం ఎందుకు?"

శర్మ ఉడుక్కున్నట్టు చూశాడు.

సాగర్ నవ్వుతూ "వాడెప్పుడూ అంతేలేమ్మా! వాడి సంగతి నాకంటే నీకే ఎక్కువ తెలుసు. నా విషయం నాకంటే ముందుగా వాడే తెలుసుకోవాలనుకుంటాడు"

"సరే. అయితే వినండి. వదిన పెళ్ళికి ఒప్పుకుంది"

"ఏమిటీ. ఏమిటీ నువ్వు చెప్పేది?"

వారి ముఖాల్లో ఎన్నడూ లేని కాంతి, ఆతృత, ఆనందం ఒకేసారి కళకళలాడాయి. ఇద్దరి ముఖాలూ అయోమయంతో పోటీపడుతున్నాయి.

"అవును. రేఖ పెళ్ళికి ఒప్పుకుంది. వాళ్ళ నాన్నతో మాట్లాడతానంది. కాబట్టి నువ్విక నిశ్చింతగ ఉండొచ్చు"

ఆమె మాటలింకా పూర్తికాలేదు. ఆమెను ఎత్తుకుని తిప్పేశాడు శర్మ.

"ఇంత ఆలస్యంగానా చెప్పేది. వచ్చిన వెంటనే చెప్పేయ్యొద్దు ఇటువంటి శుభవార్తల్ని. ఈరోజు నువ్వెక్కడ కోరుకుంటే అక్కడే పార్టీ"

"అబ్బా! మహానుభావా! కిందకు దింపండి. కళ్ళు తిరుగుతున్నాయి. అన్నయ్య పెళ్ళంటే మీరు హడావుడి చేస్తున్నారేమిటి?"

"అదే మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధం లలితా! ఒకళ్ళకు సంతోషం కలిగితే ఇద్దరం ఆనందిస్తాం. ఒకరు బాధపడుతుంటే ఇద్దరం విచారిస్తాం. అంత బాల్యస్నేహం మాది. మమ్మల్ని విడదీసేందుకు ఎందరో ఎన్నో ప్రయత్నాలు చేశారు. కానీ సాధించలేకపోయారు"

తమ మధ్య అనుబంధం గురించి చెబుతున్నప్పుడు సాగర్ కళ్ళలో మెరుపు కనిపించింది.

"నేను ఊరికే జోక్ చేశానన్నయా! మీ అనుబంధం నాకు తెలియదా?"

"నీ అంగీకారం వెంటనే ఫోన్‌లో తెలియజేయమంది. ముందు దానికి ఫోన్ చేయాలి. తరువాత మనం మాట్లాడుకుందాం" మళ్ళీ అన్నది.

వెంటనే సాగర్ ఈ విషయం విని ఎంతో సంతోషించాడని, పట్టలేని ఆనందంతో ఉన్నాడని రేఖకు చెప్పింది. లలిత ఫోన్ పెట్టిన వెంటనే సాగర్ ఫోన్ మోగింది. సాగర్ ఫోన్ లిఫ్ట్ చేశాడు.

"నేను రేఖను" అవతల నుండి వినబడింది.

**అంతే సాగర్** ముఖం కళకళలాడింది.

"చెప్పు"

"చెప్పటానికేగా ఫోన్ చేసింది. ముందు మీ పక్కన ఉన్న లలితను, శర్మను అవతలికి పంపండి."

సాగర్ వాళ్ళిద్దరి వైపు చూశాడు. అతని చూపు అర్థమైనట్టు వాళ్ళిద్దరూ బయటకు నడిచారు.

"వెళ్ళిపోయారు. ఇప్పుడు చెప్పు. ఎందుకీ ఫోన్?"

"ఏం చేయకూడదా? కాబోయే శ్రీవారి గొంతు ఫోన్‌లో ఎలా ఉంటుందో విందామని. నా ప్రపోజల్ మీకిష్టమో కాదో తెలుసుకుందామని" ఆమె అంత చిలిపిగా మాట్లాడుతుందని అతను ఊహించలేదు. అతని మనసు ఊహల్లో తేలిపోతోంది.

"అప్పుడే ఊహల్లోకి వెళ్ళిపోకండి.. ముందున్నది అసలు సంగతి. సరే! పెళ్ళయ్యాక చెప్పుకునే ఊసులకు పెళ్ళికాకముందు చెప్పుకునే ఊసులకు ఎంతోతేడా ఉంటుంది. పెళ్ళికాక ముందు ఊసులు పెళ్ళయిన తరువాత ఆ ఆనందాన్ని అందించలేవు. అందుకే మీతో మాట్లాడాలని ఉంది. మనసు విప్పి మాట్లాడుకునేందుకు మీకెప్పుడు వీలవుతుందో తెలుసుకుందామని!"

"దేవిగారికి ఎప్పుడు తీరిక కుదిరితే అప్పుడే! ఐ యామ్ ఆల్వేస్ ఎట్ యువర్ సర్వీస్!"

"అయితే రేపు పొద్దున పదిగంటలకు" ఏ హోటల్‌లో కలవాలో చెప్పింది.

"అలాగే. థాంక్యూ"

"మరచిపోకుండా వస్తారుగా?"

"ఆ సంగతి నేను అడగాలి. షార్ప్ టెన్"

"ఉంటాను. అప్పటివరకు స్వీట్ డ్రీమ్స్" ఫోన్ పెట్టేసింది.

★★★

ఆఫీసులో బిజీగా ఉన్నాడు సుదర్శనరావు.

ఆయన గదిలోకి అడుగుపెట్టి "బిజీగా ఉన్నారా డాడీ?" అంది రేఖ.

యాక్సిడెంట్ తరువాత ఆరోజే ఆమె ఆఫీసుకు వచ్చింది. ఆమెను చూసి "ఆఁ. బిజీనా పాడా.? అదేం లేదు అదేమిటమ్మా. మరో రెండు రోజులు రెస్టు తీసుకోవచ్చు కదా! ఏం కొంపలు మునుగుతున్నాయని అప్పుడే వచ్చావు?"

"ఇంట్లో కూర్చుంటే బోరు కొడుతోంది డాడీ. అయినా మీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలని. ఇలా వచ్చాను. నా జీవితం విషయంలో మీ అభిప్రాయం తెలుసుకుందామని."

కూతురు మాటలు అవాళ ఎందుకో వింతగా అనిపించాయి ఆయనకి.

"దానికోసం ఇంతదూరం రావాలా. ఇంట్లోనే అడగొచ్చుకదా!"

"ఇంటి దగ్గర అమ్మ వుంటుంది కదా! మనల్ని రిలాక్స్‌డ్‌గా మాట్లాడుకోనివ్వదు"

"అదీ నిజమేలే! ఆఁ చెప్పు"

"ముందు కాఫీ తాగి"

కూతురు మాటలకు నవ్వుకుంటూ బెల్ నొక్కాడు. బోయ్ రాగానే రెండు కాఫీ చెప్పాడు.

రెండు నిమిషాల్లో పొగలు కక్కుతున్న కాఫీ కప్పులతో వచ్చాడు.

వాడందించిన కాఫీ సిప్ చేసి "ఈ రోజు కాఫీ ఎంత బాగుంది కదు డాడీ. మన ఆఫీసులో ఇంత టేస్టుగల కాఫీ తాగడం ఇదే మొదటిసారి."

"మన మనసులోనే అంతా ఉంటుంది. మనం సంతోషంగా ఉంటే చుట్టూ పరిస్థితులు కూడా అందంగానే కనబడతాయి. ఈ విషయాలకేమిగానీ.. అసలు సంగతి చెప్పు"

"డాడీ! మనం కొద్దిసేపు మనసులు విప్పుకుని మాట్లాడుకుందాం. ఇది నా పర్సనల్ విషయం కాబట్టి ఎటువంటి కల్మషాలూ వద్దు"

అలాగే అన్నట్టు తలూపాడు.

"సాగర్‌పై మీ అభిప్రాయం ఏమిటి?"

ఆయన ఏదో అర్థమైనట్టు తలూపి "ఇప్పుడు అతని ప్రసక్తి ఎందుకు?"

"చెబుతాను. ముందు అతనిపై మీ అభిప్రాయం ఏమిటి?"

"నేను తెలుసుకున్నంతవరకు అతను మంచివాడు. యోగ్యుడు."

తన మనసులోని మాట చెప్పటానికి తటపటాయించింది. ఎంత చనువున్నా తన తండ్రితో తన పెళ్ళి విషయం ఏ ఆడపిల్లా చెప్పలేదు. ఆమె తటపటాయింపు గమనించాడు.

"సంకోచాలు, సందేహాలు అన్నీ వదిలేసి విషయమేమిటో చెప్పు"

"అతన్ని... అతన్ని నేను పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను" సిగ్గుతో ఆమె ముఖం కిందకు వాలిపోయింది.

"అనుకున్నాను. నీ మాటల్ని బట్టి ఊహించాను."

"ఏం.. మీకతను నచ్చలేదా?"

"నచ్చకపోవటమేమిటమ్మా! మంచివ్యక్తిని నువ్వు ఎంపిక చేసుకుంటే వెనక్కి ఎందుకు లాగుతాను? ఆరోజు నువ్వు ఆస్పత్రిలో ఉన్నప్పుడు అతనెంత కంగారుపడ్డాడో, టెన్షన్ పడ్డాడో స్వయంగా చూశాను. నీపై అతనికి ఉన్న ప్రేమను అప్పుడే గ్రహించాను. కానీ, నీతో ఈ విషయం ప్రస్తావించే సమయం ఇలా వస్తుందనుకోలేదు. నా మనసులో మాటే నువ్వు చెబుతున్నావు. ఇవాళ నువ్వు బయటపడకపోతే రేపోమాపో నేనే అడిగేవాణ్ణి నిన్ను"

తండ్రి అంగీకారం తెలిపినందుకు ఆనందంతో "థాంక్స్! డాడీ థాంక్స్" అంది.

ఆయన లేచి వచ్చి కూతురు తలను గుండెకు చేర్చుకున్నాడు. ఇంత త్వరగా తండ్రి అంగీకరిస్తాడని ఆమె ఊహించలేదు.

"డాడీ! నేను ఇంటికి వెళ్ళిపోతాను. అమ్మతో మీరే మాట్లాడండి"

ఆయన సరేనన్నట్టు తలూపాడు. ఆమె సంతృప్తిగా బయటకు నడిచింది.

★★★

మర్నాడు.

ఉదయం సరిగ్గా పదిగంటలు..

రేఖ చెప్పిన హోటల్.

అప్పుడే హోటల్‌లోకి ప్రవేశించాడు సాగర్.

సరిగ్గా అదే సమయంలో రేఖ కూడా లోపలికి అడుగుపెట్టింది.

సాగర్ చూస్తూ "ఠంచనుగా వచ్చారే?"

"మీరూ అంతేగా!" ఇద్దరూ నవ్వుకున్నారు.

"అక్కడ టేబుల్ రిజర్వ్ చేశాను. పదండి" దారితీశాడు.

"ముందుగానే అన్ని ఏర్పాట్లు చేశారే?"

"ఏం? మీకేమైనా అభ్యంతరమున్నదా? లేక వేరేచోటేమైనా?"

"అక్కర్లేదు పదండి"

ఇద్దరూ టేబుల్ వైపు నడిచారు. కూర్చున్న తరువాత.

సప్లయర్‌ను చూసి "ఒక అరగంట మమ్మల్ని డిస్టర్బ్ చేయొద్దు. చాలా ముఖ్యమైన విషయం మాట్లాడుకోవాలి" అని చెప్పింది.

వాడు తలూపి వెళ్ళిపోయాడు.

"ఇప్పుడు చెప్పండి. ఎందుకు రమ్మన్నారు?" అడిగాడు.

"నిన్ననే చెప్పానుగా. ఇప్పుడు కొత్తగా చెప్పేదేమున్నది?"

అతడు మౌనంగా ఆమెనే చూస్తున్నాడు "నా కలల రాకుమారి ఇంత త్వరగా కరుణిస్తుందనుకోలేదు"

"ముందు మనం మనసు విప్పి మాట్లాడుకుందాం. తరువాత కలలరాకుమారో, కలల రాకుమారుడో తేల్చుకుందాం" ఆమె మాటలకు వింతగా ఆమెను చూశాడు.

"పెళ్ళిపై మీ అభిప్రాయం ఏమిటి?" ఆమె అడిగింది.

"ఓహో ఇప్పుడు ఇంటర్వ్యూ అన్నమాట" నవ్వుతూ అన్నాడు.

"బీ..సీరియస్" ఆమె మాటకు ఒక్కసారి గతుక్కుమన్నాడు.

"పెళ్ళంటే రెండు తనువులే కాదు. రెండు మనసుల కలయిక. కష్టంలోను, సుఖంలోనూ కలిసే వుంటామని ఇద్దరూ కలిసి అంగీకరించే ఆత్మీయబంధం. ఒకళ్ళు ఎక్కువ, మరొకరు తక్కువ కాదని, సంసారానికి ఇద్దరూ సమానమేనని, ఒకరు లేకపోతే మరొకరు లేరని తెలియజెప్పే పవిత్రబంధం. పెళ్ళనేది వ్యక్తిగతమైనదైనా నా అభిప్రాయం ప్రకారం ప్రవహించే ఏరులాంటిది. ఒకచోటు నుంచి మరోచోటుకి నీరు ఎలా ప్రవహిస్తుందో అలాగే ఒక తరం నుంచి మరో తరానికి వారధిగా పెళ్ళి నిలుస్తుంది. వంశాన్ని పెంచుకునేందుకు మన పెద్దలు ఉద్దేశించిన నిరంతర ఝరి పెళ్ళంటే. మన పెద్దల నుండి మనకు అందిన ఈ ఝరిని మన తరువాతి తరానికి కూడా అందివ్వాలి. అంటే మన పెద్దల నుండి మనకు వచ్చినట్లే మన పిల్లలకు కూడా అందించేందుకు పెద్దలు నిర్ణయించిన పవిత్ర ప్రక్రియ. మంచి సమాజాన్ని, మంచి పౌరుల్ని నిర్మించేందుకు వారధిగా నిలిచే పవిత్రబంధం అది"

ఉద్వేగంగా చెబుతున్న అతని జవాబుకి ఆమె కళ్ళలో వెలుగు. "బాగా చెప్పారు. ఇంతబాగా చెబుతారని నేనూహించలేదు. కానీ మన పెళ్ళికి నావి కొన్ని షరతులున్నాయి"

"షరతులా! ఏమిటవి?"

"నాకు ఆత్మాభిమానం ఎక్కువని మీకు తెలుసు. ఎట్టి పరిస్థితుల్లోను నా మాటే నెగ్గాలి. నా మాటలకు విలువలేని చోట నేను ఒక్క క్షణం కూడా ఉండలేను. అంతేగాక నాకు కోపం కూడా ఎక్కువే. దాన్ని భరించగల శక్తి మీకుంటే.."

"ఇంతేనా? ఇంకా ఏమైనా ఉన్నాయా?" నవ్వుతూ అడిగాడు.

"ఇంకా ఏమైనా ఉంటే పెళ్ళి అయిన మన తొలిరాత్రి చెబుతాను. వాటిని కూడా మీరు భరిస్తానని మాటివ్వండి"

"తప్పకుండా! నీకోసం ఎన్ని కష్టనష్టాలనైనా భరిస్తాను. నాకు కావలసినది నువ్వు. నువ్వే నా దరి చేరితే ఈ కష్టనష్టాలు ఒక లెక్కలోవి కావు. అయినా భార్యాభర్తలు ఒకరి కోసం మరొకరు అనటంలోనే అందం ఉంది. నీ తృప్తికోసం ఎటువంటి షరతులైనా నాకు అంగీకారమేనని నా తల్లిదండ్రుల మీద ఒట్టువేసి చెబుతున్నాను"

"చాలా తొందరపడి పెద్ద ఒట్టువేశారు. ఎప్పటికీ ఒట్టు తీసి గట్టుమీద పెట్టకుండా చూసుకోండి. తరువాత వచ్చే వాటిని ఎదుర్కోవటానికి అవసరమైన గుండె నిబ్బరాన్ని సమకూర్చుకోండి. తరువాత నన్ను నిందించి ప్రయోజనం ఉండదు"

"అంతేకాదు. నీ అభిజాత్యాన్నిగానీ, నీ అహాన్నిగానీ, నీ ఆత్మాభిమానాన్నిగానీ పొరపాటున కూడా తాకనని, వాటికి ఎట్టి పరిస్థితుల్లోను దెబ్బతీసే విధంగా ప్రవర్తించనని కూడా ఒట్టుపెడుతున్నాను."

అతని మాటలకు హాయిగా నవ్వింది.

"నా షరతులకు మీరేమంటారోనని ఎంత భయపడ్డానో తెలుసా? మీవంటి భర్త లభించటం నాకు పూర్వజన్మ సుకృతం. జన్మజన్మలకూ మనబంధం ఇలాగే ఉండాలని కోరుకుంటున్నాను."

ఆమె మనసు సంతోషంతో పొంగిపోతోంది. అతని పరిస్థితి కూడా అంతే!

"మన పెళ్ళినాటి ప్రమాణాలు బాగున్నాయి. ఇవేనా?! ఇంకా ఏమైనా ఉన్నాయా?"

"ఇప్పటికివే. మిగిలినవి మనకు మరపురాని తొలిరాత్రికి జాబితా సిద్ధం చేసి ఉంచుతాను. వాటిపై కూడా ఆమోదముద్ర వేయండి. వేస్తారనే భావిస్తున్నాను"

బోయ్‌ను పిలిచి స్వీట్ చెప్పాడు సాగర్.

ఆమె చిరునవ్వుతో "మీరు చెప్పిన గులాబ్‌జామ్ నాకు ఇష్టం లేకపోయినా మీకోసం తీసుకుంటాను. ఒకరి ఇష్టాలను మరొకరు త్యాగం చేయటమే భార్యాభర్తల బంధానికి తీపి గుర్తులుగా మిగిలిపోతాయి" గొప్ప త్యాగం చేస్తున్నట్టుగా చెప్పింది.

ఆమె మాటలకు నవ్వుతూనే స్వీట్ అందుకున్నాడు. ఆమె కూడా స్వీట్ తిని, "విష్ మీ బెస్టాఫ్ లక్. మన జీవితాల్లో మరపురాని మధురమైన ప్రయాణానికి సిద్ధమవుతున్నాం కదా! ప్రయాణం సాఫీగా సాగాలని, ఒకరంటే మరొకరికి ప్రేమాభిమానాలు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ ఒకరికొకరు అభినందనలు తెలుపుకుందాం"

## 10

సాగర్, లలిత, శర్మ కలిసి హైదరాబాద్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న గంగవరం చేరుకున్నారు. రోడ్డు సరిగ్గా లేక అప్పటికే వారు అలిసిపోయారు. ఇంకా పదికిలోమీటర్లు వెళ్ళాలి. ఈరోడ్డే ఇలావుంటే మిగిలిన పదికిలోమీటర్ల రోడ్డు ఎలా ఉందో అనుకుంటూ ఎందుకైనా మంచిదనుకుని రోడ్డుపక్కనే ఉన్న బడ్డీకొట్టు దగ్గర కారు ఆపాడు సాగర్. బడ్డీ కొట్టును చూపిస్తూ రోడ్డు ఎలావుందో ఎంక్వైరీ చేయమన్నాడు శర్మతో.

శర్మ కారుదిగి "బాబూ రామవరానికి రోడ్డు బాగుందా? కారు వెళ్తుందా?" బడ్డీకొట్లో కూర్చున్నతన్ని అడిగాడు.

"కారు వెళ్ళటం కష్టమండీ. ఏవో కేబుల్ కోసం రోడ్డంతా తవ్విపెట్టారు. ఇక్కడి నుండి కాలినడకే. కారుమాత్రం వెళ్ళలేదు. ఏదైనా జీపు అయితే.."

అతని జవాబుకి గతుక్కుమన్నాడు శర్మ.

నీరసంగా కారు దగ్గరకు వచ్చి, "ఒరేయ్! నడకే ప్రస్తుతం మన కర్తవ్యం పదికిలోమీటర్లు"

"సరే! కూర్చో" కారును గంగవరం ఊళ్ళోకి తిప్పాడు. అదొక పల్లెటూరు. ఊరంతా చెట్లు ఉండటంతో చల్లనిగాలి వీస్తోంది. మనసుకు హాయిగొలుపుతున్న ప్రకృతిని ఆస్వాదిస్తూ కారు నెమ్మదిగా ముందుకు సాగుతోంది.

ఎదురుగా రామాలయం. పక్కన పంచాయితీ ఆఫీసు. రామాలయం ముందున్న సిమెంట్ బెంచ్‌పై కొందరు కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నారు. పంచాయితీ ఆఫీసు దగ్గర ఇంకొందరు నిలబడి ఏదో మాట్లాడుకుంటున్నారు. గుడికి, పంచాయితీ ఆఫీసుకు మధ్య ఉన్న రోడ్డులోకి కారు మళ్ళించాడు.

"ఇటెక్కడికిరా? మనం వెళ్ళాల్సింది రామవరానికి కదా! ఇటు తీసుకెళ్తున్నావేమిటి?"

శర్మ మాటలకు చిరునవ్వు నవ్వాడు. "పది కిలోమీటర్లు నడవటానికి నీల్గుతున్నావు కదా! మరో మార్గమేదైనా ఉందేమో చూద్దామని.."

అంటూనే కారును ఒక బంగ్లా ముందు ఆపాడు. కారు ప్రహరీదాటి గేటులో నుండి లోపలికి దారితీసింది.

గొడ్లచావిట్లో ఏదో పనిలో ఉన్న రంగడు కారు శబ్దానికి పరిగెత్తుకు వచ్చి కారులో ఉన్న సాగర్‌ను చూశాడు. గేటు దాటగానే కుడివైపున గొడ్లచావిడి ఉంది. దానిలో ఎడ్లు, గేదెలు మేతమేస్తూ కనబడ్డాయి. ఆ ఇల్లు ఎవరిదో శర్మకు, లలితకు అర్థంకాలేదు.

"చినబాబుగారూ! సాగర్‌బాబు వచ్చారు" అరుస్తూ లోపలికి పరిగెత్తాడు రంగడు.

అప్పటికే అతని అరుపు పదిళ్ళకు వినిపించింది. చుట్టుపక్కల ఇళ్ళలోని వారు బయటకు వచ్చి సాగర్‌ను చూసి నవ్వుతూ నమస్కారాలు చేశారు. సాగర్ వారందరికీ ప్రతినమస్కారాలు చేశాడు.

వారి ముఖాలు చూస్తుంటే సాగర్‌కు వాళ్ళు చిరపరిచితుడని అర్థమైంది.

"ఏం సాగర్‌బాబూ! ఇదేనా రావటం? ఈ మధ్య మా మీద శీతకన్ను వేశారే! పట్నంలో మకాం పెట్టిన తరువాత మమ్మల్ని మరిచిపోయినట్టున్నారు" ఒకావిడ దగ్గరకి వస్తూ అడిగింది. సాగర్‌ను చూసిన తరువాత వారందరి ముఖాల్లోను ఆనందం కనబడింది.

కొందరి జాతకమే అంత. కొందర్ని చూస్తే మొట్టబుద్ధవుతుంది. మరికొందర్ని చూస్తే ముద్దుపెట్టబుద్ధవుతుంది. సాగర్ రెండోకోవకు చెందుతాడు. తెలిసిన చోటుకెళ్ళినా, తెలియని చోటుకెళ్ళినా అభిమానుల్ని క్షణాల్లో సంపాదించుకోవటం సాగర్ ప్రత్యేకత.

అంతలోనే మూడు కొబ్బరిబొండాలు తీసుకుని ఒకడు పరిగెత్తుకు వచ్చాడు.

"ముందు దాహం తీర్చుకోండి. బాబూ! తరువాత మాట్లాడుకుందాం" అంటూ అందించాడు.

అతని ఆప్యాయతకు నవ్వుకున్నాడు సాగర్.

"ఏం. జానకిరామయ్యా బాగున్నావా? నీ మనవడు ఏం చేస్తున్నాడు?" సాగర్ తనను పేరుతో పిలిచేసరికి ఏనుగు ఎక్కినంత సంతోషం వేసింది జానకిరామయ్య అనబడే ఆ వ్యక్తికి.

"ఊఁ ఇంటి బయటే అతిధి మర్యాదలయ్యాయా? ఇంకా ఇంట్లోకి ఎందుకు అటునుంచి అటే బయలుదేరండి. మళ్ళీ ఎండ ఎక్కుతోంది" లోపలనుంచి వస్తూ ఒక యువకుడు నిష్ఠూరంగా అన్నాడు.

"ఏం చేయమంటావురా! ఊరంతా ఇలా ఒక్కసారే ఉక్కిరిబిక్కిరిచేస్తుంటే!"

"అవునులే నాకంటే నీకు ఊరివాళ్ళే ఎక్కువయ్యారు" అతని గొంతులో నిష్ఠూరం తగ్గలేదు.

"అదేం మాట బాబూ! మీ కోసమే ఆ బాబు ఇక్కడికి వచ్చేది. ఇప్పటికి ఆ బాబును చూసి ఐదేళ్ళయింది. ఇంతకాలానికి కనబడటంతో ఆత్రం ఆపుకోలేకపోయాం" జానకిరామయ్య నొచ్చుకుంటున్నట్టు అన్నాడు.

"వాడి ధోరణే అంత పట్టించుకోకండి. మీ పనులు మీరు చేసుకోండి. మళ్ళీ వెళ్ళేటప్పుడు కలుస్తాను" సాగర్ అన్నాడు.

"కొందరు కొన్నిటికి పెట్టిపుడతారు. నీ శత్రువు నుండి కూడా గౌరవాన్ని పొందగలవు నువ్వు" లోపలి నుండి వచ్చిన యువకుడు సాగర్‌ను ఆలింగనం చేసుకుంటూ అన్నాడు.

"అందుకే నేనంటూ ఉంటాను. ఇటువంటి వాడికి మిత్రుణ్ణి అయినందుకు నాకు గర్వం పెరుగుతుందని. వీడేమో ఆ మాటల్ని పట్టించుకోడు. ఏం చేస్తాం? చెప్పండి. అన్నిటికీ సర్దుకుపోవటమే మన విధి"

అంటున్న శర్మను చూస్తూ ఎవరు అన్నట్లు కళ్ళు ఎగరేశాడు ఆ యువకుడు.

"వాడి పరిచయం పెద్దగా అక్కర్లేదుగానీ, ఇదిగో ఈమె మాత్రం నాతో సహా అందరికీ వి.ఐ.పీనే. నా చెల్లెలు లలిత" పరిచయం చేస్తూ చెప్పాడు.

అతని పరిచయానికి పొంగిపోయింది లలిత. శర్మ ముఖం ముడుచుకుపోయింది.

"అలా ముడుచుకు పోనక్కర్లేదు. వీడు నా ప్రతిబింబం శర్మ. అందుకే పరిచయం అక్కర్లేదన్నది. ఇకపోతే ఇతనెవరు అన్న సందేహం తీర్చాలి కదా! వీడు నా చిన్ననాటి స్నేహితుడు ఆంజనేయులు."

ముగ్గురిదీ ఒకే వయసు.. ఇరవై దాటిన యువకులే.

"గృహప్రవేశం చేస్తే సంతోషిస్తాం" ఆంజనేయులు మాటలకు అంతా నవ్వారు. లోపలికి నడిచారు.

"ఏం సాగర్? బాగున్నావా?"

"అసలు వాడితో మాట్లాడవద్దే అమ్మా! మనింటినే మరిచిపోయాడు. ఐదేళ్ళ తరువాత గుర్తుకొచ్చాం మనం"

కోపంగా అంటున్న కొడుకును చూసి నవ్వింది సుగుణమ్మ.

ఆ ఇంట్లో అతనికున్న ప్రత్యేకత ఏమిటో గమనించారు శర్మ, లలితలు.

"ఇదిగో పిన్నీ! ఈ అమ్మాయి. నాకు, ఆంజనేయులుకు జాయింట్‌గా చెల్లెలు. ఇక వీడు. నాకు కాబోయే బావ!"

"కూర్చో నాయనా! రాకరాక వచ్చావు. భోజనం చేయందే వెళ్ళనిచ్చేదిలేదు" ఆమె ఆప్యాయతకు కదిలిపోయాడు.

"లేదమ్మా! తాతయ్య అర్జంటుగా రమ్మని కబురుచేశారు. ఊళ్ళోకి వెళ్ళటానికి రోడ్డు బాగోలేదట కదా! కారు వెళ్ళటం కష్టమన్నారు. అందుకని ఆంజనేయుల్ని అడిగి జీపు తీసుకెళ్దామని" సాగర్ మాటలింకా పూర్తికాలేదు.

"ఒరేయ్! లేవరా! జీపు అవసరం అయింది కాబట్టి వచ్చావు. లేకపోతే వచ్చివుండేవాడవు కావు. అవునా?"

అది కోపమో, అభిమానమో అర్ధకాలేదు వింటున్నవారికి.

"సరేలే. ఇప్పుడు తాతయ్య అర్జంట్‌గా రమ్మన్నారు కదా! వచ్చేటప్పుడు వస్తాంలే" నచ్చచెపుతున్న సాగర్ చూస్తూ, "అయితే నీకిష్టమైన పెసరట్టు ఉప్మా చేసి పెడతాను తినెళ్ళండి" సుగుణమ్మ అంది. అలాగేనన్నట్టు తలూపాడు.

టిఫిన్, కాఫీ అయిన తరువాత ఆంజనేయులు వైపు తిరిగి, "జీపు తియ్యరా?!" అన్నాడు సాగర్.

"ఏమిటీ. నేను రావాలా?" అంటున్న ఆంజనేయుల్ని చూస్తూ తప్పదన్నట్టు తలూపాడు.

వాళ్ళు బయలుదేరుతుండగా "ఒక్క నిమిషం" అంటూ లోపలికి వెళ్ళింది సుగుణమ్మ.

ఒక ప్లేట్‌లో చీర, పసుపు, కుంకుమ, జాకెట్ తీసుకొచ్చి, లలితకు బొట్టుపెట్టి అందించింది. మొహమాటపడుతూ "ఇప్పుడెందుకండీ ఇవన్నీ?" అంటున్న లలితతో "అదేమిటమ్మా! ఇప్పుడేగా ఈ ఇంటి ఆడపడుచువని సాగర్ చెప్పాడు. మరి ఈ ఇంటి ఆడపడుచుకు ఆ మాత్రం ఇవ్వకపోతే ఎలా? పైగా మొదటిసారి మా ఇంటికి వచ్చావు. సాగర్‌కు చెల్లెలివైతే ఈ ఇంటి ఆడపడచుగా నీకు అన్ని హక్కులుంటాయి" అన్నది.

"నీ పనే రైటు" చలోక్తిగా అన్నాడు శర్మ.

"అమ్మా! ఇంకో చీర ఉంటే ఆయనకు కూడా పెట్టండి" చలోక్తిలో తీసిపోనట్టు అంటున్న లలితను చూసి నవ్వేశారంతా. లలిత, శర్మలను చూసి చూడముచ్చటైన జంట అని వారంతా మెచ్చుకోవటంతో శర్మ సిగ్గుపడ్డాడు.

"బావా! అలా సిగ్గుపడితే చీర జాకెట్టు వస్తుందనుకుంటున్నావా?"

ఆంజనేయులు అని నాలిక్కరుచుకున్నాడు, తానన్న మాటలకు శర్మ ఎక్కడ బాధపడతాడోనని.

"పర్వాలేదులే బావా! లలితను మీ అమ్మగారు ఇంటి ఆడపడుచుగా దీవించినప్పుడు నేను ఇంటి అల్లుణ్ణే కదా! ఈసారి వచ్చినప్పుడు అల్లుడు దర్జా చూపిస్తానులే" అన్నాడు శర్మ.

అతని మాటలు విన్న సాగర్, "అయితే మేము తిరిగి వచ్చేటప్పుడు నిన్ను తీసుకెళ్తాంగానీ, అప్పటివరకు అల్లుడు దర్జా చూపించు పిన్నీ బాబాయిలకు పదరా! ఆంజనేయులూ! బావ ఇక్కడే ఉంటాడులే" అనటంతో అంతా పక్కున నవ్వారు.

11

**హైటెక్స్ ధగధగలాడిపోతోంది.**

కనీవినీ ఎరుగని రీతిలో సాగర్, రేఖల పెళ్ళివేడుక కోసం మండపం సర్వాంగసుందరంగా అలంకరించబడింది. పెళ్ళికి ప్రత్యేక ఆకర్షణగా సాగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ నారాయణరావు, ఆయన భార్య రాధాదేవి, ఆయన తల్లిదండ్రులతో విచ్చేశారు. ఆయన కుటుంబం రావటం సుదర్శనరావుకు మహదానందమైంది. వారు సాగర్‌కు, రేఖకు డైమండ్ రింగ్‌లు ప్రజెంట్ చేశారు. ఈ వివాహవేడుకలో వారు అత్యంత ఉత్సాహంగా పాల్గొనటం చూసి వారి నిరాడంబరతను అందరూ మెచ్చుకున్నారు.

వధూవరులిద్దరూ ముందుగా ఆ కుటుంబానికే నమస్కారాలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇక పెళ్ళిలో అంతా తానై తిరుగుతున్న శర్మను నారాయణరావు దంపతులు అనేక సార్లు పిలిచి ఏవో సూచనలు చేయటం, వాటికి శర్మ తలూపటం చూస్తే సాగర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌తో తమకు విడదీయరాని అనుబంధం ఏర్పడినట్లుగా సుదర్శనరావు సంతోషించాడు.

మర్నాడు సాయంత్రం సిటీలోనే ప్రఖ్యాతి గాంచిన హోటల్‌లో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌కు కూడా రావలసిందిగా సుదర్శనరావు ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించాడు నారాయణరావు. సుదర్శనరావు పట్టుబట్టడంతో అవకాశముంటే వస్తానని చెప్పాడు.

హోటల్‌లో రిసెప్షన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నారాయణరావు దంపతులు రావటం చూసిన సుదర్శనరావు ఉబ్బితబ్బిబ్బయ్యాడు. రిసెప్షన్‌లో కూడా వారు సాగర్‌కు బ్రేస్‌లెట్, రేఖకు బంగారు గాజుల సెట్ బహూకరించారు. హాల్లో రేఖ స్నేహితురాళ్ళ మధ్య మెరిసిపోతూ కూర్చుని ఉంది. నారాయణరావు దంపతులు వెళ్ళేందుకు సిద్ధమవటంతో రేఖను పిలిచేందుకు లోపలికి వచ్చాడు సాగర్.

సాగర్‌ను చూసి రేఖ సిగ్గుతో తలదించుకుంది. సాగర్ కూడా అదే భావంలో మునిగిపోయాడు. నారాయణరావు దంపతులు వెళ్తున్నారని చెప్పడానికి అతను సంశయించాడు.

శర్మ పరిగెత్తుకుంటూ వచ్చి "అరేయ్ నువ్విక్కడున్నావా? మీ ఇద్దర్నీ మామయ్య పిలుస్తున్నారు" అన్నాడు.

"మామయ్యా!"

సాగర్ ఆశ్చర్యపోతుండటంతో, "అదేరా! నారాయణరావుగారు వెళ్తున్నారట. మీకు చెప్పటానికి రమ్మంటున్నారు. రేఖా! ఒక్కసారి ఇటురామ్మా!" శర్మ పిలిచాడు.

ఇద్దర్నీ ఆశీర్వదించి "ఒకసారి మా ఇంటికి భోజనానికి రండి కొత్తదంపతులిద్దరూ..." నారాయణరావు ఆహ్వానానికి తలూపారు కొత్తదంపతులిద్దరూ.

నారాయణరావు, ఆయన భార్య రాధాదేవిలను కారువరకూ వెళ్ళి సాగనంపారు సాగర్, శర్మ. ఆయన శర్మతో ఎక్కువ చనువుగా ఉన్నట్టు తోచింది చూసినవారికి.

పది నిమిషాలు గడిచాయి.

"మిమ్మల్ని రేఖ పిలుస్తోంది" లలిత వచ్చి చెప్పటంతో లోపలికి వెళ్తున్న సాగర్‌తో శర్మ కూడా వెళ్ళాడు. అక్కడ రేఖ, ఆమె తల్లిదండ్రులు, స్నేహితుల మధ్య నుండి లేచి సాగర్ దగ్గరకు వచ్చి అతని చేతికి తన చేతిలో ఉన్న బ్యాగ్‌ను అందించి "పాపం..! మీరు ఈ పెళ్ళికి బట్టలు కూడా కొనుక్కోలేకపోయినట్టున్నారు. ఇందులో పది లక్షల రూపాయలున్నాయి. మీ ఇష్టం వచ్చినట్టు ఖర్చు

పెట్టుకోవచ్చు. ఎవరికీ ఆఖరికి నాక్కూడా లెక్క చెప్పక్కర్లేదు'' అతిశయంతో అంటున్న ఆమె మాటలు అక్కడున్నవారందర్నీ ఉలిక్కిపడేలా చేశాయి.

''రేఖా!'' ఆమె తల్లీతండ్రీ ఇద్దరూ కూడా ఒకేసారి పెద్దగా అరిచారు.

''మీకు తెలియదులే అమ్మా! ఆయన పరిస్థితి అటువంటిదాయె మరి..!'' అన్నది అక్కసుగా.

''రాక్షసి'' అని పళ్ళుకొరుకుతూ, ''చూడండి రేఖగారూ! మన పెళ్ళయి ఇంకా 24 గంటలు గడవలేదు. మీ అతిశయానికి ఎలా తలవంచమంటారు? నిజమే మీకు మాట ఇచ్చాను కదా అని ఎంతమాట అంటే అంత, ఇష్టం వచ్చినట్టుగా అవమానిస్తే అంగీకరిస్తాననుకోవటం పొరపాటు. నేను లేనివాడినని తెలిసీ మీరెందుకు కావాలని వెంటపడి మరీ పెళ్ళిచేసుకున్నారు? ఇలా నన్ను పదిమందిలో అవమానం చేయటానికా?'' అతని కళ్ళు అప్పటికే అవమానాగ్నితో ఎర్రబడ్డాయి.

అతని పరిస్థితి చూస్తుంటే ఆమెకు ఆనందంగా ఉంది. రాక్షసానందం పొందసాగింది.

ముందుగా శర్మ తేరుకున్నాడు.

''ఒక్కక్షణం రేఖగారూ! మీరు మావాడి అర్ధాంగి కాకపోయివుంటే తగిన గుణపాఠం చెప్పేవాడిని. కానీ వాణ్ణి ఇలా అవమానించటం ద్వారా మిమ్మల్ని మీరు కించపరుచుకుంటున్నారని తెలుసుకోండి''

కోపంతో అంటున్న శర్మను చూసి, ''షటప్ యూ రాస్కెల్. ఇది మా భార్యాభర్తలకు సంబంధించిన విషయం. ఇందులో నీ జోక్యం అనవసరం.''

ఆమె నోటి దురుసుకు ఏం చెప్పాలో తెలియలేదు శర్మకు.

అతను తేరుకోవటానికి రెండు నిమిషాలు పట్టింది.

ఈలోగా రేఖ చెంప ఛెళ్ళుమనిపించింది లలిత.

''ఇంతకాలం నా స్నేహితురాలు అతిశయం ఉన్నదని మాత్రమే అనుకున్నాను. ఇప్పుడు మంచి చెడూ విచక్షణ కూడా లేనిదని అర్ధమైంది. నా స్నేహితురాలివని చెప్పుకోవటానికి కూడా సిగ్గుగా ఉంది'' లలిత ఆగ్రహంతో ఊగిపోయింది.

అంతమందిలో తన స్నేహితురాలే ఇలా చెంప ఛెళ్ళుమనిపించటం మింగుడు పడలేదు రేఖకు.

అంతలో శర్మ ఎవరికో ఫోన్ చేశాడు. అక్కడున్న వారంతా నెమ్మదిగా తలవంచుకుని వెళ్ళే ప్రయత్నాలు చూసిన శర్మ అందర్నీ పది నిమిషాలు ఉండవలసిందిగా కోరాడు. అతనెందుకు ఉండమన్నాడో అర్ధంగాక పోయినా ఫ్రీగా సినిమా చూపిస్తానంటే అందరికీ ఆసక్తే కదా! కరెక్టుగా తొమ్మిది నిమిషాలు గడిచాయి.

హోటల్ ఆవరణలోకి వరసగా ఆరుకార్లు వచ్చి ఆగాయి. అందులో నుంచి సిటీలోని బిగ్‌షాట్స్ పిల్లలు దిగారు. అంతా పరిగెత్తుకుంటూ వచ్చారు.

వచ్చీరాగానే రాయిలా నోటమాట రాకుండా నిలబడిన సాగర్‌ను చూసి, ''ఎవర్రా! నిన్ను అవమానం చేసే ధైర్యం చేసింది? వాళ్ళకెన్ని గట్స్?'' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు.

''మిస్టర్ సుదర్శనరావు.. కూతుర్నిచ్చి పెళ్ళిచేసి 24గంటలు గడవకముందే అల్లుణ్ణి అవమానించిన నిన్ను ఊరికే వదులుతామనుకోకు. ఏదో డబ్బుందని అహం చూపించావట. ఏదీ నీ డబ్బున్న బ్యాగ్?'' అని ఆరుగురు ఒక్కొక్కరూ పదిలక్షల చొప్పున ఆ బ్యాగుపైన పెట్టి శర్మవంక చూశారు.

"ఇదిగో రేఖా మీ డబ్బుకి ఆరురెట్లు అంటే అరవైలక్షలు.. సాగర్‌ను అవమానించిన పాపం ఊరికేపోదు. నీ అహానికి దిష్టితీశామని అనుకుంటాం. ఈ అరవై లక్షలూ తీసుకో. ఇకముందు ఎప్పుడూ జీవితాలతో ఆడుకోకు. ఈ అరవై లక్షల రూపాయలగురించి ఎవరికీ లెక్క చెప్పక్కర్లేదు. కనీసం సాగర్‌కూడా అడగడు" కఠినంగా హెచ్చరించాడు శర్మ.

వచ్చిన యువకులందర్నీ చూస్తూ వాళ్ళెవరెవరో గుర్తుకు తెచ్చుకోసాగాడు సుదర్శనరావు. వాళ్ళంతా తనకన్నా పైమెట్టు మీద ఉండే వ్యాపారవేత్తల తనయులే. ఇంతమంది పెద్దవాళ్ళు సాగర్ కోసం ఎంతైనా ఖర్చుచేయటానికి సిద్ధపడటం, అదీ పది నిమిషాల్లో అంత పెద్ద మొత్తంతో రావటం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది.

రేఖకు కూడా మతిపోయింది. పదిమందిలో అదీ తన స్నేహితురాళ్ళ మధ్య సాగర్‌ను అవమానిద్దామనుకుంటే వచ్చిన ఆహ్వానితులందరిలోనూ తనే అవమానం పాలయ్యింది.

సాగర్‌కు స్నేహితులున్నారని తెలుసుగానీ మరీ అతని కోసం ప్రాణాలిచ్చే స్నేహితులున్నారన్న సంగతి తెలియదు. ఇదంతా తెలుసుకోకుండా తాను తొందరపడిందా? తన తొందరపాటు ఫలితం వెంటనే కనబడిందా?

సాగర్ మాత్రం బొమ్మలా నిలబడిపోయాడు. అతని కోసం వచ్చిన అతని మిత్రులు మాత్రం సాగర్‌ను తీసుకుని వెళ్ళటం చూసిన సుదర్శనరావు కంగారుపడ్డాడు.

"బాబూ! మా అమ్మాయి తొందరపాటుకు, అహంకారానికి నేను సిగ్గుపడుతున్నాను. క్షమించవలసిందిగా వేడుకుంటున్నాను. మా అమ్మాయి అహంకారి అని తెలుసుకానీ దురహంకారి అని మాత్రం నేను ఊహించలేకపోయాను. నన్ను మీరంతా మనస్పూర్తిగా క్షమించండి. దయచేసి ఎవరిడబ్బు వాళ్ళు తీసుకెళ్ళండి" ప్రాధేయపడుతున్న సుదర్శనరావును చూస్తుంటే అందరికీ జాలివేసింది.

అక్కడ ఉన్న వారందరికీ ఒక విషయం గుర్తుకొచ్చింది. నాలుకకు నరం లేదని చెబుతుంటారు. అందుకే ఎటు కావాలంటే అటు తిరుగుతుందని అంటారు. కానీ ఆ మాటలో నిజం లేదనిపించింది అందరికీ.

నరంలేనిదైనా మనసును విరగ్గొట్టి ముక్కలు చేయగల శక్తిదానికి తప్ప మరోదానికి లేదు. కాబట్టే మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడమంటారు. లేకపోతే ఒకసారి ముక్కలైన హృదయం మళ్ళీ అతుక్కోదు. అద్దం బద్దలైతే మళ్ళీ ఎలా అతికించలేమో అలాగన్నమాట.

"వద్దు సుదర్శనరావుగారూ! ఒకసారి ఇచ్చిన డబ్బు తీసుకునే అలవాటు మాకెవరికీ లేదు. ఆ డబ్బును సాగర్‌ను అవమానించి ఘనకార్యం చేసినట్టుగా సంతోషపడుతున్న వారికి ఉదారంగా ఇచ్చేశామనుకోండి. మళ్ళీ ఇటువంటి పొరపాటు మరెవరికీ చేయకుండా మీ అమ్మాయిని ఉచ్చం నీచం తెలుసుకుని మసలుకోమని చెప్పండి. మీ ముఖం చూసి ఈ విషయాన్ని పొడిగించలేకపోతున్నాం. లేకపోతే మా సాగర్‌ను అవమానపరిచినందుకు తగిన శాస్తి ఇక్కడే ఇప్పుడే చేసి వుండేవాళ్ళం. పదరా సాగర్!" అని శర్మ అన్నాడు. అతన్ని బలవంతంగా లాక్కుపోయారు.

"ఛీ.ఛీ. ఇంత అవమానం నేనెప్పుడూ ఎరగను. గారాబం చేసినందుకు, కోరినది ఇచ్చినందుకు మీ నాన్నకు మంచి గౌరవం తెచ్చిపెట్టావు తల్లీ. నా జీవితంలో పోయిన ఈ గౌరవాన్ని మళ్ళీ తెచ్చుకోగలనా?"

ఒక్కసారిగా సుదర్శనరావు నెలరోజులు లంఖణాలు చేసిన మనిషిలా మారిపోయాడు. ఆయన ముఖం వాడిపోయింది.

తననే తప్పు పడుతున్న తండ్రిని చూసింది.

"ఇంకా ఇక్కడెందుకండీ. అందరూ మనల్నే చూస్తున్నారు. ముఖాన ఉమ్మేయించుకోకముందే వెళ్ళిపోదాం పదండి" తల్లి సుమిత్ర అన్నది.

ఇప్పుడేం చేయాలో అర్థంకాలేదు రేఖకు. సుదర్శనరావు బ్యాగుతో పాటున్న డబ్బును తీసుకుని మొత్తాన్ని ఒక సూట్‌కేసులో సర్దాడు.

తరువాత సూట్‌కేసును తాళం వేసి ఆ సూట్‌కేసును,, తాళం చెవిని రేఖ పక్కనే ఉన్న బల్లపై పెట్టి ''ఇదిగోనమ్మా! మీ ఆయన్ని, నన్ను అవమానించినందుకు కిరాయి. మొత్తం డెబ్బై లక్షలు. ఏం చేసుకుంటావో నీ ఇష్టం.''

''తీసుకో రేఖా! తీసుకో. ఇంత డబ్బు నీ జీవితంలో చూసి ఉండవు. నువ్వెంత కోటీశ్వరురాలివైనా ఒక్కసారిగా ఇంత డబ్బు చూసే అవకాశం లభించి ఉండదు. తీసుకో. చాలకపోతే మళ్ళీ సాగర్ ఫ్రెండ్స్‌కు ఫోన్ చేద్దాం. మనం అడిగినంత ఇస్తారు'' లలిత తీవ్రస్వరంతో అన్నది.

అప్పటికి కొంచెం తేరుకుంది రేఖ.

అందరూ నన్నే తప్పుపడతారేమిటి? తండ్రివైపు తిరిగి ''మీ అల్లుడు ఉన్నతుడు, ఉత్తముడు అనుకుంటున్నారేమో? ఏమీ కాదు ఆడపిల్లల జీవితాలతో ఆడుకునే రకం. నన్నూ ఇలాగే అవమానించాడు. అతన్ని అవమానించాలనే పెళ్ళి చేసుకున్నాను. అతన్ని వేధించాలనే కావాలని కోరి మరీ దగ్గరయ్యాను. మీరెన్ని అన్నా అతనో సైకో! ఆడపిల్లల జీవితాలతో ఆడుకునే దుర్మార్గుడు. ఎంత దుర్మార్గుడైనా ఒక ఆడపిల్లను, ఆమె మానమర్యాదలతో ఆడుకునేందుకు సాహసం చేయడు. కానీ మీరు గొప్పగా చెప్పుకునే మీ అల్లుడు నాపట్ల అలాగే ప్రవర్తించాడు. మీకతను మంచివాడు, బుద్ధిమంతుడు అయితే కావచ్చు. నా దృష్టిలో మాత్రం క్షమించరాని తప్పు చేసిన దుష్టుడు. అందుకు గుణపాఠం చెప్పాలనే ఇంతా చేశాను'' ఆపై మాటలు రావటంలేదు. వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

సుదర్శనరావు దంపతులకు ఆమె మాటలు మొదట్లో అర్థం కాలేదు. ఆ తరువాత సాగర్ అంత దుర్మార్గుడైనా ఒక ఆడపిల్లను, ఆమె మానమర్యాదలతో ఆడుకునేందుకు సాహసం చేయడు. కానీ మీరు గొప్పగా చెప్పుకునే మీ అల్లుడు నాపట్ల అలాగే ప్రవర్తించాడు. మీకతను మంచివాడు, బుద్ధిమంతుడు అయితే కావచ్చు. నా దృష్టిలో మాత్రం క్షమించరాని తప్పు చేసిన దుష్టుడు. అందుకు గుణపాఠం చెప్పాలనే ఇంతా చేశాను'' ఆపై మాటలు రావటంలేదు. వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టింది.

సుదర్శనరావు దంపతులకు ఆమె మాటలు మొదట్లో అర్థం కాలేదు. ఆ తరువాత సాగర్ అంత దుర్మార్గుడంటే వారికి నమ్మబుద్ధికావటంలేదు. ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది. రేఖ ఆలోచనలో ఎక్కడో ఏదో తప్పున్నది. ఒకవేళ సాగర్ అంత దుర్మార్గుడైనా ఇంత అవమానం అవసరమా? అతన్ని అవమానిస్తే తమను, తమ కుటుంబాన్ని అవమానించినట్టు కాదా?

నాలుగ్గోడల మధ్య పరిష్కరించుకోవలసిన సమస్యను ఇలా నలుగురి మధ్య రగడ చేసుకోవటం వల్ల సాధించేది ఏమున్నది? తమ ప్రారబ్ధం కాకపోతే ఏరికోరి సాగర్‌ను ఎంపిక చేసుకున్న కూతురు ఇలా ప్రవర్తించటమేమిటి? పెళ్ళికి ముందో, తరువాతో అల్లుడిపై ఆమెకున్న అభిప్రాయాన్ని తమకు చెబితే చక్కదిద్దేవారు. ఇప్పుడు ఆవేశంతో దారులు మూతపడేలా చేసింది ఇంక చేసేదేమీ లేక అవమానభారంతో తలవంచుకుని బయటకు నడిచారు రేఖతోపాటు ఆ తల్లిదండ్రులు.

## 12

ఆ తరువాత హైదరాబాద్‌లోనే సాగర్ ఎవరికీ కనబడలేదు. ఎక్కడికి వెళ్ళాడో, ఏం చేస్తున్నాడో ఎవరికీ తెలియదు. శర్మలాంటి వాళ్ళకు మాత్రం అప్పుడప్పుడు ఫోన్ చేసి క్షేమసమాచారాలు తెలుసుకుంటూ తన క్షేమసమాచారాలు చెబుతూ ఉంటాడు. అంతకు

మించి ఒక్క ముక్క ఎక్కువ మాట్లడడు. అడిగితే ఫోన్ పెట్టేస్తాడు. మొబైల్ నుండి ఫోన్ చేయడు. ల్యాండ్ లైన్ నుండే చేస్తాడు. అదీ పబ్లిక్‌కాల్ ఆఫీసు నుంచి.

రేఖ జీవితంలో కూడా ఎంతో మార్పు వచ్చింది.

సాగర్ ఆలోచనలతో సతమతమయ్యేది. తాను తప్పు చేసిందా? నిజంగా సాగర్ అమాయకుడా? తనకు స్పృహలేని సమయంలో బట్టలు మార్చటం తప్పుకాదా! అది తలుచుకుంటేనే ఇప్పటికీ సిగ్గుతో చచ్చిపోవాలనిపిస్తుంది. ఈ అవమానాన్ని ఎవరితో చెప్పుకోగలదు. తల్లిదండ్రులకు చెప్పుకుని తనమీద వాళ్ళకున్న అపోహను పోగొట్టుకుందామా అని ఒక్కోసారి ఆలోచిస్తుంది.

ఛీ...ఛీ ఇంత సిగ్గుమాలిన పనిచేసిన తరువాత కూడా తనతో సాదాసీదాగా ఏమీ తెలియని అమాయకుడిలా వ్యవహరించిన సాగర్ అందరి దృష్టిలో ఉత్తముడు.

అవమానం పాలై మరో వ్యక్తిని పెళ్ళాడలేక, విధిలేని స్థితిలో అతన్నే పెళ్ళాడిన తానేమో దుర్మార్గురాలైంది. ఆరోజు నుంచి సాగర్ కనబడటంలేదట. ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయాడట. అవును. ఎంతైనా మగవాడు కదా! ఎక్కడికి వెళ్ళినా, ఎన్ని తప్పులు చేసినా చెల్లుబాటు అవుతుంది.

పదిమంది ముందు జరిగిన అవమానాల్ని తట్టుకోలేక ఎటో వెళ్ళిపోయాడంటోంది లోకం అతనిమీద సానుభూతితో. మరి తన సంగతి ఎవరికి ఏమని చెప్పుకోగలదు?

దుస్తులు మార్చే నెపంతో తన శరీరాన్ని తాకి ఛీ..ఛీ.. ఆలోచించటానికే అసహ్యంగా ఉంది. అవమానకరంగా ఉంది.

ఆఫీసుకు వెళితే అక్కడా అంతే! తననో పొగరుబోతుగా, కట్టుకున్న మొగుణ్ణి 24 గంటల్లోనే అవమానాలు పాల్జేసిన దుర్మార్గురాలిగా చెవులు కొరుక్కునే వారెక్కువయ్యారు. అందుకే ఆఫీసుకు వెళ్ళటం కూడా మానుకుంది.

"నాన్నా! నేను ఆఫీసుకు రాలేను. దయచేసి నా పోస్టులో మరొకరిని నియమించండి" అని చెబుతున్న కూతుర్ని జాలిగా చూస్తుండిపోయాడు సుదర్శనరావు.

ఇంట్లో నుండి కదలకుండా ఏవో ఆలోచనలతో కాలం గడుపుతున్న కూతుర్ని చూస్తూ దుఃఖించటం మినహా మరేమీ చేయలేకపోతోంది సుమిత్ర.

ఇలావుండగా ఒకరోజు సుదర్శనరావుకు నారాయణరావు నుంచి ఫోన్ వచ్చింది. నారాయణరావు పిలుపు మేరకు సాగర్ ఇండస్ట్రీస్‌కు వెళ్ళాడు సుదర్శనరావు.

సుదర్శనరావును సాదరంగా ఆహ్వానించిన నారాయణరావు ఒక ప్రపోజల్ పెట్టాడు.

"మీ ఇంట్లో అందరిలోనూ ప్రస్తుతం చెలరేగుతున్న మానసిక సంఘర్షణ గురించి నాకూ తెలిసింది. అమ్మాయి ఇక్కడే ఉంటే కోలుకోవటం కష్టం. ఎవరూ తెలియని చోట అయితే ఆమె గురించి ఆలోచించే అవసరం ఎవరికీ ఉండదు కాబట్టి త్వరలోనే కోలుకునే అవకాశం ఉంటుంది. నా మాట విని అమ్మాయిని వేరే ప్రదేశంలో ఉంచండి. మీరేమీ అనుకోకపోతే నాదొక సలహా."

ఆయన మాటల్ని వింటున్న సుదర్శనరావు ఏమిటో చెప్పమన్నట్టు చూశాడు.

"అమ్మాయి ఎదురుగా ఉంటే మీరూ కోలుకోలేరు. అందువల్ల మా బెంగుళూరు బ్రాంచిలో అమ్మాయికి మంచి ఉద్యోగం ఏర్పాటు చేస్తాను. కొన్నాళ్ళు ఈ ఊరికి, ఈ ప్రాంతానికి దూరంగా ఉండి వస్తుంది. ఎన్నాళ్ళు ఉద్యోగం చేయాలని ఉంటే అన్నాళ్ళు చేయమనండి. ఏదో చిన్నాచితకా ఆఫర్ కాదు. మంచి ఆఫరే ఇస్తా. రేఖ నా కూతురు వంటిది. ఆమె ఎంత త్వరగా కోలుకుంటే

సంతోషించే వాళ్ళలో నేను మొదట ఉంటాను. ఇలా ప్రపోజల్ చెప్పినందుకు మరోలా భావించవద్దు. మీ కుటుంబ విషయాల్లో కల్పించుకుంటున్నానని అనుకోవద్దు. చెప్పానుగా! పిల్లలు తప్పుచేయకపోతే మనం చేస్తామా?

అలాగని పిల్లల్ని అలా వదిలేస్తే ఎలా? మనకు తోచిన సాయం చేసి వాళ్ళ మనసు కుదుటపడేటట్లు చేయాలి కదా! తొందరేం లేదు. బాగా ఆలోచించండి. మీరొక్కరే కాదు. అమ్మాయితో కూడా ఆలోచించండి."

ఇంటికి వచ్చిన తరువాత నారాయణరావు చెప్పిన విషయాన్ని కూతురు, భార్యకు వివరించాడు సుదర్శనరావు. నారాయణరావు మంచి మనసుకు వారంతా మనసులోని కృతజ్ఞతలు చెప్పుకున్నారు. కానీ అమ్మాయిని ఒక్కదాన్నే బెంగుళూరు పంపాలంటేనే సుమిత్రకు మింగుడుపడలేదు.

ఈ పరిస్థితుల్లో ఆమె ఒంటరిగా ఉంచటం కంటే తమ కళ్ళెదుటే ఉంచుకుంటే మనోవ్యథ నుండి బయటపడగలదని ఆమె భావించింది. అదే ఆలోచనను భర్తకు చెప్పింది.

రేఖకు కూడా తల్లి ఆలోచన నచ్చింది. ఏ ఊరైతేనేమి తనకు ప్రస్తుతం వ్యాపకం కావాలి. ఇక్కడే ఆ ఇచ్చే ఉద్యోగమేదో ఇస్తే పరిచయమున్న పరిసరాలు, సేద దీర్చే మనుషులు ఉన్నారని భావించింది. బెంగుళూరు కాకుండా అవకాశం ఉంటే హైదరాబాద్‌లోనే పోస్టింగ్ ఇవ్వవలసినది తండ్రిని కోరమని చెప్పింది. సుదర్శనరావుకీ ఇది నచ్చింది.

ఆ సాయంత్రం లలితకు ఫోన్ చేసింది. ఇప్పుడిప్పుడే రేఖ మీద కోపం తగ్గుతోంది లలితకు. రేఖ ఫోన్ అందుకుని వచ్చిన లలిత అక్కడి పరిస్థితికి కళ్ళవెంబడి నీళ్ళు ఆగలేదు. గతంలో రేఖకు, ప్రస్తుత రేఖకు అసలు పోలికే లేదు.

కళ్ళు లోతుకుపోయి, ముఖం పీక్కుపోయి జడవేసుకుని ఎన్ని రోజులైందో అన్నట్టున్న రేఖను చూసి బావురుమంది లలిత. రేఖ మనస్థితి కూడా అలాగే ఉంది.

"ఇదేమిటే ఇలా అయ్యావు? ఎలా ఉండేదానివి ఎలా అయ్యావు? అసలు నువ్వు రేఖవేనా?"

బావురుమన్న లలితను చూసి కన్నీరు ఆగలేదు రేఖకు.

"ఇదంతా స్వయంకృతమే. చేసిన పాపం ఊరికే పోదంటారు. నేను చేసిన పాపం వల్ల పాపం సాగర్ ఎటువెళ్ళిపోయాడో మరి ఆ తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని, వ్యధను మిగిల్చాను. నేనూ, అమ్మానాన్నా అందరికీ దుఃఖపడుతూనో, నిస్తేజంగానో కనబడుతున్నాంగానీ, సాగర్ తల్లిదండ్రులు ఎంత బాధపడుతున్నారో మనకు తెలియదు, వాళ్ళెంత క్షోభననుభవిస్తున్నారో ఊహించలేము, అసలు సాగర్ ఎక్కడికెళ్ళాడో, ఏమైపోయాడో ఎవరూ తెలియదంటున్నారు. ఇన్ని పాపాలకు కారణం నేనేకదూ! మరాపాపం ఎక్కడికి పోతుంది? ఇంతమందిని క్షోభపెట్టినందుకు తగిన శిక్ష అనుభవిస్తున్నాను. మీరంతా నన్ను ఒక దుర్మార్గురాలిగా, అహంభావిగా భావిస్తున్నారేగానీ, అసలు నా ఈ స్థితికి కారణమేమిటో ఎవరూ తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. ఎందుకు నేనిలా రాక్షసిలా మారానో తెలుసుకోవాలనే ఆలోచన ఎవరికీ రాలేదు. కానీ నేనూహించింది ఒకటి, జరిగింది మరొకటి"

రేఖను చూస్తుంటే ఎప్పటికి కోలుకుంటుందోనని కుమిలిపోయింది లలిత.

"అసలెందుకే నువ్వలా సాగర్‌ను అవమానించావ్, కావాలనే పెళ్ళిచేసుకున్నావ్ కదా!" ఏడుపు ఆపుకుంటూ అడిగింది లలిత.

"ఎవరితో చెప్పుకోలేని కారణమే అది. ఎలా చెప్పుకోగలను? ఏమని చెప్పుకోగలను?"

"ఫర్వాలేదే నాకు చెప్పు. పరిష్కారం ఆలోచిద్దాం" అనునయించింది లలిత.

లలిత అనునయంతో ఆమెలో దుఃఖం మరింత పెరిగింది. అలా ఏడిస్తేనే ఆమెలో ఘనీభవించిన వేదనంతా బయటకు వస్తేనే ఉపశమనం ఉంటుందని మౌనం వహించింది లలిత.

ఎంత చలాకీగా ఉండేది. చూసిన వారందరికీ రోల్ మోడల్‌లా ఉండేది. ఎప్పుడూ గలగలమని మాట్లాడుతూ ఉండేది. ఏ క్షణంలో సాగర్‌తో పరిచయమైందోగానీ ఆమె జీవితాన్నే మార్చేసి అంధకార బంధురంగా తయారుచేసింది.

నిజంగా సాగర్ అంత క్షమించరాని నేరం చేసి ఉంటాడా? బయటకు కూడా వెల్లడించలేనంత తప్పు రేఖ పట్ల చేశాడా? ఇది అతిగా ఊహించుకుంటోందా? లలిత ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి రేఖ వైపు చూసింది.

రేఖ కొద్దిగా తేరుకున్నది.

"అసలు కారణం చెబుతాను. తలుపేసిరా! ఇది అమ్మతో కూడా చెప్పుకోలేను. నీతోనే పంచుకోవాలనుకుంటున్నాను" లలిత తలూపేసి వచ్చింది.

ఆ తరువాత రేఖ చెబుతున్న ఒక్కొక్కమాట ఒక్కొక్క శరాఘాతంలా తగిలింది లలితకు.

"అంటే. ఆస్పత్రిలో ఎవరూ లేని సమయంలో నీ ఒంటిమీద బట్టల్ని" ఆపై లలిత మాట్లాడలేకపోయింది.

"ఛీ...ఛీ.. తలుచుకుంటేనే నా ఒంటిమీద ఇప్పటికీ తేళ్ళూ జెర్రులూ పాకినట్టుగా ఉంది. అందుకే పంతం బట్టి అతను మరో ఆడపిల్ల పట్ల జీవితంలో మళ్ళీ అలా ప్రవర్తించకుండా గుణపాఠం చెప్పాలనే కోరిక నాలో బలీయంగా నాటుకుపోయింది. దాని ఫలితమే ఈ పెళ్ళి, అతన్ని అవమానం చేయటం. ఇంతటితో ఆగాలని నేను అనుకోలేదు. అతణ్ణి రోజుకో రకంగా అవమానం చేయాలనే నా ఆశయం" రేఖ చెప్పింది విన్న తరువాత లలిత నోటమాటరాలేదు.

"నువ్వు చెప్పింది నిజమైతే సాగర్‌ను అనుమానించటంలో తప్పులేదు. కానీ అతను అలా చేసి వుంటాడా? ఎవరో ఏదో చెప్పారని అదంతా పూర్తిగా నిజమేనని ఎలా నమ్ముతాం? అతను అంత దుర్మార్గుడంటే నమ్మబుద్ధి పుట్టటంలేదు"

"అదేనే అతనిలో ఉన్న స్పెషాలిటీ" అన్నది రేఖ.

కొద్దిసేపటి తరువాత "అన్నట్టు మరిచిపోయాను. ఆ రోజు అతని స్నేహితులిచ్చిన అరవై లక్షల రూపాయలు మనదగ్గరే ఉన్నాయి. కనీసం శర్మ కూడా కనిపించటంలేదట ఆ డబ్బు ఇచ్చేద్దామంటే. అలాగే బ్యాంకులో వేసి ఉంచారు డాడి"

"ఆఁ అన్నట్టు నిన్ను పిలిచింది వేరే విషయంలో నీ సలహా తీసుకోవటానికి. సాగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ నారాయణరావుగారు డాడీతో మాట్లాడారట. ఆయనంత ఆయనే డాడీని పిలిచి అమ్మాయి కోలుకోవాలంటే స్థలమార్పు అవసరం. అందుకని బెంగుళూరు పంపితే వాళ్ళ కంపెనీలో ఏదో ఉద్యోగం వేయిస్తారట. దీనిపై నీ సలహా ఏమిటి?"

"ఆయన చెప్పిందీ నిజమేగానీ. పని లేకపోవటమే మనిషికి అసలైన జబ్బు. అందులోనూ ప్రస్తుతం నువ్వున్న పరిస్థితుల్లో నీలాంటి వాళ్ళకు మరింత అవసరం. మనిషిని పని ఇతర వ్యాపకాలకు దూరం చేస్తుంది. మనసు అనాలోచన కార్యక్రమాలకు దూరం చేస్తుంది. పని ఒక ప్రవాహ ఝరి. అందులో కొట్టుకుపోయేందుకు, మునిగిపోయేందుకు ప్రయత్నించాలిగానీ జరిగిన ఘాతుకాలను, అన్యాయాన్ని తలచుకుని కూర్చుంటే ఊరట లభించకపోగా మరింత నిర్వేదం ఆవహిస్తుంది. అటువంటి నిర్వేదం జీవనంపై తీవ్రప్రభావానికి కారణమవుతుంది. ఒకసారి ఆ నిర్వేదం నిన్ను ఆవహించిందా తట్టుకోవటం చాలా కష్టం. బ్రతుకు దుర్భరంగా మారుతుంది. నిన్నటివరకు పనిరాక్షసివైన నీకు ఇప్పుడు పని ఒత్తిడి చాలా అవసరం" లలిత మాటల్ని వింటోంది రేఖ.

**"అదికూడా** నీకు ఊపిరాడనివ్వనంత పనికావాలి. అలా పనిలో మునిగితేనే నీలో పేరుకుపోతున్న భయాందోళనలకు దూరం కాగలవు. దిగులు, చింత, భయం వంటి వాటన్నింటికీ పని ఒక్కటే మందు. మనసును ఆవరించిన నిస్సత్తువ, నీరసం నుంచి నువ్వు

బయటపడవలసిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే నీలో చైతన్యం పెరిగి మళ్ళీ సరైన మార్గంలోకి రాగలవు. అందుకు నారాయణరావుగారు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకో. అయితే నువ్వొక్కదానివే బెంగుళూరులో ఉండగలవా అన్నది నా అనుమానం. ఆ ఇచ్చేదేదో ఇక్కడే ఇస్తే మాలాంటివాళ్ళ సాహచర్యంలో నువ్వు మళ్ళీ పూర్వపు రేఖవు కాగలవు. ఉత్సాహం ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది"

"డాడీకి సరిగ్గా ఇదే చెప్పాను. మా ఆఫీసుకు వెళ్ళలేను. అక్కడ సానుభూతి, తిరస్కారాలను భరించలేను. కాకపోతే ఏ వ్యాపకం లేకపోతే పిచ్చెక్కినట్టు ఉంటోంది. అందుకే నారాయణరావుగారి ప్రపోజల్‌ను అంగీకరించాలనుకుంటున్నాను"

"మంచి నిర్ణయం. మరి ఆయన బెంగుళూరు అంటున్నారుగా!"

"డాడీ ఇవాళ వెళ్ళి ఆ విషయంపైనే అడుగుతానంటున్నారు. ఏదో ఒక చిన్న పోస్టు ఇచ్చినా నాకు వ్యాపకంగా ఉంటుంది"

"అన్నట్టు నాకు తెలిసినాయన ఉన్నారు కదా ఆ కంపెనీలో. ఆయన్ని కూడా కదిలిస్తాను ఉండు. గంటలో నీకే విషయం చెబుతాను"

లలిత మాటలకు ఆమె ముఖంలో ఆనందోత్సాహాలు కనబడ్డాయి. లలిత సెలవు తీసుకుని వెళ్ళిపోగానే మళ్ళీ ఆమె ముఖంలో నీలినీడలు అలుముకున్నాయి.

అన్నటుగానే లలిత గంటలో ఫోన్ చేసింది. ఆ ఆఫీసులో తనకు తెలిసిన వ్యక్తితో మాట్లాడానని, రెండుమూడు రోజుల్లో చైర్మన్‌గారితో మాట్లాడి ఏ విషయం చెబుతానని, సాధ్యమైనంత వరకు పాజిటిగానే రెస్పాండ్ అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చాడని చెప్పింది. ఈ విషయం తండ్రికి చెప్పింది.

ఈ రెండురోజులు రెండు యుగాలుగా గడిచాయి రేఖకు. తాను ఉద్యోగంలో చేరుతున్నానన్న ఆలోచనే ఆమెకు నూతన ఉత్సాహాన్నిచ్చింది. రెండు రోజుల తరువాత లలిత వచ్చి అంతా సవ్యంగానే అనుకున్నట్టుగానే జరిగిందని, ఆమెను తీసుకుని ఆఫీసుకు రమ్మన్నారని చెప్పింది. వాళ్ళు చెప్పిన సమయానికి బయలుదేరారు రేఖ, లలిత సుమిత్రకు చెప్పి బయలుదేరారు. బయలుదేరే ముందు తల్లి కాళ్ళకు నమస్కారం చేసి మరీ బయలుదేరింది. ఎప్పుడూ అలాచేయని కూతుర్ని చూసి కళ్ళు తుడుచుకుంది సుమిత్ర.

ఇద్దరూ నెమ్మదిగా కారు దగ్గరకు వచ్చి ఎక్కబోయేంతలో గేటు దగ్గర బెంజ్‌కారు ఆగటం గమనించారు. ఎవరిదా కారు అనుకునేంతలో వాచ్‌మన్‌తో పాటు ఆ కారు డ్రైవర్ వారి దగ్గరకు వచ్చాడు.

"మేడమ్.. సాగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ నుంచి వస్తున్నాను. మీరేనా మా చైర్మన్‌గారిని కలుసుకోవాలనుకుంటున్నది? అయితే మీ కోసమే చైర్మన్‌గారు కారు పంపారు. మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మన్నారు" డ్రైవర్ చెప్పిన మాటలు ఆ యువతులిద్దరికీ విస్మయం కలిగించాయి.

ఒక ఉద్యోగి ఇంటర్వ్యూ కోసం కారును పంపటం ఏ కంపెనీలోనూ ఉండదు. ఇదేదో ప్రత్యేకంగా కనబడుతోంది. బహుశా లలితకు తెలిసినాయన పంపివుంటారు - అనుకుంది రేఖ.

ఇద్దర్నీ ఎక్కించుకుని బయలుదేరింది కారు. రేఖకు నెర్వస్‌గా ఉంది. అది గమనించి రేఖ చేతిని తీసుకుని మామూలుగా ఉండమని చెప్పింది.

"కంగారు వద్దు. నీతోపాటు లోపలి వరకు నేనూ వస్తాను. నాకు తెలిసినాయన నన్నూ లోపలికి రమ్మన్నారు. కాబట్టి నెర్వస్‌నెస్ వద్దు. కూల్‌గా అడిగినదానికి జవాబివ్వు. నువ్వెంతో మందిని ఇంటర్వ్యూ చేసి వుంటావు. ఇంకా నీకెందుకు సంకోచం?"

కారు నెమ్మదిగా సాగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌ను సమీపించింది. మొత్తం అరవై ఎకరాల్లో వ్యాపించి ఉందా కంపెనీ. కంపెనీ ప్రహరీ నుంచి ప్రధాన భవనం వరకు మధ్య దూరం రెండు కిలోమీటర్లుంటుంది.

ఒకే భవనంలో అన్ని గ్రూపుల ఆఫీసులున్నాయి. ఐదంతస్తుల భవనం. ఆ భవనాన్ని ఆశ్చర్యంగా చూస్తోంది రేఖ. కారు మెయిన్ గేటు వద్ద ఆగింది. కారు పార్కింగ్ ఎక్కడ చేయాలో పార్కింగ్ నెంబర్ చెప్పాడు డ్రైవర్‌కి గేట్ వద్ద ఉన్న సెక్యూరిటీ అధికారి. వారిద్దర్నీ గేటు దగ్గరే దింపేసి పార్కింగ్‌కు కారు వెళ్ళిపోయింది.

ఇద్దరూ దిగీదిగగానే అక్కడే వేచివున్న ట్రాలీలోకి మారారు సెక్యూరిటీ సిబ్బంది సూచనల మేరకు. ప్రధాన భవనాన్ని సమీపించింది ట్రాలీ. అక్కడ దిగారిద్దరూ. అక్కడ వారికోసమే వేచివున్న సెక్యూరిటీ అధికారి వారిని దాపునే ఉన్న రిసెప్షనిస్టు దగ్గరకి తీసుకెళ్ళాడు. లోపలికి ప్రవేశించగానే ఏసీ ప్రభావం కనబడింది. సెంట్రలైజ్డ్ ఏసీ..

పొడవాటి కారిడార్‌ను ఆశ్చర్యంగా చూస్తోంది రేఖ. వారిద్దరూ పేరు చెప్పగానే సెకండ్ ఫ్లోర్‌కు లిఫ్ట్‌లో వెళ్ళగానే లిఫ్ట్ దగ్గరే అటెండర్ ఉన్నాడు. ఆ కారిడార్, లైట్ల మధ్య మిలమిలలాడుతున్న ఆ అద్దాలు చూస్తుంటే ఏదో స్వర్గంలోకి వచ్చినట్లనిపించింది రేఖకు.

వారిద్దర్నీ విజిటర్స్ రూమ్ అన్న బోర్డున్న రూమ్‌లోకి వెళ్ళి కూర్చోమన్నాడు బోయ్. వాళ్ళ తలుపు తీసుకుని లోపలికి వెళ్ళగానే దాదాపు ముప్పైమంది వేచివుండటానికి కుర్చీలు వేసివున్నాయి. అదొక రూమ్ అనేకంటే హాలు అనుకోవచ్చు. ఇద్దరూ కూర్చున్నారు. అక్కడకు తీసుకొచ్చిన అటెండర్ శుభ్రంగా కడిగిన రెండుగ్లాసుల్లో మంచినీళ్ళు, రెండు కప్పులతో కాఫీ తెచ్చి అందించాడు.

''ఇదేమిటి? ఉద్యోగం కోసం వచ్చినవాళ్ళు కూడా వీళ్ళు అతిథి మర్యాదలు చేస్తున్నారు'' ఆశ్చర్యపోవటం రేఖ వంతైంది.

తమ ఆఫీసుకు, ఈ ఆఫీసుకు తేడా గమనించి ఆమెకు నోటమాట రావటంలేదు. అలా వాళ్ళు కాఫీతాగి టేబిల్‌పై కప్పులు పెట్టగానే ఇందాకటి అటెండర్ వచ్చి వాటిని తీసుకెళ్ళిపోయాడు.

వాడు వెళ్ళీవెళ్ళగానే మరో అటెండర్ వచ్చి ''సార్ రమ్మంటున్నారు'' అని పిలిచాడు.

ఇద్దరూ అతను చూపిస్తున్న వైపు నడిచారు. అలా కారిడార్‌లో పది పదిహేను గుమ్మాలు దాటిన తరువాత చివరలో ఉన్న హాలు చూపించాడు. గౌరవంగా డోర్ ఓపెన్ చేసి లోపలికి వెళ్ళమన్నట్టు చూశాడు.

లోపలికి ప్రవేశించిన వాళ్ళిద్దరికీ ఎదురుగా రివాల్వింగ్ చైర్‌లో ఒక వ్యక్తి కూర్చుని కంప్యూటర్‌లో ఏదో చూస్తున్నాడు. అతని ముఖం వీళ్ళిద్దరూ సరిగ్గా గమనించలేదు. వీళ్ళను అతనూ చూడలేదు.

నెమ్మదిగా నడుచుకుంటూ అతని టేబుల్‌ను సమీపించారు. అప్పుడు కంప్యూటర్‌లో నుంచి తల బయటకు పెట్టాడు ఆ వ్యక్తి. అతన్ని చూడగానే రేఖ ఉలిక్కిపడింది.

'ఇతను.. ఇతను.. ఇక్కడ..' ఆమెకు కళ్ళు తిరుగుతున్నట్టున్నాయి. ఒక చేత్తో కుర్చీపట్టుకుని నిలబడింది.

ఆమె పరిస్థితి గమనించి చిరునవ్వు నవ్వాడు ఆ యువకుడు.

''కూర్చోండి. రేఖగారూ! డోంట్ బీ నెర్వస్''

కూర్చున్నది. ''మీరు.. మీరు.. ఇక్కడ?''

''ఈ కంపెనీలో నాకు తెలిసిన ముఖ్యమైన వ్యక్తి ఈయనే!'' ముసిముసిగా నవ్వుతూ చెప్పింది లలిత.

''అంటే?''

''నువ్వేం కంగారు పడక్కర్లేదు. ఈయన మన శర్మగారే. సాగర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సి.ఈ.వో. నువ్వనుకుంటున్నట్టు వీళ్ళేమీ అలగా జనంకాదు. ఇకపోతే మీ శ్రీవారు ఎవరనుకుంటున్నావ్ ఈ కంపెనీ ఎం.డి చైర్మన్ నారాయణరావుగారు మీ మామగారు. పోతే మీ

శ్రీవారికి, నాకు ఉన్న బంధుత్వమేమిటంటావా? సాగర్ నాకు పెద్దమ్మ కొడుకు" నిజంగా ఆమెకు మతిపోయింది. నోటమాట రావటంలేదు.

అది గమనించి స్వయంగా శర్మలేచి మంచినీళ్ళగ్లాసు అందించాడు. మారుమాట్లాడకుండా గ్లాసు అందుకుని నీళ్ళు గటగటా తాగేసింది.

ఆమె తేరుకోవటానికి చాలా సమయం పట్టింది. ఇంతలో ఒక అటెండర్ వచ్చి శర్మకు ఏదో కవర్ అందించాడు. దాన్ని అందుకుని లోపలి కాగితాన్ని తీసి చదువుకున్నాడు. మళ్ళీ ఆ కాగితాన్ని మడిచి ఆ కవర్‌లోనే ఉంచి రేఖకు అందించాడు.

అయోమయంగా అందుకున్న రేఖ కవర్‌లో నుండి కాగితం తీసి చూసింది. అది తన అప్పాయింట్ మెంట్ లెటర్. ఆమెకు జీతంతోపాటు కారు, ఇంటి అలవెన్స్ వేర్వేరుగా ప్రొవైడ్ చేస్తున్నట్టు అందులో ఉంది.

"మరీ షాకింగ్ న్యూస్ చెప్పనా? ఈయనే మా బావగారు. నేను వాగ్దత్త అయిన మా మేనత్త కొడుకు. మీ శ్రీవారికి కుడిభుజమే కాదు, స్వయానా బావ అవుతారు" లలిత ఇలా షాకింగ్ మీద షాకింగ్ న్యూస్‌లిస్తుంటే తట్టుకోవటం కష్టంగా ఉంది రేఖకు.

ఆమెకు కళ్ళ వెంబడి జలజలా నీళ్ళు వస్తున్నాయి. అది చూసి "కూల్ డౌన్ రేఖగారూ! కూల్ డౌన్. గతాన్ని మరిచిపోండి. కొత్త జీవితాన్ని ప్రారంభించండి. మీకు అంతా శుభం అరగాలని కోరుకుంటూ మా కంపెనీలోకి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను"

షాక్! కళ్ళు తిరిగి పడిపోతానేమో అనుకుంది. కానీ అలా జరగలేదు. మనిషి అనుకోని పరిణామం ఎదురైనప్పుడు షాక్ తినటం సహజం. అదే ఇప్పుడు రేఖ విషయంలో జరిగింది. మూడు నిమిషాల తరువాత తేరుకున్నది.

అప్పుడు చెప్పింది అసలు సంగతి లలిత. ఏదో పెళ్ళిలో రేఖను చూసి సాగర్ మనసు పారేసుకున్నాడట. ఎలాగైనా పెళ్ళిచేసుకోవాలని అనుకున్నాడట. ఆ విషయం తనకు తెలియచేయటంతో తన భుజం మీదే అంతా వేసుకుందిట. తాను చెప్పిన విధంగానే సాగర్ నడుచుకున్నాడని లలిత చెప్పిన మాటలు ఆశ్చర్యంగా విన్నది రేఖ.

ఆమెను ఇంప్రెస్ చేయటానికే గాంధీనగర్ అపార్టుమెంట్. అంతా ఆమెను ప్రసన్నం చేసుకునేందుకే కానీ ఆమెను మోసం చేయటానికి కాదని చెబుతుంటే రేఖకు మతిపోయినట్టయింది.

"నేను.. నేను నేనొకసారి ఛైర్మన్‌గారి ఆశీస్సులు తీసుకోవాలనుకుంటున్నాను. ఆయన్ని చూడవచ్చా" రేఖ చిన్నగా అడిగింది తడబడుతూ.

"సాధారణంగా ఛైర్మన్‌గారి ఇంటర్వ్యూ కావాలంటే వారం ముందు పర్మిషన్ అవసరం. మీది ప్రత్యేకమైన కేసు కాబట్టి అడిగిన వెంటనే పర్మిషన్ ఇచ్చేందుకు అనుమతి లభించింది. నేను మీకోసం ముందే ఆయన అప్పాయింట్‌మెంట్ తీసుకున్నాను. కాబట్టి నిరభ్యంతరంగా మీరు వెళ్ళవచ్చు" అని టేబుల్ మీద ఉన్న ఇంటర్‌కమ్‌లో ఎవరినో పిలిచాడు శర్మ. లోపలికి వచ్చిన బోయ్‌తో ఆమెను ఛైర్మన్ ఛాంబర్‌కు తీసుకెళ్ళమని చెప్పాడు.

"ఆమె ఎక్కడో ఫెయింట్ అయ్యేలా ఉంది. తోడుగా నువ్వూ వెళ్ళు లలితా!" శర్మ అన్నాడు.

ఇద్దరూ బోయ్ వెనక నడిచారు. నాలుగో అంతస్తుకి తీసుకెళ్ళాడు బోయ్. 'ఛైర్మన్ ఛాంబర్' అని రాసివున్న చోట ఆగి లోపలకు వెళ్ళమన్నట్టు చూశాడు.

రేక కాళ్ళూ చేతులూ వణుకుతున్నాయి. లోపలికి వెళ్ళి ఆయనతో ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? ఇంత దూరం వచ్చి సంకోచపడటమెందుకు? ఏదైతే అదే అవుతుందని తనకు తానుగా ధైర్యం చెప్పుకుని లోపలికి నడిచింది.

వీళ్ళకోసమే ఆయన ఎదురు చూస్తున్నట్టున్నారు. ఆయన ముఖంలో ఎక్కడా ఆందోళన కనబడటంలేదు. చాలా ప్రశాంతంగా ఉంది. రేఖ గబగబా ఆయన టేబుల్ దగ్గరకు నడిచి అటునుండి తిరిగి ఆయన కాళ్ళపై ఒరిగిపోయింది.

''అయ్యో! అదేమిటమ్మా? లే..లే.. స్థిమితపడు'' అనునయంగా ఆయన అన్నాడు.

''మీ అబ్బాయిని అంత అవమానం చేసినా నాకీ ఉద్యోగం పిలిచి ఇచ్చారంటే మీ మనసు ఎంత ఉన్నతమైనదో. తలుచుకుంటేనే నాకే సిగ్గేస్తోంది నా ప్రవర్తన గురించి'' రేఖ డగ్గుత్తికతో అన్నది.

''అమ్మా! తప్పులు చేసేది మనుషులే. అంతమాత్రాన తప్పుల్నే మనసులో పెట్టుకుని మనుషుల్ని దూరం చేసుకుంటూ పోతే ఇక భూమ్మీద అనుబంధాలు, ఆత్మీయతలు ఉండవు. నీ మనసు మాకు తెలుసు. మా గురించి నువ్వు తెలుసుకోవాలనే నిన్ను పిలిచి ఈ సీటు అప్పగిస్తున్నాను. నీ సమర్ధత నిరూపించుకో. ఇవాళ కాకపోయినా రేపయినా మా కోడలిగా నీ ఇంటికి నువ్వు రావలసినదే. దీన్ని ఎవరూ కాదనలేరు. కాబట్టి నీ మనసును చిక్కబట్టుకుని పనిమీద శ్రద్ధపెట్టు. నీ సర్వశక్తులూ ఇక పనిమీదే ఉండాలి. పిలిచి ఇచ్చినందుకు నా పేరు నిలబెట్టాలి''

ఏదో అడగాలని నోరు తెరిచింది రేఖ. కానీ అడగలేకపోయింది. ఆమె అడగాలనుకున్న విషయం నారాయణరావుకు తెలిసినా తెలియనట్లే ఉన్నాడు.

ఆయన కాళ్ళను మరోసారి కళ్ళకు అద్దుకుని లేచింది.

నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెనుతిరిగింది.

''ఇంత ఉన్నత సంస్కారులకు అంత కుసంస్కారి కొడుకుగా ఎలా పుట్టాడో? తాను చేసిన అవమానాన్ని గురించి ఆయన ఒక్కమాట కూడా ప్రస్తావించకపోవటం ఆయన సంస్కారానికి నిదర్శనం''

బయటకు వచ్చిన తరువాత లలితతో అన్నది రేఖ.

ఇద్దరూ కలిసి మళ్ళీ శర్మ కాబిన్‌కు చేరుకున్నారు.

వారిని చూడగానే ''ఛైర్మన్‌గారు ఏమన్నారు?'' ప్రశ్నించాడు.

ఛైర్మన్‌గారి గదిలో జరిగిందంతా చెప్పింది రేఖ.

''వెరీగుడ్ అది ఆయన సంస్కారం. విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్ రేఖా! మీ సమర్ధత రుజువు చేసుకునే మంచి అవకాశం వచ్చింది. రుజువు చేసుకోండి. ఛైర్మన్‌గారి కోడలిగా ఆయన పేరు, ఎండిగా మి శ్రీవారు ఎంత సమర్ధులో అంతకు మించిన సమర్ధులుగా మీరు పేరు తెచ్చుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను''

మధ్యలో సాగర్ పేరు తేవటం ఆమెకు ఎందుకో అయిష్టమనిపించింది. కానీ తానేమి చేయగలదు? రేపటి నుండి వీళ్ళు ఎన్నిసార్లు ఆ పేరును తన ముందు తలుస్తారో? తానెన్నిసార్లు ఇష్టంలేకపోయినా వినాల్సిందే తప్పదు కదా అనుకుంది.

ఛైర్మన్ దగ్గర ప్రస్తావించలేకపోయిన అంశాన్ని శర్మ నుండి తెలుసుకోవాలనిపించినా ఎందుకో తటపటాయించింది.

''ఈ పూటకు నేను వెళ్ళి వస్తాను. రేపు బాధ్యతలు స్వీకరిస్తాను'' శర్మకు చెప్పింది.

శర్మ కూడా తలూపి, ''రేపటి నుంచి షార్ప్ పావు తక్కువ పదిగంటలకు కారు మీ యింటిముందు ఉంటుంది. సిద్ధంగా ఉండండి'' అని చెప్పాడు.

రేఖతోపాటు వెళ్ళేందుకు లేచిన లలితను చూస్తూ ''నువ్వా అప్పుడే వెళ్ళాలా? కాసేపు ఆగితే నేనూ వస్తానుగా'' అన్నాడు.

''ఇది ఆఫీసు స్వామీ! నేను ఎదురుగా ఉంటే మీరిక ఆఫీసు పనిచేసినట్లే. మళ్ళీ కలుస్తాను'' చిలిపిగా రేఖతోపాటు నడిచింది.

బయటకు వచ్చారు. మళ్ళీ ట్రాలీలో వాళ్ళను మెయిన్ గేటు దగ్గర దింపారు. అక్కడ అప్పటికే కారు రెడీగా ఉంది. ఇద్దరూ కారు ఎక్కారు.

కారు ఎక్కిన తరువాత "ఇద్దరూ ఎంత నాటకమాడారే. సాగర్ ఇంత పెద్ద కంపెనీకి యజమాని అనిగానీ, మీ శర్మగారు ఇంత పెద్ద పొజిషన్‌లో ఉన్నారనిగానీ ఏ మాత్రం అనుమానం లేకుండా ఎంత గ్రంధం నడిపారే" నిష్ఠూరంగా అడిగింది రేఖ.

"పాపం సాగర్‌కి ఆర్భాటాలు, హంగు అంటే పడవే. అతను ఎక్కువగా లోప్రొఫైల్‌ను ఇష్టపడతాడు. అది ఆయన తాతగారి శిక్షణ. ఆయన దగ్గరే ఎక్కువకాలం పెరిగాడు" ఆమె కంఠంలో జీర స్పష్టంగా కనబడింది.

సాగర్ పేరు ఎత్తేసరికి ఆమె బాధపడుతోందని గ్రహించింది రేఖ.

'ఇదేమిటి? ఆ పేరు తలచుకుంటే తాను బాధపడాలిగానీ వీళ్ళంతా ఎందుకింత ఉక్కిరిబిక్కిరవుతున్నారు? సాగర్ అదృశ్యమైన తరువాత ఆ ప్రభావం వీళ్ళమీద చాలా ఎక్కువగా పడినట్టుంది. జీవితంలో ప్రధానభాగం వహించే వ్యక్తి మనసు ఇష్టపడినా పడకపోయినా కళ్ళెదురుగా కనబడుతుంటే అదోరకమైన తృప్తి ఉంటుంది. ఇలా కంటికి కనిపించకుండా నిత్యం ప్రతి నిమిషం అటు మరిచిపోనూలేక నరకం అనుభవించటం ఎంత దురదృష్టం. ఈ దురదృష్టాన్ని తాను జీవితాంతం మోయాలన్న విషయం వీళ్ళు గ్రహించటంలేదు. తమ సంసారం సజావుగా సాగినా సాగకపోయినా అతను ఎక్కడో అక్కడ సుఖంగా ఉంటే అదే చాలు. అప్పుడే ఈ నరకం నుంచి తాను ఉపశమనం పొంది బయటపడగలదు'

కారులో ఇద్దరికీ మౌనమే శరణ్యమైంది. కారు ఇంటి దగ్గరకు చేరుకోగానే ఇద్దరూ దిగారు. ఇంట్లోకి రమ్మనమంటే ఇప్పుడు కాదంటూ లలిత తన కారులో వెళ్ళిపోయింది. సాగర్ జ్ఞాపకాలింకా ఆమెను వదల్లేదని అర్థం చేసుకుని వెళ్తుంటే బలవంతం చేయలేకపోయింది రేఖ.

ఆమె కోసమే తల్లి సుమిత్ర, తండ్రి సుదర్శనరావు ఎదురుచూస్తున్నారు. ఆ సమయంలో తండ్రి ఇంట్లో ఉండటటం ఆశ్చర్యమనిపించింది ఇంట్లోకి రాగానే చేతిలో ఉన్న కవర్‌ను తండ్రికి అందించింది. ఆయన లెటర్ చదివి ఆశ్చర్యపోయాడు. ఇంత గొప్ప అవకాశం ఎటువంటి ఇంటర్వ్యూ లేకుండా పిలిచి ఇవ్వటం ఏమిటనుకున్నాడు.

అప్పుడు చెప్పింది అసలు సంగతి రేఖ.

"నారాయణరావుగారు సాగర్ తండ్రి. నాకు అక్కడికి వెళ్ళేవరకు తెలియలేదు. తెలిసి ముందు భయపడ్డాను. కానీ ఆయన ఆ సంగతే ప్రస్తావించలేదు" అంటూ జరిగిందంతా చెప్పింది.

ఆమె చెప్పింది విన్న తరువాత అంత పెద్ద కంపెనీ యజమాని అయివుండి కూడా ఏ మాత్రం భేషిజం లేకుండా ఉండే ఆయన ప్రవర్తనను అభినందించాడు. వెంటనే నారాయణరావుకు ఫోన్ చేశాడు.

"బావగారూ! అమ్మాయి చెప్పేవరకూ మనం వియ్యంకులమని తెలియలేదు. అందుకు మీకు మనస్ఫూర్తిగా క్షమించాలి. మీ సంస్కారానికి జోహార్లు. అమ్మాయి మనసు అసలే నలిగిపోయి వుంది. మీరు మీ అబ్బాయి సంగతి ఎత్తితే మరింత నలిగిపోయేది. అమ్మాయి తరపున మిమ్మల్ని నేను క్షమాపణలు అడుగుతున్నాను. ఇవేవీ మనసులో పెట్టుకోవద్దని మనవి"

"అదేమిటి బావగారూ! రెండు చేతులూ చరిస్తేనే చప్పట్లు అనే సంగతి మీకు తెలియనిది కాదు. ఈ విషయంలో మీ అమ్మాయి తప్పు ఉందని మీరనుకుంటున్నట్లే మా అబ్బాయి తప్పూ ఉండవచ్చని మేము అనుకుంటున్నాము. కాకపోతే వాడు ఎక్కడికో వెళ్ళిపోయాడు కాబట్టి వచ్చేవరకు నిజానిజాలు తెలియవు. అంతవరకు మనకీ మానసిక క్షోభ తప్పదు. ఇందులో ఒకరినొకరు

క్షమించుకునేదేమున్నది? మీ ఎదుట కూర్చుని మీ అమ్మాయి ఎలా బాధపడుతోందో ఎక్కడ వున్నా మావాడు కూడా ఇలాగే ఉంటాడు. ఇద్దరూ ఎదురుపడితేగానీ అసలు సమస్య తీరదు" అన్నాడు నారాయణరావు.

ఆయన సంస్కారానికి చేతులెత్తి నమస్కరించినా సరిపోదని అనుకున్నాడు సుదర్శనరావు.

జీవితం ఎంత విచిత్రమైనది. అతను ఎదురుగా ఉన్నంతసేపూ పేరు తలిచేందుకు కూడా మనసొప్పేది కాదు. ఇకనుంచి నిత్యం అతని నామస్మరణ వినక తప్పదు.

మనం కోరుకున్నట్టు మన జీవితం ఉండదు. ఎవరో ఒకరి చేతుల్లోకి తన గమ్యం పయనిస్తున్నట్టున్నది. అది సాగర్ వైపా లేక తానుకోరుకున్న వైపా అగమ్యంగా తోచింది ఆమెకు.

"నాన్నా! ఆ అరవై లక్షలు మామగారికి అప్పగించేస్తే బాగుంటుందేమో. శర్మ ద్వారా ఎవరి డబ్బు వాళ్ళకు చేరుతుంది" ఆ మాటలతో కూతురు మనసు కుదుటపడుతోందని అర్థమైంది ఆయనకు.

తరువాత తెలిసింది సాగర్ గురించి రేఖకు.

## 13

రిసెప్షన్ సమయంలో జరిగిన అవమానాన్ని తట్టుకోలేక ఎక్కడికో వెళ్ళిపోయాడట. అతని కోసం బెంగపెట్టుకున్న అతని తల్లి ఆస్పత్రి పాలయ్యిందట కూడా. కొడుకు కోసం అలమటిస్తున్న ఆ తల్లి ప్రార్థనను ఏ దేవుడు ఆలకించాడోగాని తాను క్షేమంగా ఉన్నానని, మానసిక ప్రశాంతత చిక్కిన తరువాత తప్పకుండా వస్తానని తల్లికే ఫోన్ చేశాడట. అప్పటినుండి మళ్ళీ ఫోన్ లేదట. కొడుకు ఎప్పటికైనా వస్తాడని నారాయణరావు గుండె దిటువు పరుచుకున్నాడుగానీ ఆ తల్లి కొడుకు మాయమైన తరువాత మంచం పట్టింది. కొడుకునే తలుస్తూ ఎప్పుడొస్తాడా అని కలవరిస్తోంది. ఇదంతా తెలిసిన రేఖ గుండెలవిసిపోయాయి. కేవలం తన ఒక్కదాని పగ ఇన్ని అనర్థాలకు కారణమైంది. ఏం.. పగ సాధించకపోతే తన ప్రాణం పోయేదా?

కావాలని పెళ్ళిచేసుకుని అంత అవమానం చేయకపోతే తనకు వచ్చిన నష్టమేమిటి? అతను చేసిన ఆ ఒక్క తప్పువల్ల తన జీవితమేమీ నష్టపోలేదు. కానీ తాను చేసిన ఒకే ఒక్క తప్పు రెండు కుటుంబాలను, అతని మిత్రుల్ని ఎన్ని బాధలకు గురిచేసింది. అసలా తప్పు అతను చేశాడా? ఎవరు చూశారు? కేవలం ఎవరో చెప్పిన మాటల్ని తాను నమ్మటమేమిటి? అతన్నే నేరుగా అడిగివుంటే నిజం బయటపడివుండేది. ఇదంతా కేవలం తన అవివేక ఫలితమేనా?

ఇందర్ని బాధపెట్టినా ఒక్కరు కూడా తనను పల్లెత్తుమాట అనటంలేదు. కొడుకును దూరం చేసినా మామగారు తననెంతో ఆదరిస్తున్నారు. తొందరపాటు నిర్ణయాలు అనర్థాలకు దారితీస్తాయంటారు. ఇదేనేమో భగవాన్.. నాకోసం కాకపోయినా ఆ వృద్ధ తల్లిదండ్రుల గర్భశోకాన్ని తీర్చేందుకైనా అతన్ని క్షేమంగా తిరిగొచ్చేటట్టు చెయ్యి స్వామీ.

అన్నం తిందామంటే ఆకలి వెయ్యదు. పడుకుందామంటే నిద్రరాదు. పుస్తకం తెరిస్తే మనసు లగ్నం కావటం లేదు. అభిజాత్యమట.. అభిజాత్యం. ఎందుకొచ్చిన అతిశయం? ఎదుటి వ్యక్తుల్ని బాధపెట్టటానికి తప్ప ఎందుకూ పనికిరాని అతిశయమెందుకు?

అహంకారం అనర్థదాయకం. ఇది తెలిసీ లలిత వంటి స్నేహితులు ఎన్నిసార్లు తనను మందలించినా వినిపించుకున్నదా? శనిదేవత నెత్తిమీద నాట్యం చేస్తుంటే హితోక్తులు ఎందుకు మనసుకెక్కుతాయి? చేసిందంతా చేసి ఇప్పుడు చింతించి ప్రయోజనమేమిటి?

మర్నాడు ఆఫీసులో జాయినింగ్ రిపోర్టు ఇవ్వటానికి వెళ్ళినప్పుడు శర్మను కలిసింది. పాత సంగతులేమీ ఎత్తకుండా జాగ్రత్తపడుతున్న శర్మను గమనించి ఎలా సాగర్ విషయం తెలుసుకోవాలో తెలియక సతమతమైంది. కొత్తగా చేరింది కాబట్టి ఆమె చేయాల్సిన పని గురించి శర్మే వివరిస్తున్నాడు. ఏవైనా డౌట్లు ఉంటే అతన్నే అడిగేది.

నెమ్మది నెమ్మదిగా ఆఫీసు పనులకు అలవాటు పడుతోంది. తాను చేయాల్సిన పనిని ఆర్గనైజ్డ్‌గా చేయటం ఆమెకు అలవాటు. అదే పద్ధతి ఇక్కడ కూడా అనుసరించటం వల్ల ఆమెను త్వరలోనే పనిలో పూర్తిపట్టు సాధించింది. ఇక ఆమె వెనుతిరిగి చూడాల్సిన అవసరం రాదని గ్రహించిన శర్మ ఆమె పనుల్ని ఇండిపెండెంట్‌గా చేసేలా సహకరిస్తున్నాడు. మధ్యమధ్యలో లలిత కలుస్తూనే ఉంది.

ఆమె పనితీరుకు నారాయణరావుకూడా ముగ్ధుడవుతున్నాడు. ఆఫీసులో ఆమె పనిచేస్తున్న విభాగంలో దాదాపు రెండువేలమంది ఉద్యోగులున్నారు. వారిలో ఎవరి సీనియారిటీ ఎంత? వారి పి.ఎఫ్ ఎంత? వారి సెలవులు, వారి జీతభత్యాలు అన్నీ క్షణాల్లో చెప్పగలిగేలా ఆమె తగు శ్రద్ధ తీసుకునేది.

నెలాఖరు రోజుకల్లా పేషీట్‌లు రెడీగా చైర్మన్‌గారి టేబుల్ మీద ఉండేవి. అంతకుముందు వాటినన్నింటినీ ఎం.డి చూసుకునేవాడు. సాగర్ అదృశ్యం తరువాత ఆ బాధ్యత చైర్మన్‌పై పడింది. ఆమె చేరకముందు మూడు నాలుగు తేదీల్లోగానీ పేషీట్లు తయారయ్యేవి కావు. ఇప్పుడు నెల చివరిరోజుకి అప్ టు డేట్‌గా చైర్మన్ టేబుల్ పైకి చేరుతున్నాయి. దాంతో ఫస్ట్‌కల్లా జీతాలు అందటం ఉద్యోగులకు సంతోషదాయకమైంది. మిగిలిన సెక్షన్ వాళ్ళు కూడా ఆమె ద్వారానే పేషీట్లు తయారయ్యేలా చూడవలసిందిగా శర్మపై ఒత్తిడి తీసుకురావటం మొదలుపెట్టారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమెపై పనిభారం పెరిగింది.

ఆఫీసులో ఉదయం పదిగంటలనుంచి సాయంత్రం ఐదుగంటలవరకు పనిచేసినా వర్క్ పెండింగ్‌లో ఉండటం గమనించిన ఆమె రాత్రి ఎనిమిదిగంటల వరకు ఆఫీసులోనే ఉండేది. దీనివల్ల ఆమె మనసులోకి ఇతర ఆలోచనలు వచ్చేవి కావు. వచ్చినా పని ఒత్తిడి కారణంగా ఆ ఆలోచనలపై అంత శ్రద్ధపెట్టేదికాదు. వాటినుండి బయటపడేందుకే పని ఎక్కువ కలిపించుకునేది. ఒక్క క్షణం ఖాళీగా ఉంటే ఆలోచనలు ఎక్కడ చుట్టుముడుతాయోనన్న భయం ఆమెను పని రాక్షసిని చేసింది.

ఇదంతా శర్మ ద్వారా నారాయణరావుకు తెలుస్తూనే ఉంది. తామంతా ఐదుగంటలకే వెళ్ళిపోతుంటే ఆమె రాత్రి ఎనిమిది వరకు ఉండటం తెలుసుకుని ఆయన శర్మను మందలిస్తుండేవాడు. మధ్యమధ్యలో లలితను ఆమెకు తోడుగా ఉండమని స్వయంగా ఫోన్ చేసి చెప్పేవాడు. శర్మ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఆమె దృష్టిని మళ్ళించలేకపోయేవాడు.

"అమ్మా మిమ్మల్ని ఛైర్మన్‌గారు పిలుస్తున్నారు" అటెండర్ వచ్చి చెప్పటంతో ఎందుకబ్బా అనుకుంటూ ఛైర్మన్ ఛాంబర్‌కు వెళ్ళేందుకు సీటులోనుండి లేచింది. లిఫ్ట్ ఎక్కి ఛైర్మన్ ఛాంబర్‌ను చేరుకుంది.

ఆమెను చూసి ఆయన ఆప్యాయంగా "రా అమ్మా.. రా" అంటూ ఆహ్వానించాడు.

ఆయన ఎదురుగా ఉన్న కుర్చీ వెనక తలవంచుకుని నిలబడిన ఆమెను చూసి "కూర్చోమ్మా" అని ఆయన చెప్పినా ఆమె నిలబడే ఉంది.

ఆయనే బలవంతంగా కూర్చోబెట్టి "ఏమ్మా? పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నట్టుంది. నీకు అసిస్టెన్స్ కోసం అదనపు స్టాఫ్‌ను రిక్రూట్ చేసుకుందామా? నీ రిక్వైర్‌మెంట్ ఏమిటో చెబితే మిగతావన్నీ శర్మ చూసుకుంటాడు"

"అబ్బే, అక్కర్లేదండీ నాపై ఇప్పుడు అంత ఒత్తిడేం లేదు. అదనపు స్టాఫ్‌తో పనిలేదు" వినయంగా చెప్పింది.

"మరి అంత ఒత్తిడి లేకపోతే రాత్రి ఎనిమిదిగంటలవరకు నువ్వు ఎందుకు పనిచేయాల్సి వస్తోందంటావు? మొహమాటపడకుండా అవసరమైన వారిని నువ్వే రిక్రూట్ చేసుకో. నాకు అదనపు గంటలు చేయించుకోవటం ఇష్టం ఉండదు. అందుకే పిలిపించాను. మిగిలిన విషయాలు శర్మతో మాట్లాడతానులే"

ఆయన నిర్ణయం తీసుకున్న తరువాత ఇక తను మాత్రం ఏమి చేస్తుంది? మెదలకుండా వెళ్ళిపోయేందుకు లేచింది.

"అన్నట్టు మరిచాను. నీ ఇంటికి ఎప్పుడు వస్తావు? మీ అత్తగారు నీకోసం కలవరిస్తోంది. కొడుకు ఎలాగూ దగ్గరలేడు కదా! కోడల్నయినా దగ్గరుంచుకుంటానని తెగ గొడవచేస్తోంది. నీ నిర్ణయం చెబితే అందుకు తగిన ఏర్పాట్లు చేస్తాను"

ఏం చెప్పాలో తెలియలేదు రేఖకు. వాళ్ళ ఆప్యాయతను ఆమె భరించలేకపోతోంది.

"ఆలోచించుకుని చెప్పమ్మా!" ఆయనే మళ్ళీ అన్నాడు.

నెమ్మదిగా తలవంచుకుని బయటకు వచ్చేసింది.

## 14

**ఇంటికొచ్చాక** తల్లికి నారాయణరావు అడిగిన సంగతి చెప్పింది.

ఆమెకు కూడా ఏం చెప్పాలో తెలియరాలేదు.

లలితకు ఫోన్ చేసి విషయం చెప్పి "ఏం చేయమంటావే?" అని అడిగింది.

"దీనికి ఒకరి సలహా అనవసరం. పూర్తిగా నువ్వు నిర్ణయించుకోవలసిన విషయం. మరొకరి ప్రమేయం అక్కర్లేదు. అయినా నా సలహా అడిగావు కాబట్టి మీ మామగారి మాటను అంగీకరించటమే మంచిది. ఆ ఇంటిలో చేరికతో నీమీద వారికేమైనా అపోహ ఉన్నా అది తొలిగిపోతుంది. నీ జీవితానికి ఒక అర్ధం, పరమార్ధం ఏర్పడుతుంది. మీ అత్తగారు అసలే అనారోగ్యంతో ఉన్నారు కదా! ఆమెను దగ్గరుండి చూసుకునే అవకాశం ఉంటుంది. ఆలోచించు. సరైన నిర్ణయం తీసుకో"

లలిత మాటలకు ఆలోచించింది. నిజమే అది కరెక్టుగానే చెప్పింది. కానీ ఒంటరిగా అత్తగారి ఎదుటపడాలంటే ఒకరకమైన బెరుకు ఆమెను ఆవరించింది. పెళ్ళి తరువాత ఆమెను మళ్ళీ చూడలేదు. ఇప్పుడు తగుదునమ్మా అంటూ ఏ ముఖం పెట్టుకుని వాళ్ళింటికి వెళ్తుంది? లలిత ముందు అదే సందేహాన్ని వ్యక్తం చేసింది.

"మీ మామగారే నీకు చెప్పారు. వెళ్ళటానికి సంకోచమెందుకు? నీకు తోడుగా నేనూ వస్తాను కావాలంటే" ఆమెకు ధైర్యం చెప్పింది. అలాగే, ఒకరోజు ఆమె చేత సెలవు పెట్టించి నారాయనరావుగారింటికి రేఖతో తానూ వెళ్ళింది. ముందుగానే నారాయణరావు భార్యకు చెప్పివుంచటంతో రేఖను ఆప్యాయంగా లోపలికి తీసుకెళ్ళింది రాధాదేవి.

అత్తగారిని చూడగానే కాళ్ళకు నమస్కరించింది. "నా తెలివితక్కువ కారణంగానే మీరు అనారోగ్యం పాలయ్యారు. ఇందుకు నా నిష్కృతి లేదు. నన్ను మనస్పూర్తిగా క్షమించండి"

"అదేమిటమ్మా ఇవన్నీ తాత్కాలికం. నువ్వు చేసిన తప్పు తెలుసుకున్నావు. పశ్చాత్తాపపడుతున్నావు. ఇంకా దాన్నే మనసులో ఎందుకు పెట్టుకుంటావు?" అంటూ ఆమె సున్నితంగా మందలించింది.

"కొడుకు ప్రస్తుతం ఇక్కడలేడు. దూరంగా ఎక్కడ ఉన్నాడో తెలియదు. ఉన్న కోడలన్నా మాతో ఉంటే అదో తృప్తి. ఈ వయసులో కొడుకూ కోడలూ కళ్ళెదుట తిరుగాడుతూ ఉంటే చూసే భాగ్యం ఉన్నదో లేదో తెలియదు. కానీ, అందుకోసమే నేను బ్రతికి ఉన్నాననిపిస్తుంది. మనిషి తప్పులు చేయటం సర్వసాధారణం. నేనూ ఎన్నో చేసే ఉంటాను. కాకపోతే వాటిని ఎవరూ గుర్తించి ఉండకపోవచ్చు. అందుకే అవేవీ నన్ను బాధించేంతగా బయటపడలేదు. నువ్వు చేసిన ఒకే ఒక తప్పు నిన్ను రోడ్డుమీదకు లాక్కువచ్చింది. అకారణంగా ఏ వ్యక్తీ ఎవరినీ నొప్పించేందుకు ప్రయత్నించడు. ఏదో బలీయమైన కారణం లేకపోతే నువ్వలా ప్రవర్తించివుండవు. నీ ఆలోచనలో నిజం ఉండొచ్చు. ఉండకపోవచ్చు. ఏదేమైనా జరిగిపోయినదాన్ని మనం మళ్ళీ వెనక్కి తీసుకురాలేం కదా! అందుకని ఇకముందైనా తొందరపాటు లేకుండా జాగ్రత్తగా అడుగు వేయటం మంచిది. గుర్తుపెట్టుకో" కోడలిని ఒక పక్క సమర్ధిస్తూనే మరో పక్క మందలిస్తోంది.

జీవితంలో ఎన్నో ఒడిదుడుకుల్ని కాచివడపోసిన అత్తగారిని చూస్తే రేఖకు ఇంత ఉన్నతమూర్తులు కూడా ఉంటారా అనిపించింది.

కోడళ్ళను ఆరళ్ళుపెట్టే అత్తలే ఉంటారని, అత్తరికం వచ్చిందంటే కోడళ్ళను వేధించటమే అన్న భావన సంఘంలో ప్రబలిపోయిందని ఉన్న ప్రచారంలో ఎంత వాస్తవం దాగుందో అర్ధమైంది. నిజమే. ఆమె చెప్పినట్టు ఇకనుండైనా తొందరపాటుకు అవకాశం లేకుండా వేసే ప్రతి అడుగు ఆచితూచి వేయటం తప్పనిసరి.

ఒకసారి చేసిన తప్పు పునరావృతం కాకుండా చూసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత. గతంలో చేసిన పొరపాట్ల గురించి ఆలోచించకుండా కొత్తగా మళ్ళీ మళ్ళీ తప్పులే చేస్తూ బ్రతుకు బండిని ఈడుస్తుండే వ్యక్తికి భవిష్యత్తు ఆశాజనకంగా ఉండదు. వెనక్కి తిరిగి చూసుకుంటే తప్పులే కనబడతాయి.

ఆరోజు సాయంత్రం సుదర్శనరావు, సుమిత్ర వచ్చారు. వారిద్దర్నీ రాధాదేవి సాదరంగా ఆహ్వానించింది. కూతురు తెచ్చిన మంచినీళ్ళు తాగుతూ ఆమె ఇక్కడ ఇమిడిపోయిందా లేదా అన్న సంశయం, ఆలోచన వాళ్ళను నిలువనివ్వటం లేదు. మాములుగా అందరిలా అత్తవారింటికి కూతురు వస్తే పర్వాలేదు. కానీ, తమ కూతురిది ప్రత్యేకమైన పరిస్థితి అందువల్లే తాము వచ్చి కూతుర్ని అత్తవారింట దింపలేకపోయారు. అందుకే ఆమె గురించి వాళ్ళలో అంత ఆరాటం.

వాళ్ళు కాఫీలు పూర్తిచేయగానే నారాయణరావు వచ్చాడు. వియ్యంకులిద్దరూ ఏవో పిచ్చాపాటీ కబుర్లలో పడ్డారు. వియ్యపురాళ్ళిద్దరూ వంటింట్లో బిజీ అయిపోయారు.

మొదట్లో రేఖ ఎంత చలాకీగా ఉండేదో సుమిత్ర చెబుతుంటే రాధాదేవి వింటోంది. ఒక్క క్షణం కూడా ఊరుకోకుండా ఇంట్లో కూడా ఆఫీసు పని ఎలా చేసేదో, ఎంత సమర్ధవంతురాలిగా ఆఫీసులో చెప్పుకునేవారో చెప్పింది.

"దానికున్నదల్లా అహం జాస్తి. లేనివాళ్ళను చూస్తే అదో రకమైన ఎలర్జీ. తనమాటే చెల్లుబాటు కావాలనే పంతం. ఈ మొండితనమే దాని బ్రతుకును ఇలా చేసింది. ఎంతో తెలివిగా అందరినీ ఆకట్టుకునే పిల్లకు అహంభావంవల్ల ఎన్ని అనర్ధాలు జరుగుతాయో" అని బాధపడింది సుమిత్ర.

"ఒదినా! అది ఇరవై ఏళ్ళు నిండని చిన్నపిల్ల. ఏమైనా తప్పులు చేసినా కడుపులో పెట్టుకుని దాచుకోండి. దానికి తొందరపాటు ఉన్నదేకానీ ఎవరికీ కీడు చేసే ఆలోచనలేదు. ఏదో జరిగిపోయింది. అబ్బాయి వచ్చేసరికి దాన్ని, దాని మనసుని దారిలోకి తీసుకొచ్చే బాధ్యత మనమీదే ఉన్నది. ఆఁ అన్నట్టు అబ్బాయి గురించి ఏమైనా తెలిసిందా?"

సుమిత్ర ప్రశ్నకు రాధాదేవి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏమీ తెలియలేదన్నట్టు తల అడ్డంగా ఊపింది. "ఈ పెళ్ళి అనుకున్నప్పుడు పిల్లాపిల్లాడూ కళ్ళముందే తిరుగుతారు కదా అని సంబరపడ్డాను. మనం ఆశించినవన్నీ జరిగితే ఇక లేనిదేమున్నది? విధి చేతిలో

మనమంతా ఆటబొమ్మలమని చెబుతుంటే ఏమిటో ఈ మెట్టవేదాంతం అనుకునేదాన్ని. అందులోని వాస్తవం ఇప్పుడు అనుభవంలోకి వచ్చింది. ఇంకా ఎన్నాళ్ళో ఈ కడుపుకోత?" రాధాదేవిని ఎలా ఓదార్చాలో అర్థం కాలేదు సుమిత్రకు. మౌనం వహించింది.

"అయ్యో! మిమ్మల్ని కూడా బాధిస్తున్నాను. కూతుర్ని చూసుకోవటానికి వచ్చిన మీముందు ఇలా నా గుండె క్షోభతో బాధించటం సరైనది కాదు. ఇక నా కోడలి గురించా! ఏదో అలా జరిగిపోయిందికానీ పిల్లకేం బంగారం. ఇటువంటి అమ్మాయి నూటికో కోటికో ఒకరుంటారు. ఆమె గురించి మీరు ఆలోచిస్తూ వేదన చెందాల్సిన అవసరంలేదు. ఆమె కోడలు కాదు. నా కూతురు అనుకోండి. మీరు ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు వచ్చి చూసి వెళ్తూండండి" రాధాదేవి మంచిమనసుకు పొంగిపోయింది సుమిత్ర.

తన కూతురు కారణంగా ఈ కుటుంబానికి తీరని అపకారం జరిగినా దాన్ని మనసులో ఉంచుకోకుండా కూతురు పట్ల ఆమె చూపుతున్న అభిమానానికి, వారి మంచితనానికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంది. అంతకన్నా తానేమి చేయగలదు.

వెళ్ళేందుకు సిద్ధమవుతున్న భార్యాభర్తల్ని చూసి "ఉండండి. రాకరాక వచ్చారు. మీ అమ్మాయితో మాట్లాడుతూ ఉండండి. ఎంతసేపూ మనమే మాట్లాడుకున్నాం కానీ మీ కూతురితోనూ కాస్త మాట్లాడండి. గతం తాలూకు స్మృతులను ఆమె మనసు నుంచి చెరిపివేసె ప్రయత్నం చేయండి. మళ్ళీ రేపటినుండి ఆఫీసు ఆఫీసు అంటూ పరుగులు తీస్తుందాయె. కోడలి తెలివితేటలు, పనిపట్ల ఆమెకున్న శ్రద్ధ చూసి మామగారు మురిసిపోతున్నారు. పిల్లకు ఏదో వ్యాపకం ఉండాలి కదా అని ఉద్యోగం ఇస్తే అసలు ఆఫీసు స్వరూపాన్నే మార్చేసిందిట. ఆమె అంటే ఆఫీసు స్టాఫ్ కూడా కలవరిస్తున్నారట. ఆయన ఇంటికి వచ్చి కోడలి గురించి ముచ్చట్లే ముచ్చట్లు. ఈయనకు తోడు ఆ శర్మ."

ఆమె మాటలకు కడుపు నిండిపోయినట్టనిపించింది సుమిత్రకు. రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేసింది. సజల నయనాలతో ఉన్న ఆమెను సముదాయించింది రాధాదేవి.

తల్లీతండ్రి వచ్చిన తరువాత వాళ్ళ ముందుకు వచ్చేందుకు సాహసించలేకపోయింది రేఖ.

అత్తగారు పిలిచి "మీ అమ్మతో కబుర్లు చెబుతూండు. భోజనాలు చేసి వెళ్తారు. వంట విషయం చూసుకుంటాను" అనటంతో అమ్మ దగ్గరకు  వచ్చింది.

కూతుర్ని పక్కన కూర్చోబెట్టుకుని అత్తామామల గురించి అడిగింది. ఎలా చూసుకుంటున్నారు? ఏమైనా ఇబ్బందులున్నాయా? ఇమిడిపోగలిగిందా? వంటి ప్రశ్నలతో ఆమె నుండి జవాబులు రాబట్టింది.

"చూడు రేఖా! ఇంతవరకు నువ్వు చూసిన జీవితం వేరు ఇప్పుడు చూడబోతున్న జీవితం వేరు. ఇది నా ఇల్లు. ఇది నా కుటుంబం అనే భావన పెంచుకో. కష్టాలు కన్నీళ్ళు అంటావా అవన్నీ తాత్కాలికమే. కష్టం తెలిస్తేనే సుఖం విలువ తెలుస్తుంది. కాబట్టి జరిగిపోయిన దాన్నే తలుచుకుంటూ భవిష్యత్తును కూడా చీకట్లోనే గడిపేందుకు ప్రయత్నించకు. నీ అదృష్టం కొద్దీ దేవతలే అత్తామామలుగా లభించారు. ఆవేశాన్ని తగ్గించుకో. ఎదుటి వ్యక్తిని చూసి మనల్ని మనం తగ్గించుకుంటే మన వ్యక్తిత్వానికి వన్నెవస్తుంది. నాకే అంతా తెలుసునని గానీ, నీకేం తెలుసునని, నేను పరిపూర్ణపండితురాల్ని అన్న అహం వద్దు. అహం ఎప్పుడూ అనర్థదాయకమని నీకిప్పటికే తెలిసివుంటుంది. ఇవాళ కాకపోతే రేపు. కాకపోతే ఎల్లుండి నీ భర్త తిరిగి వస్తాడు. నీ జీవితాన్ని ఆనందమయం చేసుకునే బాధ్యత నీమీదే ఉంది. అందుకు నీ అత్తమామల సహకారం పూర్తిగా లభించటం నువ్వు చేసుకున్న పుణ్యం"

తల్లి మాటల్ని మౌనంగా వింటూ ఉండిపోయింది రేఖ. తనలోని కోపాన్ని, అభిమానాన్ని పక్కకు పెట్టి ప్రశాంత చిత్తంతో మెలిగితే మేలని అనుకున్నది. ఆమె మనసులో సంఘర్షణను గుర్తించింది సుమిత్ర. ఇంతకంటే ఎక్కువ చెప్పనవసరంలేదని భావించింది. ఇప్పటికే కూతురు ఎంతో బాధపడుతోంది. దాన్ని తగ్గించే ప్రయత్నంలో తాను మరింత బాధపెడుతున్నానేమోనని అనుకున్నది.

లోపల వియ్యంకులిద్దరూ లోకాభిరామాయణం మాట్లాడుకుంటున్నారు.

రేఖ సంగతి సుదర్శనరావు ప్రస్తావించేసరికి నారాయణరావు ఆమెను ఆకాశానికి ఎత్తేశాడు. అటువంటి చురుకైన అమ్మాయి కోడలుగా లభించటం తనకెంతో ఆనందంగా ఉందని ఎంతో మురిసిపోయాడు. వియ్యంకుడు కూతుర్ని ప్రశంసిస్తుంటే ఇక సుదర్శనరావు సంగతి చెప్పనక్కర్లేదు. ఆయన ఆనందానికి పట్టపగ్గాలు లేకుండాపోయాయి.

వియ్యంకుడు, వియ్యపురాలి బలవంతం మీద ఆ రోజు అక్కడే భోజనం చేసి సెలవు తీసుకున్నారు సుదర్శనరావు దంపతులు.

## 15

తానే కావాలని, ప్రేమించానని, తనవంటివాడు భర్తగా లభించటం పూర్వజన్మ సుకృతమని ఎన్నో చెప్పిన రేఖ ఇలా ఎందుకు ప్రవర్తించింది? ఇందుకు తన ప్రవర్తన ఏమైనా కారణమా? లేక ఏ విషయంలోనైనా అపోహపడిందా? ఎంత అపోహపడినా ఇంతగా అవమానం చెయ్యాలా? కొత్తగా పెళ్ళయినవాడు భార్యతో గడిపే జీవితం కోసం, భావిని ఎలా సంతోషభరితం చేసుకోవాలోనని ఎన్నో ఊహల్లో తేలిపోతాడు. తన విషయంలో అవన్నీ ఒట్టి ఊహలుగానే మిగిలిపోయాయి.

ఊహలకు, నిజానికి ఎంత తేడా ఉంటుందో అనుభవంలోకి వచ్చాకగానీ తెలియరాలేదు. ఊహలు ఊహలే. వాస్తవాలు వాస్తవాలే! రెండిటికీ పొంతన ఉండదు.

ఏది ఏమైనా ఈ అవమాన భారాన్ని దించుకోవటమెలా? దీన్నుండి తాను బయటపడకపోతే వికృతమైన ఆలోచనలు, విపరీత ధోరణులు పెరిగిపోతాయి. అందువల్ల తాను సాధ్యమైనంత త్వరగా ఈ వేదన నుండి బయటకు వచ్చేయాలి. అందుకు మార్గమేమిటి? తానేం చేస్తే దీన్ని మర్చిపోగలడు?

తానేమైనా చిన్నపిల్లవాడా జరిగిన అవమానాన్ని చిటికెలో మర్చిపోవటానికి? చిన్నపిల్లవాడు.. చిన్నపిల్లవాడు.. అతని మనసులో ఏదో తళుక్కుమని ఆలోచన వచ్చింది. అవును తాను ఇలాగే చేయాలి. ఇంతకుమించి తరుణోపాయం లేదు.

ఆ ఆలోచన అతనిలో కొత్త ఉత్సాహాన్ని తెచ్చింది. వెంటనే డ్రస్ చేసుకున్నాడు.

"బామ్మా! బామ్మా! నేను ఊరు వెళ్తున్నాను. బహుశా ఇవాళ రాలేకపోవచ్చు. నాకోసం ఎదురు చూడొద్దు. రేపు భోజనం టైంకి వచ్చేస్తాను" అంటున్న మనవణ్ణి చూసి, "వీడెప్పటికి మనుషుల్లో పడతాడు? కొంపదీసి ఇల్లు విడిచి వెళ్ళడుగా? ఎందుకైనా మంచిది. ఆ ఆంజనేయులుకి ఫోన్ చేయాలి. వెంట ఉంటాడు" అనుకుంది.

"అలాగే వెళ్దువుగానీ, ఒక్కసారి ఆ ఆంజనేయులుకు ఫోన్ చేసి ఇవ్వరా. ఈ మధ్య ఏమిటో ఒకటే కలలోకి వస్తున్నాడు. కాసేపు మాట్లాడితే మనసు కుదుటపడుతుంది" బామ్మ మాటలకు తలూపాడు.

ఫోన్ చేసి బామ్మకు రిసీవర్ అందించాడు. "హల్లో ఎవరూ? ఆంజనేయులేనా?"

గొంతు గుర్తుపట్టిన ఆంజనేయులు "ఆఁ నేనే బామ్మా ఏమిటి సంగతులు?"

"ఏరా నేను ఫోన్ చేస్తేగానీ మాట్లాడవా? అందరూ పెద్దవాళ్ళయిపోతున్నారా. ముసలాళ్ళం ఎక్కడ గుర్తుంటాం?"

బామ్మ మాటలకు పెద్దగా నవ్వాడు ఆంజనేయులు.

"నిన్ననేగా బామ్మా నీ చేతి వంట లొట్టలేసుకుంటూ తిన్నాను. ఇక్కడికొచ్చి అమ్మచేత తిట్లు తిన్నాను"

"ఎందుకురా?"

"ఎందుకేమిటి? అసలే ఓపికలేక అవస్థలు పడుతుంటే నేను వచ్చి నీతో వండించుకుని తిన్నానట. దాంతో అమ్మ బామ్మకు అసలే వంట్లో బాగుండటంలేదు. నువ్వొకడివి. రెండురోజులకోసారి వెళ్ళి ఆమెకు పనికల్పిస్తావంటూ ఒకటే దీవెనలు. నేనెంత చెప్పినా వినిపించుకుంటేనా?"

ఆంజనేయులుతో మాట్లాడుతూనే సాగర్ కోసం చూసింది సాగర్ బయటకు వెళ్లిపోయాడు. కారు స్టార్ట్ అయిన శబ్దం కూడా వినిపించింది.

"ఒరేయ్ నీతో ముచ్చట్లకు నేనేమీ ఫోన్ చేయటంలేదు" అంటూ విషయం చెప్పి "వాడు ఎక్కడికి వెళ్తున్నాడో ఏమిటో అసలే నిరాశలో ఉన్నాడు. నిరాశ మనిషిని ముందుకు కదలనివ్వదు. అందుకని నువ్వా వాడితో వెళ్ళి కాస్త కనిపెట్టుకుని ఉండు. జాగ్రత్త నేను చెప్పినట్లు కాకుండా మసలుకో. ఇప్పుడే బయలుదేరాడు" ఫోన్ పెట్టేసింది.

ఇప్పుడు ఆమెకు నిశ్చింతగా ఉంది. తోడు ఆంజనేయులు ఉంటాడు కాబట్టి తానేమీ భయపడనక్కర్లేదు.

గంగవరం బస్టాండు దగ్గర నిలబడి ఉన్న ఆంజనేయుల్ని చూసి కారు ఆపాడు సాగర్. అప్పుడే సాగర్‌ను గమనించినట్టు "అరే.. అన్నాయ్! నువ్వా సమయానికి కనబడ్డావు. ఎటు హైదరాబాద్‌కేనా! నేనూ అర్జంటుగా బయలుదేరాను. నా జీపు మారాం చేస్తోంది. బస్సుకోసం ఎదురుచూస్తున్నాను. నువ్వు వచ్చావు" నవ్వుతూ కారు డోర్ తీశాడు.

రెండున్నర గంటల్లో హైదరాబాద్ చేరుకున్నారు. "ఎక్కడికెళ్ళాలి?" అడిగాడు ఆంజనేయుల్ని. ఆంజనేయులు "నాకేం పనిలేదు ఊరికే. హైదరాబాద్ వచ్చి చాలా రోజులైంది కదా అని బయలుదేరాను. ఎలాగూ నీతో వచ్చాను కదా! నీ పని అయిన తరువాత ఇద్దరం కలిసే వెళ్దాం." అంటున్న ఆంజనేయుల్ని అర్థమైనట్లు చూశాడు.

"బామ్మ ఫోన్‌లో ఏం చెప్పిందేమిటి?" ప్రశ్నించాడు. ఇక దాచి లాభంలేదనుకుని మొత్తం చెప్పేశాడు.

బామ్మ ఆప్యాయతకు సాగర్‌కు నవ్వువచ్చింది. ఇంతమంది తనను కనిపెట్టుకుని ఉంటున్నారు కాబట్టే తానిలా తిరగ్గలుగుతున్నాడు.

హైదరాబాద్ చేరుకోగానే శర్మకు ఫోన్ చేసి ఎక్కడకు రావాలో చెప్పాడు. అప్పుడు ఏదో అర్జంట్ మీటింగ్‌లో ఉన్న శర్మ హడావుడిగా ఛైర్మన్ చాంబర్‌వైపు నడిచాడు. అక్కడ రేఖ ఏదో నారాయణరావుతో మాట్లాడుతోంది. ఆమెను గమనించకుండానే "నేనొక అర్జంటు మనిమీద బయటకు వెళ్తున్నాను. మీటింగ్ మధ్యలో ఆపేయాల్సి వచ్చింది. రేపు మళ్ళీ కండక్ట్ చేస్తాను మామయ్యా!" అని చెప్పాడు.

అతన్ని, అతని హడావుడిని చూసి "ఎందుకురా అంత హడావుడి పడుతున్నావ్ ఎనీ థింగ్ సీరియస్?"

"వాడు ఫోన్ చేశాడు. నేను వెళ్తున్నాను" అని చెప్పి రేఖ అక్కడే ఉండటం చూసి నాలిక్కరుచుకున్నాడు.

ఫోన్ చేశాడా? ఎవరు? సాగర్ ఫోన్ చేశాడా? లేక ఇంకెవరైనా ఫోన్ చేశారా? రేఖకు అయోమయంగా ఉంది. నెమ్మదిగా లేచిచ్ బయటకు నడిచింది.

ఆమె వెళ్ళిపోయిందని రూఢీ చేసుకుని, "ఇప్పుడే సిటీకి వచ్చాడట. నన్ను రమ్మని ఫోన్ చేశాడు. వెళ్ళొస్తాను" అంటున్న శర్మను చూసి, "ఒకసారి వాణ్ణి ఇంటికి రమ్మని చెప్పు. వాళ్ళ అమ్మ కలవరిస్తోంది. ఆమె బెంగకూడా తీరుతుంది కొడుకును, కోడల్ని ఒకచోట చూసుకుని. వాణ్ణి ఉండమని మేమెవరం బలవంతం చేయమని కూడా చెప్పు. వీలైతే వాడు కలవగానే నాకో ఫోన్ చెయ్యి" నారాయణరావు మాటలకు తలూపాడు శర్మ.

బయట నిలబడి ఓరగా తెరిచిన డోర్‌లో నుంచి వారిద్దరి మధ్యా జరిగిన సంభాషణను రేఖ విన్నదని ఆ ఇద్దరికీ తెలియదు.

అంటే సాగర్ వచ్చాడన్నమాట. అతను ఇంటికి వస్తే. అమ్మో తన ముఖం అతనికి ఎలా చూపగలుగుతుంది? ఆమె గుండెలు దడదడలాడుతున్నాయి. భగవంతుడా! నన్ను చూడగానే అతను ఎంత సీరియస్ అవుతాడో? తనెంత అసహ్యించుకుంటాడో? ఎలా ఈ పరిస్థితినుండి బయటపడటం? పోనీ ఇవాళ అమ్మానాన్న దగ్గరకు వెళ్ళిపోతే? ఉహూఁ ముఖం చూపించలేక తప్పించుకు తిరుగుతున్నానని అనుకుంటే? ఇంతకంటే ఎదురయ్యే పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కోవటమే మంచిది. ఏదైతే అదే అవుతుంది. రోట్లో తలపెట్టిన తరువాత రోకటి పోటుకు వెరవటమెందుకు? ఇలా రకరకాల ఆలోచనలతో నెమ్మదిగా తన కాబిన్ వైపు నడిచింది.

శర్మ హడావుడిగా వెళ్లిపోవటం గమనించింది. దీర్ఘంగా నిట్టూర్చింది.

మరో పావుగంటలో శర్మను సాగర్ కలుసుకున్నాడు. ఎన్ని నెలలైంది. ఆ ఇద్దరూ కలుసుకుని. ఇప్పటివరకూ ఇన్ని నెలలపాటు ఇద్దరూ ఒకరి ముఖం మరొకరు చూసుకోకుండా ఉండలేదు. ఇదే మొదటిసారి. సాగర్‌ను చూడగానే శర్మ కళ్ళల్లో నీళ్ళు. సాగర్ పరిస్థితి అందుకు భిన్నంగా లేదు. ఇద్దరూ అది నడిరోడ్డనే విషయం కూడా మరిచిపోయి ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు.

''ఎలా ఉన్నావురా? ఎక్కడుంటున్నావు?'' పక్కనే ఉన్న ఆంజనేయుల్ని చూసి ''ఓహో! తాతగారి దగ్గరకు చేరావా? ఇంత దగ్గరగా ఉంటూ ఒక్కసారి కూడా ఫోన్ చేయలేదేమిటిరా? నిన్ను చూడాలనిపించినప్పుడు వచ్చేవాణ్ణి కదా! నువ్వు లేకుండా ఆఫీసులో పిచ్చెక్కిపోతోంది'' సాగర్‌కి మాట్లాడే అవకాశం ఇవ్వటంలేదు.

''ఒరేయ్! కాస్త ఆగరా! ఊపిరి పీల్చుకో. నన్ను కూడా మాట్లాడనివ్వు''

శర్మపడుతున్న బాధను చూసి ఆంజనేయులు ''బావను ఆపవద్దు అన్నయ్యా! అతని మనసులో ఉన్న వేదనంతా బయటకు వస్తేనే తేరుకోగలడు. రీఫిల్ కాగలడు. మీ అనుబంధం తెలిసిందే కదా! ఇక్కడకాదు. ఏదైనా హోటల్‌లో రూమ్ తీసుకుందాం''

అతని మాటలకు తలుపాడు. వెంటనే  ఫోన్ తీసి ప్రముఖ హోటల్‌లో రూమ్ బుక్ చేశాడు. ముగ్గురూ అటువైపు దారి తీశారు. శర్మతోపాటు వచ్చిన డ్రైవర్ కూడా సాగర్‌ను చూసి శాల్యూట్ చేశాడు.

అతన్ని గుర్తుపట్టి ''ఏం ప్రభాకర్ ఎలా వున్నావు?'' అని అడగటంతో అంత పెద్ద యజమాని తనను పేరుపెట్టి పిలవటం ఆనందం వేసింది డ్రైవర్‌కు.

ఆఫీసు కారు తీసుకుని వెనక్కి వెళ్ళిపోయాడు డ్రైవర్.

సాగర్ వచ్చిన కారులోనే ఎక్కాడు శర్మ. కాకపోతే ఈసారి డ్రైవర్ సీటు అతనిదైంది. కారు నెమ్మదిగా కదిలింది. హోటల్‌కు చేరుకుంది. హోటల్ చేరుకోకముందే సాగర్ అన్నాడు.

''ఎక్కడైనా టిఫిన్ సెంటర్ దగ్గర కారు ఆపరా! ఏదైనా తినిపోదాం. పొద్దున నాతో వెళ్ళమని వీణ్ణి ఏమీ తిననీయలేదు బామ్మ'' అన్నాడు ఆంజనేయుల్ని చూపిస్తూ. దారిలోనే ఉన్న టిఫిన్ సెంటర్ దగ్గర కారు ఆపాడు. కారు పార్కింగ్ చేస్తుండగా అప్పుడే మరో కారు హోటల్ గేటులోకి ఎంటర్ అవటం గమనించలేదు.

''కాఫీ అయినా పోయించవే'' పోరుపెడుతున్న రేఖను చూసి అలాగే అన్నట్టు కారును టిఫిన్ సెంటర్‌లోకి మళ్ళించింది లలిత. అప్పుడే అందులోకి వెళ్తున్న శర్మను చూసి ఆమె కళ్ళు మిలమిల మెరిశాయి.

''నీ చూపులు అతన్ని ఏమీ తాకలేవు కానీ కాసేపు తమాషా చూస్తుండు'' అని లోపలికి దారితీసింది.

సాగర్‌తోపాటు ఆంజనేయులు, శర్మ ఇద్దరూ స్పెషల్ రూమ్‌లోకి ప్రవేశించారు. సాగర్‌ను చూడటంతోనే క్యాషియర్ లేచి నిలబడి విష్ చేశాడు. ''ఏం కృష్ణా! ఎలా వున్నావు?''

''బాగానే ఉన్నాసార్! ఈ మధ్య కనబడటంలేదు ఏమిటిసార్?''

నవ్వుతూ రూంలోకి వెళ్ళిపోయాడు.

సాగర్ నుంచి ఫోన్ రాగానే శర్మ బయలుదేరటంతో ఇక ఆఫీసులో ఉండబుద్ధి కాలేదు రేఖకు. వెంటనే లలితకు ఫోన్ చేసింది. ఆమె ఫోన్ అందుకుని వచ్చిన లలిత కారులోనే తలపగిలిపోతోందంటూ కాఫీకి బయలుదేరింది. నిజంగానే సాగర్ సిటీలోకి వచ్చాడని తెలియగానే ఆమెకు భయంతో ఎక్కడలేని నీరసం ముంచుకొచ్చింది. టిఫిన్ సెంటర్‌లోకి ప్రవేశించగానే శర్మ వాళ్ళు వెళ్ళిన రూములోకి వెళ్ళబోయింది లలిత. అలా గుమ్మంలో కాలు పెట్టబోతున్న లలితను ఆపేసింది రేఖ.

ఎందుకన్నట్లు చూస్తున్న లలితను వారిస్తూ "శర్మతోపాటు మీ అన్నయ్య కూడా లోపలే ఉన్నాడు" అంది.

ఆ మాటకు ఉలిక్కిపడింది.

"ఏమిటీ సాగర్ అన్నయ్య వచ్చాడా? ఇంకా ఆలోచిస్తావేమిటి? నన్నెందుకు ఆపుతున్నావ్? నీకు అతనితో మాట్లాడలని లేదా? కలుసుకోవాలనుకోవటంలేదా?" ఒకేసారి ఇన్ని ప్రశ్నలు స్మధిస్తున్న లలితను నిరాసక్తిగా చూసింది.

"ఏమని మాట్లాడమంటావు? నాకు అన్యాయం చేసివుంటే ఎందుకు అన్యాయం చేశావని అడుగుతాను? నేనంటే కోపం వుంటే ఎందుకని నిలదీయగలను? లేక మనిద్దరం హాయిగా కలిసివుందామని చెప్పమంటావా?" ఆమె ముఖం క్షణంలో వాడిపోయింది.

"అతని ఎదుటపడటానికే నాకు ముఖం చెల్లటంలేదు. నా పట్ల అతను అమానుషంగా ప్రవర్తించినా భర్తేకదా అని సరిపెట్టుకుందామంటే నేను చేసిన అవమానాన్ని మానవమాత్రుడెవరూ మరచిపోలేడు. అతను అమానుష ప్రవర్తన నాకు ఒక్కదానికే తెలుసుగానీ, నా ప్రవర్తన అందరికీ జుగుప్స కలిగించేలా ఉంది కదా! ఇంకెలా అతన్ని ఫేస్ చేయమంటావో చెప్పు" అంటున్న రేఖను నిట్టూరుస్తూ చూసింది లలిత.

"మా సమస్యకు కాలమే జవాబు చెప్పాలి. మేమిద్దరం ఒకరి ఎదుటపడే రోజున ఈ మబ్బులు అవంతట అవే విడిపోయి కలపాలిగానీ, సంజాయిషీలతో సంధి కార్యక్రమాలతో కాపురాలు నడవవు."

ఆరిందాలా మాట్లాడుతున్న రేఖను చూస్తూ ఉండిపోయింది లలిత.

ఇద్దరూ ఆ రూముకు పక్కనే ఉన్న మరో రూములోకి వెళ్ళారు. రేఖ కూర్చున్న తరువాత లలిత ఇప్పుడే వస్తానంటూ బయటకు వచ్చిఇంది రేఖ జవాబు కోసం ఎదురు చూడకుండానే. శర్మ వాళ్ళున్న రూములోకి ఆమె కాళ్ళు దారితీశాయి.

"దొంగలంతా ఒకేచోటికి చేరారే!" అంటూ వస్తున్న లలితను చూసి హాయిగా నవ్వాడు సాగర్.

"ఎంత ఒకేచోట చేరినా కావలసినవారు, కోరుకున్నవారు అనుకుని అయినా అనుకోకుండా అయినా కలుస్తూనే ఉంటారుగా" శర్మ అన్నాడు ఆమెను ఆశ్చర్యంగా చూస్తూ.

తామిక్కడకు వచ్చిన విషయం ఆమెకు ఎలా తెలిసిందో అనుకున్నాడు.

"మీకు మాట్లాడే సీన్‌లేదు. అన్నయ్య రాగానే గబగబా వచ్చి కలుసుకోవటమేనా? నాకు ఫోన్ చేయాలని అనిపించలేదంటే మీరంతా నన్ను పక్కకు నెట్టేశారన్నమాటేకదా!"

"కోపం వద్దు లలితా! ఇప్పుడే వచ్చాను. వచ్చీరాగానే వీడికి ఫోన్ చేశాను. వచ్చి కలిశాడు. నువ్వెలా వచ్చావు. కొంపదీసి వీడిమీద సి.ఐ.డి పనిచేయటంలేదు కదా!" అతని నవ్వు చూసి తేరుకున్నాడనిపించింది.

"అదేం లేదు. అయినా ఆయన మీద సి.ఐ.డి చేయాల్సినంత పెద్దమనిషేం కాదు. నన్ను కలిసి మూడురోజులైంది. ఎప్పుడు ఫోన్ చేసినా బిజీబిజీ అంటారు. ఇప్పుడు స్నేహితుణ్ణి కలవటానికి మాత్రం బిజీలేదు. ఏమీలేదు" ఉడుక్కుంటున్న లలితను చూసి నవ్వుకున్నాడు సాగర్.

"ఇది అన్యాయం రా! మా చెల్లెల్ని నువ్వు అవాయిడ్ చేయటం క్షమించరాని తప్పు. ఇకముందు ఇలా జరగదని క్షమాపణలు చెప్పు"

వారి సంభాషణను నవ్వుతూ వింటున్న ఆంజనేయులికి సాగర్‌లో ఇంత మాటకారితనాన్ని ఈ మధ్య చూడకపోవటంతో అతనిలా మనుషుల్లో తిరిగితేనైనా దారిలోకి వస్తాడనుకున్నాడు.

"సరే.. సరే.. ఏమిటిలా వచ్చావు? వేళకాని వేళలో" శర్మ అడిగాడు లలితను.

"ఒక స్నేహితురాలితో వచ్చాను. వచ్చీరాగానే మిమ్మల్ని చూసి ఇటొచ్చాను. తను బయట కూర్చున్నది"

"బయట కూర్చోవటమెందుకు? లోపలికి రమ్మను" సాగర్ లేస్తూ అన్నాడు. బయట వేచివున్న లలిత స్నేహితురాల్ని పిలిచేందుకు బయలుదేరాడు.

అతను లేవటం చూసి "నేను వెళ్ళి పిలుచుకు వస్తాను. పదా" అని లేచాడు శర్మ.

అతనితో రెండు అడుగులు వేసిన తరువాత "బయట ఉన్నది రేఖ" అతనికి మాత్రమే వినబడేలా చెప్పింది. ఉలిక్కిపడిన శర్మ వెనకడుగు వేశాడు.

"సరేలే.. మళ్ళీ కలుస్తాను" అంటూ వెనక్కి వచ్చేశాడు.

లలిత బయటకు వెళ్ళిపోయింది. ఆమె చూడగానే, "ఏమంటున్నారు మీ నాథుడు?" చిలిపిగా అడిగింది రేఖ.

"నా నాథుడి గురించా లేక నీ నాథుడి గురించా నీకు కావలసినది? అన్నయ్యను చుస్తుంటే ఇప్పుడిప్పుడే అవమానభారం నుండి బయటపడుతున్నట్టుంది. అది తెలుసుకోవాలనే వెళ్ళాను. తెలుసుకున్న వెంటనే వచ్చేశాను నీకు చెప్పాలని."

"నాకూ కావలసినది అదేకదా! అతను ఎంత త్వరగా ఇంటికి వచ్చేస్తే నాకంత నిశ్చింత. వాళ్ళ కొడుకుని వాళ్ళకి అప్పగించి నా దారిన నేను వచ్చెయ్యొచ్చు. ఆ శుభఘడియ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నాను."

రేఖ మాటలు అర్థంకాలేదు లలితకు.

ఆ విషయం అవగతమైంది రేఖకు.

"వాటి గురించి తరువాత మాట్లాడుకుందాం. తలనొప్పంటే కాఫీ ఇప్పిస్తానని తీసుకొచ్చావ్. ఆ సంగతి మరిచి ఏదో చర్చ పెడుతున్నావ్"

ఈలోగా సాగర్ మిగిలిన ఇద్దరూ బయటకు నడిచారు. వారు వెళ్ళిన అయిదు నిమిషాల తరువాత వీళ్ళు కూడా బయటకు వచ్చేశారు.

**అతను** మరో రెండురోజులు సిటీలోనే ఉంటాడని, కానీ ఇంటికి రావటానికి ఇష్టపడటం లేదని లలిత ద్వారా తెలిసింది రేఖకు. అతను ఇంటికి రాకపోవటానికి తాను కారణం కాదుకదా! తాను ఉండటం వల్లనే తన ముఖం చూడటం ఇష్టంలేకనే అతను రావటానికి సుముఖంగా లేడని ఆమె భావించింది.

మామగారు, అత్తగారు అతడితో మాట్లాడివచ్చారు. ఒక్కమాట కూడా తనకు చెప్పలేదు. అంటే తన మీద అతనికి కోపం పోలేదన్నమాట. మనసు నిలుపుకోలేక ఒకసారి చూద్దామని ఒకరోజంతా అతను బసచేసిన హోటల్ దగ్గర కాపుకాసింది.

దూరం నుండి అతణ్ణి చూసి ఇదేమిటి కళ్ళు పీక్కుపోయి ముఖం వడిలిపోయి ఇలా ఉన్నాడు. సడన్‌గా చూస్తే అతణ్ణి గుర్తుపట్టటం కష్టం. అంతలోనే అతని చంకలో ఉన్న చంటిపిల్లను చూసి విస్తుపోయింది.

ఎవరా పిల్ల? ఏడాది వయసు ఉంటుంది. నవ్వుతూ ఏవో కబుర్లు చెబుతోంది. ఆ పిల్లనే చూస్తున్న అతని ముఖంలో ఏదో సంతోషం.

ఆమె మనసులో ఎన్నో అనుమానాలు. ఎవరైతే తనకెందుకు? తన వల్ల ఎలాగూ అతనికి సుఖంలేదు. పోనీ ఆ చంటిపిల్ల వల్లనైనా మానసిక శాంతి లభిస్తే బాగుంటుంది. కానీ అంత విడదీయలేని అనుబంధం ఇద్దరి మధ్యా ఏర్పడటం చూసిన ఆమె మనసు ఎందుకో అంగీకరించలేకపోతోంది.

అంతలోనే తనపట్ల అతడి దురాగతం గుర్తుకొచ్చింది. చూస్తుంటే ఇతనికి చాలామందితో పరిచయాలున్నట్టున్నాయి. వాటి ఫలితమే ఈ పాపేమో?

అనుమానం రాకూడదు. వచ్చిందా రేఖలాంటి యువతులకు పెనుభూతంగా తయారవుతుంది.

అతనితో బంధాన్ని తెంచుకోవాలనుకుంటున్న తనకెందుకీ పాప గురించి. అతను ఎలా ఎవరితో గడిపితే తనకు పోయేదేమున్నది? అతని జీవితం అతని ఇష్టం.

ఎంత సర్దుకోవాలనుకున్నా మనసు మాట వినటంలేదు. నెమ్మదిగా కారు డ్రైవ్ చేసుకుంటూ ఇంటికి చేరుకుంది.

"ఏమ్మా! ఆఫీసులో చాలాసేపయిందట బయలుదేరి. ఇంతాలస్యమైందేం?" అత్తగారికి జవాబు చెప్పకుండానే తనగదిలోకి నడిచింది. తలుపు వేసుకుని పక్కమీద వాలిపోయింది. దుఃఖం ఎంత ఆపుకుందామనుకున్నా ఆగటంలేదు. తనకే ఎందుకు జరుగుతోంది? దేనికోసం ఆరాటపడినా అందినట్టే అంది చేతిలో నీళ్ళు జారిపోయినట్టుగా అవుతోందెందుకని? ఇక తన జీవితమంతా ఇలా నిరాశా నిస్పృహలతో గడపాల్సిందేమో.

కొందరిని పుట్టించే ముందే దేవుడు నుదుటరాత రాసేటప్పుడు వేదనలు, బాధలు అని రాస్తాడేమో. పొరపాటున ఎవరికో రాయబోయి వాళ్ళబాధలు కూడా తనలాంటి వాళ్ళ నుదుటే రాస్తాడేమో. లేకపోతే తనకేం తక్కువ. అందం ఉంది, ఐశ్వర్యం ఉంది, ప్రేమించే మనుషులున్నారు. కొండమీద కోతినైనా తీసుకొచ్చే పనివాళ్ళున్నారు, ఎన్నివుంటే ఏం లాభం? లేనిదొక్కటే మనశ్శాంతి. ఇన్ని ఉన్నా మనశ్శాంతి లేకపోతే తట్టుకోవటం ఎంత కష్టమో అనుభవిస్తున్న తనకు తెలుస్తోంది.

కోడలి పరిస్థితి గమనించి ఆమె వెనక వచ్చిన రాధాదేవికి రేఖను చూస్తే జాలి, సానుభూతి కలిగాయి. ఇరవైఏళ్ళకే జీవితంలో ఎన్నో ఆటుపోట్లకు గురికావటం రేఖ దురదృష్టం. ఒక తెలివిమాలిన పనివల్ల ఇంతమంది జీవితాలు ఎన్ని ఇక్కట్లు పాలవుతాయో కదా అనుకుంది.

రేఖను పొదివి పట్టుకుని ఓదార్చేందుకు ఆమె చేసిన ప్రయత్నం రేఖకు సముద్రంలో అలల తాకిడికి తల్లకిందులయ్యే నావను సురక్షితంగా ఒడ్డుకు చేర్చేందుకు ప్రయత్నించే నావికుడిపై కలిగే నమ్మకంలా కనబడింది. అత్తగారిని కావలించుకుని ఏడ్చేసింది. ఆమె దుఃఖిస్తున్నంతసేపూ వెన్ను నిమురుతునే కూర్చుండిపోయింది రాధాదేవి.

రెండురోజులుండి ఆంజనేయులుతో వెళ్ళిపోయాడు సాగర్. అతని మాటల్లో రేఖపట్ల ఎక్కడా విముఖత్వం కనిపించలేదు శర్మకు. ఆమెది పూర్తిగా పసితనపు చేష్టలుగా భావిస్తున్నట్టు మాటల మధ్యలో అనటం శర్మకు కొంత ఊరటనిచ్చింది. తానెక్కడ ఉంటున్నదీ ఎవరికీ తెలియనివ్వవద్దని, తన మనసు కోలుకున్న తరువాత తనంతట తానే తిరిగి వస్తానని శర్మకు నచ్చచెప్పాడు. అవసరమైనప్పుడు, తనను కలుసుకోవాలనుకున్నప్పుడు శర్మ ఒక్కణ్ణే రమ్మని కూడా హెచ్చరించాడు. ఆఖరికి తన సంగతి లలితకు కూడా తెలియనివ్వవద్దని, ఎవరికైనా తెలియచేస్తే తాను జన్మలో ఎవరికీ కనబడకుండా ఎటో వెళ్ళిపోతానని మరీమరీ చెప్పాడు.

"ఇక్కడ ఎంతో బిజీగా ఉండే నీకు ఆ పల్లెటూళ్ళో కాలక్షేపం ఎలా అవుతోందిరా? అప్పుడప్పుడు మమ్మల్ని కలుసుకుంటుంటే మనసు ప్రశాంతంగా అయినా ఉంటుంది కదా!" శర్మ అడిగాడు.

"పల్లెటూరు అంటే కాలక్షేపం ఉండదా? నువ్వు వచ్చి ఓ రెండురోజులుండి చూడు. అసలు టైమ్ తెలుస్తుందేమో! తాతయ్యతోపాటు మామిడితోటకు వెళ్తాను, పూలతోటకు వెళ్తా. సాయంత్రం వరకూ టైమే తెలియదు. ఇక ఇప్పుడు దీన్ని కూడా నాతో తీసుకువెళ్తున్నాను కదా! ఇక దీని ముద్దుముద్దు మాటలతో లోకమే తెలియదు ఎవరన్నా గుర్తుచేస్తే తప్ప" చేతిలో పిల్లను ముద్దుపెట్టుకుంటూ నవ్వాడు.

"అవును. ఇంత పసిదానికి నువ్వు సేవచేయగలవా? ఇక్కడే ఉంటే పార్వతి ఆయాగా ఎంతో జాగ్రత్తగా పెంచుతోంది కదా! ఎందుకని తీసుకెళ్తున్నావు. మళ్ళీ బామ్మకు ఇదో అదనపు భారం కాదూ!"

"కాదురా! ఇతరులు ఎంతప్రేమ చూపించినా అది సొంత మనుషుల ప్రేమకు సాటిరాదు. రేఖలాగా కాకుండా దీన్నో మంచి పౌరురాలిగా తీర్చిదిద్దాలని నా లక్ష్యం. ఆ సంస్కారం ఒక్క బామ్మ తాతయ్య సంరక్షణలోనే లభిస్తుంది. ఎప్పటినుండో దీన్ని తెచ్చెయ్యమని బామ్మ, తాతయ్య పోరుపెడుతున్నారు. నాకు కాలక్షేపం చేతినిండా ఉంటుంది కదా! అందుకే తీసుకెళ్దామని వచ్చాను."

"అన్నట్టు రేఖ సంగతేమిటి? మా ఇంటికి వచ్చేసిందని చెప్పావు కదా! ఇమిడిపోయిందా? లేక ఇదివరకులాగానే అతిశయంతో అమ్మానాన్నలను బాధపెడుతోందా? ఆఫీసులో ఎలా నడుచుకుంటోంది? పనిలో మరికొంత పర్ఫెక్షన్ వచ్చిన తరువాత ఎండిగా ప్రమోట్ చెయ్యమని నాన్నగారికి చెప్పు. అందుకు ఆమె సమర్ధురాలనే నేను అనుకుంటున్నాను. ప్రస్తుతం కొడుకైనా, కూతురైనా, కోడలైనా అన్నీ అమ్మానాన్నలకు ఆమే కదా!" అన్నాడు.

"సాగర్ ఎందుకురా నీకు నువ్వే శిక్ష విధించుకుంటావు? నువ్వు బాధపడటమే కాకుండా అటు అమ్మానాన్నలను, ఇటు రేఖను కూడా బాధపెడుతున్నావు. రేఖ ఇదివరకులా కాదు. పూర్తిగా మారిపోయింది. నిన్ను గురించి తెలుసుకోవాలని, నీ గురించి అడగాలని ఎంత ప్రయత్నం చేస్తోందో నీకు తెలియదు. తాను చేసిన తప్పు ఆమెను బయటపడనివ్వటంలేదు. నువ్వు ఆమెను క్షమించి దగ్గరకు తీసుకుంటే.." శర్మ మాటలు పూర్తికాకముందే అందుకున్నాడు సాగర్.

"ఎవరైనా ఎదురుగా ఉంటే వారి విలువ తెలియదురా. ఇనుమును కాల్చినప్పుడే వంగదీయగలం. రేఖవంటి వాళ్ళ సంగతి అంతే. నువ్వు చెప్పినదాన్ని బట్టి ఆమెలో ఇప్పుడిప్పుడే మార్పువస్తోంది. కానీ, నా పట్ల ఎందుకంత అనాగరికంగా ప్రవర్తించిందో ఇంకా తెలియలేదు. నామీద తప్పుడు అభిప్రాయంతో ఉన్న ఆమెను ఇప్పుడే ఎలా కలుస్తాను? నామీద సదభిప్రాయం లేనివారితో కలిసి ఎలా ఉండమంటావ్? అసలు ఆమె ప్రవర్తనకు కారణం తెలుసుకో. అప్పుడు సమస్య దూదిపింజలా ఎగిరిపోతుంది. తన తొందరపాటు వల్ల

ఇంతమంది బాధపడుతున్నారన్న భావం, ఆలోచన చాలదు తాను తప్పు చేశానని, ఒక మనిషిని అపార్థం చేసుకున్నానని తెలుసుకుంటేగానీ సమస్య కొలిక్కిరాదు'' సాగర్ మాటలకు శర్మ తలూపాడు.

''అంటే రేఖ మీద నీకేమీ దురభిప్రాయం లేదుకదా! ఆమె మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తే చేరదీస్తావా?'' అడిగాడు.

''శర్మా! ఇదిగో నా చేతిలో ఉన్న ఈ పసిదాని మనసు ఎంత స్వచ్ఛమైనదో రేఖ మనస్తత్వం కూడా అంతే. కాకపోతే అతిశయం, అహంకారం ఆమె మనసును డామినేట్ చేస్తున్నాయి. అది ఆమె తప్పుకాదు. చిన్నప్పటినుంచి ఒక్కటే కూతురు కదా అని చేసిన అతిగారాబ ఫలితం అది. దానికి రేఖను బాధ్యురాలిని చేయటం తగదు. డబ్బుందన్న అహంకారం మనిషిని అధఃపాతాళానికి తీసుకెళ్తుంది. నాకూ డబ్బుంది. కానీ తాతయ్య పెంపకం, మంచితనం, మానవత్వాన్ని ప్రతినిత్యం గుర్తుచేస్తూనే ఉంటుంది. అది నా అదృష్టం.''

సాగర్ మాటలకు, అతని ఔన్నత్యానికి చేతులెత్తి నమస్కరించాలనుకున్నాడు.

అయితే రేఖపట్ల ఎలాంటి విముఖం లేదన్నమాట. ఇదొకవిధంగా ఆ ఇద్దరి జీవితం గాడిలో పడేందుకు ఉపకరిస్తుంది. ఈలోగా అసలు రేఖ ఎందుకలా ప్రవర్తించిందో తెలుసుకోవాలి. ఆమె మనసులో సాగర్ అంటే ఎందుకంత వైరం ఏర్పడిందో తెలుసుకోవాలి. సాగర్ అన్నట్టు అప్పటికిగానీ అసలు సమస్య బయటపడదు.

''వస్తానురా'' ఆంజనేయులుకి, సాగర్‌కు వీడ్కోలు పలికాడు శర్మ.

## 16

''పాపను తీసుకొచ్చేందుకు వెళ్ళావా? చెప్పివెళ్ళవచ్చుగా!'' సాగర్ చేతిలో నుంచి పాపను అందుకుంటూ బామ్మ అంటున్న మాటలకు నవ్వే సమాధానంగా చెప్పాడు.

''బామ్మా! ఇదెంత చురుకో తెలుసా? మాటకు మాట సమాధానం అప్పుడే చెప్పేస్తోంది. దీన్ని మాయపుచ్చటం కష్టం'' ఆంజనేయులు ముద్దుపెట్టుకుంటూ అన్నాడు.

ఆంజనేయులు మాటలు అర్థమైనట్లు నవ్వుతూ నాలిక బయటపెట్టి వెక్కిరించింది పాప. ఆ ముద్దుచేష్టలకు అందరూ నవ్వేశారు.

''అయితే పేరేం పెట్టాలనుకుంటున్నావ్?''

బామ్మ ప్రశ్నకు ''అదంతా నాకేం తెలుసు? మునిమనవరాలికి ఏం పేరు పెట్టుకుంటారో తాతయ్య, బామ్మ ఇష్టం'' అన్నాడు.

పాపకు ఆకలి వేస్తోందేమోనని పాలు కలపటానికి లోపలికి వెళ్ళింది బామ్మ.

''అన్నయ్యా! ఇది పెద్ద 'చాలు' అవుతుందిరా! ఏడాది నిండలేదు. అప్పుడే ఎవరి దగ్గర ఎలా ఉండాలో తెలుసుకుంది. బామ్మను చూడటం మొదటిసారే అయినా ఆమె చంకలోకి దూకేసింది. మూడురోజుల నుండి నేను దానికి ఏం కావాలంటే అది కొనిపెడుతూ ఉన్నాను కదా! నా దగ్గరకు రకపోతే పోయె.. పైగా వెక్కిరిస్తోంది''

ఆంజనేయులు ఫిర్యాదును నవ్వుతూ విన్నాడు సాగర్.

ఆంజనేయులు మాటలకు నవ్వుతూ ఎత్తుకోమన్నట్టు చేతులు చాపింది. ఆంజనేయులు ఎత్తుకోకుండా ఉండలేకపోయాడు.

తాతయ్యకు, బామ్మకు పాపే కాలక్షేపం అయింది. దాన్ని కిందకు దించటంలేదు. సాగర్ ఎత్తుకుంటే గబగబా వచ్చి ''నువ్వేం ఎత్తుకుంటావుగానీ ఇటిచ్చెయ్యి'' అంటూ ఎవరో ఒకరు లాగేసుకుంటున్నారు.

పాప కూడా కొత్త లేకుండా ఎవరి దగ్గరకు రమ్మంటే వాళ్ళ దగ్గరకు వెళ్ళిపోతోంది. ఆ ఇంట్లోని వాళ్ళకే కాదు చుట్టుపక్కల వాళ్ళకు కూడా పాప అంటే అపూర్వం. త్వరలోనే అందరికీ దగ్గరైంది. అందరూ గారాబం చేసేవారే. ఇంట్లోకంటే చుట్టుపక్కల వారి దగ్గరే ఎక్కువ సమయం గడిపేస్తోంది.

పాప ఏడిస్తే బామ్మా తాతయ్యలకు కంగారు.

"ఎందుకేడుస్తోంది. ఒకసారి సిటీకి తీసుకెళ్ళి డాక్టర్‌కి చూపించొద్దామా?" అని ఒకటే కంగారు.

అది చూసి నవ్వుతాడు సాగర్.

"ఎందుకురా నవ్వుతావు? అది చిన్నపిల్ల. అది చిన్నపిల్ల. ఏదైనా బాధకలిగితే నోటితో చెప్పగలదా? మనమంటే పదిమందికి చెప్పుకుంటాం" బామ్మ మందలించేది.

"అదికాదు బామ్మా! నువ్వెంతమందిని పెంచివుంటావు? ఎప్పుడైనా ఇంత కంగారుపడ్డావా? అందుకే అసలుకంటే వడ్డీ ముద్దంటారు"

"చెప్పావులేవోయ్. నువ్వూ ఇంతకన్నా ఎక్కువ మారాం చేసేవాడివి. ఇప్పుడు కబుర్లు చెబుతున్నావ్‌గానీ" బామ్మ మందలించేది.

"అయినా అదేమ మనుషులురా! ఇంత చక్కటి పిల్లను వదిలేసి వెళ్ళటానికి మనసెలా ఒప్పిందో? వాళ్ళసలు మనుషులే కాదురా! ఏదో పిల్ల అదృష్టం కొద్దీ మనచేతుల్లో పడిందిగానీ లేకపోతే" ఆ పైన మాట పూర్తిచేయలేకపోయింది.

"ఇప్పుడవన్నీ ఎందుకు బామ్మా! దేవుడిచ్చిన ఈ ప్రసాదాన్ని అపురూపంగా చూసుకోవాలి మనం. మంచి పౌరురాలిగా నీ శిక్షణలో తయారవ్వాలి. నీ పెంపకాన్ని చూసి అది గర్వపడాలి. అప్పుడే మన శ్రమకు తగిన ప్రతిఫలం లభించినట్లు" అన్నాడు.

అతని మాటలకు తలూపింది బామ్మ. బామ్మ ఒళ్ళో ఆడుకుంటున్న పాప అతణ్ణి చూసి ఎత్తుకోమన్నట్టు చేతులు అందించింది. అతను ఎత్తుకున్నాడు. బుగ్గలపై ముద్దుపెడుతున్న అతన్ని చూసి నవ్వింది. అతను చేసిన పనినే తనూ చేసింది. తన బుగ్గలపై ముద్దుపెడుతున్న పాపను చూసి మురిసిపోయాడు.

తాతయ్య పాపకు 'మనస్విని' అని పేరు పెడదామన్నాడు. మంచిపేరు అనుకున్నారు. అందరూ దాన్నే ఖాయం చేశారు. పాపకు ఏడాదిన్నర వచ్చింది. తడబడకుండా గడగడా మాట్లాడేస్తోంది. అల్లరిచూసి మురిసేవారేగానీ విసుక్కునే వారెవరూ లేరు కాబట్టి ఆడింది ఆటగా పాడింది పాటగ మారింది.

ఒకరోజు తాతయ్య పూలతోటకు వెళ్తూ మనస్వినిని కూడా తీసుకువెళ్తానన్నాడు.

"దాన్ని మీరు చూసుకోలేరు. దాని అల్లరి భరించలేరు. నేనూ, అది తరువాత వస్తాం మీరు ముందు పదండి" అన్నది బామ్మ.

తాతయ్య వెళ్ళిపోయాడు. పాపకు పాలసీసా, వేడిచేసి చల్లార్చిన నీళ్ళసీసా తీసుకుని బయలుదేరింది బామ్మ పాపతో. చుట్టుపక్కల వాళ్ళంతా పాప లేకపోతే మాకేం తోచదు. ఇటిచ్చి వెళ్ళండి బామ్మా అని బతిమలాడినా వారి మాటను సున్నితంగా తిరస్కరించి తోటకు వెళ్ళింది.

తోటలో తాతయ్య మొక్కలకు నీళ్ళు పెడుతున్నాడు. పనివాడు వీరయ్య కడవలతో నీళ్ళు తోడుతూ బావి దగ్గరే ఉన్న మొక్కలకు నీళ్ళు పోస్తున్నాడు. వీరయ్య చేస్తున్న పనిని, తాతయ్య చేస్తున్న పనిని కొద్దిసేపు గమనించిన పాప కిందకు దిగింది.

వీరయ్య దగ్గరకు వెళ్ళి పక్కనే నీళ్ళు తాగేందుకు నీళ్ళబాన మీద ఉన్న గ్లాసు తీసుకుని నీళ్ళతో నింపి మొక్కలకు తానూ పోయసాగింది. దాని ముద్దు ముద్దు ముద్దు చేష్టలు బామ్మా తాతయ్యలిద్దరికీ మురిపమే. వీరయ్య కూడా పాపను ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నాడు. వీరయ్య ముద్దుపెట్టగానే "ఛీ..ఛీ.." ముఖం చిట్లించి వీరయ్య ముద్దుపెట్టుకున్న బుగ్గను తుడుచుకుంది.

"వీరయ్యా! చూశావా! చుట్ట మానెయ్యమంటే మానవు కదా! నీ చుట్ట కంపు మేమంతా భరిస్తున్నాం కదా అని దాన్నికూడా భరించమంటే ఎలారా చెప్పు. ఇకముందు దాన్ని ఎత్తుకోవాలంటే చుట్ట తాగడమన్నా మానెయ్యి. లేకపోతే చుట్ట తాగకుండా ఒక గంట ఆగి అప్పుడు ఎత్తుకో" అన్నాడు తాతయ్య నవ్వుతూ.

"ఏదోనండీ బాబూ! చుట్టతో యాభై ఏళ్ళ సహవాసం. ఇప్పటికిప్పుడు మానమంటే కుదురుతుందా? నెమ్మదిగా మనస్విని బుజ్జితల్లికోసమన్నా మానెయ్యాలి. లేకపోతే ఇంట్లోకి కూడా రానివ్వదు. రెండు మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంచేట్టుంది" తానూ నవ్వుతూ అన్నాడు.

"మరేమనుకున్నావ్. నా మనవరాలంటే?" తాతయ్య పొంగిపోతూ అన్నాడు.

వారిద్దరి సంభాషణను ఆలకిస్తూ తాతయ్య దగ్గరకు వచ్చి వీపుమీద వాలిపోయి మెడచుట్టూ చేతులు వేసింది మనస్విని.

అది చూసి బామ్మ "ఇక తాతా మనవరాలికి మేమెక్కడ కనబడతాం" అంటుంటే ఆ మాట అర్థమైనట్లు తాతయ్యను వదిలేసి బామ్మ దగ్గరకు చేరింది తడిసిన తన గౌను చూపిస్తూ.

బామ్మ తనను గమనించకపోవటం చూసి "ఊఁ చొక్కామాల్చు.. తడిచింది" డిమాండ్ చేసింది.

"చూశారా! ఇప్పుడు గౌను తడిసిపోవటంతో మార్చుకోవటానికే నా దగ్గరకు వచ్చింది. లేకపోతే అప్పుడే తాతవీపు వదిలేదా?" అంటూ సంచిలో నుంచి మరో గౌను తీసి మార్చింది.

ఎండ ఎక్కువవుతుండటంతో పాపను తీసుకుని బామ్మ ఇంటికి బయలుదేరింది. తాతయ్యను వదిలి రానని మారాం చేస్తున్న పాపను బుజ్జగిస్తూ తీసుకెళ్తుండగా గేటు దగ్గరే ఎదురొచ్చాడు సాగర్.

"దీన్ని తోటకు తీసుకెళ్తానని తాతయ్య రోజూ అనటం, ఇది వెంటపడటం దాన్ని తీసుకుని నువ్వూ బయలుదేరటం సరిపోయింది. మీరు దీన్ని ఎక్కువ గారాబం చేస్తున్నారు. పెద్దయితే మాట వినదసలు" అంటున్న సాగర్‌ను చూసి చేతులు చాపింది. అంతే పాపను బామ్మ చేతుల్లోనుంచి తీసుకున్నాడు.

"నాన్నా! మలే వీలయ్య ముద్దుపెడుతుంటే అబ్బ వాసన" అంది. వారివెనకే ఉన్న వీర్య్యతో సహా అందరూ నవ్వేశారు.

అప్పుడు గుర్తుకొచ్చింది బామ్మకు పాప పాలు తాగలేదని. "పాలు తాగుతావా? మనూ" అని అడుగుతున్న బామ్మ వంక చూసి వద్దని తల అడ్డంగా ఊపింది.

"నా తల్లివి కదూ కొద్దిగా తాగమ్మా!" బామ్మ బతిమలాడుతోంది.

"ఏమితి? నేను నీ తల్లినా?"

బుగ్గలు నొక్కుకుంటూ ఆశ్చర్యంగా అడుగుతున్న మనస్విని చూసి అంతా నవ్వేశారు.

"తాగమ్మా బామ్మ పాపం ఇంటినుండి తీసుకొచ్చింది కదా! నా బంగారు తల్లి నాన్న చెప్పినమాట వింటుందంట. మారాం చేయదట" సాగర్ మాటలకు నవ్వేసింది.

"ఇందాకటి నుండి వింటున్నానుగా!" ఇక లాభంలేదు. మాట్లాడకుండా ఉంటేనే గౌరవం నిలుస్తుందని అనుకున్నారు. మౌనంగా ఇంటికి బయలుదేరారు.

"అదేమితి. మాట్లాడకుండా నడుత్తున్నాలు?"

"ఏం మాట్లాడమంటావే తల్లీ! ఏం మాట్లాడినా కౌంటర్ ఇచ్చేస్తున్నావ్‌గా" సాగర్ మాటలకు నవ్వేసింది.

"కౌంటల్ అంటే ఏంతి నాన్నా?"

"అయ్యబాబోయ్ ఇదో క్వశ్చన్ బ్యాంక్‌లా ఉందిరా నాయనా!" సాగర్ మాట పూర్తికాకముందే

"...అంతే.." మళ్ళీ అడిగింది.

"ఇదిగో బామ్మా! నీకిదివరకే చెప్పాను. దీన్ని గారాబం ఎక్కువ చేయొద్దని. విన్నావా! ఇప్పుడూ చూడు"

"పోన్లేరా చిన్నపిల్ల" బామ్మ సమర్థించటం చూసి చప్పట్లు కొట్టింది.

"ఎందుకే చప్పట్లు" సాగర్ అడిగాడు.

"ఎందుకా.. ఎందుకంతే. మలే ... మలే ఇందాక బామ్మ తల్లీ అంది. ఇప్పులేమో చిన్నపిల్ల అంతోంది" ఇక లాభంలేదు. దీంతో మాట్లాడటం బ్రహ్మతరం కూడా కాదు అనుకున్నాడు.

ఇంటికి వచ్చేసరికి ఇంటిముందు కారు ఆగివుంది. కారు చూడగానే సాగర్‌లో ఎక్కడలేని హుషారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఇంటి చుట్టూ పచార్లు కొడుతున్నాడు శర్మ. కార్లో కూర్చునుంది లలిత.

వాళ్ళను చూడగానే "హాయ్! ఆంతీ! ఏంతీ నాకోచమే వచ్చావా?"

ముద్దు ముద్దు మాటలతో అడుగుతున్న మనూని అందుకుంది కార్లో నుండి దిగిన లలిత.

అప్పుడెప్పుడో ఒకసారి శర్మతో వచ్చినప్పుడు తనను చూసి ఇప్పటివరకూ గుర్తుపెట్టుకుని పలకరిస్తున్న పాపను మురిపెంగా ఎత్తుకుంది లలిత.

"అవునురా! నిన్ను చూద్దామనే వచ్చాను. ఏంటీ మా అమ్మ ఎక్కడికో షికారు వెళ్ళినట్లుందే" ముద్దులు పెట్టుకుంటూ అంటున్న లలితనుంచి చూపులు శర్మవైపు మళ్ళించింది.

"ఏంతి చల్మా! నన్ను పలకరించవ్. నీకంటే చిన్నపిల్లను కదా! ముందే పలకలించాలని తెలీదా?"

తనను పేరు పెట్టి పిలుస్తుంటే ఉడుక్కున్నాడు శర్మ.

"చూడరా! ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములు వాడి అంటే ఇదేమరి. పుట్టినప్పటి నుండి ఎత్తుకు తిరిగింది నేను. తను ఇవాళ వచ్చింది. తననేమో ఆంటీ అనీ, నన్నేమో పేరు పెట్టి పిలుస్తోంది" ఫిర్యాదు చేశాడు సాగర్‌కు.

"అదేమరి. అక్కడే ఉంది అసలు సంగతి. కొందర్ని చూస్తే నమస్కరించాలనిపిస్తుంది. కొందర్ని చూస్తే మొట్టబుద్ధిపుడుతుంది. తమరిది రెండోరకం" వెక్కిరించింది లలిత.

"పోన్లే ఆంతీ. మన చల్మే కదా కోప్పలవద్దు. మన జత్తులో చేల్చుకుందాం" అంది.

"ఇప్పుడేమిటి తల్లీ ఎప్పుడో చేరిపోయాను" శర్మ మాటలకు అందరూ గలగలా నవ్వారు.

తాళం తీసి లోపలికి వెళ్ళిన బామ్మ మంచినీళ్ళతో తిరిగొస్తూ "అక్కడే నిలబడిపోయారు. లోపలికి రండి" పిలిచింది.

అంతా లోపలికి వెళ్ళారు.

"ఊఁ ఇప్పుడు చెప్పు చల్మా కబుల్లు?" ఆరిందాలా అడుగుతున్న మనూని చూసి ఏం మాట్లాడాలో తోచలేదు.

"ఏమిట్రా సంగతులు. ఊరకరారు మహాత్ములు. అందులోనూ చెల్లాయిని కూడా తీసుకొచ్చావ్? మొన్న ఫోన్లో చెప్పిన ముహూర్తమే ఖాయమైందా? ఇద్దరూ వచ్చారంటే అంతే అయ్యుంటుంది."

"ఏంతీ మీలు పోన్లో మాట్లాడుకున్నాలా? మలి నాకు చెప్పలేదే?" సాగర్‌ను అడిగింది.

"ఒరేయ్! ఈ క్వశ్చన్ బ్యాంకుతో కష్టమే.. అవును ఆ ముహూర్తానికే" అన్నాడు.

బామ్మను, తాతయ్యను పిలిచి అక్షింతలు చేతికిచ్చి దీవించమన్నాడు సాగర్. శర్మ, లలిత ఇద్దరూ తాతయ్య, బామ్మ కాళ్ళకు నమస్కరించారు. వాళ్ళ తలపై అక్షింతలు వేస్తూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది బామ్మ. అది గమనించిన సాగర్ కళ్ళతోనే బామ్మను వారించాడు.

"ఈ నెల పదోతేదీన ముహూర్తం బామ్మా! నువ్వూ తాతయ్యా వచ్చి తప్పకుండా మమ్మల్ని దీవించాలి" పెళ్ళి ఎక్కడో చెప్పాడు. లలిత సిగ్గుల మొలకే అయ్యింది. శర్మ గబగబా కారు దగ్గరకు వెళ్ళి తన ఇన్విటేషన్ తీసుకొచ్చాడు. కాబోయే దంపతులిద్దరూ తాతయ్యకు, బామ్మకు కలిపి ఇచ్చారు.

"నేను లాను" కోపంగా లోపలికి వెళ్ళున్న మనూని పట్టుకుంది లలిత.

"ఎందుకమ్మా అంతకోపం?"

"వాల్లకు కాల్డు ఇచ్చి నాకు ఇవ్వలేదు. నన్ను లమ్మని పిలవలేదు" మూతి ముడిచింది.

"సారీరా! మీ శర్మ అంకుల్‌కి ఆలోచనలేదు. అందుకే నేను రమ్మంటున్నాను కదా!"

"మలి నాకెందుకు దణ్ణం పెటలేదు"

"అయ్యో! మళ్ళీ సారీ"

బామ్మ తెచ్చిన కాఫీ తాగారు.

"వస్తాం రా! వస్తాం బామ్మా తాతయ్యా! వస్తాం నా బంగారు కొండా!" తనకు చెప్పటంతో మను ముఖం వెలిగిపోయింది.

"ఆంటీ! నీ పెల్లికి వత్తాను. కానీ చల్మ అంకుల్ పెల్లికి లాను" అంటున్న పాపను ముద్దుపెట్టుకుంది లలిత.

వాళ్ళకారు కనబడినంత దూరం చూస్తూ ఉండిపోయారు.

"చక్కటి జంట. చూడముచ్చటగా ఉంది. అందరికీ అదృష్టం ఉండాలి" బామ్మ నర్మగర్భంగా అంటున్న మాటలకు దీర్ఘంగా నిట్టూర్చి సాగర్ తన గదిలోకి వెళ్ళిపోయాడు. అతనితోపాటు మనూ కూడా పరిగెత్తింది.

## 17

**శర్మ, లలితల** పెళ్ళికి రెండురోజుల ముందే పాపతో సహా వచ్చాడు సాగర్. ఈసారి హోటల్‌కి కాకుండా సరాసరి ఇంటికే వచ్చాడు. అప్పుడు ఇంట్లో రేఖ లేదు. ఆఫీసుకు వెళ్ళింది. కొడుకును చూసుకుని ఎక్కడలేని ఓపిక తెచ్చుకుంది రాధాదేవి.

రాధాదేవిని చూస్తూ సిగ్గుతో తండ్రి ఒడిలో తలదాచుకుంది మనూ.

రహస్యంగా "ఎవలూ?" అని అడిగింది.

"నానమ్మనే! ఇటు రా దగ్గరకు" పిలిచింది రాధాదేవి.

"అక్కలో నాన్నమ్మ ఉందిగా. మళ్ళీ ఇంకో" ముద్దులు మూటకడుతున్న మనూను చూసి కళ్ళనీళ్ళు పెట్టుకుంది రాధాదేవి.

"అందరికీ ఇదో అలవాటైపోయింది. మాట్లాడితే కళ్ళల్లో నీళ్ళు వచ్చేస్తాయి. ఇప్పుడేమైంది అమ్మా! త్వరలోనే అంతా సర్దుకుంటుంది" తల్లి ఇచ్చిన కాఫీ తాగాడు.

"పాలు తాగుతావురా చిట్టితల్లీ?" అడిగింది రాధాదేవి.

"అయ్యో! పాలచీచా మల్చిపోయాను బామ్మ మల్చిపోయింది ఇవ్వటం" ఇప్పుడెలా అని చూస్తున్న మనూను దగ్గరకు తీసుకుని, "పాలసీసా లేకపోతేనేం. నాకాళ్ళమీద పడుకోబెట్టుకుని పడ్తానుగా. రా తల్లీ!"

పాపను లోపలికి తీసుకువెళ్ళింది.

కాళ్ళమీద పడుకుని స్పూన్‌తో పాలు తాగటం కొత్తగా ఉందనిపించింది పాపకు. మళ్ళీ కొడుకు దగ్గరకు వచ్చింది.

"అమ్మా! బడలికగా ఉంది. కాసేపు పడుకుంటాను" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు. ఆ గదిని ఇప్పుడు రేఖ వాడుకుంటోంది. లోపల అంతా ఆడవాళ్ళ సామాన్లు, చీరలు, లంగాలతో నిండిపోయి ఉండటం చూసి సాగర్ "అమ్మా!" అని పిలిచాడు.

రాధాదేవి రాగానే "ఏమిటమ్మా ఈ గది. ఇందులో అన్నీ ఆడవాళ్ళ వస్తువులే కనబడుతున్నాయి?"

"అవునురా! నువ్వెలాగూ లేవుగా. అందుకని రేఖ వాడుకుంటోంది. అయినా ఈ గది మీ ఇద్దరిదీ కదా!"

ఏమీ మాట్లాడలేకపోయాడు. నీరసంగా మంచం మీదున్న బట్టల్ని పక్కకు జరిపి ఒరిగిపోయాడు. తండ్రి పక్కనే పడుకుండిపోయింది మనూ.

వాళ్ళు మంచి నిద్రలో ఉండగా రేఖ వచ్చింది. చెప్పుల స్టాండ్‌లో బూట్లు చూసి సాగర్ వచ్చాడని తెలుసుకున్నది. ఆమె గుండెలు గుబగుబలాడాయి. ఇప్పుడెలా అతన్ని ఫేస్ చేయటం? అతను ఏ గదిలో ఉన్నాడు? తన గదిలోకి వెళ్ళాలా వద్దా? అని సంశయిస్తూ హాల్లో సోఫాలో కూర్చుండిపోయింది.

"అదేమిటి అలా కూర్చుండిపోయావు? ఫ్రెష్ అయివస్తే కాఫీ తాగొచ్చు" కోడలు హాల్లో కూర్చోటం చూసి అంది రాధాదేవి.

నెమ్మదిగా అదురుతున్న గుండెలతో తన రూమ్‌లోకి వెళ్ళింది. అక్కడ మంచం మీద సాగర్ పడుకుని ఉన్నాడు. అతని గుండెలపై మనూ పడుకుని హాయిగా నిద్రపోతుంది. నిశ్చింతగా ఉన్న ఆ పసిపాపను చూస్తూ ఉండిపోయింది. అంతలోనే తేరుకుని చప్పుడు కాకుండా బాత్‌రూంలో దూరింది. ముఖం కడుక్కొని, బయటకు వచ్చి చీర మళ్ళీ తీసుకెళ్ళింది. బాత్‌రూములోనే చీర మార్చుకుని వచ్చింది. నెమ్మదిగా డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకు నడిచి అద్దంలో చూసుకుంటూ పౌడర్ రాసుకుంది. బొట్టు పెట్టుకుంది. ఇటు తిరగబోయింది.

"మలి నాకో" అన్న మాటలకు ఉలిక్కిపడి మాట వినిపించిన వైపు తిరిగింది.

నిద్రలేచిన పాప తండ్రి పక్కనే కూర్చుని రేఖను చూస్తూ అడిగింది. పాపను నవ్వుతూ దగ్గరకు రమ్మని పిలిచింది. కొత్తలేదేమో పాపకు. మంచం మీదనుండి దూకి రేఖవైపు పరిగెత్తుకు వచ్చింది. పాపను బాత్‌రూమ్‌కు తీసుకెళ్ళి టాయ్‌లెట్ పనులు పూర్తిచేయించి సబ్బుతో నెమ్మదిగా ముఖం కడిగి టవల్‌తో శుభ్రంగా తుడిచింది. తరువాత పౌడర్ అద్ది, తిలకంతో బొట్టుపెట్టింది.

"తిలకం ఎందుకు? బొత్తుబిల్ల లేదా?"

"చిన్నపిల్లలకు తిలకమే బాగుంటుంది. కావాలంటే అద్దంలో చూడు"

తరువాత పాప డ్రస్ మారుద్దామని సూట్‌కేసు కోసం వెతికింది.

"నా డ్లస్ కోసమా? అది కారులోనే ఉండిపోయిందిగా. నాన్న తీసుకులాలేదు" పాపను తీసుకుని బయటకు వచ్చింది.

వాళ్ళిద్దర్నీ చూసి "సిసింద్రీ కూడా లేచిందే" అంటున్న రాధాదేవిని చూస్తూ "నా పేలు చిచింద్లీకాదు. మను" పేరుకూడా తెలియదా అన్నట్టు ముఖం పెట్టింది.

ఆ మాటలకు ఇద్దరూ నవ్వేశారు. సరిగ్గా అదే సమయంలో ఇంట్లోకి అడుగుపెట్టిన నారాయణరావు. "ఏమిటీ అత్తాకోడళ్ళు నవ్వేసుకుంటున్నారు? అంత నవ్వు వచ్చేదేమున్నదబ్బా!"

"మీ మనవరాలి మాటలకు నవ్వుకాక మరేమొస్తుంది?" అప్పుడు చూశాడు రేఖ చేతుల్లో ఉన్న మనూను.

"అరెరే ఎవరీ చిట్టితల్లీ! ఎవరురా నువ్వు..? "

"ముందు నువ్వెలివో చెప్పు?" నిలదీసింది.

"అయ్యో నేనెవరో తెలియదా? మీ నాన్నమ్మ చెప్పలేదా?"

"ఊహూం చెప్పలేదు. ఇంతకీ ఎవలు నువ్వు?"

"నేనా.. నేను తాతయ్యను"

"ఎంతమంది తాతయ్యలు?"

దానికి ఏం జవాబు చెప్పాలో తెలియలేదు వాళ్ళెవరికీ.

"మలి నువ్వో?" తననే అడుగుతుండటంలో ఉలిక్కిపడింది రేఖ.

"నేను.. నేను.. ఆంటీని" ఏం చెప్పాలో తెలియక అనేసింది. ఈలోగా మనూని ఎత్తుకుని నారాయణరావు లోపలికి నడిచాడు. ఆయన రిఫ్రెష్ అయి వచ్చాక రేఖకు, ఆయనకు కాఫీ తెచ్చిచ్చింది.

"అయ్యో మీరు తేవటమెందుకు? నేను వచ్చేదాన్నిగా" నొచ్చుకుంటూ అన్నది.

"అంతేలే. నన్ను మల్చిపోయాలు అందలూ. నాకు పాలు తేలేదు"

దాని ముద్దుమాటలతో ఆ రోజు ఎలా గడిచిపోయిందో తెలియలేదెవరికీ. రాత్రి అవుతున్న కొద్దీ రేఖకు దిగులుపుట్టుకొస్తోంది. సాయంత్రం అంతా హాల్లోను, వంటగదిలోను తచ్చట్లాడింది.

పొద్దుగూకింది. అప్పటివరకు సాగర్ ఎదుటపడకుండా అతను అటుంటే ఈమె ఇటుండేది. ఇటుంటే అటు వెళ్ళేది. మధ్యలో పాప ఉండటంతో సాగర్ టైమంతా పాపతో గడపటంతోనే సరిపోయింది. రాత్రి అందరూ భోజనాలు చేశారు. పేచీ పెట్టకుండా తనకు కావలసినది అడిగి వేయించుకుని తింటున్న పాపను ముద్దుగా చూస్తుండిపోయారు.

నారాయణరావు, రాధాదేవి పడుకోటానికి వెళ్ళిపోయారు. సాగర్, మనూ ఇద్దరూ బెడ్‌రూములోనే ఉండిపోయారు. ఇప్పుడేం చేయాలి... ఎలా ఎక్కడ పడుకోవాలి?

రేఖ ఇంకా హాల్లోనే ఉండటం చూసిన రాధాదేవి "వెళ్ళిపడుకోమ్మా! మళ్ళీ పొద్దున్నే లేవాలి" అని ఆమె బెడ్‌రూములోకి వెళ్ళేవరకూ తనూ అక్కడే ఉండిపోయింది. తను వెళ్ళేవరకు ఆమె కదలదని అర్థమైంది. తప్పనిసరిగా గదిలోకి వెళ్ళింది.

గుమ్మం దగ్గరే కొద్ది నిమిషాలు తలవంచుకుని నిలబడింది. తరువాత నెమ్మదిగా తలెత్తి చూసేసరికి సాగర్ సోఫాలో పడుకుని ఉన్నాడు. తలకింద దిండు కూడా లేదు. నెమ్మదిగా నడిచి బెడ్ దగ్గరకు వచ్చింది.

దిండు తీసుకుని సోఫా దగ్గరకు నడిచి అతనికి నిద్రాభంగం కలగకుండా నెమ్మదిగా తలెత్తి అతని తలకింద దిండుపెట్టింది. పాప ఎక్కడా అని వెతికింది. మంచం మీద పడుకుని ఉంది. చిన్నగా నిట్టూర్చి తనూ మంచం మీద ఒరిగిపోయింది.

సాగర్ నిద్రపోవటంలేదు. ఆమె చేసిన పని అతనికి తెలుసు. కానీ ఏమీ తెలియనట్టు నిద్ర నటించాడు. తాను మేలుకున్నట్టు తెలిస్తే ఆమె రిలాక్స్‌డ్‌గా నిద్రపోలేదనుకున్నాడు. ఏవేవో ఆలోచనలతో పడుకున్న రేఖకు ఎప్పుడు నిద్రపట్టిందో తెలియలేదు.

"ఎంతచేపు పలుకుంటావు? ఇంతేసేపు పలుకోకూడదు. లే..లే" అని పాప లేపటంతో లేచి వాచ్‌వంక చూసింది. ఎనిమిదిగంటలు. బాప్రే అనుకుంటూ హడావుడిగా లేచింది.

"పెద్దవాళ్ళు సూల్యుడు లాకముందే లేవాలట. నాన్న చెప్పాలు" అంది.

"హాయ్ గుడ్‌మార్నింగ్" పాపకు చెప్పింది.

"లేతుగా లేవతం గుడ్‌మార్నింగ్‌లు చెప్పతం. బాగుంది నీ పని"

పాపను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుంది.

"ముందు బ్లష్ చేసుకులా" నవ్వుకుంటూ బాత్‌రూమ్ వైపు అడుగులు వేసింది.

అప్పటికే పాపకు స్నానం చేయించి బట్టలు వేశాడు సాగర్. జడవేయాలి. ఆంటీచేత వేయించుకోమన్నాడు. బాత్‌రూమ్ వైపు నడుస్తున్న రేఖకు ఎదురుగా బాత్‌రూములో నుంచి స్నానం చేసి వస్తున్న సాగర్ కనిపించాడు. అంతే. గబుక్కున వెనక్కి తిరిగి వచ్చి మంచంపై కూర్చుండిపోయింది.

అద్దం ముందు నిలబడి తలదువ్వుకుంటూ అద్దంలో నుండి ఆమెను చూస్తూ "బాగున్నావా రేఖా!" అని అడిగాడు.

"ఊఁ" అంది.

"ఏమితీ నీ పేరు లేఖానా! మలి చెప్పలేదే" పాప కల్పించుకుని అడిగింది.

"తప్పమ్మా! పెద్దవాళ్ళను పేరు పెట్టి పిలవకూడదు" చెప్పాడు సాగర్.

అలాగే అన్నట్టు తలూపింది. అతను సూట్‌కేస్‌లో నుంచి డ్రస్ తీసుకుని ఎక్కడ వేసుకోవాలో అర్థంగాక చూస్తుండిపోయాడు. అది గమనించి రేఖ బాత్‌రూములోకి దూరింది. ఆమె వచ్చేసరికి అతను తయారయ్యాడు. ఇంతవరకు అతన్ని కోటులో చూడలేదు రేఖ. ఇప్పుడు కోటు, టై కట్టుకుని హుందాగా కనబడుతున్నాడు.

ఇంత అందమైన వాడికి హృదయం కూడా అందంగా ఉంటే ఎంత బాగుండేది. తన దురదృష్టం కాకపోతే! అతనెంత దుర్మార్గుడైనా తమ ఇద్దరికీ ముడిపెట్టాడు భగవంతుడు. ఇక తప్పించుకునే అవకాశం లేదు. తప్పదు భరించక.

ఆమె ఆలోచనల్లో ఆమె ఉంటే "ఆఫీసులో మంచి పేరు తెచ్చుకున్నావట. పనిలో పడితే టైము కూడా చూసుకోవటం లేదట. అంతా నిన్నే కలవరిస్తారట. గుడ్ అండ్ కంగ్రాట్స్ ఆల్సో" అభినందించాడు.

ఆమె "థాంక్స్" అన్నది. ఆమె మాటలకు అతను నవ్వాడు.

"చూశావా? కలవక కలవక కలుసుకున్నాం. భార్యాభర్తలమైనా అలా లేదు మన బంధం. ఏదో మొక్కుబడిగా నేను అడుగుతున్నాను. నువ్వూ అంతే మొక్కుబడిగా చెబుతున్నావు. ప్రపంచంలో ఏ భార్యతోనూ భర్త ఇలా ముభావంగా మాట్లాడడు. మన దురదృష్టం. ఏం చేస్తాం?" అతని మాటలు పొడిగా ఉన్నాయి. అందులో ఏ భావంలేదు.

"ఎన్నాళ్ళుంటారు?" మొదటిసారిగా ఆమె నోటిలోంచి వచ్చిన మాటకు షాక్ తిన్నాడు.

అతను షాక్ తిన్నాడని గ్రహించింది. అతన్ని చూడగానే మళ్ళీ తనలో అణుచుకున్న ఆగ్రహం పెల్లుబుకువస్తోందని తెలుసుకుంది.

"అహఁ నేనా ఉద్దేశంతో అడగలేదు. ఏదో క్యాజువల్‌గా అడిగానంతే!"

"నువ్వే ఉద్దేశంతో అడిగినా నాపై సదుద్దేశం లేదని అర్థమైంది. ఇంకా నాపై కోపం పోయిందేమో అనుకుని ఎంతో ఆశతో వచ్చాను. నువ్వు మారావనుకున్నాను. కానీ, నువ్వు మారలేదని, నీ అతిశయం తగ్గలేదని అర్థమైంది. ఎక్కువరోజులుండనులే. భయపడకు. శర్మ, లలితల పెళ్ళి అయిపోగానే వెళ్ళిపోతాను. అసలు హోటల్‌లోనే దిగేవాడిని. నువ్వు ఎంతో మారావని, ఇదివరకు రేఖవు కాదని శర్మ మరీమరీ చెబితే నిజమేనని నమ్మి వచ్చాను. నీకు ఇబ్బంది అనిపిస్తే హోటల్‌కు మారిపోతానులే" నిర్వేదంతో అతని నోటినుండి వచ్చిన మాటలు ఆమెకు నోటమాట రాకుండా చేశాయి.

ఛీ... ఎప్పుడూ ఇంతే! ఒకటి మాట్లాడబోయి మరొకటి మాట్లాడుతుంది తాను. ఎదుటి వ్యక్తికి ఆ మాటల పదును తెలుస్తుందిగానీ విసిరే తనకు ఎలా తెలుస్తుంది? ఎదుటి వ్యక్తిని కించపరిచే నోటి దురుసు తనకు తగ్గదా? అందరితోనూ ఎంతో వినయంగా, వినమ్రతతో నడుచుకుంటున్న తాను ఇతని ముందు ఎందుకు ఇలా మొరటుగా మాట్లాడుతోంది? నిజంగా లౌక్యం తెలియదు తనకు. ఎదుటి వ్యక్తి బాధపడతాడని తెలిసీ మారలేకపోతోంది.

అతను విసురుగా పాపను ఎత్తుకుని నడిచాడు. రెండు నిమిషాల్లో గుమ్మం దాటేవాడే.!

తేరుకుంది రేఖ.

"ఒక్కమాట.."

అతను ఆగాడు వెనక్కి తిరిగిచూడలేదు.

"ఒక్క నిమిషం లోపలికి వచ్చి కూర్చోండి"

ఏం చెబుతుందో చూద్దామని వచ్చి సోఫాలో ఆమెకు దూరంగా కూర్చున్నాడు.

"క్షమించండి. నాకు మాట్లాడటం సరిగ్గా రాదు. అనుకోకుండా ఒక్కొక్కసారి విసురుగా వచ్చేస్తాయి మాటలు. అందుకని ఏమీ అనుకోకండి. ఇందాక కూడా ఏదో క్యాజువల్‌గానే అడిగాను. అందులో పెడర్థం ఏమీలేదు. అయినా ఇది మీ ఇల్లు. మీ ఇంటికి మీరెప్పుడైనా రావచ్చు వెళ్ళొచ్చు. అడగటానికి నేనెవర్ని? మీరు ఏ హోటల్‌లోనూ దిగాల్సిన పనిలేదు. నన్ను చూసి ఇంటికి రాకుండా ఉండనక్కర్లేదు"

అయిపోయిందా అన్నట్టు చూశాడు.

"మాట్లాడటం రాదంటూనే మనిషిని గాయపరిచేలా మాట్లాడటం నీకే చెల్లుతుంది. నీలా రాళ్ళు విసిరేలా మాట్లాడటం నాకు రాదు. నేను పెరిగిన వాతావరణం అటువంటింది. ఏం చేయను చెప్పు. చేయని తప్పుకి ఇంతవరకు శిక్ష అనుభవించాను" అతని కళ్ళలో నీళ్ళు చూసి బెంబేలు పడింది పాప.

బేలగా తననే చూస్తున్న పాపను గమనించి తలపక్కకు తిప్పుకున్నాడు. అపురూపమన్నట్టు పాపను గుండెకు హత్తుకున్నాడు. తండ్రి అలా హత్తుకోవటం చూసి పాప ధైర్యం తెచ్చుకుంది.

"మనసుల్ని గాయపరచటం తెలిసిన మీకు మాటలతో గాయపరచటం తెలియదని నాకూ తెలుసు. మాటలతో గాయపరిచే నన్ను చూసి అంతా నాదే తప్పనుకుంటారుగానీ మనసుల్తో ఆడుకునే మిమ్మల్ని ఎవరూ తప్పుపట్టరు. ఎంతైనా పురుషాధిక్యం కదా! ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా, విన్నా మగవాడికి చెప్పుకింద తేలులా ఆడది మెలగాలనే సమాజం చెబుతుంది. అందుకు మగాడిగా మీరు చేసిన తప్పుల్ని ఎంచేందుకు ముందుకు రాదు. అదే ఆడది చిన్నపొరపాటు చేసినా అదో మహాపాపంగా ప్రతి ఒక్కరికీ కనబడుతుంది"

"అదే నేనేం తప్పు చేశాను. ఏం పాపం చేశానో చెబితే తెలుసుకుని సరిచేసుకునే ప్రయత్నం చేస్తాను. అంతేగానీ నువ్వు తప్పుచేశావు, నువ్వు పాపం చేశావంటూ నిందలు వేస్తే నాకెలా తెలుస్తుంది? తప్పుచేసినట్లు నీ దగ్గర స్పష్టమైన సాక్ష్యాలు, రుజువులు ఉంటే చూపించు. అవి నిజమైతే నీకాళ్ళ మీద పడి పదిమంది ముందూ క్షమాపణ అడుగుతాను. అంతేగానీ నువ్వేదో ఊహించుకుని, నీ మనసులో ఏదో భ్రమపడి ఇతరుల్ని నిందించటం తగని పని. మన పంతాలతో పెద్దల్ని నవ్వులపాలు చేయటం మూర్ఖత్వం. ఇకనైనా తెలివితెచ్చుకుని సరైన మార్గాన్ని ఎంచుకో. ఇంతకు మించి నిన్నేమీ కోరను" పాపను ఎత్తుకుని వెళ్తున్న అతన్ని చూస్తుండిపోయింది.

మరుసటిరోజు అతని తాతయ్య, బామ్మ పెళ్ళికి వచ్చారు. వారు వచ్చిన దగ్గరనుండి పాప వదలటం లేదు. పాపను వాళ్ళకు వదిలేసి ఇంట్లో ఉండటం తగ్గించేశాడు సాగర్. ఎంతసేపూ స్నేహితుల ఇళ్ళల్లోను, వాళ్ళతోనే గడపటం మొదలుపెట్టాడు. ఇంటికి రావటం కూడా అరుదుగానే ఉండేది.

ఇంటికి ఎందుకు రావటం లేదని ఎవరైనా అడిగితే చిరునవ్వే సమాధానమయ్యేది. అతను ఎందుకు రావటం లేదో రేఖ ఊహించింది. తాను అడిగినందుకే అతను రావటం లేదని ఆమె గ్రహించింది.

తాను అలా అడగటంలో తప్పులేదు కదా! అడిగి తప్పుచేసిందా? ఏ తప్పూ చేయకపోతే ఎందుకు తప్పించుకు తిరుగుతాడు? తప్పుచేసినవాడెవడూ తప్పుచేశానని అంగీకరించడు.

"ఏ తప్పూ చేయకపోతే మరిపాప ఎవరిపిల్ల? అతని కూతురు కాకపోతే అంత ప్రేమగా ఎందుకు చూసుకుంటాడు? కాళ్ళు కిందపెడితేనే అపురూపం అన్నట్లు ఎందుకుంటాడు? ఊహించుకుంటేనే అతని స్త్రీలోలత్వానికి జుగుప్స కలుగుతోంది ఇన్ని తప్పులు చేసి కూడా అంత నిర్భీతిగా ఎలా తిరగ్గలుగుతున్నాడు. ఇవాళ కాకపోయినా రేపయినా తప్పులు బయట పడకపోవు. అప్పుడు తెలుస్తుంది ఫలితం ఎలావుంటుందో, ఇవాళ వెనకే తిరుగుతున్న వారంతా అప్పుడు అసహ్యించుకుంటుంటే తెలుస్తుంది జీవితంలో చేసిన తప్పుల పర్యవసానం ఏమిటో? అతని కారణంగా తాను పూర్తిగా తెలుసుకోగలుతారు? అప్పటివరకు అందరికీ తానొక రాక్షసిగానే కనబడుతుంది. చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకున్న పాతకిలాగానే అగుపడుతుంది'

ఆమె ఆలోచనలు ఇలా సాగుతున్నాయి.

తాను చేసిన దానిలో తప్పులేదని ఇద్దరూ ఎవరికి వారే భీష్మించుకు కూర్చోవటం వారిమధ్య దూరాన్ని మరింత పెంచింది.

మాట్లాడుకోవటానికి దుర్భేధ్యమైన గోడలు అడ్డుగా నిలిస్తే సహజంగానే నిజాలు బయటపడవు. ఎక్కడైతే వదులుకోలేని భేషిజాలు, కోపతాపాలు ఉంటాయో అక్కడ మనుషుల్ని విడదీసే ఇనుపతెరలు ప్రత్యక్షమవుతాయి. విచక్షణ కోల్పోయి అహం అడ్డుగా నిలుస్తుంది. రాజీమార్గాలన్నీ మూసుకుపోతాయి. సరిగ్గా ఇప్పుడు వీరిద్దరి విషయంలో అదే జరిగింది. నువ్వు తప్పుచేశావంటే నువ్వు చేశావని వాదించుకోవటమేగానీ ఎవరే తప్పు చేశారో కూర్చుని మాట్లాడుకుంటే అసలు సమస్యే ఉండేదికాదు. ఎదుటి వ్యక్తే తప్పుచేశాడనే భావనే వారిద్దర్నీ చెరోదారి ఎంచుకునేలా చేసింది.

శర్మ, లలిత పెళ్ళి ఘనంగా జరిగింది. ఊరిలోని అనేకమంది పారిశ్రామికవేత్తలు వచ్చారు. ముఖ్యంగా సాగర్ వచ్చినట్లు తెలుసుకున్న మిత్రులంతా ప్రత్యేకంగా వచ్చారు. అంతకుముందు సాగర్ వ్యవహారశైలికి, ఇప్పటి సాగర్‌కి మధ్య ఉన్న తేడా గమనించి ఎవరికి వారు ఖిన్నులయ్యారు. ఎప్పుడూ సరదాగా మాట్లాడే సాగర్ ఇప్పుడు నిండుకుండలా గంభీరంగా ఉండటం వారిని బాధించింది. మనూను తన కూతురుగా అందరికీ పరిచయం చేశాడు. పెళ్ళిపీటల మీద కూర్చున్న శర్మ, లలితలను చూసి ముద్దుముద్దుగా ఏదో మాట్లాడుతున్న మనూని ముద్దులాడని వారు లేరు.

పెళ్ళికి వచ్చిన స్నేహితులందర్నీ చూసి పలకరించాడు శర్మ.

పక్కనే ఉన్న ఒకరిని పిలిచి "ఆ భాస్కర్‌గాడు వచ్చినట్టున్నాడు. సింగ్ సంగతి చెప్పనే అక్కర్లేదు. మొహమాటస్తుడు. ఆ షాని తనకిష్టమైనవి తినటానికి కూడా బద్ధకిస్తాడు. పోయి వాళ్ళకు కాఫీ టిఫిన్లు చూడు" అని పురమాయించాడు శర్మ.

అతను వాళ్ళ దగ్గరకు వెళ్ళేలోపే శర్మ మాటలు విన్న మనూ పరిగెత్తుకుంటూ వాళ్ళ దగ్గరకు వెళ్ళి "ఒలేయ్ సింగూ, భాస్కలూ టిఫిన్లు చేశాలా" అంటూ ఆరా తీయటంతో స్నేహితులకు ముద్దువేసింది. ఒక్కసారి అందరూ కలిసి మనూను ఎత్తుకునేందుకు ప్రయత్నించారు.

అంతమంది ఒక్కసారిగా తనను ఎత్తుకునేందుకు ప్రయత్నించటంతో బెదరాల్సిందిపోయి, "ఉందండి. ఒక్కలొక్కలేలండి" అంటున్న మనూను వదిలిపెట్టలేకపోయారు.

"ఒరేయ్! నీ కూతుర్ని మాకిచ్చేయరా! మేం తీసుకెళ్తాం" అంటూ ఒకటే ముద్దు.

"అమ్మో నేనులాను. నాకు నాన్నా కావాలి" ఖచ్చితంగా అంటున్న మనూ బుగ్గలు సాగదీశారంతా.

"ఒలేయ్ వదలండిలా బుగ్గలు నొప్పెలుతున్నాయ్" అంటూ పక్కనే సాగర్ దగ్గరకు పరుగుతీసింది.

"సాగర్ నీకింత చలాకీ కూతురున్నదని మాకు చెప్పలేదేరా? దీంతో ఆడుకోవటానికైనా వారానికోసారి వస్తూండేవాళ్ళం. ఇక్కడున్న నాలుగురోజులు మరిచిపోకుండా దాన్ని తీసుకురా! నిజంగా చిన్నపిల్లల ముద్దుముద్దు మాటలు మనసుకు ప్రశాంతత, హాయి ఇస్తాయనటంలో వాస్తవం ఇప్పుడు మాకు తెలిసింది" అందరూ సాగర్ ఈడువాళ్ళే. పాతికేళ్ళవాళ్ళే.

"నిజంగా ఇది నీ దగ్గర ఉంది కాబట్టే నువ్వింత త్వరగా మనుషుల్లోకి రాగలిగావు. నిన్ను మళ్ళీ ప్రపంచంలోకి తీసుకురావటంలో దీని ప్రమేయం ఎంతో ఉందనిపిస్తోంది. నువ్వు మానసికంగా పూర్తిగా స్వస్థుడవయ్యే వరకు దీన్ని వదిలిపెట్టకు. ఒక్కక్షణంలో ఇంతమందిని నిలబెట్టేసింది. ఇది సామాన్యురాలు కాదురా!" అన్నారంతా.

"ఇంటికి వెళ్ళగానే పెద్దమ్మతో చెప్పి దిష్టి తీయించరా. మా దిష్టే తగిలేటట్టున్నది" వారంటున్న మాటలు నవ్వుతూ వింటున్నాడు సాగర్.

అప్పుడు ఎక్కడలేని సిగ్గూ ముంచుకొచ్చిందేమో నాన్న గుండెల్లో ముఖం దాచుకుంది.

"పాలు తాగావా మనూ?" చిన్నగా అడిగాడు సాగర్. తాగలేదన్నట్టు తల అడ్డంగా ఊపింది.

"అదేమిటి. ఇంతసేపు పాలు తాగకుండా ఉండటం బ్యాడ్ పద తాగిస్తాను"

"అందలూ అందలికీ కాపీలిచ్చేవాల్లేగానీ నా పాల గురించి ఎవలూ పట్టించుకోలేదు" ఫిర్యాదు చేసింది.

"ఇప్పుడే వస్తానా పాపకు పాలుపట్టించి"

అతడు వెళ్ళిన తరువాత అందరూ సాగర్‌పై సానుభూతి మాటలే ఎక్కువగా మాట్లాడుకున్నారు.

అలా పాపను తీసుకుని వెళ్తున్న సాగర్‌కు రేఖ ఎదురైంది.

"ఆంతీ! ఓ ఆంతీ! నాకు పాలు తెచ్చి ఇత్తావా?" అని మనూ అడగటం సాగర్ గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది.

తనే అడిగించానని రేఖ అనుకుంటుందేమోనని అతని అనుమానం.

రేఖ అదేమీ పట్టించుకోకుండా "ఇటురా! ఇప్పిస్తాను" అని సాగర్ చేతుల్లోనుండి పాపను తీసుకుని అతణ్ణే చూసింది. ఏదో అపురూపమైన వస్తువు దూరమవుతున్నట్టుంది అతని ముఖం. పాపను వంటవాళ్ళ దగ్గరకు తీసుకువెళ్ళి గ్లాసులో పాలుపోయించుకుని స్పూన్‌తో బయటకు వచ్చింది.

అక్కడ రెండు బెంచీలు జాయింట్ చేసి ఉండటం చూసి ఆ బెంచీలపై కూర్చుని పాపను తన కాళ్ళపై పడుకోబెట్టుకుంది. స్పూన్‌తో కొద్దికొద్దిగా పాలు తాగించసాగింది. పాపకూడా ఆకలి మీద ఉందేమో పాలు మెదలకుండా తాగేసింది.

"ఆంతీ పొద్దున నువ్వూ, నాన్న ఎంతుకు పోత్తాలుకున్నాలూ?" హఠాత్తుగా పాప అడగటంలో ఏం జవాబు చెప్పాలో తెలియక "ఆ సంగతి మీ నాన్ననే అడగకపోయావా?" అన్నది.

"అడిగాను. ఆంతీకి కోపం వచ్చే పనిచేశానని చెప్పాలు. అప్పులేమో అలా చేయొచ్చా అని నాన్నను అలిచాను."

అమ్మో ఇదో పిసిన్రీ. చిచ్చుబుడ్డిలాంటి దీని దగ్గర జాగ్రత్తగా ఉండాలి. అన్నీ పరిశీలిస్తుంది. వయసుకు మించిన మాటలు అనుకుంది రేఖ.

"అయినా ఇకనుండు నువ్వు పాలు ఇలా సీసాతోను, స్పూనుతోనూ తాగకూడదు. గ్లాస్‌తో తాగే అలవాటు చేసుకోవాలి. గుడ్‌గరల్స్ అంతా అలాగే తాగుతారు. మరి నువ్వు గుడ్ కదా!" అని చెప్పింది. అందుకు పాప తలూపింది.

అంతలో "పాలు తాగావా అమ్మలూ" అంటూ సాగర్ వచ్చాడు. తండ్రిని చూడగానే అతని దగ్గరకు దూకింది. పాపను ఎత్తుకుని "థాంక్స్" చెప్పాడు. పాపతో "ఆంటీకి థాంక్స్ చెప్పు" అని చెప్పాడు. పాప అలాగే అన్నట్లు కిందకు దిగి రేఖ చెయ్యి తీసుకుని అరచేతిని ముద్దుపెట్టుకుంది. ఆమె చర్యకు ఇద్దరూ విస్తుపోయారు.

అతనికేం అన్నీ మరిచిపోవటానికి పాప ఉన్నది. దాని ముద్దుముద్దు మాటలతో గతాన్ని మరిచి మానసిక ప్రశాంతతను పొందవచ్చు. తనకే ఈ జన్మకు ఆ భాగ్యం కలగదు. బతికినంతకాలం ఇలా మానసిక శాంతి లేకుండా చూసేవారి కోసం నవ్వు నటిస్తూ మోడులా గడిపేయక తప్పదు. ఎవరి అదృష్టానికి ఎవరు కర్తలు?

## 18

శర్మ పెళ్ళయిన తరువాత కొన్నాళ్ళుండాలనుకున్నాడు. తాతయ్య, బామ్మ ఆ రోజే వెళ్ళిపోయారు. పాపను వదలలేక వదలలేక వెళ్తున్న వాళ్ళను చూసి పాప అదృష్టవంతురాలనుకుంది రాధాదేవి. తల్లిదండ్రులు మరీ మరీ చెప్పటంతో తానుండిపోయాడు సాగర్.

తాతయ్య వాళ్ళు వెళ్ళిన తరువాత పాపను ఎక్కువగా ఇంట్లోనే వదిలివెళ్ళటం మొదలెట్టాడు సాగర్. తనతోపాటు ఊరికే ఊరుమీద తిప్పటమెందుకని, పాపకు అలసట ఎక్కువవుతుందని అతని ఆలోచన. దాంతో పాపభారం రాధాదేవి మీద పడింది. ఎంత పనివాళ్ళున్నా రోజంతా ఇంటిపనితో సతమతమయ్యే అత్తగారికి పాపభారం లేకుండా చూసేందుకు తను ఇంట్లో ఉన్నప్పుడు పాప పనులు రేఖే చూసేది.

తాను ఆఫీసుకు తయారయ్యేసరికే పాపకు స్నానం చేయించటం, దానికి ఇష్టమైనట్టుగా బొట్టూకాటుక పెట్టటం, దానికి నచ్చిన డ్రస్ వేయటం అన్నీ తనపైనే వేసుకునేది. పొద్దున లేవగానే పాలుపట్టే పనికూడా తనే తీసుకుంది. పాలు పట్టటం కొద్దిగా లేటయితే పాప ఊరుకునేదికాదు.

"ఎవలూ నన్ను చూలటంలేదు. ఎవలికీ నా ఆకలి తెలియదు" అంటూ "ఆంతీ..ఆంతీ" అని పిలిచేది.

దాని ముద్దుమాటలు విందామన్న కుతూహలంతో పలికేది కాదు రేఖ. "నిన్నే.. ఓయ్ లేఖా! లేఖా" అని విసుగ్గా పిలవటంతో తప్పనిసరిగా పలిఖేది.

"మీలంతా కాపీలు తాగాలు. నా సంగతేంతి?" గారాబంగా అడిగేది. అడిగేతీరు, దాని ముఖమూ చూసి నవ్వుకుంటూ దగ్గరకు లాక్కునేది.

దాని గొంతు ఒక్క క్షణం వినకపోతే రాధాదేవికే కాదు, రేఖకు కూడా తోచేదికాదు.

నారాయణరావు చదువుకునే రోజుల్లో ఆయన స్నేహితుడొకరు టేబుల్ గడియారం ప్రజెంటు చేశాడు. అదంటే నారాయణరావుకు ప్రాణం. రోజుకు ఒకసారైనా దాన్ని చూడకపోతే ఆయన మనసు ఊరుకునేది కాదు. దాన్ని బెడ్ పక్కనే ఉన్న టీపాయ్ మీద పెట్టుకునేవాడు. ఎవరూ దాన్ని ముట్టుకునే సాహసం చేసేవారు కాదు. ఒకవేళ ఏ పనివాడైనా దాన్ని తుడిచేందుకు పట్టుకున్నా యజమానికి అది ఎంత ప్రీతికరమైనదో తెలుసు కాబట్టి జాగ్రత్తగా తీసినచోటే పెట్టేవాడు. ఉండాల్సిన చోట కనబడకపోయినా, దాన్ని ఎవరైనా ముట్టుకున్నా ఇక ఆ రోజు ఇంట్లో యుద్ధమే. మళ్ళీ ఆ గడియారం కనబడేవరకు నారాయణరావు మామూలు మనిషి అయ్యేవాడు కాదు.

ఒకసారి నారాయణరావు లేని టైములో ఆ గదిలోకి రాధాదేవి కోసం పాపవచ్చింది. పరిగెత్తుకుంటూ రావటం వల్ల టీపాయ్ మీద పడిపోయింది. "అయ్యో! అయ్యో!" దాన్ని పట్టుకునేందుకు రాధాదేవి ముందుకు ఉరికింది. పాపను వెతుక్కుంటూ వెనకే వచ్చింది

రేఖ. ఈలోగా టీపాయ్ మీద పాపపడిపోవటం, ఆ అదురుకు టీపాయ్ మీద ఉన్న వస్తువులన్నీ కిందకు పడిపోవటం ఒకదాని తరువాత మరొకటి జరిగిపోయాయి. అన్ని వస్తువులతోపాటు ఆ గడియారం కూడా కిందపడిపోయి ముక్కలు ముక్కలైంది. అలా కావటం చూసిన మనూ బెంబేలు పడింది. పెద్దగా ఏడుపు లంకించుకుంది. దాని ఏడుపుకు కిందపడిన వస్తువుల్ని ఏరాలన్న సంగతి కూడా అత్తాకోడళ్ళు పట్టించుకోలేదు. మనూను ఇద్దరూ ఒకేసారి దగ్గరకు తీసుకున్నారు. అత్తగారికి మనూను అందించి టీపాయ్ మీదనుంచి పడిపోయిన వస్తువులు ఏరే పనిలో పడింది. మామగారు ప్రాణసమానంగా చూసుకునే గడియార్మ పగిలిపోవటం రేఖ గమనించింద్ది. అత్తగారివైపు చూసింది భయంభయంగా.

అప్పుడు గమనించింది రాధాదేవి. "అయ్యో! మీ మామగారికి అపురూపమైనదా గడియారం. ఇప్పుడు ఇంటికొస్తే ఎలా?" అనుకుంటుండగానే రానేవచ్చాడు నారాయణరావు.

గదిలోకి రాగనే ఆయన చూపు ముందుగా టీపాయ్ మీదకే వెళ్తుంది.

గడియారం పగిలిపోయి ఉండటం చూసిన కోపంతో ఆయన ముఖం ఎర్రబారింది.

"ఎవరు చేశారీపని? ఆ వస్తువు విలువ ఇంట్లో అందరికీ తెలుసుకదా! జాగ్రత్తగా ఉండక్కర్లేదా? ఒక్కరికీ బాధ్యతలేకుండా పోతోంది" ఆయన అరుపులకు మనో మరీ బెంబేలెత్తిపోయి ఏడుపు లంకించుకుంది.

పాప ఏడుపు వినగానే ఆయన కోపం చప్పున చల్లారిపోయింది.

నిన్ను కాదురా నాన్నా! ఈ బొమ్మను పగలగొట్టిన వారిని. భయంవద్దు. నిన్నుకాదులే" మనవరాల్ని సముదాయిస్తూ అన్నారు.

"ఎవరు పగలగొట్టారో కూడా మీ మనవరాలినే అడగండి" రాధాదేవి నవ్వు దాచుకుంటూ చెప్పింది.

మనూను దగ్గరకు తీసుకుని "నాన్నా! ఎవరు పగలగొట్టారు. నానమ్మ పగలగొట్టిందా?"

"కాదు. కాదు" తల అడ్డంగా తిప్పింది.

"మరి ఎవరు?"

"నేను పలిగెత్తుకు వచ్చి ఆపుకోలేక బల్లమీద పడిపోయాను. ఆ బొమ్మ కింద పడి పగిలిపోయింది" ముద్దుముద్దుగా అంటున్న మనవరాలిని మరింత దగ్గరకు తీసుకున్నాడు.

ఇంకేమంటాడు? ఏమన్నా అనటానికి పాప ఇప్పటికే బెదిరిపోయింది. తానే తగ్గటం మంచిదనుకున్నాడు.

"పోతే పోయిందిలే ఒట్టి బొమ్మేగా. మళ్ళీ కొత్తది కొనుక్కుందాంలే!"

ఆయన మాటలకు పకపకా నవ్వేసింది రాధాదేవి. ముసిముసిగా నవ్వింది రేఖ.

"ఇవాళ మేము లేచిన వేళ మంచిదైంది. పిల్ల పగలగొట్టింది కాబట్టి సరిపోయిందిగానీ. లేకపోతేనా! మనవరాలంటే అంత అబ్బురమెందుకో?"

అంటున్న రాధాదేవిని చూసి నవ్వాడు నారాయణరావు.

"మలే తాతయ్యా! మలే. నేను పెద్దదాన్నయ్యాక ఇతువంతిదే ఇంకోతి కొనిపెల్తాలే" ఇక ఒక్కరూ ఆపుకోలేకపోయారు. ఒకరికి మరొకరు మనూను ఎత్తుకునేందుకు పోటీపడ్డారు. అదే సమయంలో వాళ్ళను వెతుక్కుంటూ వచ్చిన సాగర్ కూడా నవ్వేశాడు.

"ఇవాళ నిజంగా పండగేరా! మీ నాన్నగారి కోపాన్ని ఒక్కక్షణంలో పోగొట్టగలిగిన మేధావి మనింట్లో ఉంది. అయినా ఎంతసేపూ స్నేహితులు, పార్టీలని తిరగటమేనా? లేకపోతే పాపను తీసుకుని ఏదైనా చూపించేదుందా?"

"ఏం చూపించాలమ్మా! దాని ప్రశ్నలకు జవాబు చెప్పటం ఎవరివల్లాకాదు. అది మాట్లాడుతుంటే అంతా నోరెళ్ళబెట్టాల్సిందే" నవ్వుతూ అన్నాడు.

"జూకి తీసుకెళ్ళు. ఆ జంతువుల్ని చూసి ఆనందపడుతుంది. ఏం రేఖా వాడికి తోచకపోతే నువ్వన్నా చెప్పవచ్చు కదా!" రేఖను చూస్తూ అనటంతో రేఖ గతుక్కుమంది.

"రేపు వెళ్తాం ఆంటీ.. జూకి..జూ అంతే ఏమిటి?"

"అమ్మా నీ నోటినుండి మాట వచ్చిన రెండు క్షణాలు కాలేదు. అప్పుడే మొదలైంది క్వశ్చన్ల తుఫాను" సాగర్ నవ్వుతూ కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు.

"నాన్నా! రేపు జూకి వెళ్దామా?"

"అలాగే! కానీ పొద్దున్నే నువ్వు తయారవ్వాలి. లేటు చేయకూడదు"

ఇంతలో శరం వచ్చాడు.

"మా బంగారం ఎక్కడికో బయలుదేరతానంటోందే" అని నవ్వుతూ పాపను తీసుకున్నాడు.

శర్మ వెనకే వచ్చిన లలిత "అయితే నేనూ వస్తాను."

"రేపు జీకి పోతున్నాం. మరి చల్మ లాలా"

"నువ్వు రమ్మంటే శర్మా వస్తారు. నేనూ వస్తాను."

"మరి ఆంటీనో" రేఖను చూపిస్తూ అంది.

"ఆంటీ కూడా వస్తుంది. ఏం రేఖా? రేపు ఆఫీసుకు డుమ్మా కొట్టేయ్" లలిత అంది.

"అమ్మో. నాకు రేపు పేషీట్లు తయారవవలసిన రోజు" ఎలా తప్పించుకోవాలో తెలియక అన్నది.

"పర్వాలేదులే అమ్మా! ఒక్క రోజులో కొంపలు మునిగేదేమీ లేదు. అయినా పిల్లలతోపాటు మనమూ వెళ్తేనో" నారాయణరావు ప్రపోజల్‌కు అందరూ ఓటేశారు.

"ఇది నిజంగా గడుగ్గాయే అందరి పనీ చెడగొట్టింది" నవ్వుతూ అన్నాడు సాగర్.

"నేను లలితా ఆంటీని, చల్మను, లేఖా ఆంటీనీ లమ్మన్నాను. తాతయ్యను, నానమ్మను లమ్మన్నానా ఏంతి?" తనమీద నెపం వేయటంతో తనదేం లేదన్నట్టుగా అంటున్న మనూను చూస్తుండిపోయారు.

జూలో పాపకు అన్నీ విడమరిచి చెబుతున్నాడు సాగర్.

ఇది కోతి, దీన్ని రామచిలుకంటారు. అదిగో చూడు ఏనుగు. "ఏనుగు ఎక్కుతావా?"

ఎక్కనన్నట్టు చూపింది.

"అదిగో చూడు ఆ గుహలో పులి కూర్చుని ఉంది"

"దాన్ని కొండముచ్చు అంటారు."

కనబడ్తున్న ప్రతి వస్తువును వివరించి చెబుతున్న సాగర్‌ను, తండ్రి మాటను ఆసక్తిగా ఆలకిస్తున్న పాపను చూసి జెలసీ ఫీలయ్యింది రేఖ. తండ్రీ కూతుళ్ళ మధ్య ఉన్న అపురూప అనుబంధం ఆమె మనసులో జెలసీకి కారణమైంది.

"ప్చ్.. తనకీ భాగ్యం లేదుకదా! అది ఈ సాగర్ పుణ్యమే. తాను తల్లికాకుండా చిత్రవధ అనుభవించటానికి కారణమైన ఇతణ్ణి తానెలా క్షమించగలదు?"

పాపకు ప్రతి ఒక్కదాన్ని వివరిస్తున్న సాగర్‌ను చూసి అతని తల్లిదండ్రులు, శర్మ, లలిత మనసుల్లో పాపపట్ల సాగర్‌కున్న అభిమానాన్ని, అతని మనసులో పాప సంపాదించుకున్న స్థానాన్ని గుర్తుంచారు. అతని మనసులో పాప ఒక భాగమైందని గమనించారు. అంతేగానీ వాళ్ళల్లో ఎలాంటీ ఈర్ష్య కలగలేదు.

మన మానసిక పరిస్థితిపైనే ఒక్కొక్కరికి ఒక్కొక్క అభిప్రాయం ఏర్పడుతుందంటారు. సరిగ్గా ఇక్కడ అదే జరిగింది.

'ఒక పక్క తానింత మానసిక క్షోభను అనుభవిస్తుంటే ఆ తండ్రీకూతుళ్ళు ప్రపంచాన్నే మరిచి విశ్వవిజేతలుగా ఉంటున్నారు. ఈ రెండురోజులనుండి పాప పట్ల కొద్దిగా కలిగిన సానుభూతి. పాప పక్కనే సాగర్‌ను చూస్తుంటే కరిగిపోసాగింది. రేపు ఇది కూడా ఇతరుల ఆనందాన్ని హరించి తండ్రిలాగానే తయారవుతుందేమో! ఎంతైనా ఆ తండ్రి పెంపకంలోనే ఉంటోంది కదా. తండ్రి బుద్ధులు రాకపోతే ఇంకెవరివి వస్తాయి? ఇప్పుడే ఆరిందాలా తడుముకోకుండా మాట్లాడుతోంది. రేపు ఇంకెలా ప్రవర్తిస్తుందో?' ఇక అక్కడ ఉండలేకపోయింది.

***

**పాపకు ఇంకా** చూపించాల్సినవి చాలా ఉన్నాయని అనుకుంటున్న సాగర్, రేఖ ఫీలింగ్స్ చూసి నీరసపడ్డాడు.

ఇక ఈ జన్మలో తమ మధ్య అనుబంధం చక్కబడదు. ప్రతి అంశాన్నీ నెగిటివ్‌గానే రేఖ తీసుకుంటోంది. ఒక్క విషయంలోనూ పాజిటివ్ థింకింగ్ ఆమెలో కనబడలేదు. తన దగ్గరే ఇలా ఆమె ఆలోచనలు ముడుచుకుపోతాయేమో? తాను లేని సమయంలో ఆమె ఎంత హుషారుగా, ఎంత చలాకీగా ఉంటోందో ఈ రెండురోజులనుండి గమనించాడు. తనను చూడగానే ముడుచుకుపోయే ఆమె స్వభావాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడంలేదు. ఆమెకు సాధ్యమైనంతవరకు దూరంగా ఉంటేనే మంచిది. ఆమె మనసుకు ప్రశాంతత అన్నా లభిస్తుంది' అనుకున్నాడు.

సాగర్, రేఖ మూడ్ చూసి బాధపడ్డారు మిగతావారు. ఎలాగో ఆ రోజు జూ సందర్శన ముగించుకుని ఇంటికి బయలుదేరారు. ఆరుగురిలో ఏ ఒక్కరూ బయటకు వచ్చామన్న తృప్తి మాత్రం పొందలేకపోయారు. బయటకు వచ్చామన్న ఆనందం ఏ ఒక్కరికీ కలగలేదు. నీరసంగా ఇళ్ళకు చేరుకున్నారు. ఇంటికి చేరుకోగానే సాగర్ మళ్ళీ బయటకు వెళ్ళిపోయాడు.

పాప మాత్రం "ఎక్కలికి నాన్నా?" అని అడిగింది.

"ఇప్పుడే వస్తానమ్మా!" అని బయటకు నడిచాడు.

అలా వెళ్ళిన సాగర్ ఆ రోజు రాత్రి ఇంటికి రాలేదు. అతడొస్తాడనుకుని అందరూ అర్ధరాత్రివరకూ ఎదురుచూస్తూనే ఉండిపోయారు.

కానీ అతను రాకపోయేసరికి 'ఈ జీవితం ఎప్పటికి చక్కబడుతుందో? అసలు వీళ్ళిద్దరి మధ్యా అగాధానికి కారణమేమిటి? అది తెలిస్తే తామేం చెయ్యాలో తెలుస్తుంది. వీళ్ళిద్దరూ ఇప్పట్లో కలిసి జీవించరా? ఇద్దరూ చదువుకున్నవాళ్ళే. అర్థం చేసుకోగలవాళ్ళే. కానీ పట్టుదల, మొండితనం వదులుకోలేరు. ఎవరి అభిజాత్యం వారిది. ఇంతకీ ఎవరిది తప్పో ఎవరు నిర్ణయించగలరు? పోనీ పెద్దవాళ్ళం మున్నాం కదా! వాళ్ళ సమస్య తమకైనా చెబుతారేమోననుకుంటే ఎవరూ నోరు విప్పరు. భగవాన్! ఈ వయసులో మాకేమిటి శిక్ష?' నారాయణరావు, రాధాదేవి బాధను చూడలేకపోయింది రేఖ. అదే సమయంలో రేఖ అమ్మా నాన్నా వచ్చారు. వాళ్ళను పెళ్ళిలో చూసింది కాబట్టి తేలిగ్గానే గుర్తుపట్టింది మనూ.

"ఆంటీ! ఆంటీ! తాతయ్యా, అమ్మమ్మ వచ్చాలు. తొంలగా లా"

పాప పిలుపు విని బయటకు వచ్చిన రేఖకు సుమిత్ర, సుదర్శనరావులను చూడగానే ముఖంలోకి వెలుగువచ్చింది. వాళ్ళను లోపలికి ఆహ్వానించి, మంచినీళ్ళు అందించింది. ఈలోగా లోపలనుండి నారాయణరావు, రాధాదేవి వచ్చారు.

వాళ్ళ కుశలప్రశ్నలైన తరువాత మనూని రమ్మని పిలిచింది సుమిత్ర. ఆమె పిలవగానే పరిగెత్తింది మనూ. ఆమెను ఒళ్ళో కూర్చోబెట్టుకుని "నాన్న ఏరమ్మా? లేరా?" అని అడిగింది.

"లేలుగా! చల్మ అంకుల్‌తో ఎల్లాలు"

"మరి నువ్వు వెళ్ళలేదేం?"

"ఏమో తీసుకెల్లలేదు" పాప జవాబుకి రేఖను చూసింది సుమిత్ర. తల్లి తననే చూస్తుండటంతో చూపు మరల్చింది రేఖ. ఇంకా అల్లుడు, కూతురు మధ్య సఖ్యత కుదరలేదని అర్ధమైంది. కూతురుకు ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో ఆ తల్లిదండ్రులకు పాలుపోవటంలేదు. చూస్తూ చూస్తూ కూతురు కాపురం ఎక్కడ కూలిపోతుందోనన్న భయం వాళ్ళను కుదురుగా ఉండనివ్వక ఇలా తీసుకొచ్చింది.

పెద్దవాళ్ళుగా తాము కల్పించుకోకపోతే ఎప్పటికీ వాళ్ళు రాజీపడరని తేలిపోతోంది. వాళ్ళకు నచ్చచెప్పడం పోయి వాళ్ళతోపాటు తాము కూడా మౌనం దాల్చటం సరికాదని వాళ్ళకు తెలిసిపోయింది. వీళ్ళ ఆలోచనలు ఇలా ఉండగానే అమ్మానాన్నలకు కాఫీ తేవటానికి లోపలికి వెళ్ళింది రేఖ.

ఆమె అటువెళ్ళగానే "వదినా! రేపు ఒకసారి మీరు మా యింటికి రండి. మీరూ రండి అన్నయ్యగారు. వీళ్ళిద్దర్నీ కూర్చోబెట్టి అసలు సమస్య ఏమిటో తెలుసుకుందాం. వీళ్ళే సర్దుకుపోతారులే అనుకుంటే ఇద్దరూ భీష్మించుక్కూర్చుంటున్నారు గానీ ఎవరూ తగ్గటంలేదు. ఈ రోజు అమ్మాయిని మేము తీసుకెళ్తాం. రేపు మీరు అబ్బాయితో రండి" అన్నది సుమిత్ర.

"అబ్బాయి వస్తాడో రాడో మరి" సుమిత్రకు, నారాయణరావుకు ఒకే సందేహం వచ్చింది.

"ఈయన పుట్టిన రోజని చెప్పండి. అందుకే పిలిచేందుకు వచ్చామని చెప్పండి"

అబద్ధమైనా పిల్లల భవిష్యత్తు కోసం చెప్పటంలో తప్పులేదని భావించారు వారంతా.

రేఖ తెచ్చిన కాఫీ తాగిన తరువాత "అమ్మా రేఖా! ఇక్కడికి వచ్చిన తరవాత మమ్మల్ని పూర్తిగా మరిచిపోయినట్లున్నావు. ఇప్పుడు నిన్ను తీసుకెళ్దామనే ఇటు వచ్చాం. మీ అత్తగారు, మామగారు కూడా ఒప్పుకున్నారు నిన్ను పంపడానికి" తల్లి మాటలకు అత్తగారిని చూసింది.

"వెళ్ళిరా రేఖా! వాళ్ళకు మాత్రం ఎవరున్నారు. నువ్వు తప్ప.."

'తానిప్పుడు వెళ్ళటమే మంచిది. సాగర్ నుండి తప్పించుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశం లభించదు. అతను ఎప్పటివరకూ ఉంటాడో అన్నాళ్ళు అమ్మావాళ్ళ దగ్గర గడిపేస్తే మనసుకి కాస్త హాయి లభిస్తుంది' అనుకుంది రేఖ.

తల్లితోపాటు తన గదిలోకి వెళ్ళింది బట్టలు సర్దుకునేందుకు. వాళ్ళిద్దరితోపాటే మనూ కూడా లోపలికి వెళ్ళి "ఆంతీ ఊలెల్లుతున్నావా? నేనూ వత్తా" అనటంతో "అలాగే తల్లీ! రా. నీకు అడ్డం ఏమున్నది?" అన్నది సుమిత్ర.

మనూను తీసుకెళ్తేగానీ సాగర్ తిక్క కుదరదు అనుకుంది రేఖ. బయటకు వచ్చి మనూ కూడా వస్తానంటూ మారాం చేస్తోందని అత్తగారికి చెప్పి, "దాని బట్టలుకూడా సర్దుతాను. మళ్ళీ రేపు సాయంత్రం తీసుకొచ్చేస్తాను" అంది.

"అది లేకుండా సాగర్ ఒక్క క్షణం కూడా ఉండడు. ఇప్పుడు దాన్ని నువ్వు తీసుకెళ్తే ఏమంటాడో" అనుమానంతో అంటున్న అత్తగారిని నవ్వుతూ చూసింది.

"ఏమీ అనరు. పాపకు కూడా కాస్త కొత్త ప్రదేశం చూసినట్టుంటుంది ఏమన్నా అంటే నేను చెప్పుకుంటాలెండి. అంతగా ఆయన ఉండలేకపోతే రేపొద్దున వచ్చి తీసుకెళ్ళమని చెప్పండి" అన్నది.

రేఖ మాటలకు ఇదీ ఒకందుకు మంచిదేననుకుంది రాధాదేవి. పాపకోసమైనా రేపు సాగర్, సుదర్శనరావు ఇంటికి వెళ్ళక తప్పదని భావించింది.

సుదర్శనరావు, సుమిత్రలతోపాటు రేఖ, మనూ కూడా బయలుదేరారు. మనూకి ఎక్కడికన్నా వెళ్ళాలంటే ఎక్కడలేని హుషారు వస్తుంది. రేఖను పీడించి అప్పటికప్పుడు డ్రస్ మార్చుకుంది. జడవేయించుకుంది. అందరికన్నా తానే ముందు కార్లో కూర్చుని నారాయణరావు, రాధాదేవికి టాటా చెప్పింది. కారు బయలుదేరుతున్న సమయంలో రాధాదేవిని దగ్గరకు పిలిచి "పోనీ మీలూ లాకూడదూ!" అని చెప్పటం చూసి ఆ సమయస్ఫూర్తికి అందరూ హాయిగా నవ్వేశారు.

అందుకే చిన్నపిల్లలుంటే వారి ముద్దుముద్దు మాటలకు, చేష్టలకు మనసులో ఎంతభారం ఉన్నా ఇట్టే మాయమవుతుందంటారు. సరిగ్గా ఎవరి మనసులోనైనా నిరాశా, నిస్పృహ గూడుకట్టుకుంటున్న సమయంలో తన చేష్టలతో వాటిని దూరం చేస్తోంది మనూ. అందుకే పసిపిల్లల్ని దేవుళ్ళంటారు. వాళ్ళ మనసులో ఎటువంటి కల్మషం, కాలుష్యం ఉండవు.

సాగర్ ఎలాగూ ఆ రాత్రి ఇంటికి రాలేదు. పాపలేకుండా ఒంటరిగా ఉండటంలో ఉన్న వేదన ఆ రాత్రి పూర్తిగా అనుభవించాడు. అందుకే పాపను చూడాలన్న ఆత్రుతతో ఉదయమే ఇంటికి వచ్చాడు. పాప అలికిడి ఎక్కడా లేకపోవటంతో తల్లిని అడిగాడు. అప్పటికే ఇల్లంతా వెతికాడు. పాప ఎక్కడా కనబడలేదు.

"నిన్న సాయంత్రం మీ మామగారు, అత్తగారు వచ్చారు. ఇవాళ ఆయన పుట్టినరోజట. రేఖను తీసుకెళ్తుంటే వాళ్ళతోపాటే తానూ వెళ్తానని పేచీపెట్టి వెళ్ళింది. ఇప్పుడెలాగూ అందరం అక్కడికి వెళ్తాంకదా! తీసుకొచ్చేద్దాంలే" అన్నది.

ఆ మాటలకు నీరుగారిపోయాడు. పాపకోసమే తాను జీవిస్తున్నానని అతనికి అర్థమైంది ఆ ఒక్క రాత్రితో. పాపను ఎంత త్వరగా చూద్దామా అన్న ఆతృతతో ఇంటికి వస్తే మనూ కనిపించకపోవటంతో అతనికి చిరాకు ఎక్కువైంది. ఎవరినీ ఏమీ అనలేక చేసేదేమీ లేక గబగబా తయారయ్యాడు.

"అమ్మా! మీరు తీరిగ్గా తర్వాత రండి. నేను వెళ్తాను" వారికి మరో అవకాశం ఇవ్వకుండా వెళ్ళిపోతున్న కొడుకుని చూస్తుండిపోయింది రాధాదేవి.

కొడుక్కి మనూ అంటే ఎంత ప్రాణమో ఆమెకి తెలిసిందేగా!

వెళ్తూనే శర్మకు ఫోన్ చేశాడు. వెంటనే రేఖ వాళ్ళింటికి లలితతో రమ్మని చెప్పాడు. శర్మ ఏదో చెబుతున్నా వినిపించుకోకుండానే ఫోన్ పెట్టేశాడు. కారు జూబ్లీ హిల్స్ నుండి బంజారా హిల్స్‌కు తిరిగింది. అసలే రాత్రంతా నిద్రలేదేమో అలసట అనిపించింది. కాఫీ తాగుదామని హోటల్‌లోకి కారు పోనిచ్చాడు. కారును పార్కింగ్‌లో ఆపి దిగాడు. అతనికి చెట్టుకింద ఎదురుగా ఒక జంట నిలబడివుంది. ఆమెను చూడగానే ఎక్కడో చూసినట్లనిపించింది. ఎక్కడ చూశాడో ఒక పట్టాన గుర్తురాలేదు. ఆమె కూడా అతన్ని చూస్తోంది. అతన్ని గుర్తుపట్టి దగ్గరకు వచ్చింది. ఆమెతోపాటు ఆమె పక్కన ఉన్న వ్యక్తికూడా.

"గుర్తుపట్టారా సార్! పాప ఎలా వుంది?"

అప్పుడు గుర్తుకొచ్చింది ఆమె... అవును. ఆ రోజు ఆస్పత్రిలో పాపను తనకు అప్పగించిన మనిషి. ఆమెను ఇప్పుడు చూడగానే ఏదో కీడును శంకించింది అతని మనసు. అసలే మనసు చికాకుగా ఉంది. ఇప్పుడు ఈమె కనబడటం ఆ చికాకు మరింత ఎక్కువ చేసింది.

"ఏమ్మా! బాగున్నావా?" పక్కనున్న వ్యక్తి ఎవరు అన్నట్టు చూశాడు.

"ఈయన మావారు"

"మీవారా?"

"అవును సార్. మీ ఇంటికే బయలుదేరాం. దారిలోనే మీరు కనిపించారు" అన్నాడు అతను.

"మా ఇంటికా! నాతో మీకేం పని?"

అతని మనసులో ఏదో అనుమానం.

"ఒక్కసారి పాపను చూడాలని ఉంది సార్. అప్పుడు నేను చేసింది తప్పే. తప్పు తెలుసుకునేసరికి జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. దాన్ని సరిదిద్దుకునేందుకు అప్పటినుండీ ప్రయత్నిస్తూనే ఉన్నాం."

అతని మాటలకు గతుక్కుమన్నది సాగర్ హృదయం. కొంపదీసి పాపాయిని తీసుకెళ్తామనరుకదా! అదే జరిగితే తానేం చేయగలడు? తల్లిదండ్రులు ఇద్దరూ తమ బిడ్డను తమకిచ్చేయమని అడిగితే ఇవ్వననటానికి తనకు హక్కు ఏమున్నది? కాకపోతే పాపలేకుండా తాను జీవించగలడా? దానితోనే తన భావిని ముడిపెట్టుకున్నాడే కట్టుకున్న భార్యకు తనెలాగూ అక్కర్లేదు. ఇప్పుడు పాపకూడా లేకపోతే?

"ఏమిటిసార్ ఆలోచిస్తున్నారు?"

"ఏమీలేదు. తలనొప్పిగా ఉంటేనూ కాఫీ తాగలని."

"రండిసార్. మేమూ అందుకే వచ్చాం ఇక్కడికి" లోపలికి దారి తీశాడు. అనుసరించక తప్పలేదు.

కాఫీ తాగిన తరువాత "మీకారులో మీరు పదండి సార్. మా కారులో మేము మిమ్మల్ని ఫాలో అవుతాము. ఒక్కసారి పాపను చూస్తాం అతని కోరికను కాదనలేకపోయాడు.

ఏదైతే అదే అవుతుందని అలాగేనన్నట్టు తలూపాడు. అక్కడినుండి సరాసరి మామగారింటికి దారితీశాడు.

ఈ సమయంలో శర్మను కూడా రమ్మని పిలవటం ఎంతో మంచిదైంది అనుకున్నాడు.

కార్లు రెండూ సుదర్శనరావు కాంపౌండ్‌లోకి ప్రవేశించాయి.

కారు పార్కింగ్ చేసి తనతో రమ్మని ఆ దంపతుల్ని పిలిచాడు.

మౌనంగా ముగ్గురూ ఇంట్లోకి ప్రవేశించారు.

కారు శబ్దం విని లోపలెక్కడో ఉన్న పాప పరిగెత్తుకు వచ్చింది.

తండ్రిని చూడగానే "నాన్నా" అంటూ కాళ్ళకు చుట్టేసింది. పాపను ఎత్తుకుని ముద్దాడాడు. తనతో వచ్చిన ఇద్దర్నీ అక్కడే ఉన్న సోఫాలో కూర్చోమన్నట్టు చూశాడు.

ఇంతలో లలిత, శర్మ లోపలికి వచ్చారు.

కొత్త వ్యక్తుల్ని చూసి ఎవరు అన్నట్టు సాగర్ వైపు చూశారు.

ఇంతలో హాల్లో ఏవో మాటలు వినబడటంతో సుదర్శనరావు, సుమిత్ర, రేఖ వచ్చారు. సాగర్‌ను చూడగానే సుదర్శనరావు, సుమిత్ర ముఖాల్లో ఎక్కడలేని సంతోషం వ్యక్తమైంది. పెళ్ళయిన తరువాత మొట్టమొదటిసారి తమ ఇంటికి వచ్చిన అల్లుణ్ణి చూసి ఆ అత్తామామలు మురిసిపోయారు.

రేఖ ముఖం మాత్రం ముడుచుకుపోయింది. అది గమనించిన సాగర్ ఎక్కువసేపు అక్కడ ఉండటం మంచిదికాదనుకున్నాడు.

తనతోపాటు వచ్చిన వాళ్ళను చూపిస్తూ "వీరు.." పేర్లు తెలియకపోవటంతో ఆగిపోయాడు.

"సాగర్‌గారూ! మేమే పరిచయం చేసుకుంటాం. అయ్యా మీరెవరో నాకు తెలియదు. కానీ సాగర్‌గారి పేరు మా ఆవిడ ద్వారా తెలిసింది. కానీ మా పేర్లు ఆయనక్కూడా తెలియవు. అంత సహృదయుడు, మీకు ఏమవుతారో మాకు తెలియదుకానీ, ఆయన మాకు మాత్రం దేవుడితో సమానం" అంటుంటే సాగర్ అంటే అతనికున్న గౌరవం స్పష్టంగా బయటపడుతోంది.

అక్కడ ఉన్న వాళ్ళంతా సాగర్‌ను గురించి అతను గొప్పగా చెబుతుంటే ఒక్కరు తప్ప మిగతా వారి ముఖాల్లో ఆనందం ముప్పిరిగొంది.

"అయ్యా! మీరెవరో తెలియకపోయినా మాకు కావలసినవారికిందే లెక్క. ముక్కూ ముఖం తెలియని మీకు సాగర్ ఇంత ఆత్మీయుడయ్యాడంటే అది మాకెంతో ఆనందదాయకం" అన్నాడు శర్మ.

"సాగర్ మా అల్లుడుగారు. ఇదిగో ఈమె మా అమ్మాయి రేఖ" పరిచయం చేశాడు సుదర్శనరావు.

వారికి రేఖ నమస్కారం చేసింది.

"అమ్మా! సాగర్ వంటి భర్త లభించటం మీ పూర్వజన్మ సుకృతం. నిజంగా మీ అంత అదృష్టవంతులు మరొకరుండరు" కొత్తగా వచ్చిన అమ్మాయి అన్నది.

"ఇంతకీ మేమెవరం అన్న అనుమానం తీర్చాలి కదా! అయ్యా నా పేరు మురళి. ఈమె నా భార్య సరస్వతి. మా పెళ్ళికి ముందే మేం చేసిన తప్పుకి సరస్వతికి నెలతప్పింది. సరిగ్గా అదే సమయంలో నేనామెను పట్టించుకోకుండా విదేశాలకు వెళ్ళిపోయాను. తీరా వెళ్ళిన తరువాతగానీ సరస్వతికి నెల తప్పిన సంగతి నాకు తెలియలేదు. ఆమెతో మాట్లాడేందుకు అవకాశం చిక్కలేదు. ఆమె తల్లిదండ్రులు ఆ అవకాశం నాకివ్వలేదు. నేను మోసం చేశానని ఆమెను నమ్మించారు. ఆమె కూడా వారి మాటలు నమ్మింది. నెలలు నిండి ప్రసవం రోజున ఆమెను అపోలో ఆస్పత్రికి తీసుకెళ్ళారు ఆమె తల్లిదండ్రులు. అదే సమయంలో మీ అమ్మాయి రేఖకు ఏక్సిడెంట్ జరగటం, సాగర్‌గారు ఆమెను ఆస్పత్రిలో చేర్చటం అప్పుడే జరిగింది. మీ అమ్మాయికి ట్రీట్‌మెంట్ జరుగుతున్నప్పుడే సరస్వతి ఆడపిల్లను ప్రసవించింది. తరువాత ఆమె స్పృహలోకి వచ్చేసరికి భర్తలేని పిల్లను సంఘంలో సాకటం కష్టమని సరస్వతికి ఆమె తల్లిదండ్రులు బ్రెయిన్‌వాష్ చేశారు. ఆమెకూడా తల్లిదండ్రుల మాట కాదనలేకపోయింది. పిల్లను అనాధ శరణాలయానికి ఇచ్చేద్దామని వాళ్ళు భావించారు. సరిగ్గా అప్పుడు అక్కడే ఉన్న సాగర్‌గారు అబ్బే! అనాథశరణాలయానికి ఎందుకు? తనకిస్తే పువ్వుల్లో పెట్టుకుని పెంచుకుంటానని డాక్టర్‌కు చెప్పారు. తానెవరో కూడా ఆయనకు తెలియజేయటంతో ఆయన ఉన్నతకుటుంబం గురించి తెలిసిన డాక్టర్ సరస్వతికి, ఆమె తల్లిదండ్రులకు నచ్చచెప్పి పాపను సాగర్‌గారికి అప్పగించారు. అప్పటినుండి పాపను సొంతబిడ్డలా పెంచుతున్నారు"

"అంటే అంటే మనూ? " అందరూ స్థాణువులయ్యారు. రేఖకు మతిపోతోంది. నిలబడలేక పక్కనే ఉన్న కుర్చీలో కూలబడింది. తానెంత అపార్థం చేసుకున్నది. ఎన్ని బాధలు పెట్టింది. ఇంత ఉన్నత సంస్కారినా తాను కుసంస్కారిగా హేళన చేసింది తానెన్ని మాటలన్నా ఒక్కమాటకూడా అతను అనలేదు.

"తరువాత నేను అమెరికానుంచి వచ్చి అతికష్టంమీద సరస్వతిని కలుసుకున్నాను. జరిగింది తెలుసుకుని ఆమెను భార్యగా స్వీకరించాను. పాపగురించి సరస్వతి చెప్పి తట్టుకోలేకపోయింది. సాగర్‌గారి గురించి అపోలో డాక్టర్ దగ్గర వివరాలు తెలుసుకున్నాం. పాపను ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఆతృతతో ఎదురుచూస్తున్న మాకు దేవుడల్లే సాగర్‌గారు ఈరోజు ఎదురువచ్చారు. అందుకే పాపను చూద్దామని వచ్చాం"

అతను చెప్పటం అయిపోవటంతో ఆగిపోయాడు.

సాగర్ తన దగ్గరే ఉన్న పాపను చూపించి "ఇదిగోనండి మీ పాప, మేం పెట్టిన పేరు మనస్విని" అప్పటికే అతని గొంతు గద్గదమైంది.

ఈరోజు నుండి పాప తనకు దూరం కానుంది. తాను తట్టుకోగలడా? కానీ పాప తల్లిదండ్రులకు వారి పాపను అప్పగించకుండా ఎలా ఉంటాడు? ఇవ్వననటానికి తనకేం అధికారం ఉంది? కేవలం మూడేళ్ళు పెంచినంత మాత్రాన తనకేం రక్తసంబంధం ఉంటుంది? మరి పాపను వదులుకుని తానసలు బతికి ఉండగలడా? కష్టమే..! తను జీవించి ఉండటం కోసం పాపను ఇవ్వననటం న్యాయంకాదు.

సాగర్ ఆలోచనలు అక్కడున్న వారిలో ఇద్దరికి మాత్రమే అర్థమవుతున్నాయి. శర్మ, లలిత మాత్రం సాగర్‌ను జాలిగా చూస్తుండిపోయారు. సాగర్ పరిస్థితి వాళ్ళకు అర్థమవుతోంది. పాపలేకుండా సాగర్ ఉండలేడు. అలాగని ఆమెను అప్పగించకుండానూ ఉండలేడు.

ఎందుకితని జీవితంతోనే విధి ఇలా ఆడుకుంటోంది? భార్య దగ్గరికి తీయదు. దగ్గరికి తీసిన బిడ్డ వెంట ఉండే పరిస్థితి లేదు. ఏమైపోతాడు? ఈ విషమపరిస్థితి నుండి ఎలా బయటపడతాడు? కనీసం భార్య అయినా ఇతన్ని అర్థం చేసుకుంటే పరిస్థితి వేరుగా ఉంటుంది. ఇంత మంచిమనిషికి ఈ దుస్థితి ఏమిటి?

పాపను రమ్మని మురళి, సరస్వతి ఇద్దరూ చెయ్యి జాపారు. ఎవరైనా పిలిస్తే పరిగెత్తే పాప అక్కడ బేలగా నిలబడిన సాగర్‌ను చూసి మురళి, సరస్వతి దగ్గరకు వెళ్ళడానికి ఇష్టపడలేదు. కొత్తకదా అనుకున్నారు వాళ్ళు. మురళే లేచి వచ్చి పాపను ఎత్తుకున్నాడు. బిక్కముఖం వేసింది మనూ. ఆమెకు ఏడుపు ఒక్కటే తక్కువ. ఆమె ముఖం చూసి తాను అందుకుందామనుకున్నాడు సాగర్. కానీ ధైర్యం చాలలేదు.

వాతావరణం గంభీరంగా ఉండటంతో రేఖను తనతో రమ్మని సైగచేసి లోపలికి నడిచింది సుమిత్ర.

వాళ్ళతో తనూ వెళ్దామని అనుకున్న లలిత వెళ్ళలేకపోయింది. అక్కడి వాతావరణంలో తానూ, శర్మ ఇద్దరూ సాగర్‌కు పక్కనే ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె భావించింది. ఎలాగూ రేఖ ఆపని చేయదు. అతని ఆత్మీయులుగా అతనికి ధైర్యం చెప్పటం తమ కర్తవ్యం అనుకుని ఉండిపోయింది.

ఏడుపు ముఖంతో దిగాలుగా మురళి చేతుల్లో ఉన్న మనూని సాగర్ తీసుకోవటానికి సంశయిస్తున్నాడని గ్రహించి చొరవగా తాను తీసుకుని మంచినీళ్ళు తాగించి తీసుకువస్తానని లోపలికి నడిచింది.

మిగిలిన వాళ్ళంతా మౌనంగా కూర్చుండిపోయారు.

ఇంతలో నారాయణరావు, రాధాదేవి వచ్చారు. వస్తూనే "మా మనవరాలేదీ?" అని అడిగింది రాధాదేవి. అక్కడి వాతావరణం గమనించి సాగర్‌వైపు చూసింది. అతను జీవంలేని చూపు చూశాడు. అతనికి ప్రపంచం చీకటిలో మునిగిపోయినట్లుంది. కళ్ళు తిరుగుతున్నాయేమోనని, ఏ క్షణంలోనైనా పడిపోయేలా ఉన్నాడు.

సాగర్ మానసిక పరిస్థితిని గమనించాడు శర్మ.

"అయ్యా! మనం పాప గురించి భోజనాలు అయిన తరువాత మాట్లాడుకుందాం. ఇప్పుడు సాగర్‌కు విశ్రాంతి అవసరం" అని సాగర్ చెయ్యిపట్టుకుని లేపాడు శర్మ.

"బాబాయిగారూ! బెడ్‌రూం ఎటు?" సుదర్శనరావుని అడిగాడు.

సుదర్శనరావు చూపించిన వైపు సాగర్‌ను నడిపించాడు. అసలు సాగర్‌లో ఓపికలేదు. తూలుతున్నాడు. అంతలో లోపల్నించి వస్తున్న రేఖ అతని పరిస్థితి గమనించింది. శర్మ ఒక్కడే అతన్ని పట్టుకోలేకపోతున్నాడని గ్రహించి పరిగెత్తుకు వచ్చి రెండోవైపు తాను పట్టుకుని తన బెడ్ రూమ్ వైపు నడిపించింది.

ఇద్దరూ చెరో రెక్కపట్టుకుని తీసుకెళ్తుండగా తూలుకుంటూనే నడిచాడు సాగర్. వాళ్ళు తీసుకెళ్తున్న సంగతి కూడా అతనికి తెలియలేదు. అలా తీసుకెళ్ళి మంచం మీద పక్క సరిచేసి పడుకోపెట్టారు. ఏసీ ఆన్‌చేసి అతని కాళ్ళను బెడ్ మీదకు తెచ్చి కాళ్ళకున్న షూస్, సాక్స్ తీసి పక్కన పడేసింది. ఆమె చేస్తున్న ఉపచారాలను గమనించి శర్మ ఊపిరిపీల్చుకున్నాడు.

మంచినీళ్ళు తీసుకొస్తానంటూ మళ్ళీ పరిగెత్తింది. అప్పటికే సాగర్ పరిస్థితి ఏమీ బాగోలేదు. ఒళ్ళంతా చెమటలు. చొక్కా తడిసిపోయింది. నీళ్ళగ్లాసుతో వచ్చిన రేఖ అతని పరిస్థితి చూసి కంగారుపడింది.

"ఇదేమిటి శర్మ అన్నయ్యా ఇలా అయిపోతున్నారు? నాకేదో భయంగా ఉంది. వెంటనే డాక్టర్ని పిలవటం మంచిదేమో?"

తనను మొట్టమొదటిసారిగా అన్నయ్యా అని పిలవటం ఆమెలో మార్పుకి సంకేతమనుకున్నాడు. బయటకు పరిగెత్తి ఫోన్‌లో డాక్టర్ ముకుందరావుకు చెప్పాడు. ఆయన వెంటనే బయలుదేరుతున్నానని చెప్పాడు. "ఏమైందండీ సాగర్‌గారికి? హఠాత్తుగా ఎందుకలా అయ్యారు?" సరస్వతి అడిగింది భయంగా.

"ఏమీలేదండీ పాప ఎక్కడ తనకి దూరమవుతుందోనని భయపడుతున్నాడు. పాపమీద ఈగవాలినా సహించలేడు. అపురూపంగా పెంచుకుంటున్న పాప ఇవాళ తల్లిదండ్రులు వచ్చేసరికి ఎక్కడ దూరమవుతుందోనని తట్టుకోలేకపోయాడు. పాపను వదులుకోలేడు. మీకు ఇవ్వననలేడు. సతమతమవుతున్నాడు" శర్మ మాటలకు అక్కడున్న వారంతా కళ్ళనీళ్ళ పర్యంతమయ్యారు.

పదినిమిషాల్లో డాక్టర్ ముకుందరావు వచ్చాడు. వస్తూనే అక్కడ నారాయణరావును చూసి విష్ చేశాడు.

"ఎక్కడ ఉన్నాడు సాగర్. పదండి శర్మా!" ఆయనతోపాటు లోపలికి నడిచాడు.

బెడ్‌రూములో సాగర్ కాళ్ళ దగ్గర ఒరిగిపోయి బేలగా అతన్నే చూస్తోంది రేఖ.

డాక్టర్‌ను చూసి లేచి నిలబడింది. అప్పటికే ఆమె ముఖం కన్నీటి ధారలతో నిండిపోయింది.

"మిసెస్ రేఖా! ఇలా దిగులుగా ఇక్కడ కూర్చోవద్దు. మీరు కాస్త బయటకు వెళ్ళండి. పేషెంట్‌ను థరోగా చెక్‌చెయాలి" అంటూ అసలేం జరిగిందని శర్మను అడిగాడు.

శర్మ చెప్పే మాటలు వింటూనే సాగర్‌ను చెక్ చేస్తున్నాడాయన.

"అంటే పాప దూరం కావటం భరించలేడన్నమాట. అంత సున్నితహృదయుడా! అయినా పాప తల్లిదండ్రులతో మనం తరువాత మాట్లాడదాం" అంటూ ఇంజెక్షన్ ఇచ్చాడు. తరువాత శర్మతో బయటకు వచ్చాడు.

బయట గుమ్మం దగ్గరే నిలబడి ఉన్న రేఖను చూసి "మరేం భయంలేదమ్మా! కొద్దిసేపట్లో తేరుకుంటాడు. అంతవరకు నువ్వు అతని దగ్గరే ఉండు. నేను బయట ఉంటాను. అవసరమైతే పిలువు" అని హాల్లోకి వచ్చాడు.

"సుదర్శనరావుగారూ! మీ అల్లుడికి పాతికేళ్ళు ఉంటాయేమో. ధృఢంగా ఉండవలసిన ఈ వయసులో మరీ ఇంత సున్నితహృదయుడైతే ఎలాగండీ బాబూ! ఈ విషయంలో మీరు, మీ అమ్మాయి అంత అదృష్టవంతులు మరొకరుండరేమో. అమ్మాయి కూడా బెంబేలు పడుతోంది. కాస్త వాళ్ళ అమ్మను కనిపెట్టుకుని ఉండమని చెప్పండి" అన్నాడు.

అల్లుడి గురించి ఇంతమంది ఇంతగొప్పగా చెబుతుంటే ఆయన పొంగిపోతున్నాడు.

ఒక్క తన కూతురు మాత్రమే ఇది అర్థం చేసుకోలేకపోతోంది.

ఆడవాళ్ళంతా సాగర్ ఉన్న గదిలోకి వెళ్ళారు.

అక్కడ దృశ్యం వాళ్ళకు నోటమాట రాకుండా చేసింది.

సాగర్ కాళ్ళ దగ్గర కింద కూర్చుని రేఖ వెక్కివెక్కి ఏడుస్తోంది.

స్పృహలేని స్థితిలో ఉన్న సాగర్‌కు ఇదెలా తెలుస్తుంది?

"నాన్నా!" తండ్రిని చూసి పెద్దగా అరిచింది లలిత చంకలో ఉన్న మనూ.

ఆమెను వదిలేసింది లలిత. పరిగెత్తుకుంటూ మంచం ఎక్కి తండ్రి పొట్టమీద పడుకుండిపోయింది. తండ్రి మెడచుట్టూ చేయి వేసింది. వదిల్తే తండ్రి ఎక్కడికైనా వెళ్ళిపోతాడేమోనన్న అనుమానంతో. ఆ తండ్రీ కూతుళ్ళ అనుబంధానికి వారంతా కన్నీరు పెట్టుకున్నారు. కన్నబిడ్డకాకపోయినా అంతకంటే ఎక్కువగా ఇంత అపురూపంగా ఎవరు పెంచుతారు? అంత విశాలహృదయం ఎందరికి ఉంటుంది?

పాప కాళ్ళు కందిపోతాయేమోనని నడవనిచ్చేవాడు కూడా కాదు. పాప కోరిందల్లా క్షణాల్లో తెచ్చిపెట్టేవాడు. పాప వియోగాన్ని ఏనాడూ ఊహించలేదు అతను. అలాంటివాడు ఇప్పుడు పాపను వదిలిపెట్టాలంటే ప్రాణాలు అయినా వదుల్తాడేమోగానీ పాపను వదులుకునేందుకు సమ్మతించడు. లలిత నెమ్మదిగా రేఖ చెయ్యి పుచ్చుకుని లేపేందుకు ప్రయత్నించింది.

రేఖ తన చేతిని గుంజుకుని "నన్నిక్కడే ఉండనియ్యవే. ఆయన కుదుటపడేవరకు నేను ఇక్కడినుండి లేవను. దయచేసి నన్ను అవతలకి తీసుకెళ్ళేందుకు చూడవద్దు. నేను చేసిన అన్యాయమే ఆయన్నిలా కాటు వేస్తోందేమో? నాలాంటి దుర్మార్గురాలికి భర్త అయితే ఇంతకన్నా సుఖం ఏముంటుంది? పెళ్ళయిన తరువాత ఒక్కరోజు కూడా నవ్వుతూ పలకరించలేదు. ఏనాడూ ఆయనకు కనీసం మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు. ఒక్కసారి కూడా ఆయనకు భోజనం పెట్టలేదు. ఏనాడూ సేవచేసేందుకు ప్రయత్నించలేదు. నాలాంటి కఠినాత్మురాలు ఎక్కడైనా ఉంటుందా? మీరంతా ఆయన మంచితనాన్ని, నిర్మలత్వాన్ని గురించి చెబుతుంటే మూర్ఖురాలిని గ్రహించలేకపోయాను" బిగ్గరగా విలపించింది.

రేఖ విలపించటం, అందరూ బిక్కముఖాలు వేసుకుని ఉండటం మనూని భయపెట్టింది. తానూ తండ్రిని కౌగిలించుకుని ఏడవటం మొదలుపెట్టింది.

రేఖను, పాపను అక్కడే వదిలేసి అందరూ బయటకు వచ్చేశారు. వారికి ఎదురు వస్తూ శర్మ ఎలా ఉంది అని అడిగాడు. లోపలికి వెళ్ళి చూడమన్నట్లు చూసింది లలిత. లోపలికి తొంగిచూసిన శర్మకు కూడా పాపను, రేఖను చూస్తే ఏడుపు ముంచుకొచ్చింది. కళ్ళు తుడుచుకుంటూ వెనక్కి వచ్చేశాడు.

డాక్టర్ ముకుందరావు పరిస్థితి గమనించాడు. ఇలా వీళ్ళంతా కన్నీళ్ళతో విలపిస్తూ పేషెంట్‌కు మరింత గాబరా పుట్టిస్తారని అనుకున్నాడు. ఏదో ఒకటి తానే చెయ్యాలని మళ్ళీ గదిలోకి నడిచాడు. ఏడుస్తున్న చంటిబిడ్డను జాలిగా చూశాడు.

పాపను ఎత్తుకుని తనతోపాటు లోపలికి వచ్చిన శర్మకు అందిస్తూ "అక్కడ నా బ్యాగ్‌లో చాక్‌లెట్ ఉంది ఇవ్వు" అన్నాడు.

"నాకొద్దు" అంది పాప.

"ఏమమ్మా?" అని అడిగాడు.

"చాక్‌లెట్లు తినొద్దని నాన్న చెప్పాలు" పాప జవాబు వింటే తండ్రీ బిడ్డకు ఉన్న అనుబంధం అర్థమైంది డాక్టర్‌కి.

"అయితే శర్మ అంకుల్ నీకు మంచి టాయ్ కొనిస్తాడులే"

"నాకొద్దు. నాన్న కొన్న బొమ్మలు చాలా ఉన్నాయి."

ఇక పాపను సముదాయించటం తనవల్ల కాదనుకున్నాడు.

"ఎందుకు అంకుల్. నాన్న అలా పలుకున్నాలు, మాట్లాడటంలేదు?" అడిగింది.

"నాన్నకు ఆయి వచ్చిందమ్మా అందుకే మాట్లాడటంలేదు. నువ్వు ఏడిస్తే నాన్నకు ఇంకా ఎక్కువ అవుతుంది. కాసేపు నాన్నను పడుకోనివ్వు" శర్మతో బయటకు పంపాడు బలవంతంగా.

"రేఖా! పాపంటే చిన్నపిల్ల. ఏవో మాయమాటలతో మరిపించగలం. నీకు పరిస్థితి పూర్తిగా తెలుసు. నువ్వు కూడా ఇలా అయితే ఎలా?"

"ఎంత మరిచిపోదామన్నా నేను చేసిన పాపం నన్ను మరవనివ్వటంలేదు. అందుకే ఆయన లేచి నన్ను క్షమించానని ఎంత వరకు నాకు మనశ్శాంతి ఉండదు" ఏడుస్తూనే అంది.

"మరి అతనికి తెలివి రావాలి కదా! తెలివి రావాలంటే సపర్యలు అవసరం కాని, ఏడుపుకాదు. ముదతనికి తెలివిరానివ్వు"

"అతను ఎంత త్వరగా స్వస్థుడవ్వాలంటే నువ్వు అంత ధైర్యంగా ఉండాలి. నువ్వే బేలవైతే ఎలా?" శర్మ అన్నాడు.

బయట మురళి, సరస్వతిలు అనవసరంగా తామొచ్చి ఈ పరిస్థితికి కారణమయ్యామా అన్న అనుమానంతో చిన్నబోయిన ముఖాలతో కూర్చుండిపోయారు. తమను గురించి పట్టించుకునే పరిస్థితి ఇంట్లో ప్రస్తుతం లేదని వారికి అర్థమైంది. వాళ్ళు సాగర్‌ను చూసొచ్చారు. అతని స్థితి వారికి కన్నీరు తెప్పించింది. ఇంత మంచిమనిషికి ఇదేమిటి అనుకున్నారు.

పాప అంటే అతనికున్న అభిమానం, పెంచుకున్న ప్రేమ వారికి అవగతమైంది.

అదే సమయంలో డాక్టర్ ముకుందరావు కూడా వారితో మాట్లాడుతూ, "పాపను మీరు తీసుకెళ్ళటానికి ఇది తగిన సమయం కాదని నా ఉద్దేశం. చూశారుగా పెంచిన ప్రేమ ఎంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉందో కాబట్టి మీరు మరోసారి ఈ ప్రస్తావన తీసుకొస్తే బాగుంటుంది" అన్నాడు.

"అయ్యో! మీరంతగా చెప్పాలా డాక్టర్‌గారూ! పరిస్థితులు మాకూ తెలుసు. ఇప్పుడు మేము వచ్చింది పాపను చూడ్డానికేగానీ తీసుకెళ్ళటానికి కాదు. ఆయన పెంపకం, పాపమీద ఆయనకున్న ప్రేమ చూస్తుంటే కన్నవాళ్ళమైన మేము కూడా అంత ప్రేమగా పెంచేవాళ్ళం కాదేమో. నిజంగా మా పాప ఆయన పెంపకంలో ఉంటేనే మంచిదని మా అభిప్రాయం. మా రాకను మీరు అపార్థం చేసుకుంటున్నారు. పాప ఎక్కడ పెరిగినా మంచి పౌరురాలిగా పెరగాలన్నదే మా ఆశయం. సాగర్ సంరక్షణపై పూర్తి నమ్మకం మాకుంది. ఈ సంగతి మీరు సాగర్‌కు తెలియజేయండి. పాపను ఆయన నుండి దూరం చేసే ఆలోచన మాకు లేదు. కన్నతండ్రిగా పాపను ఇదే మొదటిసారి నేను చూడటం. కేవలం పాప ఎలా ఉంటుందో చూసేందుకే మేము వచ్చాం."

మురళి మాటలు వింటున్న అందరి చెవుల్లోను అమృతం పోసినట్లు అనిపించింది.

మురళి చెప్పింది విన్న ముకుందరావు "మీది అమృతహృదయం" అంటూ ప్రశంసించాడు.

ఆ తరువాత వాళ్ళు సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. మరోసారి వచ్చి సాగర్‌ను కలుస్తామని మురళి చెప్పటంతో అందరూ అతనికి, అతని భార్యకు సాదరంగా వీడ్కోలు చెప్పారు.

ముకుందరావు మళ్ళీ సాగర్ గదిలోకి వెళ్ళి అతన్ని మరోసారి చెక్ చేశాడు. సాగర్‌కు ఇంకా స్పృహరాలేదు. ఎందుకైనా మంచిది ఆస్పత్రిలో జాయిన్ చేసి అబ్జర్వేషన్‌లో ఉంచితే ఉత్తమమనిపించింది ఆయనకు. అదే విషయాన్ని నారాయణరావు, సుదర్శనరావులకు తెలియజేశాడు.

సంగతి తెలుసుకున్న ఆడవాళ్ళు ఘొల్లుమన్నారు. రేఖ సంగతి అయితే చెప్పనక్కర్లేదు.

"మీరు అనవసరంగా కంగారు పడుతున్నారు. అతనికేం పర్వాలేదు. ఆ గ్యారంటీ నేనిస్తాను. కాకపోతే ఇంట్లో కంటే ఆస్పత్రిలో అయితే కేర్ ఎక్కువగా ఉంటుంది. ఎవరు పడితే వాళ్ళు లోపలికి వచ్చి పేషెంట్‌ను డిస్టర్బ్ చేసే అవకాశం ఉండదు. అన్నీ సిస్టర్లే చూసుకుంటారు కాబట్టి పేషేంట్‌కు కూడా విశ్రాంతి ఎక్కువ లభిస్తుంది" అని సముదాయించాడు.

రేఖను చూస్తూ, "రేఖా! ఏమిటమ్మా! చదువుకున్నదానివి ఇలా బేలవైతే ఎలా? నేను చెబుతున్నాను కదా! మీ ఆయన్ని నీకు పువ్వుల్లో పెట్టి అప్పగిస్తాను... కాకపోతే మూడురోజులు ఆగాలి"

"అంతేనా! ఆస్పత్రిలో చేర్చాలని చెపితే భయంకాక మరేం ఉంటుంది. కాకపోతే ఆయనతోపాటు నేనూ పక్కనే ఉంటాను. నేను స్వయంగా చూసుకుంటాను" రేఖ మాటలకు చిన్నగా నిట్టూరుస్తూ సరే అన్నట్లు తలూపాడు.

ఆస్పత్రికి ఫోన్ చేసి అంబులెన్స్ పిలిపించారు. ఆస్పత్రికి తీసుకెళ్తుంటే అంబులెన్స్‌లో నేనొస్తానంటే నేను అంటూ ఆడవాళ్ళంతా పోటీపడ్డారు. మనూ అయితే మరీను.

"నాన్నతో నేనూ వత్తాను. నాన్న దగ్గలే పలుకుంటాను" అంటూ ఉంటే పాపను పట్టుకోవటం కష్టమైపోయింది. పిల్లలపై మరీ అంత ప్రేమ చూపించటం కూడా మంచిది కాదేమోననిపించింది ఆ క్షణంలో అందరికీ. సాగర్ పరిస్థితికంటే మనూను చూస్తుంటేనే అందరికీ మనసు వికలమైపోయింది.

ఆస్పత్రిలో ముకుందరావు దగ్గర ఉండి ఐసియులో చేర్పించాడు. హార్ట్, బిపి, షుగర్ టెస్టులన్నీ ఆయనే దగ్గరుండి చెక్ చేయించాడు అన్ని నార్మల్ అనే వచ్చాయి. అప్పుడుగానీ ఆయన ఊపిరి పీల్చుకోలేకపోయాడు. గ్లాస్‌లో నుండి తండ్రిని చూసి ఏడుపు ఆపుకోలేకపోతోంది మనూ. ఆమెను అక్కడ ఉంచటం మంచిది కాదని నెమ్మదిగా పక్కకు తీసుకొచ్చాడు శర్మ.

తరువాత లలితను పిలిచి "నేను కొద్దిసేపు మనూను తిప్పుకొస్తాను. నువ్విక్కడే ఉండి రేఖను చూస్తుండు" అని చెప్పాడు. లలిత సరేనని తలూపింది.

**శర్మ కారులో** మనూని తీసుకెళ్ళటం చూసిన నారాయణరావు "ఎక్కడికి?" అని లలితను అడిగాడు.

"కాసేపు మనూను తిప్పుకు వస్తానని తీసుకెళ్ళారు. ఇక్కడే ఉంటే దాన్ని పట్టుకోవటం కష్టం" ఆమె మాటలకు అదీ నిజమేననుకున్నాడు ఆయన.

డాక్టర్లు వస్తున్నారు. చూస్తున్నారు. తమలో తాము మాట్లాడుకుంటున్నారు. వెళ్తున్నారు. బయటకూర్చున్న వారితో మాట్లాడటంలేదు. ఇది చూసి రేఖకు టెన్షన్ పెరిగిపోతోంది.

సాగర్ ఇంకా స్పృహలోకి రాలేదు. ఎప్పుడొస్తాడో తెలియదు. ఊపిరి చూస్తుంటే బరువుగా తీసుకుంటున్నట్టున్నది. ఎలా ఏం చేయాలి? ఎవర్ని అడిగితే సాగర్ గురించి వాస్తవం ఎవరు చెబుతారు? అతని పరిస్థితి ఏమిటో తెలుసుకునేదెలా?

తల పగిలిపోయేలా ఉంది. నిలబడలేక పక్కనే ఉన్న స్టూలుపై రేఖ కూలబడింది. అది చూసిన లలిత గబుక్కున వచ్చి రేఖను పట్టుకున్నది.

"రేఖా! కూల్ డౌన్. అన్నయ్యకు ఏం కాదు. డాక్టర్లు చెబుతున్నారు కదా! మేమంతా నిబ్బరంగా లేమా! పద అలా వెళ్ళి కాఫీ తాగివద్దాం. కాస్త రిలాక్స్‌డ్ గా ఉంటుంది"

"ఆయన అలా మంచం మీద పడివుంటే కూల్‌గా ఎలావుంటానే. ఆ మనిషిని అలా వదిలేసి కాఫీలు, టిఫిన్లు ఎలా పుచ్చుకోగలను? ఆయన మళ్ళీ లేచి తిరిగేవరకు నా మనసు నాలో ఉండదు. నేను చేసిన ద్రోహానికి ఆయనకు క్షమాపణలు చెప్పేవరకు నాకు నిద్రపట్టదు. అన్నం సహించదు. నన్ను ఇలా వదిలెయ్యి"

రేఖ మాటలు విన్న రాధాదేవి "అలా అంటే ఎలా రేఖా! వాడు లేచేసరికి నువ్వు పేషెంట్‌వైతే ఎలా? ఈ క్షమాపణలు, పశ్చాత్తాపపడటం తరువాత ముందు వాడు తేరుకోవాలి. ఆ తర్వాతే ఏదైనా. మనమే ఏడుస్తూ కూర్చుంటే మనూ సంగతేమిటి? దాన్ని ఎవరు సముదాయిస్తారు? నాన్నను వదిలి ఒక్కక్షణం ఉండేది కాదు ఆ పసిది. మరిప్పుడెలా దిగులుపడుతోందో చూశావు కదా! దానికోసమైనా మనం నిబ్బరంగా ఉండటం అవసరం"

సుమిత్ర కూడా రాధాదేవి మాటల్ని సమర్థించింది.

"ఇలా ఏడుస్తూ కూర్చుంటే అతను ఆరోగ్యంగా కుదుటపడుతుందా? అతడు స్వస్థుడయ్యేసరికి నువ్వు పేషెంట్‌వవుతావు. మనం చేసే పనిలో విజ్ఞత ఉండాలి. ఇది విచారపడటమో లేక చేసిన తప్పుల్ని తలుచుకుని ఏడవటమో చేయాల్సిన సమయం కాదు. సాధ్యమైనంత త్వరలో అతను ఆరోగ్యంగా తిరిగిరావాలాని భగవంతుడిని వేడుకోవటమే మనం చేయగలిగింది. అయినా డాక్టర్లు చెబుతున్నారు కదా పర్వాలేదని. ఇవాళో రేపో అతను మళ్ళీ మనలో పడతాడు. అప్పటివరకు మనకు మనం ధైర్యం చెప్పుకోవాలి. అంతకుమించి చేయగలిగింది ఏమీలేదు. గుండె దిటవుపరుచుకో. మనూను జాగ్రత్తగా చూసుకో. అతను స్పృహలోకి రాగానే మొట్టమొదట అడిగేది పాప గురించే. ఇంకెవరైనా అతనికి పాప తర్వాతే. కాబట్టి ఇప్పుడు దానికి సంరక్షణ ఇవ్వటం ముఖ్యం. ముందా సంగతి చూడు"

అని సుదర్శనరావును చూస్తూ "ఎంతసేపిలా నిలబడతాం? కాస్త స్పెషల్ రూమ్ తీసుకోండి. ఇక్కడ అతన్ని అద్దాల్లోనుంచి చూస్తూ కుదుటపడలేం. రూమ్‌లో అయితే వేరుగా ఉంటుంది. అతని గురించి తెలిసిందంటే చాలామంది వస్తుంటారు. పరామర్శిస్తుంటారు. అసలే స్నేహితులు ఎక్కువ ఉన్నవాడు. కాబట్టి రూమ్ ఉండటం మంచిది. అందర్నీ ఒకేసారి ఐ.సి.యులోకి వెళ్ళనివ్వరు కదా! ఒక్కొక్కరినీ వెళ్ళనిస్తారు" అని చెప్పింది.

ఆమె మాటలకు తలూపి రిసెప్షన్ దగ్గరకు నడిచాడు.

రెండు స్పెషల్ రూమ్‌లు తీసుకున్నాడు. అసలు రెండు రూమ్‌లు ఇవ్వటానికి రూల్స్ ఒప్పుకోవని రిసెప్షనిస్టు చెబుతూ ఆయన హోదా, పలుకుబడి చూసి మారుమాట్లాడకుండా ఇచ్చేసింది.

అందరూ రూమ్‌లోకి వెళ్ళారు. రేఖను కూడా బలవంతంగా లలిత తీసుకెళ్ళింది.

ఇంతలో శర్మ వచ్చాడు. ఐ.సి.యు ముందు అంతవరకు ఉన్న వీళ్ళెక్కడి వెళ్ళారో తెలియక లలితకు ఫోన్ చేశాడు.

"రూమ్ తీసుకున్నాం. ఫస్ట్‌ఫ్లోర్‌లోకి రండి" రూమ్ నెంబర్ చెప్పింది.

మనూని శర్మ చేతుల్లోనుండి తీసుకుంటూ "ఏమైనా తినిపించారా?" అడిగింది.

లేదన్నట్టు తలూపాడు. దానికి బొమ్మలు కొనివ్వటంతో వాటితో ఆడుకునే ధ్యాసలో పడిపోయింది.

"ఇప్పుడే వస్తాను. నువ్వూ వస్తావా?" అడిగాడు లలితను.

"ఎక్కడికి?"

"పొద్దున్నుండి ఎవరం ఏమీ తీసుకోలేదు. కనీసం పాపకు కూడా పాలుపట్టలేదు. తీసుకొద్దాం."

రాధాదేవికి చెప్పి "పదండి" అన్నది.

ఆస్పత్రిలోనే ఉన్న మెడికల్ షాప్‌లో రెండు ఫ్లాస్క్‌లు కొన్నాడు.

క్యాంటిన్ కంటే బయట కాఫీ బాగుంటుందని గేటు దాటి వెళ్ళారు. ఒక ఫ్లాస్క్‌లో కాఫీ, మరో ఫ్లాస్క్‌లో పాలు పోయించుకుని రెండు బిస్కట్ ప్యాకెట్లు తీసుకున్నాడు. గేటు దాటుతుండగా పక్కనే కారు ఆగటం చూసి దారి ఇచ్చేందుకు పక్కకు తప్పుకున్నాడు.

"అరేయ్ శర్మా! ఏమిటి ఇటొచ్చావ్? ఈ ఫ్లాస్క్‌లేమిటి?" పక్కన ఉన్న లలితను చూసి "లలిత కూడా ఉందంటే ఎవరన్నా పేషెంట్‌ను చూడ్డానికి వచ్చారా?"

"కారు పార్క్ చేసి నోర్మూసుకుని ఫస్ట్‌ఫ్లోర్‌కు రా" అని రూమ్ నెంబర్ చెప్పాడు.

"విషయం చెప్పరా నాన్చకు. టెన్షన్‌తో అప్పటివరకు ఆగవద్దూ" అన్నాడు భాస్కర్.

"సాగర్ పరిస్థితి ఏమీ బాగోలేదు" మిగతావి తరువాత చెబుతానౌ అన్నాడు.

సాగర్‌కు బాగాలేదని వినటంతోనే ఉలిక్కిపడ్డాడు.

"ముందు నువ్వు లోపలికి పద. నేను కారు పార్క్ చేసి వస్తాను" గేరు మారుస్తూ శర్మ జవాబు కోసం ఎదురు చూడకుండా పార్కింగ్ వైపు వెళ్ళిపోయాడు.

పాపకు పాలు పట్టేందుకు స్పూన్ తేవటం మరిచిపోయాడు. అందరూ కాఫీలు తాగటానికి గ్లాసులు తీసుకొచ్చాడు. స్పూన్ లేకుండా ఎలా? భాస్కర్ గుర్తొచ్చాడు. వెంటనే ఫోన్ చేసి స్పూన్ సంగతి చెప్పాడు. అందరికీ గ్లాసుల్లో కాఫీ పోసి ఇచ్చింది లలిత. ఖాఫీ తాగేందుకు రేఖ మొండికేయటంతో ఆమె చేత బలవంతంగా తాగించారు. పాపకు రెండు బిస్కట్లు ఇచ్చింది సుమిత్ర. అంతలో స్పూన్ తీసుకుని భాస్కర్ రానే వచ్చాడు.

అతన్ని చూడగానే "ఏం బాస్కల్ ఇతొచ్చావు" ఆరిందాలా అందరికంటే ముందే పలకరించింది మనూ.

అంత టెన్షన్‌లోనూ అందరూ నవ్వేశారు.

"విషయం ఏమిటిరా! సాగర్‌కు ఏమైంది?" భాస్కర్ అడిగాడు.

పాప తల్లిదండ్రులు రావటం, పాప ఎక్కడ తనకు దూరమవుతుందోనని సాగర్ భయపడటం అంతా చెప్పాడు.

ముందు సాగర్‌ను చూసేందుకు ఐ.సి.యు దగ్గరకు శర్మతో కలిసి వెళ్ళాడు.

తరువాత డాక్టర్ ముకుందరావును కలిశారు.

"డాక్టర్ సాగర్ పరిస్థితి ఏమిటి? ఎవరైనా స్పెషలిస్ట్ అవసరమైతే పిలిపించండి. దేనికీ వెనకాడనక్కర్లేదు. ఎంతైనా డిపాజిట్ చేస్తాం. ఇంకా స్పృహలోకి రాకపోవటం అందర్నీ కలవరపెడుతోంది. ముఖ్యంగా పాప సంగతి" అడుగుతున్న భాస్కర్‌ను చూస్తూ ముకుందరావు నిట్టూర్చాడు.

"చూడండి..! సాగర్ గురించి మీకంటే మేమే ఎక్కువ ఆందోళన చెందుతాం. ఎందుకంటే అతనెంత సహృదయుడో మాకూ తెలుసు. అందుకే ఒక టీమ్‌నే అతనికోసం ఏర్పాటు చేయబోతున్నాం. రాత్రికిగానీ అతనికి స్పృహరాదు. అతనికి రెస్టు అవసరమని నేనే మత్తు ఇచ్చాను. చేసిన వైద్యం గురించి పేషెంట్ బంధువులకు చెప్పట్మ వృత్తిధర్మం కాదు. మీరు కంగారుపడాల్సిన పనిలేదు. అతనికి పాపంటే ప్రాణం. ఆ ప్రాణం దూరమవుతుందేమోనని బెదిరిపోయాడు. ఇప్పుడు ఆ పాపనే ట్రీట్‌మెంట్‌గా ఉపయోగించాలనుకుంటున్నాం. నాన్నను వదిలి పాపకూడా ఉండలేదు కాబట్టి అతని దగ్గర సాధ్యమైనంతవరకు పాపను ఉంచుదాం. మిగతావాళ్ళు కొంచెం ఓపికపట్టాలి. పాప అతని దగ్గర ఉంటేనే అతను త్వరగా కోలుకుంటాడు. ఈ సంగతిలో మేమొక నిర్ధారణకు

వచ్చాం. అందువల్ల మీలాంటి వాళ్ళంతా కాస్త కోపరేట్ చేయండి. అతన్ని చూడాలన్న ఆతృతను చూపవద్దు. చూసినా వెంటనే వచ్చేయండి. మీరుండే సమయం కూడా పాపకు ఇచ్చేయండి" అన్నాడు.

డాక్టర్‌కు థాంక్స్ చెప్పి రూముకు చేరుకున్నారు.

"పాప తల్లిదండ్రులు ఎవరు? ఎక్కడుంటారు?" అడిగాడు.

"వాళ్ళను చూడగానే సాగర్ పరిస్థితి తీవ్రంగా మారటంతో ఆ సంగతి అడగటం మరచిపోయాం" అన్నాడు.

"వాళ్ళు కనబడితే ఈసారి అడ్రసు తీసుకోవటం మరచిపోవద్దు"

"మళ్ళీ వస్తాను. ఏదైనా అవసరమైతే సంకోచించవద్దు. వీలైతే మనవాళ్ళతో వస్తాను" అని అందరి దగ్గరా సెలవు తీసుకున్నాడు.

అప్పుడు సుదర్శనరావుకు నారాయణరావుకి భోజనం సంగతి గుర్తుకొచ్చింది.

ఇంటికెళ్ళి తినొచ్చే ఓపిక లేకపోవటంతో అందరూ కలిసి ఏదైనా హోటల్‌కు వెళ్దామనుకున్నారు.

"నాకొద్దు. తరువాత తింటాను" రేఖ అంది.

"అయితే నేనూ ఆంటీతోనే తింతాను" అంది పాపం.

"పాప కోసమైనా నువ్వు రాక తప్పదు. మాకు ఆకలివేసి వెళ్తున్నామనుకున్నావా? సాగర్‌కి స్వస్థత లభించేవరకూ మనం ఓపిగ్గా ఉండాలి కదా! పద" బలవంతంగా లేవదీసింది సుమిత్ర.

తప్పనిసరిగా కదిలింది రేఖ.

అక్కడికి దగ్గరలోనే ఉన్న హోటల్‌లో తిన్నామనిపించి వచ్చేశారు.

సాయంత్రం ఆరుగంటలైంది. సాగర్‌లో కదలిక కనబడింది చెక్‌చేస్తున్న డాక్టర్‌కి. సిస్టర్‌ని పిలిచి డాక్టర్ ముకుందరావుని పిలవమని చెప్పాడు. డాక్టర్ చెప్పిన వెంటనే హడావుడిగా పరుగులు తీస్తూ వస్తున్న సిస్టర్‌ని చూసి కంగారు పడ్డారు బయట ఉన్నవారంతా.

"ఏం జరిగింది, ఎందుకలా పరుగులు తీస్తూ వస్తున్నావ్?" అని అడిగారు.

వాళ్ళకు జవాబివ్వకుండా వెళ్ళిపోయింది. దాంతో వాళ్ళు మరింత కంగారుపడసాగారు.

సిస్టర్ వెనకే వస్తున్న ముకుందరావును చూసి ఆయన్ని సమీపించారు.

"మీరేం కంగారుపడొద్దు. సాగర్‌కు స్పృహ వచ్చే అవకాశం ఉంది. కాస్త ఓపికపట్టండి. ఇలా అయినదానికి కానిదానికి కంగారుపడటం మంచిదికాదు" అని మందలిస్తూ లోపలికి వెళ్ళాడు.

లోపలికి వెళ్ళిన ఆయన సాగర్‌ను చెక్ చేసి కేస్ షీట్ తీసుకుని చూశాడు. మరో ఐదు నిమిషాల తరువాత బయటకు వచ్చి "పాప ఏదీ?" అడుగుతున్న ఆయన దగ్గరకు పాపను తీసుకొచ్చింది రేఖ.

"మనూ! నాన్న పిలుస్తున్నాడు మాట్లాడతావా?"

"నాన్న పిలుత్తున్నాలా" అంటూ ఆయన్ని తోసుకుని లోపలికి వెళ్ళింది. పొద్దున్నుండి నాన్నతో అస్సలు మాట్లాడకపోవడం ఆ పిల్లకు దిక్కుతోచనట్లయింది. ఏం జరుగుతోందో అర్థంకాదు. ఎందుకు నాన్న మాట్లాడకుండా పడుకుండిపోయాడో తెలియదు. అటువంటిది ఇప్పుడు సాగర్ రమ్మంటున్నాడనేసరికి పరిగెత్తింది లోపలికి.

వెళ్ళీవెళ్ళగానే "నాన్నా" అని పిలిచింది. ఆ పిలుపుకు కళ్ళు తెరిచాడు సాగర్.

దగ్గరకు రమ్మన్నట్టు చేతులు చాచాడు. అంతే నాన్న చేతుల్లోకి దూకింది. అతని పొట్టపై కూర్చుంది.

"అన్నం తిన్నావురా!" అడిగాడు.

"ఆఁ నేనూ తాతయ్యా, నానమ్మా, లేఖా, లలితా అంతా తిన్నాం" గుర్తుకొచ్చిన పేర్లన్నీ చెప్పింది.

మనూను చూస్తుంటే అతని కళ్ళల్లో కాంతి. మనసు ప్రశాంతతతో ఉండిపోయింది.

"పొద్దున్నుండి నీ దగ్గరకు రానివ్వటంలేదు ఎందుకని? లేఖా ఆంటీ, చర్మ అంకుల్ అంతా ఏలుత్తున్నాలు. నానమ్మ, తాతయ్య, అమ్మమ్మ, లలిత ఆంటీ అంతా ఏడుత్తూనే ఉన్నాలు. ఆఁ మలిచిపోయాను ఇందాక బాస్కల్ అంకుల్ వచ్చాలు"

ఉదయం నుండి తండ్రితో మాట్లాడకపోవటంతో ఒక్కసారే మాట్లాడేస్తోంది. పొద్దుటినుండి నాన్నతో మాట్లాడలేదనే దిగులు ఇప్పుడు తీర్చుకోవాలని చూస్తోంది. ఆమెను ఒక్కసారిగా గుండెలకు అదుముకున్నాడు. తండ్రి గుండెల్లో ఒరిగిపోయింది.

సిస్టర్‌ను బతిమలాడి లోపలికి వచ్చింది రేఖ. లోపలికి రావటమే అతని కాళ్ళ దగ్గర ఒరిగిపోయి కన్నీరు కారుస్తూండిపోయింది.

"రేఖా! ఎందుకంత దుఃఖం ఇప్పుడేమైంది? నాకు తగ్గింది కదా! నేను ఇంటికి వచ్చేవరకు పాప బాధ్యత నీదేనని గుర్తుంచుకో" పాప బాధ్యతను అప్పగించాడు.

"నన్ను క్షమించండి. మిమ్మల్ని పెట్టిన బాధలకు. ఒక్కరోజు కూడా మిమ్మల్ని భర్తగా చూడలేదు. ఎన్ని అవమానాలు చేశాను. ఎన్ని మాటలన్నాను. ఒక్కదానిక్కూడా నన్ను పల్లెత్తు మాట అనలేదు. అది మీ సంస్కారం. దాన్ని తెలుసుకోలేని మూర్ఖురాల్ని"

"ఊరుకో రేఖా అవన్నీ తరువాత మాట్లాడుకుందాం. పాప చూడు ఎంత గాబరాపడుతోందో. ముందు దాన్ని కాస్త సముదాయించు" అని కూతుర్ని చూసి "బంగారూ పాలు తాగావా?" అడిగాడు.

తాగలేదన్నట్టు తల అడ్డంగా ఊపింది.

"రేఖ ఆంటీతో వెళ్ళి పాలు తాగిరా" చెప్పాడు.

అలాగే అన్నట్టు మంచం దిగి రేఖ చెయ్యి పట్టుకుంది. రేఖ పాపను తీసుకుని వచ్చేసింది.

ఐ.సి.యులో ఎవర్నీ ఉండనీయమని, ఏం కావాలన్నా తామే చూసుకుంటామని సిస్టర్ చెప్పటంతో ఇక అక్కడ ఉండి చేసేదేమీ లేదని ఇంటికి బయలుదేరారు. వెళ్ళేముందు ముకుందరావుని కలిశారు. వాళ్ళు ఇంటికి వెళ్ళి మరుసటి రోజు వస్తామని చెప్పారు.

వారికి అలాగే అన్నట్టు తలూపి, "పాపను కూడా తీసుకువెళ్తున్నారా?" అడిగాడు.

తీసుకెళ్తున్నట్టు తలూపి "దానితో ఏమైనా అవసరమున్నదా?" అడిగాడు నారాయణరావు.

"ఇక్కడ కీలకమైన ఔషధం పాపే... సరే సాగర్‌కు చెప్పి తీసుకెళ్ళండి" మళ్ళీ చెప్పాడు.

అందరూ ఐ.సి.యు దగ్గరకు వచ్చారు. పాపను సాగర్ దగ్గరకు రేఖ తీసుకెళ్ళింది. వాళ్ళిద్దర్నీ ఏమిటన్నట్లు చూశాడు.

"నేను, పాప ఇక్కడే ఉంటామని చెబుతున్నా మీ అమ్మగారు, నాన్నగారు ఇంటికి వెళ్దామంటున్నారు. మళ్ళీ రేపటివరకు మీరు పాపను చూడకుండా ఉండగలరా?" అడిగింది.

"రేపటికి నాకు తగ్గిపోతుందిలే. బహుశా రేపు నేను డిశ్చార్జి అవుతానేమో! మీరు రానవసరంలేకుండా నేనే వచ్చేస్తానులే"

"రాత్రికి ఎవరూ లేకుండా ఒక్కరే"

రేఖ మాటల్ని మధ్యలోనే అందుకుంది పక్కనే ఉన్న సిస్టర్.

"ఒక్కరే ఏమిటమ్మా! ఆయన్ని కళ్ళల్లో పెట్టి కాపాడుకోవటానికి ముగ్గురు సిస్టర్స్‌ని ఏర్పాటు చేశారు"

"మరింకేం వెళ్ళిరండి" సాగర్ అన్నాడు.

పాప సాగర్ బుగ్గమీద ముద్దుపెట్టుకుని "లేపటికి నీకు వచ్చిన ఆయి తగ్గిపోతుందిలే. మళ్ళీ లేపువత్తాగా" అంది.

"అలాగే తల్లీ. ఆంటీని ఏడిపించకు. చెప్పిన మాట విను.. ఈ ఒక్క రోజేగా రేపు నేను వచ్చేస్తానులే" రేఖ వెంట పాప వెళ్తుంటే ఏదో అపురూపమైన వస్తువు దూరమవుతున్నట్టూ చూశాడు. ఆ చూపుల్లో భావాన్ని గ్రహించింది రేఖ.

మర్నాటికి సాగర్ తేరుకున్నాడు. అతన్ని స్పెషల్ వార్డులోకి మార్చారు. ఉదయమే రేఖ వచ్చేసింది ఆమెను చూస్తుంటే రాత్రంతా నిద్రపోలేదని స్పష్టమవుతోంది.

"రాత్రంతా నిద్రపోయినట్టులేవు" ఆమె కళ్ళను చూస్తూ అడిగాడు సాగర్.

"మీరిలా ఒంటరిగా ఇక్కడ ఉంటే నాకు నిద్రెలా పడుతుందనుకున్నారు? అయినా ఒక్కరోజు నిద్రలేనంత మాత్రాన నష్టమేమీ లేదులెండి. అనవసర ఆలోచనలు పెట్టుకోకుండా కళ్ళు మూసుకోండి. ప్రశాంతతే ఇప్పుడు మీకు కావలసినది" చీరకొంగుతో అతని చెక్కిలి తుడుస్తూ అన్నది.

ఆమె మాటల్లో ఆప్యాయత.. చేతల్లో అనురాగం..

"నీకు శ్రమ ఇస్తున్నాను. ఎవరికీ నిన్నంతా రెస్టు లేకుండా చేశాను. మళ్ళీ ఇదిగో ఇలా వచ్చేశావు. కాస్త ఆగి భోజనం చేసి రావచ్చుకదా! అంత కొంపలు మునిగే పనులేమున్నాయి ఇక్కడ? నాకు ఏదైనా అవసరమైతే కనిపెట్టుకుని సిస్టర్స్ ఉన్నారు. నువ్వెందుకు శ్రమతీసుకుని పొద్దున్నే రావటం?"

"అమ్మా! ఆయనకు డ్రస్ మార్చాలి. మీరు మారుస్తారా? మమ్మల్ని మార్చమంటారా? డ్రస్ తెచ్చారా? మీకు యాక్సిడెంట్ అయినప్పుడు డ్రస్ మార్చాలి. తోడుండండి సార్ అంటే బయటకు పారిపోయాడుర్. అలాగే మీరూ సిగ్గుపడతారేమోనని అడుగుతున్నాను" సిస్టర్ అన్నది.

ఈమాట ఆమెకు మరో షాక్! నిన్న పాప ఎవరో తెలియటం ఒక షాక్ అయితే ఇవాళ యాక్సిడెంట్ సమయంలో తన డ్రస్ అతను మార్చలేదన్నది మరో షాక్. తానెంత మూర్ఖంగా ప్రవర్తించింది. సిస్టర్‌నే డ్రస్ మార్చమని కళ్ళు తుడుచుకుంటూ బయటకు నడిచింది.

తొందరపాటుకు వైద్యం లేదు. బురదలో కాలు వేయకుండా చూసుకోవాలేగానీ వేసిన తరువాత వేదన చెందితే ప్రయోజనం ఏముంటుంది? గులాబీ పువ్వును కోసేముందే ముల్లు గురించి ఆలోచించాలి. కోసేటప్పుడు ముల్లు గుచ్చుకుందనుకుంటే ఎలా? స్విచ్ పట్టుకోవాల్సింది పోయి ప్లగ్‌లో వేలుపెడితే ఏమవుతుంది? తరువాత చింతించి ప్రయోజనం ఏమిటి? తాను చేసిన ఈ దుర్మార్గానికి విరుగుడు ఏమిటి? ఆలోచనలతో ఆమె తలపగిలిపోయేలా ఉంది. అదే సమయంలో ఆపద్బాంధవిలా లలిత వచ్చింది. ఆమెను చూడగానే ఏడుపు తన్నుకొచ్చింది. ఎందుకేడుస్తోందో తెలియదు. సాగర్ పరిస్థితి బాగానే ఉన్నదని అంతకుముందు డాక్టర్‌ను కలిస్తే చెప్పాడు. మరి ఇదెందుకు చింతిస్తోంది? సాగర్ మంచమెక్కినప్పటి నుండి దీని మనసు మనసులో లేదు. ఎంతగానో కుళ్ళిపోతోంది. సాగర్‌కు కాదు ముందు దీనికి రెస్టు అవసరం. ఇంటికెళ్ళి పొద్దున్నే ఇటు పరిగెత్తుకు వచ్చింది. కాస్త రెస్టు తీసుకుంటే మనసు కుదుటపడుతుంది. ఆలోచనలతో సతమతమవుతూ తన ఒడిలో తలపెట్టుకుని దుఃఖిస్తున్న రేఖ తలనిమురుతూ ఉండిపోయింది.

"రేఖా! అంతా శుభంగానే ఉంది కదా! మళ్ళీ నువ్వెందుకు ఇంత మధనపడుతున్నావు? ఇది చింతించాల్సిన సమయం కాదు. ఆనందించాల్సిన సమయం. భగవంతుడి దయవల్ల సాగర్ త్వరగానే కోలుకున్నాడు. సాయంత్రం అతన్ని డిశ్చార్జ్ చేస్తారు. అతన్ని డిశ్చార్జ్ చేయగానే మనమంతా ఇంటికి వెళ్ళిపోతాం కదా! ఎవరైనా చూస్తే బాగుండదు సముదాయించింది.

రేఖ తలెత్తి కళ్ళు తుడుచుకుని "నా పాపాలకు నిష్కృతిలేదు. నా దురాలోచనలకు చావే శరణ్యమనిపిస్తోంది. ఆయన్ని ఎన్ని చిత్రహింసలు పెట్టాను. ఎన్ని రకాలుగా వేధించాను? వాటిలో ఒక్కటి కూడా మనసులో పెట్టుకోలేదు. అంతటి మహోన్నత హృదయాన్ని ఎన్నిసార్లు గాయపరిచాను. తలుచుకుంటేనే నా మీద నాకే అసహ్యం వేస్తోంది. ఆయనకు మనశ్శాంతి లేకుండా చేసి ఇంట్లో నుండి వెళ్ళిపోయేలా చేశాను. ఏ మనిషీ చేయకూడని దుష్కార్యాలెన్నో చేశాను దీనికి ప్రాయశ్చిత్తం లేదా?" దీనంగా లలిత ముఖంలోకి చూసింది.

"ఇవన్నీ అతనిపై కక్షతో చేయలేదు కదా! కేవలం పరిస్థితులు అలా కల్పించాయి. పరిస్థితులకు ఎవరైనా తలొగ్గాల్సిందే వాటి నుండి ఎవరూ తప్పించుకోలేరు. ఇక్కడ కకషలు కార్పణ్యాలకు అవకాశమే లేదు. ఏదీ శాశ్వతం కాదు. సుఖమైనా దుఃఖమైనా శీతాకాలంలో ప్రపంచం మొత్తాన్ని మంచుతెరల మధ్యలో నుంచి చూస్తే అవతల ఏమున్నదో, ఏమి జరుగుతోందో ఎవరికీ తెలియదు. సూర్యకాంతి వస్తేగానీ వాస్తవాన్ని గ్రహించలేం. నీ పరిస్థితీ అంతే. ఇప్పుడు నీ జీవితంలోకి సూర్యకాంతి అనే వెలుగు ప్రవేశించింది. ఆ వెలుగులో ఇకనుంచి వాస్తవాల్ని మాత్రమే చూడు. అతిశయం, అభిజాత్యం, ఎక్కువ తక్కువ వంటి చీకట్లో మళ్ళీ ప్రయాణించకు. ముఖ్యంగా ఇతరులను ప్రేమించటం నేర్చుకో" లలిత హితబోధతో కొంత తేరుకుంది.

"మనిషికి కావలసింది తొందరపాటు కాదు. ఓర్పు. సర్దుకుపోవటం జీవితానికి వెలుగునిస్తుంది. ఆ వెలుగే మనసుల్ని దగ్గరకు చేరుస్తుంది. స్వర్గం ఎక్కడో లేదు. మనం చేసే పనుల్లోనే ఉంటుంది. మనం వేసే ప్రతి అడుగూ సవ్యదిశలోనే పడేలా చూసుకోవాలి. జీవితమంటేనే ఎన్నో ఒడిదుడుకులమయం. నడుస్తున్నప్పుడు ఎదురుదెబ్బలు తగలకుండా ఎలా జాగ్రత్తపడతామో అలాగే జీవితంలో కూడా ఎదురుదెబ్బలు తగలకుండా చూసుకోవాలి. మన చదువు మనకు అతిశయం ఇవ్వకూడదు. సహనం, వివేకం ఇవ్వాలి. అయినా డిగ్రీల ద్వారా నేర్చుకోలేనిది ప్రపంచాన్ని చూసి నేర్చుకోవచ్చు. ఈ విశాల ప్రపంచమే ఒక విశ్వవిద్యాలయం. దీన్నుండి జీవించటం ఎలాగో నేర్చుకోవచ్చు. ఎలా జీవించకూడదో కూడా ఈ విశ్వవిద్యాలయమే నేర్పుతుంది. డబ్బు సంపాదించాలంటే డిగ్రీలతో నేర్చుకున్న చదువు సరిపోవచ్చు. అసలా డిగ్రీలు లేకపోయినా సంపాదించుకోవచ్చు. డబ్బు సంపాదనకు మనం కాలేజీల్లో నేర్చుకునే విద్య పనికిరావచ్చు, రాకపోవచ్చు. కానీ ఖచ్చితంగా విజ్ఞానార్జన మాత్రం ప్రపంచమనే విశ్వవిద్యాలయం నుండి నేర్చుకోవలసిందే విచక్షణ, వినయం. సౌశీల్యం అనేవి చదువుతో రావు. సంస్కారం వల్లనే అలవడతాయి"

లలిత మాటలు ఆశ్చర్యంగా వింటోంది.

దీనికి ఇంత విచక్షణ ఎక్కడిది? తనతోనే తిరుగుతుండేది. తాను ఏది చెబితే అదే చేసేది. తానేది అడిగినా నిరాకరించేది కాదు. మరి ఇంత విచక్షణ ఎక్కడ నేర్చుకున్నది. నేర్చుకుంటే వచ్చేది కాదు విచక్షణ. పరిస్థితులే అన్నీ నేర్పుతాయి కాబోలు.

"సాగర్ వంటి వ్యక్తుల్ని అర్థం చేసుకోవటం అంత తేలికకాదు. అలాంటి వాళ్ళకు క్షమాగుణం ఎక్కువ ఉంటుంది. వాళ్ళను ఎవరైనా బాధపెట్టినా దాన్ని మనసులో ఉంచుకోరు. తాము కూడా ఎన్నో తప్పులు చేస్తుంటామని భావించగల విశాలహృదయం వాళ్ళది. తనను బాధపెట్టిన వాళ్ళతో ప్రయాణించేందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. హాని తనవల్లజరిగినా, తనకు ఇతరుల వల్ల జరిగినా పెద్దగా ఆలోచించరు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తానూ వాళ్ళలాగానే ప్రవర్తిస్తానని, తామే గొప్ప హృదయంతో ఆలోచించగలమని వారు భావించరు. అటువంటి ఉన్నత హృదయం కల సాగర్‌లాంటి వాళ్ళను అర్థం చేసుకోవాలంటే చాలా సమయం పడుతుంది. వారి సున్నితత్వాన్ని మనం గుర్తించేసరికి జరిగిపోవలసిన అనర్థం జరిగిపోతుంది. వేసిన అడుగు వెనక్కి తీసుకునే సమయం కూడా ఉండదు. కానీ, ఇక్కడ నీ తప్పుని సరిదిద్దుకునే అవకాశం ఉంది. కంగారుపడకు. అవసరమైతే సాగర్‌కు మేమంతా నచ్చచెపుతాం. అసలంత అవసరం వస్తుందని నేను అనుకోవటంలేదు. ఎందుకంటే సాగర్ గురించి నాకు పూర్తిగా తెలుసు."

ఈలోగా పాపతోపాటు రెండు కుటుంబాల వారూ వచ్చేశారు.

పాపను దగ్గరకు తీసుకుని "టిఫిన్ తిన్నావా నాన్నా?" అడిగింది రేఖ.

"ఓ.. అమ్మమ్మ ఇడ్లీ పెత్తింది. పాలు తాగించింది"

"మరి నాన్న దగ్గరకు వెళ్దామా?" ఆ మాట వినగానే పాపలో ఎక్కడలేని హుషారు. సాగర్ నిన్న ఉన్న ఐ.సి.యు వైపు వెళ్ళబోయింది. "నాన్న ఇప్పుడు అక్కడ లేరు. ఇటు రా తీసుకెళ్తాను" పాపచేయి పట్టుకుని సాగర్ ఉన్న రూమ్ వైపు నడిచింది.

పాపను చూడగానే సాగర్ ఒక్క ఉదుటున మంచం మీదనుండి కిందకు దిగాడు. పాప కూడా గబగబా మంచం దగ్గరకు పరిగెత్తింది. సాగర్ చేతుల్లోకి దూకింది.

బయట కూర్చున్నవారు దూరంగా వస్తున్న మురళి, సరస్వతిలను చూశారు. వాళ్ళను ఇప్పుడు సాగర్ మళ్ళీ చూశాడంటే తట్టుకోలేడనిపించి గబగబా వాళ్ళ దగ్గరకు వెళ్ళారు నారాయణరావు, సుదర్శనరావు.

వారిని మధ్యలోనే ఆపి, "మరోలా అనుకోకండి. సాగర్‌కు ఇప్పుడే స్పృహ వచ్చింది. మిమ్మల్ని చూశాడంటే మళ్ళీ మొదటికి వస్తుందేమో? ఇలా అంటున్నందుకు మరోలా భావించవద్దు" నారాయణరావు అన్నాడు.

బతిమలాడుతున్నట్టు మురళి చేతులు పట్టుకున్నాడు సుదర్శనరావు. మాటల్లో వారెక్కడ ఉంటున్నారో అడ్రస్ తీసుకున్నాడు నారాయణరావు. సాగర్‌కు పూర్తిగా స్వస్తత చిక్కగానే తామే వారి వద్దకు వస్తామని, అంతవరకు సాగర్‌ని డిస్టర్బ్ చేయవద్దని మరీమరీ కోరాడు సుదర్శనరావు. వారి మనసుల్లో ఎటువంటి కల్మషం లేదని తెలుసుకున్న మురళి, సరస్వతి వెనుదిరిగాడు.

## 19

సాగర్‌ను డిశ్చార్జ్ చేశారు.

మురళి, సరస్వతిలను కలిశారు సాగర్ స్నేహితులు శర్మతో కలిసి.

తమను తాము పరిచయం చేసుకున్నారు వారంతా. వారి బ్యాక్‌గ్రౌండ్ తెలుసుకున్న మురళి, సరస్వతి ఇద్దరూ ఆశ్చర్యపోయారు. వారెందుకు వచ్చారో అర్థం కాలేదు.

సరస్వతి ఇచ్చిన కాఫీ తాగి భాస్కర్ అన్నాడు.

"మురళీగారూ మిమ్మల్ని ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోవద్దు. మాకున్న ఫ్రెండ్స్‌లో సాగర్ అంటే అందరికీ ప్రాణం. వాడి కాల్లో ముల్లు గుచ్చుకుంటే మేము విలవిల్లాడతాము. అటువంటి వాడిప్పుడు ఎంత ప్రమాదంలో చిక్కుకుని బయటపడ్డాడో మీరూ చూశారుగా. పాప ఎక్కడ తనకు దూరమవుతుందోనన్న భయం వాడిని ఇంకా వదిలిపెట్టలేదు. మూడేళ్ళనుండీ పాపను వాడెంతో అపురూపంగా చూసుకుంటున్నాడు. కన్న తల్లిదండ్రులుగా మీరు పాపను కావాలనుకోవటంలో తప్పులేదు. మిమ్మల్ని మేమేమీ అనటంలేదు. దయచేసి మావాడి పరిస్థితిని గమనించి పెద్దమనసు చేసుకోమని మా మనవి. పాప కూడా సాగర్‌ను వదిలిపెట్టి ఉండలేని పరిస్థితి."

భాస్కర్ మాటల్లోని భావం అర్థమైంది ఆ ఇద్దరికీ.

"చూడండి భాస్కర్ సాగర్ వంటి తండ్రి లభించటం మా పాప చేసుకున్న పుణ్యం. నిజంగా పాప మా దగ్గర పెరిగినా మేమంత మంచిశిక్షణ ఇవ్వగలిగేవాళ్ళం కాదేమో? పాపను తీసుకెళ్ళే ఉద్దేశం మాకులేదు. ఒకసారి పాపను చూడాలనుకున్నాం అంతే. తండ్రిని, పిల్లను విడదీసేంత దుర్మార్గులం కాము. కాకపోతే మాదో రిక్వెస్టు. అప్పుడప్పుడు పాపను మాకు చూపించమనండి. మాకు వీలున్నప్పుడు మేమూ వస్తుంటాం" మురళి అన్నాడు.

మురళి మాటలకు కన్నీళ్ళతో తలూపింది సరస్వతి.

మురళి, సరస్వతిల మంచి మనసులకు జోహార్లు అర్పించింది మిత్రబృందం. ఇక సాగర్‌కు ఏమీకాదు. వాడికి పాప రక్షరేకుగా ఉంటుంది. వచ్చేటప్పుడు ఎంతో దిగులుతో వచ్చిన వాళ్ళ ముఖాల్లో రిలీఫ్ కనబడింది. ఒక పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డామని తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

మిత్రబృందం సాగర్‌ను చేరుకున్నారు. పాప ఇక ఎక్కడికీ వెళ్ళదని, తాము మురళితో మాట్లాడివచ్చామని చెప్పారు. మురళి సమాధానాన్ని కూడా తెలిపారు. వారి మాటలు విన్న సాగర్ సంతోషం పట్టలేకపోయాడు.

"ఉండండి మీకు మంచి పార్టీ ఇస్తాను" సంతోషం పట్టలేకపోతున్న సాగర్‌ను చూస్తుండిపోయారు వారంతా.

"పార్టీ బయట ఎందుకు? ఇంట్లోనే ఇద్దాం. ఇవాళ అందరికీ భోజనం ఇక్కడే" లోపలి నుండి వస్తూ రేఖ అన్నది.

అలా ఆమె కలిసిపోవటం వారికి ఆశ్చర్యం కలిగింది. వారి ఆలోచనల్ని గ్రహించింది రేఖ.

"మీకందరికీ నా క్షమాపణలు. ఇదివరకటి నా ప్రవర్తన తలుచుకుంటే నాకే సిగ్గుగా ఉంది. మీరంతా నన్ను మనస్ఫూర్తిగా క్షమించాలి"

ఆమెలో వచ్చిన మార్పు వాళ్ళ సంతోషాన్ని మరింత పెంచింది.

"అదేమిటి వదినా అలా అంటారు. మిమ్మల్ని మేము క్షమించటమేమిటి? మీరలా అనకూడదు. మేము వినకూడదు. తప్పులు అందరం చేస్తాం. కానీ అది తెలుసుకుని సరిదిద్దికునేందుకు కొందరే ప్రయత్నిస్తారు. ఆ సంస్కారం మీకున్నది. ఇక ఆ విషయం వదిలిపెట్టండి. ఇవాళ మాకు మంచిభోజనం పెట్టండి చాలు"

"మరి నాకో! నన్ను మర్చిపోతున్నారు" లోపలనుంచి వస్తూ అంది మనూ.

"అయ్యో మా బంగారుతల్లిని మరిచిపోవటమా? వదినా మొట్టమొదట మా తల్లికే పెట్టాలి"

కోడలు, కొడుకు, కొడుకు స్నేహితులతో ఇల్లు కళకళలాడుతుండటంతో నారాయణరావు దంపతులకు పట్టరాని ఆనందంగా ఉంది. తాము ఏం కోరుకున్నారో సరిగ్గా అలాగే ఉండటం వారికి ఎంతో సంతృప్తినిచ్చింది.

"అవును. ఇవాళ విందు భోజనం మన ఇంట" అంటూ నారాయణరావు వెంటనే సుదర్శనరావుకి ఫోన్ చేశాడు.

"బావగారూ! మీరిప్పుడు ఇక్కడకు రాకపోతే మంచి దృశ్యాలు మిస్ అవుతారు. మళ్ళీ కావాలన్నా దొరకవు. వెంటనే మీరు, చెల్లెమ్మ బయలుదేరి వచ్చేయండి. భోజనాలిక్కడే"

తల్లిదండ్రుల్ని పిలిచిన మామగారి వంక కృతజ్ఞతగా చూసింది రేఖ.

"అదేమిటమ్మా అలా చూస్తావు? మన సంతోషాన్ని మనవాళ్ళతో పంచుకుంటే ఆనందం రెట్టింపవుతుంది. మనలోనే దాచుకోకూడదు" అన్నాడు నవ్వుతూ.

"అరె! చర్మ ఏడీ?" అప్పుడుగానీ శర్మ గుర్తుకురాలేదెవరికీ.

"ఇదిగో నువ్వే ఫోన్ చేసి పిలువు మీ చర్మ అంకుల్‌ని" భాస్కర్ ఫోన్ అందించాడు.

"చేసి ఇవ్వు"

"అలాగే హుజూర్!" అని శర్మకు ఫోన్ చేశాడు.

"ఏమిట్రా భాస్కర్? ఇప్పుడు ఆఫీసుకు బయలుదేరుతున్నా" అటునుంచి జవాబిచ్చాడు శర్మ.

"లైన్‌లో ఉండరా. ఇదిగో తల్లీ.. మీ చర్మ ఆఫీసుకి వెళ్తున్నాడట. నువ్వే చెప్పు"

భాస్కర్ చేతిలో నుంచి ఫోన్ అందుకుని "అలో చల్మా! ఇవాళ ఆఫీసు మా ఇంటిలోనే. నువ్వూ లలిత ఆంటీ ఇద్దలూ ఇక్కలికి వచ్చేయండి" ఫోన్ భాస్కర్‌కి అందించింది.

"విన్నావుగా మీ మేనకోడలి ఆర్డర్. మరి బయలుదేరు" చెప్పాడు శర్మతో.

దీనికి ఇంత తెలివితేటలు ఎక్కడినుంచి వచ్చాయి? ఏ విషయంలోనూ తడబడదు. ఎంత పెద్ద మాటైనా ఇట్టే పట్టేస్తుంది. కౌంటర్ ఇవ్వటంలో దిట్ట. దీని పెంపకం విషయంలో జాగ్రత్త తీసుకుంటే మణిపూస అవుతుంది. సాగర్ అనుకున్నాడు. కూతుర్ని చూసి మురిసిపోతున్న సాగర్‌ను చూస్తుండిపోయింది రేఖ.

అంతలోనే ఏదో గుర్తుకువచ్చినట్లు "ఈ రోజు భోజనానికి మురళి, సరస్వతిలను కూడా పిలిస్తే బాగుంటుందేమో? అంటున్న రేఖను మెచ్చుకుంటున్నట్లు చూశాడు సాగర్.

"అవును మంచి ఆలోచన" అని వాళ్ళకు కూడా ఫోన్ చేశాడు నారాయణరావు.

కానీ, మురళి, సరస్వతి పేరు వినగానే మనూ ముఖం అప్రసన్నంగా మారిపోవటం అందరూ గమనించారు. అది అప్పుడే మనుషుల మనస్తత్వాలను అర్థం చేసుకునేదానిలా తయారవుతోంది. ఎవరు తనకు ప్రియులో, ఎవరు అప్రియులో నిర్ధారించుకునే స్థితికి చేరుకుంటోంది. అటువంటి పసిదానికేమని జవాబివ్వగలరు?

ఆ రోజు ఇల్లంతా ఒకటే సందడి. జోకులు, ఒకరిపై మరొకరు సెటైర్లు. అబ్బ జీవితంలో ఆ రోజుని మరిచిపోలేమని అంతా అనుకున్నారు. అందరిలోకీ సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ మనూ. ఆమె ముద్దుముద్దు మాటలు, చేష్టలు అన్నీ అందరికీ అపురూపమే. మురళీ సరస్వతి కూడా ఎంతో హుషారుగా పాల్గొన్నారు.

సాయంత్రం ఎవరికి వారు వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళిపోయాక ఇల్లంతా నిశబ్ధంగా మారింది. ఇల్లు సర్దుకుంటున్న రేఖ, రాధారాణిలతోపాటు తానూ చేతనైనట్టుగా పనిచేస్తోంది మనూ.

"ఆంటీ...ఆంటీ" అని పిలుస్తున్న మనూను దగ్గరకు రమ్మని పిలిచింది.

దగ్గరకు వచ్చిన మనూను ఎత్తుకుని "ఇక నుండి నన్ను ఆంటీ అని పిలవకూడదు" అన్నది.

ఆమె మాటలకు అంతా ఇటువైపు చూశారు.

"మలి..."

ఆమె ఏమని చెబుతుందా అని ఎదురు చూస్తున్నారంతా.

"ఇవాళ్టి నుండి నేను నీకు అమ్మను. అమ్మా అని పిలవాలి తెలిసిందా?"

ఆ మాటలకు అందరి ముఖాలు వికసించాయి. సాగర్ ఆమెవైపు కృతజ్ఞతగా చూశాడు.

"చూడమ్మా! ఇవాళ్టినుండి నువ్వు నానమ్మ దగ్గరే పడుకోవాలి. నాన్న దగ్గర కాదు" రాధాదేవి మాటలకు సాగర్, రేఖ ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. రేఖ ముఖంలో సిగ్గులు దోబూచులాడాయి.

అబ్బ.. ఇన్నాళ్ళకు మంచుతెరలు విడిపోయాయి.

అందరూ ఒకేసారి ఊపిరి పీల్చుకున్నారు. అందరి హృదయాలు తేలికపడ్డాయి.

జీవితం విలువ తెలుసుకున్నవారికి భవిష్యత్తు అందంగానే కనబడుతుంది. అది తెలుసుకోలేని వారు జీవితాన్ని నిరర్థకం చేసుకుంటారు. చేసిన పొరపాట్లను తలుచుకుని భవిష్యత్తును చాలామంది నిస్తేజంగా గడుపుతారు. కానీ, కొంతమంది గతంలో చేసిన

తప్పుల్ని వర్తమానంలో సరిదిద్దుకుంటూ భవిష్యత్తును బంగారుమయం చెసుకుంటారు. మనిషి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలంటే ఎదురయ్యే సమస్యల్ని చూసి బెదిరిపోకూడదు. సంమయమనంతో వాటిని పరిష్కరించుకుంటూ ముందడుగు వేయటం నేర్చుకోవాలి.

ప్రతిమనిషికి భవిష్యత్తు ఓ జీవనస్రవంతి వంటిది. అలా సజీవంగా ప్రవహిస్తూనే ఉంటుంది. కొందరికి ఆ ప్రవాహం వేగంగా పరిణమిస్తుంది మరికొందరికి నెమ్మదిగా, గంభీరంగా అగుపిస్తుంది. ఇంకొందరికి స్థంభించినట్లు తోస్తుంది. ఏదేమైనా భవిష్యత్తును చూసి బెదిరితే జీవితం విలువ తెలుసుకోలేరు. సమస్యలు లేని జీవితం లేదు. అలాగని సమస్యల్నే తలుచుకుని బెదిరిపోవటం తెలివిలేనివాళ్ళు, మూర్ఖులు చేసేపని.

## 20

ఆ రాత్రి..

సిగ్గుల మొగ్గయి గదిలోకి వచ్చిన రేఖను మురిపెంగా చూశాడు సాగర్.

అంతలోనే ఏదో గుర్తుకు వచ్చినట్లుగా "అవును మన మొదటి రాత్రి ఇంకా ఏవో షరతులు చెబుతానన్నావుగా ఏమిటవి?"

అతని నోటిని తన చేతితో మూసేసింది.

"అదేమిటి? ఇప్పుడు చేత్తో మూసే సమయమా? నువ్వు నోటిని మూసినా మూయకపోయినా నేను కొన్ని విషయాలు నీకు చెప్పాలనుకుంటున్నాను. ఒక సందర్భంలో మంజులతో నన్ను చూసి నువ్వు అపార్థం చేసుకున్నావని నాకు తెలుసు. కానీ నాకు నీపై తప్ప మరో ఆడపిల్లపై ఎటువంటి అభిప్రాయాలు లేవు. మంజులే ఒకసారి నా వెంటపడినప్పుడు తిరస్కరించాను. నేనొక అమ్మాయిని ప్రేమిస్తున్నానని, ఆమెను తప్ప మరొకరిని పెళ్ళాడే యోచనేలేదని స్పష్టంగా చెప్పాను. ఆ అమ్మాయి పేరు చెప్పమని వేధించింది. నేను చెప్పటానికి నిరాకరించాను. అలాగే నా పుట్టినరోజున నేను పాడిన పాటలు నిన్ను ఉద్దేశించినవని నువ్వు భ్రమపడ్డావు. కానీ అవి నా ఫేవరేట్ సాంగ్స్. అవి పాడే చాలాసార్లు ప్రైజ్‌లు కూడా సాధించాను. ఇవన్నీ నీకిప్పుడు ఎందుకు చెబుతున్నానంటే భవిష్యత్తులో మళ్ళీ ఇదివరకటిలా అపార్థాలకు అనుమానాలకు తావివ్వకూడదని. ఒకసారి మనసులో అనుమానం మొదలైందా అది మనిషిని వేరుపురుగులా తినేస్తుంది. ప్రశాంతంగా ఉండనివ్వదు. ఏ పనీ చేయనివ్వదు. భవిష్యత్తును అధోగతికి ఈడుస్తుంది" అతను ఆపాడు.

"నా దైవం ఇన్నాళ్ళకు కరుణించింది. ఏ జన్మలో చేసుకున్న ఎన్ని నోముల ఫలమో ఇంత మంచి భర్తకు భార్యగా, ఇంత ఉన్నత కుటుంబానికి కోడలిగా అడుగుపెట్టగలిగాను. ఈ జన్మకు ఈ అదృష్టం చాలు" పరవశంతో అన్నది.

మళ్ళీ ఏదో గుర్తుకు వచ్చినట్లు, "అన్నట్లు చెప్పటం మరిచిపోయాను. అప్పటి అరవై లక్షల సంగతి అవి నాన్న దగ్గరే ఉండిపోయాయి" వాటినేం చేద్దాం అన్నట్టుగా ఉందామె చూపు.

"అవి నీవి, నీ కూతురివే! ఏం చేసుకుంటారో మీ ఇష్టం. నీ కూతురు పెద్దదైన తరువాత ఇద్దరూ ఆలోచించుకుని ఒక అభిప్రాయానికి రండి. నాన్నగారెప్పుడో ఎవరికివ్వవలసినవి వారికిచ్చేశారు. ఇక అవి మీ తల్లీకూతుళ్ళవే. వాటితో మాకేం సంబంధంలేదు" చెబుతున్న అతన్ని ఆరాధనగా చూసింది.

"ఈ సమయంలో నాదో కోరిక. కాదనకూడదు."

"ప్రియసఖి కోరక కోరక కోరితే తీర్చనని ఎలా తిరస్కరిస్తాను"

"ఏమీలేదు. మనకు ఒక్క పాపచాలు. అందుకని నేను బర్త్‌కంట్రోల్ ఆపరేషన్ చేయించుకోవాలనుకుంటున్నాను."

ఆమె వింతకోరిక అతన్ని ఉలిక్కిపడేలా చేసింది.

"అవునండీ మనకు మనూ చాలు. మనకు పిల్లలు కలిగితే నాలో స్వార్ధం పెరిగి మనూను సరిగ్గా చూడలేమోనని భయం. అదీగాక ఈ క్వశ్చన్ బ్యాంక్‌తోనే వేగలేకపోతుంటే ఇంకెన్ని క్వశ్చన్ బ్యాంకుల్ని తట్టుకోగలం?" నవ్వుతూ అంది.

ఆమె ఆలోచన అతనికి ఎంత సంతోషాన్ని ఇచ్చిందో చెప్పలేము.

"ఇది మనమిద్దరం తీసుకోవలసిన నిర్ణయం కాదు. మొత్తం కుటుంబం తీసుకోవాలి. ఇప్పుడే అమ్మానాన్నల్ని అడుగుదామా లేక రేపు.." నవ్వుతూ అన్నడు.

ఆ నవ్వే అయోమయంలో పడేసి ఇంకొక ఆలోచనకు అవకాశం రానివ్వదు. ఈ తృప్తిచాలు. ఇంతకుమించి ఎవరైనా కోరుకునేదేమున్నది? మబ్బులచాటున చంద్రుడు కొంటెగా చూస్తున్నాడు. గదిలో రతీమన్మధులు కోరికతో తపించిపోతున్నారు.

కౌముది